మంగళవారం 21-5-2024


'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురాక్కల జోలికి వెళ్లరు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 59

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




శభాష్ దీప్తి...

ప్రపంచ పారా అథ్లెటిక్స్ పోటీల్లో స్వర్ణం నెగ్గిన తెలంగాణ అమ్మాయి - 12లో



యూఎస్ మార్కెట్లో భారత్ హవా

47 శాతం వాటాతో అగ్రస్థానం... 219 బిలియన్ డాలర్ల పొదుపు - 13లో



దక్షిణాన కాషాయ జెండా

దక్షిణాదిలో ఈసారి కూడా బీజేపీయే అత్యధిక ఎంపీ సీట్లు గెలుచుకుంటుందని ప్రధాని మోదీ పీటీఐ ఇంటర్వ్యూలో చెప్పారు.

- వివరాలు 6లో



దేశంలో బలంగా మార్పు గాలి

దేశంలో మార్పు గాలి బలంగా వీస్తోందని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాహుల్ గాంధీ చెప్పారు.

- వివరాలు 6లో



ఐదో విడతలో 59.06 శాతం

ఆరు రాష్ట్రాల్లోని 49 ఎంపీ స్థానాలకు సోమవారం జరిగిన ఐదో దశ లోక్‌సభ ఎన్నికల్లో 59.06 శాతం పోలింగ్ నమోదైంది.

- వివరాలు 6లో



ఏడాదిన్నరలో నాలుగోసారి..

నేపాల్ ప్రధాని పుష్పకుమార్ దహాల్ 'ప్రచండ' పార్లమెంట్‌లో విశ్వాస తీర్మానం నెగ్గారు. 157 మంది ఆయనకు అనుకూలంగా ఓటేశారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

ఈ-సెట్‌లో 95.86% పాస్



పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఇంజనీరింగ్ సెకండియర్‌లో చేరేందుకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఇందులో 95.86% మంది విద్యార్థులు అర్హత సాధించారు. బాలురు 95.20% పాసయితే, బాలికలు 97.22% ఉత్తీర్ణత సాధించారు.

- వివరాలు 10లో▶

స్కూళ్లలో కూల్‌డ్రింక్స్ వద్దు



పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రిన్సిపాళ్లు స్కూళ్ల పరిసరాల్లో కూల్‌డ్రింక్స్ అమ్మకాలను నియంత్రించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది. షుగర్ ఆధారిత అన్ని రకాల డ్రింక్స్‌ను స్కూళ్ల పరిసరాల్లో అనుమతించకూడదని స్పష్టం చేసింది. ఈ మేరకు స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు మార్గదర్శకాలు జారీ చేసింది.

- వివరాలు 5లో▶

ముగిసిన వీసీల పదవీకాలం



రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాల ఉప కులపతుల పదవీ కాలం మంగళవారంతో ముగుస్తోంది. అయితే వీరిని కొంతకాలం కొనసాగించడమా? కొత్త వారిని నియమించడమా? అనే విషయంలో ప్రభుత్వం ఇంత వరకూ స్పష్టత ఇవ్వలేదు.

- వివరాలు 10లో▶

ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం



ఛత్తీస్‌గఢ్‌లోని కబీర్‌ధామ్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ పికప్ వ్యాన్ అదుపుతప్పి 20 అడుగుల లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోగా మరో నలుగురు గాయాలపాలయ్యారు.

- వివరాలు 6లో▶

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Venkobb CHICKEN

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird	150 kg	Dressed with Skin	249 kg
₹ 72	Retail Live Bird	172 kg	Skin Less	284 kg

Issued in the interest of consumers

జూన్ 2న సోనియాతో సభ

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పది సంవత్సరాలు పూర్తవుతుండటంతో ఉత్సవాలు

రాష్ట్రం ఇచ్చిన, తెచ్చిన పెద్దలకు సన్మానం చేయాలని మంత్రివర్గం నిర్ణయం

- సభ, ఉత్సవాలకు అనుమతి కోసం ఈసీకి లేఖ రాయాలని నిర్ణయం
- తడిసిన ధాన్యం కొనుగోళ్లు.. పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం
- సన్నబియ్యం పండించే రైతులకు రూ.500 బోనస్
- అమ్మ ఆదర్శ కమిటీలతో బడుల్లో మౌలిక సదుపాయాల కల్పన
- మూసేసిన బడుల్లో.. విద్యార్థులొచ్చే చాన్స్ ఉన్నవి పునరుద్ధరణ
- ఎన్డీఎస్‌ఏ చెప్పిన పరీక్షలన్నీ చేశాకే కాళేశ్వరానికి మరమ్మతులు
- తాత్కాలికంగా నీటి పంపింగ్ సాధ్యాసాధ్యాల పరిశీలన



కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటై పదేళ్లు పూర్తవుతుండటం, రాష్ట్రంలో తొలిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో.. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. జూన్ 2న భారీ బహిరంగ సభ నిర్వహించి, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీతోపాటు తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న పెద్దలందరినీ పిలిచి సన్మానం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు అనుమతి కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయనుంది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన తీర్మానాన్ని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సచివాలయంలో మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కూడా ఆ సభకు పిలుస్తామని.. ఈ విషయంలో భేషజాలు లేవని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. 'బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత ఏడాదే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించిందని, ఇప్పుడు మళ్లీ నిర్వహిస్తారా?' అని మీడియా ప్రశ్నించగా.. ''తెలంగాణ వచ్చి 10 ఏళ్లు అయింది అప్పుడా? ఇప్పుడు అవుతోందా అన్న విషయం అందరికీ తెలుసు..'' అని మంత్రి పొంగులేటి బదులిచ్చారు.

తడిసిన ధాన్యమంతా కొనుగోలు..

ఇటీవలి అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి చెప్పారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని, మద్దతు ధరకు ఒక్క రూపాయి తగ్గించకుండా తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. విపక్షాల మాయమాటలను నమ్మవద్దని పేర్కొన్నారు. యాసంగిలో పండించిన 36లక్షల టన్నుల ధాన్యాన్ని పౌర సరఫరాల శాఖ

మిగతా 2వ పేజీలో ▶

సర్కారు 'సన్నాల' రాగం

బోనస్ పేరిట రైతులకు మొండిచెయ్యి!

ఏటా కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం 1.20 కోట్ల మెట్రిక్ టన్నులు

- ఇందులో వచ్చే సన్న ధాన్యం 10 శాతం కన్నా తక్కువే
- అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇస్తే ప్రభుత్వంపై పడే భారం సుమారు రూ.6 వేల కోట్లు
- ఇప్పుడు కేవలం రూ.వెయ్యి కోట్లతో గట్టెక్కేందుకు.. రేవంత్ సర్కారు 'సన్నాల' పాట

2 లో

తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్సులోని ఓ పర్వతం వద్ద కనిపించిన హెలికాప్టర్ శకలాలు





ఇరాన్ అధ్యక్షుడు రైసీ దుర్మరణం

అజర్‌బైజాన్ పర్వతాల్లో కూలిన హెలికాప్టర్

- విదేశాంగ మంత్రి సహా అందులోని వారంతా మృతి
- తాత్కాలిక అధ్యక్షుడిగా మహమ్మద్ మొఖ్బర్ నియామకం.. ఐదు రోజులు సంతాప దినాలు

6 లో



ఇట్లు.. ఇటలీకి!

దుబాయ్‌లో చంద్రబాబు దాగుడుమూతలు

గప్‌చుప్‌గా విదేశాలకు ఉడాయించిన వైనం

వైద్య పరీక్షల కోసం అమెరికా వెళ్తున్నట్లు లీకులు

- అబ్బే.. ఇటు రాలేదన్న టీడీపీ ఎన్నారై విభాగం నేత
- టీడీపీ అధినేత ఇటలీలో ప్రత్యక్షమైనట్లు సమాచారం
- గతంలో విదేశాల నుంచే షెల్ కంపెనీలకు అక్రమ నిధుల మళ్లింపు
- స్కిల్ స్కామ్‌లోనూ బాబు దుబాయ్ బంధం.. ఈసారి అదే షెల్ దందాయేనా!
- గోప్యంగా విదేశీ పర్యటన వెనుక లోగుట్టు అదే

3 లో

బదిలీలతో బరితెగింపు

ఏపీలో 'ఎన్నికల హింస'పై డీజీపీకి సిట్ నివేదిక 3లో

రేపు అల్పపీడనం!

24 నాటికి వాయుగుండంగా మారే చాన్స్

రాష్ట్రానికి మూడు రోజులు వర్షసూచన

చాలాచోట్ల తగ్గిన ఉష్ణోగ్రతలు



సాక్షి, హైదరాబాద్: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈ నెల 22న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది తొలుత వాయవ్య దిశలో కదిలి ఈ నెల 24వ తేదీ నాటికి మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నట్లు అంచనా వేసింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని సూచించింది. కాగా సోమవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. అత్యధికంగా రంగారెడ్డి జిల్లా పసుమాములలో 5.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాలతో పాటు హైదరాబాద్ సరిహద్దు జిల్లాల్లో చాలాచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. ప్రస్తుతం రాష్ట్రానికి ఆగ్నేయ దిశ నుంచి బలమైన గాలులు వీస్తున్నాయి. సోమవారం చాలాచోట్ల సాధారణం కంటే 5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గరిష్ఠంగా ఆదిలాబాద్‌లో 41.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

భూమికి పరిహారంగా భూమే

రీజినల్ రింగురోడ్డులో అటవీశాఖకు 200 ఎకరాలు స్వాధీనం చేయాల్సిందే

- ఇప్పటి వరకు దృష్టి సారించని రాష్ట్ర ప్రభుత్వం
- ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం భూసేకరణ ప్రక్రియలో గందరగోళం
- భూములకు విలువకట్టి చెల్లించే పద్ధతికి స్వస్తి పలికిన కేంద్రం
- ఆర్థిక పరిహారం బదులు ప్రత్యామ్నాయ భూములే ఇచ్చేలా నిబంధనల్లో మార్పు
- ప్రాజెక్టు పనుల్లో జాప్యానికి కారణాన్ని మంత్రి కోమటిరెడ్డికి తాజాగా తెలియజేసిన ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు

వివరాలు 5లో

బెంగళూరు రేవ్ పార్టీలో తెలుగు రాష్ట్రాల ప్రముఖులు!

నగర శివార్లలోని ఫాంహౌస్‌లో 'సన్‌సెట్ టు సన్‌రైజ్ విక్టరీ' పేరిట పార్టీ

రేవ్ పార్టీని ధ్రువీకరించిన బెంగళూరు పోలీసులు


- హైదరాబాద్‌కు చెందిన వాసు నిర్వహించినట్లు అనుమానాలు
- సీసీబీ యాంటీ నార్కోటిక్స్ విభాగం దాడులు
- ఎండీఎంఏ, కొకైన్ తదితర మాదకద్రవ్యాల స్వాధీనం.. వాసు సహా ఐదుగురి అరెస్టు.. 25 మంది యువతులతో పాటు 100 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వీరిలో నటీనటులు, మోడళ్లు, టెక్కీలు!
- తాము ఉన్నామనే వార్తలు ఖండించిన నటులు శ్రీకాంత్, హేమ



సాక్షి బెంగళూరు/ హైదరాబాద్: బెంగళూరు నగర శివార్లలోని ఓ ఫామ్‌హౌస్‌లో ఆదివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు జరిగిన రేవ్ పార్టీలో బెంగళూరుతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులు కూడా పాల్గొన్నట్టు అందుతున్న సమాచారం కలకలం రేపుతోంది. పుట్టినరోజు వేడుకల పేరిట ఎలక్ట్రానిక్ సిటీ సింగేనా అగ్రహారలో ఉన్న ఫాంహౌస్‌లో ఈ రేవ్ పార్టీ జరిగింది. ఈ మేరకు అందిన పక్కా సమాచారంతో సీసీబీ యాంటీ నార్కోటిక్స్ విభాగం అధికారులు డీసీపీ శ్రీనివాసగౌడ నేతృత్వంలో దాడి చేశారు. మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు సుమారు 100 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 25 మందికి పైగా యువతులున్నారు. ఐదుగురిని

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ జగత్



అలా చేస్తే ఎలా సార్! మళ్లీ మనం ప్రతిపక్షాల మీద రివెంజ్ తీర్చుకోవాలిగా!!



క్లుప్తంగా...

భవిష్యత్ తరాలకు స్ఫూర్తి ప్రకాశం పంతులు

మంత్రి శ్రీధర్‌బాబు




ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

సాక్షి, హైదరాబాద్/గన్‌ఫౌండ్రీ: టంగుటూరి ప్రకాశం పంతులు ఆలోచనలు, ఆశయాలు ప్రస్తుత తరంతో పాటు భవిష్యత్ తరానికి కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం ప్రకాశం సంస్థ ఆధ్వర్యంలో జరిగిన టంగుటూరి ప్రకాశం పంతులు 67వ వర్ధంతి కార్యక్రమానికి శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అసెంబ్లీకి ఎదురుగా ఉన్న ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రకాశం పంతులు ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. 'ప్రకాశం సంస్థ'కు తెలంగాణ ప్రభుత్వం అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ప్రకాశం సంస్థ బాధ్యుడు టంగుటూరి శ్రీరామ్, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ప్రకాశం పంతులు మనుమడు టంగుటూరి గోపాలకృష్ణ, ప్రకాశం సంస్థ ప్రధాన సలహాదారు రామచందర్‌రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'పట్టభద్రుల' ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఖమ్మం–నల్లగొండ–వరంగల్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి జరగనున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ చేసిన విజ్ఞప్తిపై పార్టీలో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నామని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న కాంగ్రెస్, సీపీఐ తెలంగాణ రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కూడా కూటమిగా పోటీ చేశాయని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ విజయానికి సీపీఐ శ్రేణులు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు కృషి చేయాలని కూనంనేని కోరారు.

6 నెలల్లోనే 12 వేల కోట్ల కొత్త అప్పులు

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించిన ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఆరునెలల్లోనే రూ.12,905 కోట్లు కొత్త అప్పు చేసిందని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన ఆయన.. తెలంగాణ రాష్ట్రానికి సబంధించిన పలు అంశాలను ఆమెకు వివరించారు. రాష్ట్ర ఎఫ్ఆర్‌బీఎం పరిమితి గరిష్ట స్థాయికి చేరుకుందని, ప్రభుత్వం బడ్జెటేతర రుణాల మీద దృష్టి సారించిందని, బహిరంగ మార్కెట్‌లో రుణాలు సేకరించడానికి సిద్ధమవుతోందని తెలిపారు. కొత్త కార్పొరేషన్లను ఏర్పాటు చేసి భారీ స్థాయిలో రుణాలని పొందటానికి ప్రయత్నం చేస్తోందని ప్రభాకర్ వివరించారు. ఈ చర్యలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మరింత దిగజారుస్తాయని, అప్పులు కట్టడానికి మరిన్ని కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడం, ఆర్థిక క్రమశిక్షణ పాటించడం కోసం రిజర్వ్ బ్యాంక్ ద్వారా కొత్త మార్గదర్శక సూత్రాలు రూపొందించేందుకు ప్రయత్నించాలని కోరారు. రాష్ట్రంలో కనీసం 10 ఎంపీ స్థానాల్లో భారీ మెజారిటీతో బీజేపీ అభ్యర్థులు గెలిచే అవకాశం ఉందని కేంద్రమంత్రికి ప్రభాకర్ తెలిపారు.

సోమవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
ఆదిలాబాద్	41.3
నల్లగొండ	39.5
రామగుండం	39.4
ఖమ్మం	38.8
నిజామాబాద్	38.8
మహబూబ్‌నగర్	38.1
భద్రాచలం	38.0
మెదక్	36.4
హనుమకొండ	36.0
హైదరాబాద్	36.0
హకీంపేట్	35.8
దుండిగల్	35.5

'గ్రాడ్యుయేట్స్'పై బీజేపీ గురి

ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో విస్తృత ప్రచారం.. మోదీ ఇమేజ్ పనిచేస్తుందన్న భావనలో కమలదళం

సాక్షి, హైదరాబాద్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై బీజేపీ దృష్టి సారించింది. ఈ నెల 27న జరగనున్న నల్లగొండ–వరంగల్–ఖమ్మం జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉపఎన్నికలో గెలుపొంది సత్తా చాటాలనే సంకల్పంతో రాష్ట్ర నాయకత్వం ముందుకు సాగుతోంది. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఇప్పటికే మూడుజిల్లాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించగా, పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్ 3,4 రోజులుగా మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ప్రచారంలో పాల్గొంటున్నారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ కూడా ప్రచారంలో పాల్గొన్నారు. ఇతర రాష్ట్రాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమైన బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ త్వరలోనే ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్టు సమాచారం. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ



గెలుపొందిన అనుభవంతో పాటు విస్తృత పరిచయాలు, ఎమ్మెల్సీ క్యాంపెయిన్‌కు సంబంధించి అవగాహన ఉన్న ఎన్.రామచందర్‌రావు ఈ ఎన్నికకు పార్టీ తరఫున ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తు న్నారు. ప్రచారం ముమ్మరం చేశామని, ఈసారి గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయని 'సాక్షి'కి ఆయన వెల్లడించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలవడంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, పార్టీ కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పట్ల ఉన్న సానుకూలత తప్పకుండా ఎమ్మెల్సీ ఉపఎన్నికకు ఉపయోగపడుతుందన్నారు.

మంచి ఫలితం వస్తుంది: గుజ్జుల

రాష్ట్రపార్టీ నాయకత్వం, ముఖ్యనేతలు, వేలాది మంది కార్యకర్తల తోడ్పాటుతో మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. ఒక్కో పోలింగ్ బూత్ వారీగా మూడు, 4 బృందాలను ఏర్పాటు చేసి పార్టీనాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పట్టభద్ర ఓటర్లను కలుస్తున్నారన్నారు. కోర్టులు, వాకర్స్‌ను కలుసుకో వడం, చిన్న చిన్నసమావేశాల నిర్వహణ ద్వారా ఓటర్స్ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. క్షేత్రస్థాయిలో 'మోదీవేవ్' స్పష్టంగా కనిపిస్తోందని, ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా గెలుపొందుతాననే నమ్మకం తనకు ఏర్పడిందని ధీమా వ్యక్తం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో పాటు రెండో ప్రాధాన్యత ఓటుపైనా ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు.

జూన్ 2న సోనియాతో సభ

▶ మొదటి పేజీ తరువాయి

సేకరించిందని.. దేశంలో, రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా రైతులకు 3 రోజుల్లోపే చెల్లింపులు చేసిందని చెప్పారు. కాగా.. ఒక్క గింజ తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేశామని, ఎక్కడైనా తరుగు తీస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. వర్షాలతో దెబ్బతిన్న పంట ల వివరాలను వ్యవసాయ శాఖ సమర్పించిందని.. బాధిత రైతులకు పరిహారం చెల్లించాలని నిర్ణయించామని వివరించారు. రైతు భరోసా పథకం ఎప్పుడు ప్రారంభిస్తారని మీడియా ప్రశ్నించగా.. విధివిధానాలను తయారు చేయాల్సి ఉందని చెప్పారు.

ఆధునిక పాఠశాలలుగా తీర్చిదిద్దుతాం..

జూన్ 12 నుంచి బడులు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో.. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ స్కూళ్ల నిర్వహణ చేపట్టాలని కేబినెట్ నిర్ణయించినట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. కమిటీల ఆధ్వర్యంలో నెల రోజుల్లోగా వాటిని ఆధునిక పాఠశాలలుగా తీర్చిదిద్దుతామన్నారు. ఇందుకోసం రూ.600 కోట్లను కేటాయించామని.. అడ్వాన్స్‌గా రూ.120 కోట్లను విడుదల చేశామని తెలిపారు. అమ్మ ఆదర్శ కమిటీల్లో ప్రధానోపాధ్యాయులు, స్వశక్తి సంఘాల మహిళలు ఉంటారన్నారు. ఈ అంశంపై మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు.

టెస్టుల తర్వాతే బ్యారేజీలకు మరమ్మతులు

కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల విషయంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ మూడు కీలక సిఫార్సులు చేసిందని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు తెలిపారు. "బ్యారేజీల గేట్లన్నీ ఎత్తి ఉంచాలని నిపుణుల కమిటీ చెప్పింది. డబ్బులు ఖర్చు చేసి మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేసినా అది ఉంటుందో లేదో నమ్మకం ఇవ్వలేమని పేర్కొంది. బ్యారేజీలకు జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలు నిర్వహించాలని సిఫారసు చేసింది. బ్యారేజీలకు పరీక్షలు పూర్తయ్యే వరకు తదుపరిగా ఏ రకమైన పనులు చేపట్టవద్దని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మూడు కేంద్ర ప్రభుత్వ సంస్థలతో పరీక్షలు నిర్వహించాలని.. ప్రతి బ్యారేజీకి రెండు సంస్థలతో పరీక్షలు నిర్వహించి, రెండింటి అభిప్రాయాల ఆధారంగా మరమ్మతులు చేయాలని నిర్ణయించాం.." అని



వెల్లడించారు. ఈ పరీక్షలు త్వరగా నిర్వహించేలా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి ఎన్డీఎస్ఏతో సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు.

బ్యారేజీల్లో రాళ్ల కట్టతో పంపింగ్‌కు ప్రయత్నిస్తాం..

కాళేశ్వరం బ్యారేజీల పరిధిలో తక్కువ ఖర్చుతో రాళ్ల కట్టను నిర్మించి.. నీళ్లను పంపింగ్ చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులను మంత్రివర్గం ఆదేశించిందని మంత్రి పొంగులేటి చెప్పారు. ప్రాజెక్టుపై గత ప్రభుత్వం చేసిన ఖర్చు వృథా కాకుండా.. నిపుణుల సూచనలతో తాత్కాలిక ఏర్పాట్లు చేసి రైతులకు నీళ్లు ఇవ్వాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. గత ప్రభుత్వ తప్పును సాకుగా చూపి రైతులను ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశం తమకు లేదన్నారు.

ధర్నాల పేరుతో డ్రామాలు..

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన కోసం కలెక్టర్లను క్షేత్రస్థాయికి వెళ్లాలని ఆదేశించినట్టు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ధర్నాల పేరుతో డ్రామాలు చేశారని, వారు రైతులకు ఏం చేశారో అందరికీ తెలుసని బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేయబోతున్నామని చెప్పారు.

మూసివేసిన పాఠశాలలు తెరుస్తాం

➤ హేతుబద్ధీకరణ పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం మూసివేసిన 5,600 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి.. విద్యార్థులు వచ్చేవాటిని తిరిగి ప్రారంభించాలని నిర్ణయించినట్టు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పాఠశాల, సాంకేతిక, ఉన్నత విద్యతోపాటు ఉపాధి కల్పించే నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేయాలని.. మంచి మార్పు చూపించాలని కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించామన్నారు. నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపా యాలు, బోధన, బోధనేతర అంశాలపై దృష్టి పెడతామని చెప్పారు. మరుగు దొడ్లు, పెయింటింగ్, ఇతర అన్ని హంగులతో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతామన్నారు. విద్యార్థులకు యూనిఫారాలను కుట్టే బాధ్యతను మహిళా సంఘాలకు ఇచ్చామని.. ప్రతి విద్యార్థికి రెండు జతలు సరఫరా చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని కమిటీ ఫీజుల నియంత్రణ అంశాన్ని పరిశీలిస్తుందని పొంగులేటి తెలిపారు.

సన్న ధాన్యం పండిస్తే రూ.500 బోనస్

వచ్చే వానాకాలంలో సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఆ సన్నవడ్ల రకాలను వ్యవసాయ శాఖ ప్రకటించనుంది. బడుల్లో మధ్యాహ్న భోజనానికి, హాస్టళ్లకు విద్యార్థి, రెండు రూపాయలకే కిలో బియ్యం వంటి పథకాలకు ఏటా 36 లక్షల టన్నుల బియ్యం అవసరం కాగా.. వాటన్నింటికీ సన్న బియ్యం ఇస్తామని గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చామని మంత్రి పొంగులేటి చెప్పారు. బయటి రాష్ట్రాల నుంచి సన్నబియ్యం కొనుగోలు చేయవద్దని నిర్ణయం తీసుకున్నామని, అందుకే రాష్ట్రంలో సన్నబియ్యం పండించిన రైతులకు బోనస్ చెల్లిస్తామని వివరించారు. విత్తనాలు, ఎరువులు, ఇతర అవసరాలకు ఇబ్బంది రావద్దని.. నకిలీ విత్తనాల తయారీదారులు, విక్రయదారులు, నకిలీ రశీదులు జారీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని చెప్పారు. రైతులు లూజు విత్తనాలు కొనవద్దని, కంపెనీల వద్దే కొనాలని, సాగు ముగిసేవరకు రసీదులు దాచిపెట్టుకోవాలని సూచించారు.

ఫరీద్‌కోట్ ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడిగా భట్టి

ఏఐసీసీ ఉత్తర్వులు



సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏడో విడతలో జూన్ 1న ఎన్నికలు జరగనున్న పంజాబ్‌లోని ఏడు లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ అధిష్టానం ఏఐసీసీ పరిశీలకులను నియమించింది. ఇందులో ఫరీద్‌కోట్ లోక్‌సభ స్థానం ప్రత్యే క పరిశీలకుడిగా తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను నియమించారు. అలాగే పటియాలాకు మాణిక్యం ఠాగూర్‌ను పరిశీలకుడిగా నియమించారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీచేశారు.

పది ఎంపీ సీట్లు వస్తాయి!

కేబినెట్ సమావేశంలో సీఎం, మంత్రుల ధీమా

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో పది సీట్లలో విజయం సాధిస్తామని రాష్ట్ర మంత్రివర్గం ధీమా వ్యక్తం చేసినట్టు తెలిసింది. సోమవారం జరిగిన కేబినెట్ భేటీలో ఇటీవలి లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సరళిపై కొద్దిసేపు చర్చ జరిగినట్టు సమాచారం. పోలింగ్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగానే జరిగిందని సీఎం రేవంత్ పేర్కొన్నట్టు సమాచారం. తమ నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగిన తీరు, కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలపై ఒకరిద్దరు మంత్రులు కూడా తమ అభిప్రాయాలను పంచుకున్నట్టు తెలిసింది. ఈ సందర్భంగా ఎన్నికల్లో మంత్రులందరూ కష్టపడి పనిచేశారని, అభ్యర్థులతో పాటు స్థానిక నేతలను సమన్వయం చేసుకుని ముందుకెళ్లారని రేవంత్ అభినందించినట్టు సమాచారం.

సర్కారు 'సన్నాల' రాగం

బోనస్ పేరిట రైతులకు మొండిచెయ్యి!

సాక్షి, హైదరాబాద్: రైతులు పండించే ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామన్న ఎన్నికల హామీకి రేవంత్ సర్కారు 'సన్నని' మెలిక పెట్టింది. రైతులు పండించే సన్న ధాన్యానికే వచ్చే సీజన్ నుంచి రూ. 500 బోనస్ ఇస్తామని కేబినెట్‌లో తీర్మానించి, రైతుల ఆశలపై నీళ్లు కుమ్మరించింది. రాష్ట్రంలో వానాకాలం, యాసంగి సీజన్‌లలో కలిపి గత మూడేళ్లుగా సగటున 1.20 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తెస్తున్నారు. ఇందులో 80 నుంచి 90 శాతం వరకు దొడ్డు ధాన్యమే ఉంటుంది. అంటే ఏటా సుమారు కోటి టన్నుల దొడ్డు రకాల ధాన్యాన్నే రైతులు విక్రయిస్తున్నారు. కానీ రేవంత్ ప్రభుత్వం సన్న ధాన్యానికే బోనస్ అని చెప్పడంతో సుమారు కోటి టన్నుల దొడ్డు ధాన్యం పండించే రైతులకు మొండిచెయ్యి ఎదురయ్యేలా ఉంది.

ఖరీఫ్‌లోనే సన్నాలు..
అవి కూడా బహిరంగ మార్కెట్‌కే

రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సన్న ధాన్యం కేవలం వానాకాలం సీజన్‌లోనే పండుతుంది. రైతులు సొంత తిండి అవసరాలతో పాటు బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకునేందుకు మాత్రమే సన్నాలు పండిస్తారు. అది కూడా 40 శాతం లోపే. మిగతా 60 శాతం దొడ్డు ధాన్యాన్నే సాగు చేస్తారు. సన్న ధాన్యం దిగుబడి తక్కువగా ఉండడం, పంట రావడానికి ఎక్కువ రోజులు పట్టడంతో పదెకరాలు ఉన్న రైతు సైతం తన తిండి అవసరాలకు 2 ఎకరాల్లో సన్నాలు సాగు చేసుకొని, మిగతా 8 ఎకరాల్లో దొడ్డు ధాన్యం పండించి, కనీస మద్దతు ధర కోసం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తాడు. గత వానాకాలం సీజన్‌లో సన్నాలు పండించిన రైతులకు రూ. 3వేల వరకు చెల్లించి ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. ధాన్యాన్ని మర పట్టించి బియ్యాన్ని విక్రయించే రైతులకు భారీగా లాభాలు వచ్చాయి. నల్లగొండ, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల్లో మాత్రమే సన్నాలను ఖరీఫ్‌తో పాటు యాసంగిలో కూడా కొంత ఎక్కువ శాతం సాగుచేసి, ప్రైవేటు వ్యాపారులకు



విక్రయిస్తుంటారు. యాసంగి సీజన్‌లో కొనుగోలు కేంద్రాలకు సన్న ధాన్యం అసలే రాదు. ఈ పరిస్థితుల్లో సన్నాలకే బోనస్ అంటే రైతుల నోట్లో మన్ను కొట్టడమేనని విపక్ష బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు.

టన్నుకు రూ.5 వేల చొప్పున రూ. 5 వేల కోట్లు మిగిలేలా..!

➤ క్వింటాలుకు రూ. 500 చొప్పున రైతు పండించిన ధాన్యానికి బోనస్ ఇస్తే టన్నుకు రూ.5వేల చొప్పున 1.20 కోట్ల టన్నులకు రూ.6వేల కోట్లు చెల్లించాలి. అయితే సన్నాలకే బోనస్ ఇస్తే అందులో కోటి మెట్రిక్ టన్నుల బోనస్ ప్రభుత్వానికి మిగిలినట్టే. 20 లక్షల టన్నుల సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చినా సర్కారుకు అదనంగా అయ్యే ఖర్చు రూ.వెయ్యి కోట్లు మాత్రమే అని అంచనా.

ప్రశ్నించే గొంతు మండలిలో ఉండాలి

- అలా ఉండాలంటే పార్టీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి
- కాంగ్రెస్ అభ్యర్థి జైలు జీవితం గడిపిన బ్లాక్ మెయిలర్
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతున్న మాజీ మంత్రి కేటీఆర్. చిత్రంలో ప్రవీణ్ కుమార్

ఖమ్మం సహకారనగర్/ఇల్లెందు/సూపర్‌బజార్ (కొత్తగూడెం): 'ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతు శాసనమండలిలో ఉండాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నది. ఇప్పటివరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. జాబ్ కేలండర్ ఇవ్వలేదు. రూ.400 ఉన్న టెట్ ఫీజు రూ.2 వేలు చేసింది. వీటిపై మండలిలో గళం విప్పి గర్జించాలంటే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం, కొత్తగూడెం, ఇల్లెందులో వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుగుల రాకేశ్‌రెడ్డి గోల్డ్‌మెడలిస్ట్ అయితే కాంగ్రెస్ అభ్యర్థి బ్లాక్‌మెయిలర్ అని, 74 రోజులు జైలులో గడిపారని, అలాంటి వ్యక్తి పట్టభద్రుల ప్రతినిధి అవుతాడా అని ప్రశ్నించారు. విద్యావంతులు ఎన్నుకునే వ్యక్తి వారి తరఫున వకాల్తా పుచ్చుకుని వాదించాలన్నారు. గడిచిన పదేళ్ల కాలంలో దేశంలోని ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి తెలంగాణలో జరిగిందని కేటీఆర్ వివరించారు. రాష్ట్రంలో 24 లక్షల మందికి ఉపాధి కల్పించామని, 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని దేశంలో ఎక్కడైనా ఇలా ఇచ్చిఉంటే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. సోషల్ మీడియాలో వెనకబడి.. చేసిన అభివృద్ధిని చెప్పుకోలేకపోవటంతో గ్రామీణ ఓటర్లు కాంగ్రెస్ మాయలో పడ్డారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో విజ్ఞులైన పట్టభద్రులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. బలమైన ప్రతిపక్షం లేకపోతే సింగరేణిని బీజేపీ, కాంగ్రెస్‌లు అదానీకి అమ్మేస్తాయని ఆరోపించారు. ఆయా సభల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బోనస్ పెద్ద బోగస్

ప్రస్తుత సీజన్ నుంచే అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలి: హరీశ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్ /దేవరకొండ: ఎన్నికల హామీలను వరుసగా తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లకు బోనస్ ఇవ్వడంలోనూ మాట తప్పిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చి అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెప్పిందన్నారు. అదే తరహాలో వడ్లకు బోనస్ ఇచ్చే విషయంలోనూ కాంగ్రెస్ పచ్చి అబద్ధాలతో రైతులను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో భాగంగా హామీ ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు బోనస్ కోసం ఎదురుచూస్తుండగా కేవలం సన్న వడ్లకు మాత్రమే వచ్చే సీజన్ నుంచి బోనస్ ఇస్తామని మంత్రులు ప్రకటించడం బాధాకరం. రాష్ట్రంలో 90% మంది రైతులు దొడ్డు రకం వడ్లనే పండిస్తారు. పదిశాతం పండే సన్న వడ్లకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది. సన్న వడ్లకు ప్రభుత్వ మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్లో మంచి ధర వస్తుంది. కానీ దొడ్డు రకం ధాన్యానికే గిట్టుబాటు ధర రాదు. కేవలం సన్న రకాలకే బోనస్ ఇస్తాం.. అదీ వచ్చే సీజన్ నుంచి ఇస్తామనడం రైతులను దగా చేయడమే' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

5నెలల్లోనే కుప్పకూలిన డయాగ్నొస్టిక్ వ్యవస్థ

తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్ల వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం 5 నెలల్లోనే కుప్పకూల్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రాల నిర్వహణ, సిబ్బందికి వేతనాలు చెల్లించకపోవడంపై 'ఎక్స్'లో హరీశ్ స్పందించారు. నాణ్యమైన వైద్య పరీక్షలను అందించిన డయాగ్నస్టిక్ కేంద్రాలు ప్రస్తుతం నిర్వహణలోపంతో కొట్టుమిట్టాడుతున్నాయని చెప్పారు.

బడి పంతుళ్లపై లాఠీలు.. బడుగు జీవులకు ఝూటా హామీలు

'రాష్ట్రంలో బడి పంతుళ్లపై లాఠీలు.. బడుగు జీవులకు ఝూటా హామీలు.. ఇది రేవంత్ పాలన' అని హరీశ్‌రావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తండ్రి కసీలాల్ ఇటీవల మరణించారు. ఆయనకు నివాళి అర్పించడానికి హరీశ్ రావు దేవరకొండకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతులు, నిరుద్యోగులు ఆలోచించి త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు.

కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

చార్జిషీటు పరిగణనపై విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసుల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌజ్ అవెన్యూ కోర్టు పొడిగించింది. సీబీఐ, ఈడీ కేసుల్లో కవిత జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో సోమవారం అధికారులు న్యాయమూర్తి కావేరి బవేజా ఎదుట వర్చువల్‌గా హాజరు పరిచారు. దర్యాప్తు కీలక దశలో ఉన్నందున ఆమె కస్టడీ పొడిగించాలని సీబీఐ, ఈడీ తరపు న్యాయవాదులు పంకజ్ గుప్తా, జొహెబ్ హొస్సేన్‌లు కోరారు. కవితతో పాటు మరో నలుగురిపై దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీటు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. దీనిపై కవిత న్యాయవాది నితీష్ రాణా అభ్యంతరం తెలిపారు. చార్జిషీటు దాఖలు చేసిన తర్వాత కస్టడీ అవసరం లేదన్నారు. ఇరుపక్షాల వాదనల అనంతరం రెండు కేసుల్లోనూ జూన్ 3 వరకు కవిత కస్టడీ పొడిగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

చార్జిషీటుపై ఈడీ వాదనలు: కవితతో పాటు మరో నలుగురిపై ఈడీ దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీటును పరిగణనలోకి తీసుకోవడంపై దర్యాప్తు సంస్థ ప్రత్యేక కోర్టులో వాదనలు వినిపించింది. న్యాయవాది నవీన్ కుమార్ మట్టా వాదనలు వినిపిస్తూ.. కవిత, చారియట్ ప్రొడక్షన్స్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ ఉద్యోగులు దామోదర్ శర్మ, ప్రిన్స్‌కుమార్, చరణ్‌ప్రీత్ సింగ్, ఇండియా ఎహెడ్ న్యూస్ ఛానల్ మాజీ ఉద్యోగి అరవింద్ సింగ్‌ల పాత్ర గురించి చార్జిషీటులో ప్రస్తావించినట్లు తెలిపారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుని కవిత కాకుండా మిగిలిన వారి పాత్రపై వాదనలు విన్పించాలని సూచించారు. ఇదే క్రమంలో న్యాయమూర్తి అడిగిన ప్రశ్నలపై సమాధానానికి నవీన్ కుమార్ సమయం కోరారు. ఈ నేపథ్యంలో పూర్తి వివరాలతో రావాలంటూ న్యాయమూర్తి తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

'లోకల్' అంత ఈజీ కాదు

- పోలింగ్ బూత్‌ల వారీగా బీజేపీకి పడిన ఓట్ల ఆధారంగా పరిశీలన
- కష్టపడిన వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరుగుతాయనే వార్తల నేపథ్యంలో క్షేత్రస్థాయిపై బీజేపీ దృష్టి సారించింది. తొలుత గ్రామపంచాయతీ, ఆ తర్వాత జిల్లా, మండల పరిషత్‌లకు, ఈ ఏడాది చివర్లోగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు వరుసగా ఎన్నికలు జరుగుతాయి. అయితే గ్రామస్థాయిలో వార్డు సభ్యులు, మొదలుకొని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు ఇలా ప్రతిచోట అభ్యర్థి ఎంపికనే కీలకం. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో పార్టీకి పడిన ఓట్లు, ఆయా పోలింగ్ బూత్‌లలో బీజేపీకి పోలైన ఓట్ల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక, టికెట్ల కేటాయింపుపై పూర్తిస్థాయి దృష్టి పెడతారని పార్టీవర్గాల సమాచారం. కొంతకాలంగా పార్టీ కోసం పనిచేస్తుండడంతోపాటు, ప్రజల్లో ఉన్న గుర్తింపు, వివిధ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రయత్నా లు, ఆయా ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు సాధించిన ఓట్లు ప్రామాణికంగా మారనున్నట్టు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి, వివిధ వర్గాల ఓట్ల సాధనకు ఏ మేరకు సఫలమయ్యారనే దాని ప్రాతిపదికన స్థానిక సంస్థల టికెట్లు కేటాయిస్తామని పార్టీ నేతలు చెబుతున్నారు. పార్టీలో ఇంతకాలంగా ఉన్నాం.. ఇంత పనిచేశాం ..అంత పనిచేశామనే ప్రచారానికి పరిమితం కాకుండా గ్రౌండ్‌లెవల్‌లో పార్టీ ఫలితాల సాధనకు ఏ మేరకు వారి కృషి ఉందనే అంశాన్ని నాయకత్వం బేరీజు వేయనున్నట్టు తెలుస్తోంది. వివిధ స్థాయిల్లో పార్టీ అభ్యర్థులు మంచి ప్రదర్శన కనబరచడంలో స్థానిక నేతల కృషి, సాధించిన ఫలితాలు కొలమానం చేయడం ద్వారా నాయకులు, కార్యకర్తల్లో మరింత అంకితభావం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. వచ్చే 2,3 నెలల్లో గ్రామీణ, ఆ తర్వాత మున్సిపాలిటీల ఎన్నికలు జరగొచ్చన్న అంచనాల మధ్య పార్టీలో స్థానికంగా వివిధస్థాయిలో అభ్యర్థుల ఎంపిక కసరత్తు అనేది కూడా త్వరలోనే మొదలు మొదలవుతుందని సమాచారం. జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక, పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లు, పోలింగ్‌బూత్‌ల వారీగా పార్టీకి పడిన ఓట్ల వివరాలు వెల్లడయ్యాక ఈ ప్రక్రియ వేగం పుంజుకుంటుందని పార్టీనేతలు చెబుతున్నారు.

బెంగళూరు రేవ్ పార్టీలో తెలుగు రాష్ట్రాల ప్రముఖులు!

▶ మొదటి పేజీ తరువాయి

అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

అదుపులోకి తీసుకున్న వారికి వైద్య పరీక్షలు

రేవ్‌పార్టీ జరిగినట్లు బెంగళూరు పోలీసులు ధ్రువీకరించారు. అయితే పార్టీలో ప్రముఖులు ఎవరెవరు ఉన్నదీ వెల్లడించలేదు. అదనపు పోలీస్ కమిషనర్ డాక్టర్ చంద్రగుప్తా సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అనంతరం బెంగళూరు పోలీసులు ఒక ప్రకటన సైతం జారీ చేశారు. రేవ్ పార్టీకి సంబంధించి ఐదుగురిని అరెస్టు చేశామని, ఎలక్ట్రానిక్ సిటీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. రేవ్‌పార్టీలో పాల్గొన్న వారిని అదుపులోకి తీసుకున్నామని, రక్తం నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. రేవ్‌పార్టీలో 100 మంది ఉన్నారని, డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించి తనిఖీలు చేపట్టామని, కొన్ని మాదకద్రవ్యాలు లభించాయని వివరించారు. 'సన్‌సెట్ టు సన్‌రైజ్ విక్టరీ'పేరిట రేవ్ పార్టీ జరిగినట్లు పోలీసులు తమ ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు 15.56 గ్రాముల ఎండీఎంఏ, 6.2 గ్రాముల హైడ్రో గంజాయి, కొకైన్, 5 మొబైల్ ఫోన్లు, రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



రేవ్ పార్టీ జరిగిన స్థలం... జాగిలాలతో లోపలికి వెళ్తున్న అధికారులు

జీఆర్ ఫాంహౌస్‌లో పార్టీ

హెబ్బగోడి పోలీస్‌స్టేషన్ పరిధిలో కాన్‌కార్డు యజమాని గోపాలరెడ్డి పేరిట ఉన్న జీఆర్ ఫార్మ్ హౌస్‌లో ఈ పార్టీ జరిగింది. హైదరాబాద్‌కు చెందిన వాసు అనే వ్యక్తి ఈ పార్టీని నిర్వహించినట్లు తెలిసింది. ఈ పార్టీ కోసం ప్రత్యేకంగా విమానాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ నటీనటులు, మోడళ్లు, టెక్కీలు పాల్గొన్నట్లు ఈ పార్టీలో ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫాంహౌస్ పరిసరాల్లో మెర్సిడిస్ బెంజ్, జాగ్వార్, ఆడి వంటి ఖరీదైన కార్లు ఉన్నాయి.

రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వ్యయం

నగరం నడిబొడ్డున ఇంత పెద్దయెత్తున రేవ్ పార్టీ నిర్వహిస్తే పోలీసుల నుంచి ఇబ్బందులు రావొచ్చని భావించి నగర శివార్లలో నిర్వహించినట్లు సమాచారం. ఈ ఒక్కరోజు పార్టీ కోసం సుమారు రూ.30 లక్షల నుంచి రూ. 50 లక్షల మేర ఖర్చు చేసినట్లు తెలిసింది. దాడి చేసేందుకు వచ్చిన పోలీసులను గమనించగానే నిర్వాహకులు తలుపులు మూసేశారు. అయితే వారు బలవంతంగా తలుపులు తెరిచి లోపలకు వెళ్లారు. అప్పటికే కొందరు డ్రగ్స్‌ను దాచి పెట్టారు. కొంతమంది తమ వద్ద ఉన్న మాదకద్రవ్యాలను టాయిలెట్ కమోడ్‌లలో వేసి ఫ్లష్ చేశారు. కాగా పోలీసులు ఫాంహౌస్‌ను క్షుణ్ణంగా గాలించారు. ముగ్గురు డ్రగ్ పెడ్లర్లతో పాటు నిర్వాహకుడు వాసు, మరొకరు ఇలా.. మొత్తం ఐదుమందిని అరెస్టు చేశారు. వాసు పుట్టిన రోజు పార్టీ నిర్వాహకులు అరుణ్, సిద్ధిఖీ, రణబీర్, నాగబాబులను అదుపులోకి తీసుకున్నారు. పరప్పన అగ్రహార పోలీసుస్టేషన్‌లో ఈ పార్టీకి అనుమతులు తీసుకున్నట్లు వాసు చెబుతున్నప్పటికీ అది అవాస్తవమని తెలుస్తోంది. పార్టీకి వచ్చిన వారు ఫాంహౌస్ లోపలికి వెళ్లాలంటే సెక్యూరిటీ పాస్‌వర్డ్ చెప్పేలా ఏర్పాటు చేసినట్లు సమాచారం. రేవ్ పార్టీలో తెలుగు నటులు హేమ, శ్రీకాంత్, డ్యాన్స్ మాస్టర్ జానీ కూడా పాల్గొన్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. అయితే తాము ఆ పార్టీలో పాల్గొనలేదని వీడియో బైట్ల ద్వారా వారు వివరణ ఇచ్చారు. అయితే హేమ మాత్రం పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. ఆమె విడుదల చేసిన వీడియో హైదరాబాద్‌లో తీసింది కాదని, ఆ ఫాంహౌస్ లోపలే హేమ వీడియో బైట్ ఇచ్చినట్లు ఆమె ధరించిన దుస్తుల ఆధారంగా అనుమానిస్తున్నారు.

నేను నా ఇంట్లోనే ఉన్నా: శ్రీకాంత్

రేవ్‌పార్టీ ఎలా ఉంటుందో కూడా నాకు తెలియదు

బెంగళూరు రేవ్ పార్టీతో తనకు ఎలాంటి సంబంధం లేదని టాలీవుడ్ నటుడు శ్రీకాంత్ అన్నారు. తానసలు ఆ పార్టీకే వెళ్లలేదని చెప్పారు. ఈ మేరకు వివరణ ఇస్తూ తన ఇంట్లో నుంచే ప్రత్యేకంగా వీడియోను విడుదల చేశారు. 'నేను హైదరాబాద్‌లోని మా ఇంట్లోనే ఉన్నాను. నేను బెంగళూరు రేవ్ పార్టీకి వెళ్లినట్లు, పోలీసులు అరెస్టు చేశారనే వార్తలతో కొందరు నాకు ఫోన్ చేశారు. నేను కూడా వీడియో క్లిప్స్ చూశా. కొంతమంది మీడియా మిత్రులు నాకు ఫోన్ చేసి క్లారిటీ తీసుకున్నారు. కొన్నింటిలో మాత్రం నేను వెళ్లాననే వార్తలు వచ్చాయి. అవి చూసి నేను, మా కుటుంబ సభ్యులందరం నవ్వుకున్నాం. మొన్నేమో నా భార్యతో నాకు విడాకులు ఇప్పించేశారు. ఇప్పుడేమో రేవ్ పార్టీకెళ్లానని అన్నారు. అలా వార్తలు రాసిన వాళ్ల తొందరపడటంలో తప్పులేదనిపించింది. ఎందుకంటే రేవ్ పార్టీలో దొరికిన అతనెవరో కానీ, కొంచెం నాలాగే ఉన్నాడు. నేనే షాకయ్యా. నేను రేవ్ పార్టీలకు, పబ్స్‌కు వెళ్లే వ్యక్తిని కాను. రేవ్ పార్టీ ఎలా ఉంటుందో కూడా నాకు తెలియదు. ఎప్పుడైనా బర్త్ డే పార్టీల్లాంటి వాటికి వెళ్లినా కొంతసేపే ఉండి వచ్చేస్తా. ప్రస్తుతం నేను ఇంట్లోనే ఉన్నాను. దయచేసి తప్పుడు కథనాలను నమ్మొద్దు..'అని శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు.

నేను హైదరాబాద్‌లోనే చిల్ అవుతున్నా..

బెంగళూరులో నన్ను అరెస్ట్ చేశారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. కానీ నేను హైదరాబాద్‌లోనే ఉన్నా. ఓ ఫామ్ హౌస్‌లో చిల్ అవుతున్నా. బెంగళూరులో ఎలాంటి పార్టీకి వెళ్లలేదు నన్ను అనవసరంగా ఇందులోకి లాగుతున్నారు. నాపై వస్తున్న వార్తల్లో నిజం లేదు. – సినీ నటి హేమ

బదిలీలతో బరి తెగింపు!

- 'ఎన్నికల హింస'పై డీజీపీకి సిట్ నివేదిక
- దాడులు అరికట్టడం, కేసుల దర్యాప్తులో పోలీసులు విఫలం
- పోలింగ్‌కు ముందు ఆకస్మిక బదిలీలతో యథేచ్ఛగా విధ్వంసకాండ
- దర్యాప్తు సక్రమంగా లేదు.. అదనపు సెక్షన్లు చేర్చాలి



డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు నివేదిక సమర్పిస్తున్న సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్ లాల్. చిత్రంలో ఎస్పీ రమాదేవి

సాక్షి, అమరావతి: ఎన్నికల వేళ పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో విధ్వంస కాండను అరికట్టడం, అనంతరం కేసుల దర్యాప్తులో పోలీసు అధికారులు విఫలమయ్యారని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) నిర్ధారించింది. నిందితులపై కీలక సెక్షన్ల కింద కేసులు నమోదు చేయకపోవడాన్ని ప్రస్తావించింది. మూడు జిల్లాల్లో హింసాత్మక సంఘటనలపై విచారించిన సిట్ బృందం ఇన్‌చార్జ్ వినీత్ బ్రిజ్‌లాల్ ప్రాథమిక నివేదికను సోమవారం రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాకు అందచేశారు. రెండు రోజుల పాటు విస్తృతంగా విచారణ నిర్వహించిన సిట్ అధికారుల బృందం పోలీసుల వైఫల్యాలపై నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది. పూర్తి నివేదిక అందించేందుకు మరికొంత సమయం పడుతుందని పేర్కొంది.

బదిలీ చేసిన జిల్లాల్లోనే హింస

పోలింగ్‌కు ముందు చంద్రబాబు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఎన్నికల కమిషన్ (ఈసీ)పై ఒత్తిడి తెచ్చి పల్నాడు నుంచి అనంతపురం వరకు ఏకంగా 39 మంది పోలీసు అధికారులను బదిలీ చేయించిన విషయం తెలిసిందే. వారి స్థానాల్లో పురందేశ్వరి సమర్పించిన జాబితాలోని అధికారులనే ఈసీ నియమించడం గమనార్హం.

ఈ క్రమంలో పోలింగ్ రోజు మే 13న, అనంతరం టీడీపీ గూండాలు యథేచ్ఛగా విధ్వంసానికి పాల్పడ్డారు. ఈసీ నియమించిన పోలీసు అధికారులు శాంతి భద్రతల పరిరక్షణలో దారుణంగా విఫలమయ్యారు. అనంతరం కేసుల నమోదు, దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

అదనపు సెక్షన్లు చేర్చండి..

విధ్వంస కాండపై పోలీసుల దర్యాప్తు తూతూ మంత్రంగా ఉందని సిట్ స్పష్టం చేసింది. నిందితులను పట్టుకునేందుకు అదనపు బృందాలను ఏర్పాటు చేయడంతోపాటు అదనంగా మరికొన్ని సెక్షన్లు జోడించాలని సూచించింది. అందుకోసం న్యాయస్థానాల్లో మెమో దాఖలు చేయాలని పేర్కొంది. నిందితులను త్వరగా అరెస్టు చేయడంతోపాటు ముందస్తు తేదీతో చార్జిషీట్లను దాఖలు చేయాలని పేర్కొంది. పోలింగ్ సందర్భంగా దాడుల కేసుల దర్యాప్తును తాము పర్యవేక్షిస్తామని సిట్ స్పష్టం చేసింది.

33 కేసులు.. 1,370 మంది నిందితులు

పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో పోలింగ్ సందర్భంగా దాడులు, దౌర్జన్యకాండపై ఇప్పటి వరకు 33 కేసులు నమోదు చేశారు. పల్నాడు జిల్లాలో 22, అనంతపురం జిల్లాలో 7, తిరుపతి జిల్లాలో 4 కేసులు నమోదయ్యాయి. మొత్తం 1,370 మందిని నిందితులుగా పేర్కొనగా ఇప్పటివరకు 124 మందిని అరెస్ట్ చేశారు. మరో 94 మందికి సెక్షన్ 41 ఏ కింద నోటీసులు జారీ చేశారు.

నాలుగు బృందాలు..


పోలింగ్ సందర్భంగా హింసాత్మక సంఘటనలపై సిట్ విస్తృతంగా దర్యాప్తు చేసింది. వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో ఏర్పాటైన సిట్ నాలుగు బృందాలుగా ఏర్పడి శని, ఆదివారాల్లో విచారణ నిర్వహించింది. పల్నాడు జిల్లాలో రెండు బృందాలు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో ఒక్కో బృందం పర్యటించి హింసాత్మక సంఘటనలు జరిగిన ప్రదేశాలను పరిశీలించాయి. బాధితులతో మాట్లాడి వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించాయి. పోలీసు అధికారులను విచారించడంతోపాటు పరిస్థితిని సమీక్షించాయి.

టాలీవుడ్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం

సాక్షి, హైదరాబాద్: టాలీవుడ్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం రేగింది. ఎక్కడ డ్రగ్స్ పార్టీలు జరిగినా టాలీవుడ్ నటులతో లింక్ పెడుతూ వార్తలు వస్తున్నాయి. ఆదివారం రాత్రి బెంగళూరులో జరిగిన రేవ్‌పార్టీలో తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేకమంది ప్రముఖులతో పాటు నటీనటులు పట్టుబడినట్లు వార్తలు వచ్చాయి. నటుడు శ్రీకాంత్, నటి హేమ వీరిలో ఉన్నారనే ప్రచారం జరగ్గా..దానిపై వారు వివరణ ఇచ్చారు. 2018లోనూ తెలంగాణ ఎక్సైజ్‌శాఖ అధికారులు దర్యాప్తు చేసిన టాలీవుడ్ డ్రగ్స్ కేసు తెలుగు చిత్రపరిశ్రమను కుదిపేసిన విషయం తెలిసిందే. దర్శకుడు పూరీ జగన్నాథ్, నటులు రవితేజ, తరుణ్, నవదీప్, తనీష్, చార్మి, ముమైత్ ఖాన్ సహా పలువురిని ఎక్సైజ్ శాఖ అధికారులు రోజుల తరబడి విచారించడం సంచలనం సృష్టించింది. గతేడాది తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు దర్యాప్తు చేసిన ఓ కేసులో నటుడు నవదీప్‌తో పాటు షాడో, రైడ్ చిత్రాల నిర్మాత ఉప్పలపాటి రవి, డియర్ మేఘ చిత్ర దర్శకుడు అనుగు సుశాంత్ రెడ్డి, మోడల్ శ్వేత, మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ దేవరకొండ విఠల్ రావు కుమారుడు సురేశ్‌రావు తదితరుల పేర్లు బయటికి వచ్చాయి. తాజాగా బెంగళూరు పార్టీలో శ్రీకాంత్, హేమ ఉన్నారనే వార్తలు రావడం సంచలనం సృష్టించింది.

దుష్ప్రచారం చేయడం డాక్టర్ లోకేశ్‌కు అలవాటే..

- కోర్టుల్లో తప్పుడు కేసులు వేయడంలో నేర్పరి
- చీవాట్లు పెట్టి జరిమానా విధించిన అమెరికా కోర్టు
- పలువురు రోగుల మరణానికి కారకుడయ్యాడని ప్రాక్టీస్ పైనా నిషేధం
- ప్రముఖ ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ వాసుదేవరెడ్డి వెల్లడి



GOVERNMENT OF THE DISTRICT OF COLUMBIA
BOARD OF MEDICINE

IN RE:
LOKESH VUYYURU, M.D.
Applicant

FINAL DECISION AND ORDER OF THE BOARD

Background

డాక్టర్ లోకేశ్ మెడికల్ లైసెన్స్‌ను రద్దుచేస్తూ కొలంబియా బోర్డు ఆఫ్ మెడిసిన్ ఇచ్చిన నివేదిక

సాక్షి, అమరావతి: ప్రముఖులపై దుష్ప్రచారం చేయడం డాక్టర్ ఉయ్యూరు లోకేశ్‌కు అలవాటని ప్రముఖ ఎస్‌ఆర్‌ఐ డాక్టర్ వాసుదేవరెడ్డి తెలిపారు. ఏపీలో ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని మేధావిగా చలామణి అవుతున్నారని ఎద్దేవా చేశారు. అయితే అమెరికాలో 18 ఏళ్లగా ఆయన ప్రాక్టీస్‌పై నిషేధం కొనసాగుతోందని తెలిపారు. టీడీపీ సానుభూతి పరుడైన లోకేశ్ ఇటీవల గన్నవరం విమానాశ్రయంలో లండన్‌కు వెళుతున్న సీఎం జగన్‌ను అడ్డుకునేందుకు కుట్ర పన్నారు. ఈ సందర్భంగా అతని గురించి పలు విస్తుపోయే వాస్తవాలను డాక్టర్ వాసుదేవరెడ్డి 'సాక్షి'కి తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. గుంటూరు మెడికల్ కాలేజీలో 1983లో లోకేశ్ గ్రాడ్యుయేట్ అయ్యాడు. గ్యాస్ట్రో విభాగంలో ఎండీ పూర్తిచేసిన ఆయన అమెరికాలోని వర్జీనియాలో తొలుత ప్రాక్టీస్ మొదలెట్టాడు. అప్పటి నుంచే ఎదుటి వ్యక్తులపై అవాస్తవ ఆరోపణలు చేయడం,



డాక్టర్ వాసుదేవరెడ్డి

కోర్టుల్లో తప్పుడు కేసులు ఫైల్ చేయడం లోకేశ్‌కు అలవాటు. ప్రాక్టీస్ ప్రారంభించిన తొలినాళ్లలో ఆస్పత్రి యాజమాన్యంపై, సహచర వైద్యులపై కోర్టులో కేసులు వేసి, ఆ ఆరోపణలను రుజువు చేయడంలో విఫలమయ్యాడు. ఇదే తరహాలో 2022లో భారత ప్రధాని మోదీ, ఏపీ సీఎం వైఎస్ జగన్, అదానీ మీద వాషింగ్టన్ డీసీ కోర్టులో కేసులు ఫైల్ చేశాడు. ఇండియా నుంచి కంటైనర్‌లలో డబ్బుతో పాటు, ఇజ్రాయిల్ నుంచి స్పైవేర్ కొనుగోలు చేసి అమెరికాకు అక్రమంగా తరలిస్తున్నారంటూ ఆరోపణలు చేశాడు. తప్పుడు ఆరోపణలతో కోర్టు సమయాన్ని వృథా చేస్తున్నావని లోకేశ్‌కు కోర్టు చీవాట్లు పెట్టడంతో పాటు జరిమానా విధించింది.

ప్రాక్టీస్‌పైనా నిషేధం

వైద్య నిబంధనలకు విరుద్ధంగా రోగులకు చికిత్సలు అందించి పలువురి మరణానికి లోకేశ్ కారకుడయ్యాడు. 2006లో వర్జీనియా బోర్డ్ ఆఫ్ మెడిసిన్ లోకేశ్ మెడికల్ లైసెన్స్‌ను రద్దు చేసింది. అనంతరం న్యూయార్క్, న్యూజెర్సీ వంటి ఇతర ప్రాంతాలకు వెళ్లాడు. ఆయా రాష్ట్రాల్లోనూ లైసెన్స్‌ను రీవోక్ చేశారు. అయితే ఈ వాస్తవాలను కప్పిపుచ్చి అమెరికాలో ప్రముఖ వైద్యుడిగా చలామణి అవుతూ ఏపీ సీఎం జగన్‌పై అవాస్తవ ఆరోపణలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల ప్రజలు వాస్తవాలను ఓ సారి తెలుసుకోవాలి. మేధావులుగా చలామణి అవుతున్న లోకేశ్ వంటి కులోన్మాదులు సీఎం జగన్‌పై దాడులకు పాల్పడుతున్నారు.

కుమ్మక్కుతో విధ్వంసకాండ

- కాల్ డేటా విశ్లేషించి కఠిన చర్యలు తీసుకోవాలి
- సిట్‌ను కోరిన వైఎస్సార్‌సీపీ నేతలు

కొందరు పోలీసు అధికారులు టీడీపీతో కుమ్మక్కై విధ్వంస కాండకు కొమ్ము కాశారని వైఎస్సార్‌సీపీ పేర్కొంది. పోలింగ్ రోజు, అనంతరం టీడీపీ రౌడీమూకల విధ్వంసకాండపై పారదర్శకంగా విచారణ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. దాడులు జరిగిన ప్రాంతాల్లో ఎస్సైలు, సీఐల కాల్ డేటా సేకరించి విచారణ నిర్వహించాలని కోరింది. ఈ కేసులపై విచారణ నిర్వహిస్తున్న సిట్ ఇన్‌చార్జ్ వినీత్ బ్రిజ్‌లాల్‌ను మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం సోమవారం కలిసింది. టీడీపీ నేతలు, ఆ పార్టీ గూండాలు పక్కా పన్నాగంతో ఎలా దాడులకు పాల్పడ్డారో వివరిస్తూ ఆధారాలను అందచేసింది. మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్‌తోపాటు వైఎస్సార్‌సీపీ నేతలు పేర్ని నాని, రావెల కిషోర్ బాబు, మల్లాది విష్ణు, కైలే అనిల్‌కుమార్, లేళ్ల అప్పిరెడ్డి, మనోహర్ రెడ్డి తదితరులు ఈ బృందంలో ఉన్నారు. అనంతరం డీజీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు మీడియాతో మాట్లాడారు.

బదిలీలు చిన్న విషయం కాదు: అంబటి రాంబాబు, జలవనరుల శాఖ మంత్రి

చంద్రబాబు, పురందేశ్వరి ఈసీపై ఒత్తిడి తెచ్చి ఎన్నికల ముందు పోలీసు అధికారులను మార్చి అల్లరి మూకలను దాడులకు పురిగొల్పారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న పోలీసు అధికారులను బదిలీ చేయించడంతో టీడీపీ శ్రేణులు దాడులకు తెగబడ్డాయి. అధికారులను బదిలీ చేసిన ప్రాంతాల్లోనే దాడులు, విధ్వంసం చోటుచేసుకున్నాయి. అప్పటికప్పుడు ఐపీఎస్ అధికారులను మార్చడం చిన్న విషయం కాదు. టీడీపీ పన్నాగంలో పోలీసు అధికారులు పావులుగా మారడం దురదృష్టకరం.

అనంతపురం జిల్లాలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపై పోలీసులు దాడి చేసి సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. చాలా గ్రామాల్లో ఇప్పటికీ పరిస్థితులు కుదుట పడలేదు. మా పార్టీ నేతలపై జరిగిన దాడులపై ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసులు పెట్టడం లేదు. టీడీపీ నేతలు ఫిర్యాదు చేయడమే తడవు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారు.

ప్రజాబలంతో ఎదుర్కొలేక గూండాగిరి: మంత్రి జోగి రమేష్

వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ చంద్రబాబు కుట్రలకు బరి తెగించారు. ప్రజల మద్దతులేని టీడీపీ కూటమి ఎన్నికలను ఎదుర్కోలేక దౌర్జన్యాలకు తెర తీసింది. అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. టీడీపీ నిర్వాకంతో ఈ ఎన్నికలు రాష్ట్ర చరిత్రలో ఒక మచ్చగా మిగిలిపోయాయి.

హక్కులు కాలరాశారు: రావెల కిషోర్ బాబు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఓటింగ్‌లో పాల్గొనకుండా అడ్డుకునేందుకు టీడీపీ విధ్వంసకాండకు పాల్పడింది. వారిని గ్రామాల నుంచి తరిమేశారు. అంబేడ్కర్ అందించిన రాజ్యాంగ హక్కులను కాలరాసిన టీడీపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలి.



మీడియాతో మాట్లాడుతున్న అంబటి రాంబాబు. చిత్రంలో జోగి రమేశ్, పేర్ని నాని, మల్లాది విష్ణు తదితరులు

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూ కృష్ణతేజ అతిథిగృహం వద్దకు చేరింది. ఆదివారం అర్ధరాత్రి వరకు 86,721 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ. 3.87 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 16 గంటల సమయం పడుతోంది.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఛీ కొడుతున్నారు

- సమస్యలపై పోరాడేది బీజేపీనే
- ఈటల రాజేందర్



ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్రంలో ఎన్నికైన కొద్ది రోజుల్లోనే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఛీ కొడుతున్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడతారో ఆయనకే తెలియదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న జరిగే నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆయన 40 ఏళ్లగా బీజేపీ సిద్ధాంతాన్ని నమ్ముకుని ఎత్తిన జెండా దింపని వ్యక్తని అన్నారు. రాష్ట్రంలో ఏ సమస్యపై అయినా బయట, చట్టసభల్లో పోరాడేది బీజేపీ ఒక్కటేనని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు మనుగడ లేదన్నారు. ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించినా నేటికీ అమలు చేయకపోవడంతో వారు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. నిరుద్యోగ యువతకు రూ.4 వేలు ఇస్తామని సోనియా, రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నాలుగు డీఏలను రాష్ట్రంలో ఉద్యోగులకు ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రులు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయించాలని బలవంతం చేస్తున్నారని ఆరోపించారు.

ఇట్లు.. ఇటలీకి!

- దుబాయ్‌లో చంద్రబాబు దాగుడు మూతలు
- గప్‌చుప్‌గా విదేశాలకు ఉడాయించిన వైనం
- వైద్య పరీక్షల కోసం అమెరికా వెళ్తున్నట్లు లీకులు
- అబ్బే.. ఇటు రాలేదన్న టీడీపీ ఎన్నారై విభాగం నేత
- టీడీపీ అధినేత ఇటలీలో ప్రత్యక్షమైనట్లు సమాచారం
- గతంలో విదేశాల నుంచే షెల్ కంపెనీలకు అక్రమ నిధుల మళ్లింపు
- స్కిల్ స్కామ్‌లోనూ బాబు దుబాయ్ బంధం
- ఈసారి అదే షెల్ దందాయేనా..!
- గోప్యంగా విదేశీ పర్యటన వెనుక లోగుట్టు అదే



సాక్షి, అమరావతి: అడుగు తీసి అడుగేస్తే మీడియాలో ప్రచారం కోరుకునే టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు గప్‌చుప్‌గా విదేశాలకు ఉడాయించారు. తన సతీమణి భువనేశ్వరితో కలిసి హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళ్లిన చంద్రబాబు అక్కడి నుంచి ఎక్కడికి వెళ్లారనే విషయంపై గోప్యంగా వ్యవహరిస్తున్నారు. వైద్య పరీక్షల కోసం ఆయన అమెరికా వెళ్లినట్లు టీడీపీ తొలుత మీడియాకు లీకులిచ్చింది. అయితే చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన టీడీపీ ఎన్నారై విభాగం నేత కోమటి జయరాం మాత్రం ఆయన అసలు అమెరికా రాలేదని ప్రకటించడం గమనార్హం. విదేశాల నుంచి అక్రమ నిధులను భారత్‌లోని షెల్ కంపెనీలకు మళ్లించిన చరిత్ర ఉన్న చంద్రబాబు ప్రస్తుతం ఏ దేశంలో ఉన్నారు? ఏం చేస్తున్నారన్నది చర్చనీయాంశంగా మారింది. గుట్టుచప్పుడు కాకుండా విదేశీ పర్యటన వెనుక లోగుట్టు ఏమిటన్నది సస్పెన్స్‌గా మారింది. అయితే తాజా విశ్వసనీయ సమాచారం ప్రకారం చంద్రబాబు ఇటలీలో ల్యాండ్ అయినట్లు తెలుస్తోంది.

పోలింగ్ తరువాత సైలెంట్

చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ జీవితం అంతా మీడియా ప్రచారంతోనే ముడిపడి ఉందన్నది బహిరంగ రహస్యమే. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఆయన మీడియా ద్వారా విపరీతమైన ప్రచారాన్ని కోరుకుంటారు. మూడు ప్రెస్‌మీట్లు, ఆరు మీడియా లీకులుగా ఆయన రాజకీయం కొనసాగింది. వారానికి కనీసం రెండుసార్లు మీడియా సమావేశాలు నిర్వహిస్తుంటారు. అలాంటిది జూన్ 13న పోలింగ్ ముగిసిన తరువాత చంద్రబాబు ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు. కనీసం ప్రెస్‌మీట్ పెట్టలేదు. పార్టీ నేతలతో సమావేశం నిర్వహించలేదు. తన శైలికి భిన్నంగా ఒక్కసారిగా మౌనముద్ర దాల్చారు. మరోవైపు లోకేశ్‌కు మాట కూడా పెగల్లేదు. చంద్రబాబు కంటే ముందే ఆయన గప్‌చుప్‌గా విదేశాలకు వెళ్లినట్లు సమాచారం. ఇక పవన్ కల్యాణ్ ఎక్కడున్నారో జనసేన వర్గాలే చెప్పలేకపోతున్నాయి. రాష్ట్ర బీజేపీ శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అలికిడే లేదు. పోలింగ్ ముగిసిన తరువాత కూటమి నోట మాటే రావడం లేదు. పోలింగ్ సరళి తమకు వ్యతిరేకంగా ఉందని చంద్రబాబు కచ్చితమైన అంచనాకు రావడంతో ఒక్కసారిగా మౌనం దాల్చినట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిశ్శబ్దంగా విదేశాలకు వెళ్లడం గమనార్హం.

ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకోవడంతో..

చంద్రబాబు శనివారం అర్ధరాత్రి శంషాబాద్ విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళ్లారు. ఆయన విదేశీ పర్యటనలపై అధికారికంగా వెల్లడించే టీడీపీ ఈసారి అందుకు భిన్నంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఇమ్మిగ్రేషన్ అధికారులు చంద్రబాబును కాసేపు అడ్డుకోవడంతో ఈ వ్యవహారం బయటకు పొక్కింది. టీడీపీ హయాంలో చోటు చేసుకున్న కుంభకోణాల కేసులకు సంబంధించి చంద్రబాబుపై సీఐడీ గతంలో లుక్ అవుట్ నోటీసు జారీ చేసింది. సీఐడీ ముందస్తు అనుమతి లేకుండా ఆయన దేశం విడిచి వెళ్లకూడదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో చంద్రబాబును విమానాశ్రయంలో అడ్డుకున్న ఇమ్మిగ్రేషన్ అధికారులు సీఐడీని సంప్రదించారు. సీఐడీ ఆయనపై నాలుగు కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేసింది. సీఐడీకి సమాచారం ఇవ్వకుండా దేశం విడిచి వెళ్లకూడదని ఆయనకు తాజాగా నోటీసులు జారీ చేయనుంది. ఇదే విషయాన్ని సీఐడీ శంషాబాద్ ఇమ్మిగ్రేషన్ అధికారులకు తెలియచేసింది. దీంతో చంద్రబాబు విదేశీ పర్యటనపై అప్పటికప్పుడు సమాచారం ఇచ్చినట్లుగా భావించిన ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆయన్ను వెళ్లనిచ్చారు. సాధారణంగా దుబాయ్ చేరుకుని అక్కడి నుంచి మరో విమానంలో అమెరికా లేదా ఐరోపా దేశాలకు వెళుతుంటారు. చంద్రబాబు మాత్రం దుబాయ్ నుంచి ఎక్కడికి వెళ్లారో వెల్లడించలేదు. తన పర్యటనను అంత గోప్యంగా ఎందుకు ఉంచారన్నది సందేహాస్పదంగా మారింది.

స్కిల్ స్కామ్‌లోనూ దుబాయ్ బంధం

చంద్రబాబు రహస్య పర్యటన నేపథ్యంలో గతంలో షెల్ కంపెనీల ద్వారా అక్రమ నిధుల మళ్లింపు వ్యవహారం తెరపైకి వచ్చింది. టీడీపీ హయాంలో యథేచ్ఛగా పాల్పడిన కుంభకోణాల ద్వారా కొల్లగొట్టిన నిధులను ఆయన అక్రమంగా విదేశాలకు తరలించి అక్కడి నుంచి భారత్‌లోని షెల్ కంపెనీలకు మళ్లించినట్లు సీఐడీ ఆధారాలతో సహా నిగ్గు తేల్చింది. చంద్రబాబు 52 రోజులు రిమాండ్ ఖైదీగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్న స్కిల్ స్కామ్‌లో కూడా నిధులను అక్రమంగా దుబాయ్‌కు చేర్చారు. ఆ కుంభకోణంలో పాత్రధారులైన ఆయన మాజీ పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసాని, కిలారి రాజేశ్ దుబాయ్ నుంచే అక్రమ నిధులను సింగపూర్ మీదుగా హైదరాబాద్‌లోని షెల్ కంపెనీకి తరలించారు. అనంతరం ఆ నిధులు చంద్రబాబు బంగ్లాకు చేర్చారు. అంటే ఆయన ఆర్థిక కుంభకోణాల్లో దుబాయ్ కీలక కేంద్రంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది.

ఇటలీలో ప్రత్యక్షం..!

గుట్టుగా విదేశాలకు వెళ్లిన చంద్రబాబు ఇటలీ చేరుకున్నట్లు సమాచారం. దుబాయ్ నుంచి చంద్రబాబు దంపతులు ఇటలీ వెళ్లినట్లు ఇమ్మిగ్రేషన్ వర్గాలు అనధికారికంగా వెల్లడించాయి. లోకేశ్ దంపతులు కూడా అక్కడికే వెళ్లినట్లు భావిస్తున్నారు. గతంలో చంద్రబాబు కుటుంబ సభ్యులతో విహార యాత్రలకు వెళ్లినప్పుడు అధికారికంగా వెల్లడించారు. ఈసారి మాత్రం అందుకు భిన్నంగా గోప్యత పాటించడం గమనార్హం. ఇటలీతోపాటు మరికొన్ని చిన్న చిన్న దేశాలకు వారు వెళ్లే అవకాశం ఉంది. అక్కడ నుంచి సింగపూర్‌కు నిధులు మళ్లించి అనంతరం భారత్‌లోని షెల్ కంపెనీలకు చేరవేసే అవకాశాలున్నట్లు భావిస్తున్నారు. చంద్రబాబు విదేశీ పర్యటనను పూర్తి గోప్యంగా ఉంచడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది.



లోతుగా కనబడేట్టు చేయడానికి
వాళ్లు నీటిని బురదమయం చేస్తారు.
– నీషే

సాక్షి
మంగళవారం, 21 మే 2024

నిజాయతీ నిరూపించుకోండి!

సాక్షాత్తూ ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో ఓ మహిళపై దాడి జరుగుతుందని ఊహించగలమా? అదీ స్వయంగా సీఎంకు కుడిభుజం లాంటి సహాయకుడే ఆ దురాగతానికి పాల్పడ్డాడంటే నమ్మగలమా? అందులోనూ తనపై అలా దాడి జరిగిందని ఆరోపిస్తున్న వ్యక్తి అధికార పార్టీకే చెందిన పార్లమెంట్ సభ్యురాలు కూడా అయితే, అవాక్కవకుండా ఉండగలమా? 'ఆమ్ ఆద్మీ పార్టీ' (ఆప్)కి చెందిన రాజ్యసభ ఎంపీ స్వాతీ మాలీవాల్ సొంత పార్టీ వారిపైనే గత వారంగా చేస్తున్న ఆరోపణలు సంచలనం రేపుతున్నది అందుకే. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఇంటికి వెళితే ఆయన పీఏ విభవ్ కుమార్ అమానవీయంగా దాడి చేసి, కొట్టరాని చోటల్లా కొట్టి బయటకు గెంటించారన్న ఆరోపణలు ఏ రకంగా చూసినా అసాధారణమైనవే. అందులోనూ ఢిల్లీ లిక్కర్ పాలసీ వ్యవహారంలో అరెస్టయిన కేజ్రీవాల్ లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం సుప్రీమ్ కోర్ట్ ఇచ్చిన వెసులుబాటు ఆసరాగా తీహార్ జైలు నుంచి బయటకు వచ్చీ రాగానే ఈ పరిణామం సంభవించడం ఆయననూ, ఆయన పార్టీనీ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. విభవ్ అరెస్ట్, స్వాతి కథను బీజేపీ రాజకీయం చేస్తోందంటూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ముట్టడికి ఆప్ యత్నాలతో వ్యవహారం మరింత ముదిరింది.

కేజ్రీవాల్‌కు విభవ్ నమ్మినబంటు. పార్టీ విస్తరణ సహా అనేక బాధ్యతలను అతనికి అప్పగించారు. కేజ్రీవాల్ ఇంటిలోని క్యాంప్ ఆఫీస్ మొదలు ఢిల్లీ సెక్రటేరియట్‌లోని సీఎం ఆఫీస్ వ్యవహారాల దాకా రోజువారీ కార్యకలాపాలన్నీ అతని చేతుల మీదే నడుస్తుంటాయి. ఈ క్రమంలో స్వాతికీ, అతనికీ మధ్య గతంలో ఏం జరిగింది, దాడి ఘటన రోజున అసలేమైంది లాంటి అనేక ప్రశ్నలకింకా స్పష్టమైన సమాధానాలు దొరకాల్సి ఉంది. ఆరోపణలు వచ్చిన మొదట్లో పెదవి విప్పకుండా 'ఆప్' ఆలసించింది. ఆనక స్వాతిపై దాడి జరిగిందని గతవారం అంగీకరించింది. తీరా ఇప్పుడేమో ఇదంతా రాజకీయ కుట్రంటోంది. అదీ విడ్డూరం. అలాగని స్వాతి గత చరిత్ర సైతం గొప్పదేమీ కాదు. గతంలో ఢిల్లీ మహిళా కమిషన్‌కు సారథ్యం వహించిన ఆమె ఆ పదవిలో ఉండగా నియామకాల్లో అక్రమాలకు పాల్పడినట్టు నిందలొచ్చాయి. ఆ వ్యవహారంలో అరెస్టు తప్పదంటూ కాషాయపార్టీ బ్లాక్‌మెయిల్ చేసిందంటున్నారు. ఆ భయంతోనే ఆమె ఈ దాడి కథ వినిపిస్తోందనేది 'ఆప్' వాదన.

నిజానికి, స్వాతి కూడా కేజ్రీవాల్‌కు సన్నిహితురాలే. ఆమె రాజకీయంగా ఎదిగి, రాజ్యసభ సభ్యురాలు కావడమే అందుకు ఉదాహరణ. మరి ఎక్కడ కథ అడ్డం తిరిగిందన్నది ఇప్పుడు బయటకు రావాల్సి ఉంది. దాడి జరిగిందని చెప్పిన స్వాతి పోలీసు ఫిర్యాదుకు ఆలస్యం చేయడం, తీరా దర్యాప్తు మొదలయ్యాక రోజుకో రకం వీడియోలు, కథనాలు బయటకు రావడం చూస్తుంటే, విషయం పైకి కనిపిస్తున్నంత పారదర్శకంగా లేదన్న అనుమానమూ వస్తోంది. పోలీసులు నిష్పాక్షికంగా, లోతైన దర్యాప్తు చేసి, నిజాలు నిగ్గుతేల్చాలి. అనుమానాలు ఏమైనా, కారణాలు ఎలాంటివైనా ఒక మహిళపై భౌతిక దాడికి దిగి గాయపరచడం, దుర్భాషలాడడం ఏ రకంగానూ సమర్థనీయం కాదు. అలాగే, ఈ కేసులో సాక్షాత్తూ సీఎం ఇంటిలోని సీసీటీవీ దృశ్యాలు సహా సాక్ష్యాధారాలను మాయం చేసే ప్రయత్నం జరిగిందంటూ వస్తున్న వార్తలు సైతం పాలక వ్యవస్థపై సామాన్య ప్రజల నమ్మకానికి గొడ్డలిపెట్టు.

మరోపక్క విదేశాల నుంచి విరాళాలపై నిషేధం ఉన్నప్పటికీ 'ఆప్'కు విదేశీ నిధులు వచ్చాయనీ, దాతల పేర్లను ఆ పార్టీ మరుగున పెట్టిందనీ, విదేశీమారకద్రవ్య నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ) నిబంధనల్ని ఉల్లంఘించిందనీ తాజా ఆరోపణలు గుప్పుమన్నాయి. ఈ మేరకు కేంద్ర హోమ్ శాఖకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమాచారం అందించినట్లు సోమవారం బయటకొచ్చిన వార్తలు కేజ్రీవాల్‌నూ, ఆయన పార్టీనీ మరింత ఇరుకునపెట్టేవే. పైగా, దేశంలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న వేళ ఇలా ఒకదాని వెంట మరొకటిగా వివాదాలు రేగి, వివరణ ఇవ్వాల్సిన పరిస్థితిలోకి నెట్టడం ఏ రాజకీయ పార్టీ విశ్వసనీయతకైనా ఇబ్బంది తెస్తాయి. తాజా పరిణామాలు 'ఆప్'నే కాక, ప్రతిపక్ష 'ఇండియా' కూటమిని సైతం ఇరుకున పెట్టాయి. మద్యం పాలసీ మొదలు స్వాతి ఆరోపణలు, తాజా ఈడీ వెల్లడింపు వార్తల దాకా వేటి మీదా కాంగ్రెస్ సహా కూటమి పార్టీలేవీ గొంతు విప్పట్లేదు. తమ వైఖరి చెప్పట్లేదు. దేశంలో బీజేపీ దూకుడుకు కళ్లెం వేసి, మోదీని గద్దె దించడానికి తగిన సమయమని భావిస్తున్న వేళ ఇది ఆ పార్టీలేవీ ఊహించని దుఃస్థితి.

'ఆప్', బీజేపీల మాటల యుద్ధం మాత్రం రాజకీయ వాతావరణాన్ని రోజురోజుకూ వేడెక్కిస్తోంది. అయితే, ఈ నెల 25న ఢిల్లీలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న వేళ... ఈ వరుస వివాదాలు ఆకస్మికమనీ, పూర్తి యాదృచ్ఛికమనీ అనుకోవడం అమాయకత్వమే. నిజాయతీకి తాము నిలువుటద్దమని 'ఆప్', అలాగే అవినీతి చీడను తాము ఏరేస్తున్నామని బీజేపీ... దేనికది డప్పు కొట్టుకుంటున్నా, వాస్తవాలు అందుకు దూరంగా ఉన్నాయని ప్రజలకు అర్థమవుతూనే ఉంది. బీజేపీ రాజకీయ ప్రతీకారాన్ని బయటపెడతామంటూ కేజ్రీవాల్ గర్జిస్తున్నా, అది ప్రతిధ్వనిస్తున్న దాఖలాలు పెద్దగా కనబడట్లేదు. పదమూడేళ్ళ క్రితం 2011లో అవినీతిపై అన్నాహజారే ఉద్యమం నుంచి ఊపిరిపోసుకున్న 'ఆప్' ఇవాళ లక్ష్యం మరిచి, దారి తప్పిన బాటసారిగా మారిపోవడం సమకాలీన చారిత్రక విషాదం. హజారే ఉద్యమంలో బాసటగా నిలిచిన స్ఫూర్తిదాయకమైన స్వతంత్ర వ్యక్తులు ఇవాళ 'ఆప్'లో లేకపోవడం, కేజ్రీవాల్ భజనపరులదే పార్టీలో రాజ్యం కావడం లాంటివే అందుకు ప్రత్యక్ష సాక్ష్యం. స్వాతి ఆరోపణల పర్వంలో లోతుపాతులు ఏమైనా, 'ఆప్' ప్రస్థానంలో లోటుపాట్లు అనేకం. తప్పులు దిద్దుకొని, నిజాయతీ నిరూపించుకోవడమే ప్రజాక్షేత్రంలో శ్రీరామరక్ష.

అప్పుడు జరిగినట్టే... ఇప్పుడవుతుందా?

అభిప్రాయం



అలీ చాగులే

2014లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన అవినీతి వ్యతిరేక ఉద్యమం బీజేపీకి బాగా కలిసొచ్చింది. 2019లో పుల్వామా ఉగ్రదాడులకు ప్రతిగా జరిగిన సర్జికల్ స్ట్రయిక్స్‌తో ఓటర్లలో బీజేపీ జాతీయభావన రేకెత్తించింది. ఫలితంగా రెండు పర్యాయాల్లోనూ బీజేపీ అనుకూల వేవ్ కనబడింది. మోదీకి ఉన్న ప్రజాదరణ, రామ మందిర ప్రతిష్ఠాపన వల్ల ఈసారి కూడా ఆ ఫలితమే పునరావృతం అవుతుందని బీజేపీ ఆశిస్తోంది. కానీ చాలా రాష్ట్రాల క్షేత్రస్థాయి నివేదికలు బీజేపీకి అనుకూలంగా లేవు. భారీ మెజారిటీ కాకపోయినా, తిరిగి అధికారాన్ని నిలబెట్టుకునే అవకాశం ఉందన్న భావన కాషాయ శిబిరంలో ఉంది. కాంగ్రెస్ గెలిచిన 2004 లేదా బీజేపీ అఖండ విజయం సాధించిన 2019... ఏ ఫలితాలు వస్తాయన్నది ప్రశ్న!

2014లో, దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ గాలి కనిపించినప్పటికీ, బీజేపీ సొంతంగా పూర్తి మెజారిటీతో అధికారం చేపడుతుందని ఎన్నికల నిపుణులు, రాజకీయ పండితులు కచ్చితంగా భావించలేదు. చివరకు కాషాయ పార్టీ కూడా సాధారణ మెజారిటీ మార్కును దాటగలననే నమ్మకంతో లేదు. మరోవైపున కాంగ్రెస్ పార్టీ అంత తక్కువ స్థానాలు సాధిస్తానని అసలు ఊహించలేదు. ప్రధానంగా అన్నా హజారే నేతృత్వంలోని 'ఇండియా ఎగైనెస్ట్ కరప్షన్' ఉద్యమం కారణంగా వచ్చిన కాంగ్రెస్ వ్యతిరేక ఓటుతో బీజేపీ భారీగా లాభపడింది. దాన్ని తిప్పి కొట్టే ప్రచారం లేకపోవడంతో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయింది.

పనికి ఆహార పథకం, ఆహార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, లక్షలాది మందిని పేదరికం నుండి బయటపడేసిన అధిక ఆర్థిక వృద్ధి వంటి పదేళ్ల యూపీఏ పాలనలో సాధించిన విజయాలను కూడా కాంగ్రెస్ పార్టీ చెప్పుకోలేదు. కాంగ్రెస్ పార్టీ మీది అవినీతి ఆరోపణలు, అధిక ద్రవ్యోల్బణం అంశాలను మోదీ చక్కగా ఉపయోగించుకున్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏను గద్దె దించాలంటూ మార్పు, సమగ్ర అభివృద్ధి గురించి ప్రచారం చేశారు. 2014 ఎన్నికలు... మార్పు కోసం జరిగిన ఎన్నికలు, అదే సమయంలో ఆశావహ ఎన్నికలు. 56 అంగుళాల ఛాతీ గల హీరో దేశాన్ని రక్షిస్తారన్న కథనం బాగా ఆకట్టుకుంది.

2019లో, బీజేపీకి వ్యతిరేకంగా చాలా విషయాలు ఉన్నాయి... పెద్దనోట్ల రద్దు, హడావుడిగా విధించిన జీఎస్టీ, నెరవేర్చని అనేక వాగ్దానాల వంటివి. కాంగ్రెస్ నుండి గట్టి సవాలును ఎదుర్కొంటున్న బీజేపీ హిందీ రాష్ట్రాల్లో ఎక్కువ సంఖ్యలో సీట్లను కోల్పోతుందన్న అంచనా ఉండేది. 2019 ఫిబ్రవరి మధ్యలో పుల్వామా ఉగ్రదాడి, ప్రతీకారంగా బాలాకోట్ వైమానిక దాడులు జరిగాయి. ప్రతి ఎన్నికల ర్యాలీలోనూ ప్రధాని మోదీ రేకెత్తించిన జాతీయవాద భావన క్షీణిస్తున్న బీజేపీ అదృష్టాన్ని మార్చేసింది.

2014, 2019 రెండూ వేవ్ ఉన్న ఎన్నికలు. అయితే 2024 ఎన్నికలు వేవ్ రహితం మాత్రమే కాదు, పేలవమైనవి కూడా. 2019లో రికార్డు స్థాయిలో ఓటింగ్ బీజేపీకి విపరీతంగా ఉపయోగపడింది. మోదీకి ఉన్న ప్రజాదరణ, ఈ సంవత్సరం ప్రారంభంలో రామ మందిర ప్రతిష్ఠాపన వల్ల ఈసారి కూడా ఆ ఫలితమే పునరావృతం అవుతుందని బీజేపీ ఆశిస్తోంది. కానీ అలా జరిగేలా కనిపించడం లేదు. ఎన్నికల విశ్లేషకులకు ఎన్నికల్లో గెలిచే పార్టీగా ఇప్పటికీ బీజేపీనే ఫేవరేట్‌గా ఉన్నప్పటికీ, ఆ పార్టీ నాయకులు ఒక విచిత్రమైన భయాందోళనలో ఉన్నట్లు కనిపిస్తున్నారు. ఎందుకంటే, పార్టీ ఊహించిన విధంగా ఎన్నికలు జరగడం లేదు. ఇండియా కూటమి బీజేపీకి ఆందోళన కలిగిస్తోంది. నివేదికల ప్రకారం, ఈ సవాలును తటస్థీకరించడం బీజేపీకి చాలా కష్టంగా ఉంది.



వాస్తవానికి, తీవ్ర పోరాటం జరుగుతున్న రాష్ట్రాలైన బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ నుండి వివిధ క్షేత్ర స్థాయి నివేదికలు బీజేపీకి అనుకూలంగా లేవు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి కొన్ని హిందీ బెల్ట్ రాష్ట్రాల ఎన్నికల డైనమిక్స్ బీజేపీకి వ్యతిరేకంగా మారాయనీ, హిందుత్వ పార్టీకి తగిన మెజారిటీ పొందడం కష్టంగా ఉందనీ సూచిస్తున్నాయి. ఆత్మవిశ్వాసం నుండి గాభరాగా మారిన మోదీ ప్రవర్తన, ప్రచారాల్లో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. గత పదేళ్లలో ఆయన సాధించిన విజయాలను, వరుసగా మూడోసారి బీజేపీ మేనిఫెస్టోలో అందించిన హామీలను ప్రచారం చేయడం మానేశారు. కాంగ్రెస్ పార్టీ, ముస్లింల పట్ల మెజారిటీ వర్గాలను భయపెట్టి, అసహ్యించుకునేలా చేసే దిశగా ప్రచారం మారడానికి ఇదే కారణం. దీనిని భయాందోళనలకు, నిరాశకు చిహ్నంగా రాజకీయ విశ్లేషకులు అర్థం చేసుకుంటున్నారు.

గత ఒకటిన్నర నెలల్లో, దేశ రాజకీయ రంగస్థలంలో చాలా జరిగాయి. పోలింగులో తక్కువ ఓటింగ్ శాతం ప్రధానమంత్రిని, ఆయన ప్రచార నిర్వాహకులను కలవరపరిచింది. బీజేపీ, దాని మిత్రపక్షాలు గెలవగలవా అనే ప్రశ్నను లేవనెత్తింది. మోదీకి ఉన్న ప్రజాదరణ, సంక్షేమ పథకాలు, రామ మందిర ప్రారంభోత్సవం లాంటివిని దృష్టిలో ఉంచుకుని ఒపీనియన్ పోల్స్ అంచనా వేసినట్లుగా, పార్లమెంటులోని 543 సీట్లలో నాలుగింట మూడొంతులు బీజేపీ కైవసం అవుతాయనే భావన ప్రమాదంలో పడింది. తొలి మూడు దశల పోలింగులో ఓటింగ్ ఊపందుకోకపోవడం, ఆ పార్టీకి భారీ మెజారిటీపై ఆశలు సన్నగిల్లేలా చేసినప్పటికీ, తిరిగి అధికారాన్ని నిలబెట్టుకునే అవకాశం ఉందన్న భావన కాషాయ శిబిరంలో ఉంది.

ఓటింగ్ శాతం అంచనాల కంటే తక్కువగా ఉన్నప్పటికీ, మొత్తం ఫలితాలపై పెద్దగా ప్రభావం చూపదని రాజకీయ విశ్లేషకులు, కాషాయ పార్టీ పట్ల సానుభూతిపరులైన ఎన్నికల పండితులు అభిప్రాయ పడుతున్నారు. అయితే, రాజకీయంగా తటస్థులైన విశ్లేషకులు చాలామంది దీనిని వ్యతిరేకిస్తున్నారు. మీడియా పండితులు, రాజకీయ నిపుణుల అభిప్రాయాలు చాలా వరకు ఊహించిన స్థాయిలోనే ఉన్నాయి: వీరి అభిప్రాయం ప్రకారం 'ఏ విధంగానైనా మోదీ గెలుస్తారు'. అయితే చాలామంది 'మోదీ గెలుస్తారు, కానీ తక్కువ మెజారిటీతో' అంటూ తమ అభిప్రాయాన్ని ప్రకటిస్తూ హెచ్చరిస్తున్నారు. ఈ అభిప్రాయంతో సమస్య ఏమిటంటే, జీవనోపాధి సమస్యలపై ఓటర్లలో నిశ్శబ్దంగా చెలరేగుతున్న కోపాన్ని ఇది విస్మరిస్తోంది. జాతీయ సమస్యలపై కథనానికి తావు లేనప్పుడు, మోదీ డజన్ల కొద్దీ స్థానిక సమస్యలను, సామాజిక అసంతృప్తిని ఎదుర్కొంటారు. దేశమంతటా ప్రతిధ్వనించే ఒక చుట్టుముట్టే కథనాన్ని బీజేపీ ఈ ఎన్నికల్లో ఎందుకు కనుగొనలేకపోయిందో అది వివరిస్తోంది.

ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలలో, ఉద్యోగాలు లేనప్పుడు నిరుద్యోగ సమస్యపై ఎలా స్పందించాలి, స్తబ్ధుగా ఉన్న వేతనాలు, వ్యవసాయ సంక్షోభం గురించి విమర్శలను ఎలా ఎదుర్కోవాలి, ధరలతో సతమతమవుతున్న మహిళా ఓటర్లను ఎలా ఆకర్షించాలి అనేవి మోదీ అతిపెద్ద సమస్యలు. ఒక అంశం నుండి మరో అంశానికి స్థిరత్వం లేకుండా సాగుతున్న ప్రధాని అసంబద్ధ ఎన్నికల ప్రచారం చీకటిలో కాల్పులు జరిపే కసరత్తుగా మారిపోయింది. ఏడు దశల ఎన్నికలలో ఐదు దశలలో, చాలా సంప్రదాయ అంచనాలు తలకిందులు అయినాయి. పైగా ఓటరు సెంటిమెంటును అర్థం చేసుకుంటే, విషయాలు బీజేపీకి అనుకూలంగా లేవని తెలుస్తుంది.

ఏమైనప్పటికీ, ఈ ఎన్నికలు పోటాపోటీగానే ఉన్నాయి. మోదీ ప్రభుత్వంపై ఉన్న అధికార వ్యతిరేక సెంటిమెంట్, ఓటర్ల నిరాసక్తత వంటివి ఇండియా కూటమి మెజారిటీ మార్కును చేరుకోవడానికి కారణం అవుతాయో లేదో అంచనా వేయడం కష్టం.

ఎన్నికల ఫలితాలపై రెండు భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఒకటి, బీజేపీకి దాదాపు 300 సీట్లు వచ్చే అవకాశం ఉంది. రెండు, బీజేపీకి సాధారణ మెజారిటీ వచ్చే అవకాశం లేదు. పైగా మొత్తంగా ఎన్డీయే 272 మార్కుకు చేరుకుంటుందా అనే సందేహాలు ఉన్నాయి. దీనర్థం రెండు అవకాశాలు ఉన్నాయి. బీజేపీ తన 2019 పనితీరును పునరావృతం చేస్తుంది. లేదా 2024లో 2004 ఫలితాలు పునరావృతం అయ్యే అవకాశం ఉంది. ఎన్నికల వ్యూహకర్తగా మారిన రాజకీయ కార్యకర్త ప్రశాంత్ కిశోర్ మాత్రం బీజేపీ గెలుచుకునే సీట్ల సంఖ్యలో అర్థవంతమైన క్షీణతను చూడటం లేదు. మరోవైపు, రాజకీయ కార్యకర్తగా మారిన సెఫాలజిస్ట్ యోగేంద్ర యాదవ్ బీజేపీకి కనీసం 50 నుండి 60 సీట్లు తగ్గుముఖం పట్టనున్నట్లు చెబుతున్నారు. యాదవ్ అభిప్రాయం సరైనదే కావచ్చు. ఎందుకంటే ఈ నిర్ణయానికి రావడానికి ఆయన హిందీ బెల్టులో విస్తృతంగా ప్రయాణించారు మరి!

వ్యాసకర్త సీనియర్ స్వతంత్ర పాత్రికేయుడు
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మరిచిపోలేని నేత



ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ ఇబ్రహీం రైసీని కోల్పోయామని వినడం బాధాకరం. న్యాయవ్యవస్థలో సంస్కరణలు తేవడానికి ఆయన చేసిన కృషి, ప్రజాసేవలో ఆయన చూపిన అంకితభావం ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఆయన కుటుంబానికీ, దేశానికీ సంఘీభావం.

– సలీమ్ సారంగ్, ఎన్సీపీ నేత

చివరికి...



నేను మొదటిసారి 1985లో తెహ్రాన్(ఇరాన్)లో అడుగుపెట్టినప్పుడు నాకు కనిపించిన మొదటి దృశ్యం ఒక సర్కిల్‌లో ముగ్గురిని క్రేనుకు ఉరితీయడం. అది మనిషి మెడను విరిచే ఉరి కాదు. నెమ్మదిగా మనిషిని ఊపిరాడకుండా పైకి లేపే ఉరి. దానికి బాధ్యుడు? ఇబ్రహీం రైసీ. ఇప్పుడు ఆయన శరీరం గుర్తుపట్టలేనంతగా పాడై దొరికింది.

– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యాఖ్యాత

ఎదిగామా?



హిందీ జనాలు తెలుగు సినిమాలు చూస్తున్నారు; తెలుగు జనాలేమో మలయాళం సినిమాలు చూస్తున్నారు.

– రాంగోపాల్ వర్మ, దర్శకుడు

పరిస్థితులు...



నా జీవితంలో మొదటిసారి శివసేనకు ఓటు వేశాను(మహారాష్ట్రలో ఐదో దశ). ఇంతకంటే లౌకికవాదిగా ఉండే ముస్లిం ఎవరుంటారు?

– దారబ్ ఫారూఖీ, స్క్రీన్ రైటర్

చేసేదేమీ లేదు!




నా స్నేహితురాలు ఒకామె ఇండియాలోని ఒక పెద్ద ఐటీ కంపెనీలో పని చేస్తోంది. ఇప్పుడే ఆమె జెన్ ఏఐ కోర్సు ఒక గంటలో పూర్తి చేసింది... కేవలం 'నెక్స్ట్' బటన్‌ను వందల సార్లు నొక్కడం ద్వారా. ఇప్పుడామె జెన్ ఏఐ వర్క్‌ఫోర్సులో భాగం.

– పలాశ్ కలా, సాంకేతికాంశాల వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

దళిత చైతన్య దీప్తి

శతాబ్దాల పర్యంతం అణచివేతకు గురికాబడ్డ దళితుల గమనాన్నీ, గమ్యాన్నీ మార్చిన ఘనత ఆయనది. ఆయనే భాగ్యరెడ్డి వర్మ. ఒక దళితుడి పేరులో మూడు సామాజిక వర్గాల పేర్లుండటం ఆశ్చర్యమే. ఆయన అసలు పేరు బాగయ్య. కుటుంబ గురువు అతడి పేరును భాగ్యరెడ్డిగా మార్చారు. హైదరాబాద్ నగర ప్రజల ప్రాణాలకు తన ప్రాణాలు అడ్డుపెట్టి సేవ చేసినందుకు అప్పటి జైన సేవా సంఘం ఆయనకు వర్మ అనే బిరుదు ఇచ్చింది. అంతకు మించి దళిత జాతి చైతన్యానికి, దళిత వికాసానికి అలుపెరుగని పోరాటం చేసిన వ్యక్తి ఆయన. హైదరాబాద్‌లో 1888 మే 22న జన్మించారు.



భాగ్యరెడ్డి వర్మ

అంటరాని కులాలు అని ముద్రపడిన వారే ఈ దేశ మూలవాసులని వారిని 'ఆది హిందువు లు'గా నిలిపిన వ్యక్తి భాగ్యరెడ్డివర్మ. దళితులకు విద్య ప్రాధాన్యతను వివరించి వారికి ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేశారు. దేవదాసి, బసివి, జోగిని వ్యవస్థ లాంటి దురాచారాలను ఎండగట్టారు. ఆయన కృషి ఫలితంగా ఇలాంటి దురాచారాలను ఆనాడే నిజాం ప్రభుత్వం నిషేధించింది.

దళిత వర్గాల వికాసానికి 1906లో 'జగన్మిత్ర మండలి'ని స్థాపించి, 1913 నాటికి దానిని 'మన్యం సంఘం'గా, 1922 నాటికి దానిని 'సోషల్ సర్వీస్ లీగ్'గా భాగ్యరెడ్డి వర్మ మార్పు చేశారు. బాలికలకు పత్యేక పాఠశాలల ప్రాధాన్యతను గుర్తించి నెలకొల్పారు. 1910లోనే మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించారు. 1933 నాటికి ఆ పాఠశాలల సంఖ్య 26కు పెరిగింది. వాటిలో నిజాంను ఒప్పించి తెలుగు బోధనను ప్రవేశపెట్టించారు. చాదర్ ఘాట్ రోడ్డులోని 'ఆది హిందూ భవన్'లో ఆయన నెలకొల్పిన బాలికల పాఠశాలను ఇప్పటికీ చూడవచ్చు. 1917లో బెజవాడలో ఆంధ్రదేశ మొదటి పంచమ సదస్సు భాగ్యరెడ్డి వర్మ అధ్యక్షతన జరిగింది. అదే సభలో పంచమ అనే శబ్దాన్ని భాగ్యరెడ్డి వర్మ ఖండించారు. మరునాడు ఆ సదస్సు పేరును 'ఆది ఆంధ్రసదస్సు'గా మార్చారు. పాఠశాలల్లో అందరితో సమానమైన ప్రవేశ అవకాశాలు దళితులకు ఉండడం, బావుల్లో నీళ్ల తోడుకునే హక్కు ఆది ఆంధ్రులకు ఇవ్వడం, వారికి బంజరు భూములు పంచడం; ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో సమాన వాటా కల్పించడం వంటి 18 డిమాండ్లను సదస్సు ఆమోదించింది. తెలంగాణ గడ్డపై పుట్టిన తొలి దళిత చైతన్య కరదీపిక భాగ్యరెడ్డి వర్మ. ఆ మహానేత కాంక్షించిన సమ సమాజ నిర్మాణానికి కంకణబద్ధులమవుదాం.

– సాకి । 99511 72002 (రేపు భాగ్యరెడ్డి వర్మ జయంతి)

సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు రక్షణ కవచం

విశ్లేషణ



చిన్ని శ్రావణ్ కుమార్

'సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలే యువతకు ఉద్యోగాలు కల్పిస్తాయి'
–వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అవసరాల్ని దృష్టిలో ఉంచుకొని తీసుకొచ్చిన చట్టం 'ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ చట్టం–2006'. తయారీదారు దగ్గర కొనని వ్యాపారస్తుని ఈ చట్టం ఎలాంటి ఇబ్బందీ పెట్టదు. తయారీదారు వద్ద కొనుగోలు చేసినవాళ్లే ఈ చట్టం పరిధిలోకి వస్తారు. భారతదేశంలో వ్యవసాయ రంగం తర్వాత 15 కోట్ల మందికి ఉపాధిని కల్పిస్తూ దేశ ఆర్థిక ప్రగతిలో 40 శాతం మేర పాలు పంచుకోవడం సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల విశిష్టత.

పల్లెలు, పట్టణాలు అని తేడా లేకుండా విస్తరించిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఆర్థిక అసమానతలను తొలగించేందుకు తోడ్పడుతున్నాయి. పెట్టుబడుల కొరతను ఈ తరహా పరిశ్రమలు అధిగమించడానికి కేవలం వ్యక్తిగత హామీలతో బ్యాంకులు ఋణం అందిస్తున్నాయి. అందుకే ఇవి మనుగడ సాగిస్తున్నాయి. పీఎమ్ఈజీపీ, సీజీటీఎమ్ఎస్ఈ కింద ఇచ్చే రుణాలతో పాటు ముద్రా ఋణాలూ ఇటువంటి పరిశ్రమల స్థాపనకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

ఒక వ్యక్తి కాని, వ్యాపార సంస్థ కాని (కొనుగోలుదారు) వస్తువులు లేక సేవలు సూక్ష్మ, చిన్న పరిశ్రమలను నడిపేవారి (అమ్మకందారు) నుంచి పొందినట్లయితే... వారు అమ్మకందారుకు నగదు తంచనుగా చెల్లించాలనేది ఈ చట్టం చెప్తుంది. అమ్మకందారుకు, కొనుగోలుదారుకు మధ్య ఒప్పందం ఉండాలి. ఆ ఒప్పందం గడువు 45 రోజులు మాత్రమే ఉండాలి. దాని కోసం అమ్మకందారు 'ఉద్యమ్ ఆధార్'లో నమోదు పొందిన తయారీదారుడు కావాల్సిన అవసరం లాంటి కొన్ని పరిమితులు నిర్దేశించడం ఈ చట్టంలోని ఒక సుగుణం. అలా ఒప్పంద పత్రం లేకపోతే 'నియమించిన గడువు' అనే అంశం పరిగణనలోకి వస్తుంది. వస్తువులను లేదా సేవలను అంగీకరించిన రోజు నుంచి 15 రోజుల లోపల నగదు చెల్లించాల్సి రావడమే 'నియమించిన రోజు'గా చట్టం చెబుతోంది. సూక్ష్మ, చిన్న పరిశ్రమల తయారీదారుకు కొనుగోలుదారుకు మధ్య ఒప్పంద పత్రం రాతపూర్వకంగా ఉండాల్సి ఉంటుంది. అలా కానప్పుడు కొనుగోలుదారుడు 15 రోజుల్లోపల నగదు చెల్లించాల్సి ఉంటుంది.

కొనుగోలుదారుడు భారతదేశంలో ఏ ప్రాంతంలోని వారైనా ఈ చట్టం వర్తిస్తుంది. ఒప్పందల పత్రంలో గడువు ఎక్కువ రోజులు రాసుకొన్నప్పటికీ ప్రభుత్వం ఎమ్ఎస్ఎమ్ఈ డెవలప్మెంట్ చట్టం –2006 సెక్షన్ 15 ప్రకారం విధించిన గడువు కేవలం 45 రోజులే. ఇది సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల నుంచి కొనుగోలుచేసిన వ్యక్తులకు, సంస్థలకు మాత్రమే వర్తిస్తుంది.



పెట్టుబడి ఒక కోటి రూపాయలు లోపల ఉండి రూ. 5 కోట్ల అమ్మకాలు సాగిస్తే దానిని సూక్ష్మ తరహా పరిశ్రమగా పరిగణిస్తారు. అదే పెట్టుబడి 10 కోట్ల రూపాయల లోపల ఉండి అమ్మకం రూ. 50 కోట్ల లోపల ఉంటే చిన్న తరహా పరిశ్రమగా పరిగణిస్తారు. తయారీ లేకుండా కేవలం అమ్మకం (ట్రేడింగ్) జరిపే వ్యాపారులకు ఈ చట్టం వర్తించదు. కొన్న వస్తువులకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల చట్టప్రకారం వస్తువులు లేక సేవలు పొందిన ఏ వ్యక్తి అయినా సెక్షన్ 15లో చెప్పిన విధంగా చెల్లింపు జరపని కారణంగా అమ్మకందారునికి 'వడ్డీ' చెల్లించాలి. అదీ చక్రవడ్డీ! వడ్డీ రేటు రిజర్వు బ్యాంకు, తన కింది బ్యాంకులకు సూచించిన రేటుకు మూడురెట్లుగా నిర్దేశించారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు మూలధన లభ్యత పెరిగి అవి సజీవంగా మనుగడ సాగించడానికే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది.

కొనుగోలుకు చెల్లింపులు జరపడంలో ఆలస్యానికి కట్టే వడ్డీని ఆదాయపు పన్ను లెక్కలో ఖర్చుల క్రింద పరిగణించకపోవడం మరో విశేషం. అయితే బకాయిలు చెల్లించిన సంవత్సరంలో ఖర్చు కింద చూపే వెసులుబాటు చట్టంలో కల్పించారు. ఈ చట్టం భారత దేశ కొనుగోలుదారులకే కాకుండా విదేశీ కొనుగోలు దారులకు సైతం వర్తిస్తుంది. ఇక్కడ వివాదాల్ని పరిష్కరించడానికీ, చట్టాలు అమలు చేయడానికి దేశ దౌత్యవేత్తల కార్యాలయాలు కీలకపాత్ర పోషిస్తాయి.


ఆదాయపు పన్ను సెక్షన్ 43బీ(హెచ్)కు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల చట్టం సెక్షన్ 15ను కలిపి చదివితేనే మనకు ఈ చట్టంపై సంపూర్ణ అవగాహన కలుగుతుంది. ప్రతి సంస్థ చట్టాలకు లోబడి ఆస్తి, అప్పుల పట్టీని తయారు చేసి లెక్కలు తనిఖీ చేయించాల్సి ఉంటుంది. అయితే, ఏ సంస్థ అయితే సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు సకాలంలో చెల్లించలేదో, వాటి బకాయిలను చెల్లించాల్సిన వడ్డీని బహిర్గతం చేయాలి. కంపెనీ అయితే కంపెనీ చట్టాలకు లోబడీ, ఇతరత్రా అయితే ఆ చట్టాలను అనుసరించీ!

2006 చట్టంగా వచ్చినప్పటికీ, అమలు చేయడంలో చర్యలు ఇప్పుడిప్పుడే ప్రారంభ మయ్యాయి. ఆదాయపు పన్ను చట్టంతో ముడిపెట్టడం వల్ల చట్టం విలువ పెరిగి దాని ప్రాముఖ్యాన్ని గుర్తించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ప్రస్తుత తరుణంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల మనుగడకు ఈ చట్టం ఒక రక్షణ కవచంగా నిలుస్తున్నదనేది కాదనలేని నిజం.

వ్యాసకర్త చార్టర్డ్ అకౌంటెంట్

నారద సందేహం

ఒకరోజు నారదుడు తనదైన రాగంలో ఓ పాట పాడుకుంటూ వస్తున్నాడు. 'ఈ రాగాన్ని సరిగ్గా పాడుతున్నానా' అని ఆయనకు సందేహం కలిగింది. వెంటనే సరస్వతి వద్దకు వెళ్ళి 'నేను పాడుతున్న రాగం సరిగ్గా ఉందా' అని పాడి వినిపించాడు. అందుకు ఆమె 'నువ్వు పాడుతున్నది సరిగ్గా ఉందో లేదో అనే విషయాన్ని ఆంజనేయుడి వద్దకు వెళ్ళి అడిగి తెలుసుకో' అంది. అందుకు నారదుడు ఆంజనేయుడి వద్దకు వెళ్ళాలా అని లోలోపల బాధపడుతూ తిన్నగా ఆంజనేయుడి వద్దకు వెళ్ళి పాడి వినిపించాడు. అది సరిగ్గా ఉందా అని అడిగాడు. ఆంజనేయుడు ఏమీ మాట్లాడకుండా నారదుని తీసుకుపోయి ఓ కొండ మీద నిలబెట్టాడు. ఇప్పుడు పాడు అన్నాడు. 'నువ్వు పాడిన పాట సవ్యంగా ఉంటే ఈ కొండ కరుగుతుంద'న్నాడు ఆంజనేయుడు. నారదుడు పాడాడు. కానీ కొండ కరగలేదు. 'సరే ఇప్పుడు నేను పాడుతాను' అని ఆంజనేయుడు పాడాడు. కొండ కరగనారంభించింది. నేను నిల్చున్న కొండ కరుగుతోందని నారదుడు పెద్దగా అరిచాడు. ఆంజనేయుడు పాడుతున్న పాటను ఆపాడు. వెంటనే కొండ కరగడం ఆగిపోయింది. కరిగిన కొండ బీటలు వారడం మొదలయింది. నారదుడి కాలు అందులో చిక్కుకుంది. కాలు బయటకు తీయడం కుదరలేదు. ఆంజనేయుడు మళ్ళీ పాడి నారదుడిని కాపాడాడు. అయితే నారదుడు అసహనంతో రగిలిపోయి కోపంతో 'ఈ ఆహిరి రాగాన్ని ఎవరు పాడినా వారికి అన్నం దొరకదు' అని శపించాడని అంటారు. ఆ శాపం నిజమేనేమో అని ఇప్పటికీ కొందరు ఆ రాగంలో పాటలు పాడటానికి భయపడతారు. కానీ నాకు తెలిసిన ఓ సంగీత విద్వాంసుడు రోజూ ఆ రాగంలో పాట పాడుతూ ఉంటాడు. అదీనూ ఇంట్లోనే, తెల్లవారు జామున. ఆయనతో ఓ రోజన్నాను 'మీకు చాలా ధైర్యమండి' అని. 'ఎందుకలా అంటున్నారు' అని ఆయన ప్రశ్నించాడు. విషయం చెప్పాను. ఆయన నా వంక చూసి 'అలాగేమీ లేదు. నేను ఏ రాగం పాడినా మా ఇంట్లో అన్నం దొరకదు సార్. అందువల్ల నేనా రాగాన్ని ధైర్యంగా పాడుతుంటాను' అని చెప్పాడు.



– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, తిథి: శు.త్రయోదశి సా.4.43 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: స్వాతి పూర్తి (24 గంటలు), వర్జ్యం: ఉ.11.21 నుండి 1.06 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.03 నుండి 8.51 వరకు, తదుపరి రా.10.51 నుండి 11.39 వరకు, అమృతఘడియలు: రా.9.40 నుండి 11.23 వరకు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 5.30, సూర్యాస్తమయం: 6.22.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

పేలిన విద్యుత్ ప్లాంట్ బాయిలర్



బాయిలర్ పేలడంతో ప్లాంట్ నుంచి వెలువడుతున్న పొగ

రామగుండం: పెద్దపల్లి జిల్లా రామగుండం లోని 62.5 మెగావాట్ల బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం బాయిలర్ ఒక్కసారిగా పేలిపోయింది. పెంట్‌హౌస్‌లోని బాయిలర్ సూపర్ హీటర్ లీకవడంతో ప్రమాదం సంభవించింది. దీంతో ప్లాంట్ షట్‌డౌన్ అయ్యింది. ఈ ఘటనలో ఉద్యోగులెవరికీ ప్రమాదం జరగలేదని అధికారులు తెలిపారు. ప్రమాదం కారణంగా ప్లాంట్‌లో భారీ ఎత్తున పొగలు కమ్ముకున్నాయి. కాగా, వారం క్రితమే బాయిలర్ ట్యూబ్స్‌ను పునరుద్ధరించారు.

ఆర్‌ఎంపీ ఇచ్చిన ఇంజెక్షన్ వికటించి బాలిక మృతి

వేమనపల్లి: వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వచ్చిన బాలిక అనారోగ్యానికి గురైంది. ఆర్‌ఎంపీ వద్ద ఇంజెక్షన్ వేయించుకోగా వికటించి అసువులు బాసింది. ఈ సంఘటన మంచిర్యాల జిల్లాలో చోటు చేసుకుంది. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ కథనం ప్రకారం.. నెన్నెల మండల కేంద్రానికి చెందిన కొమిరె భాగ్యలక్ష్మి కూతురు సాయిపల్లవి (11) వేసవి సెలవులకు అమ్మమ్మ ఊరు వేమనపల్లి మండలం కల్మలపేటకు వచ్చింది. ఆదివారం రాత్రి ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పడంతో నీల్వాయిలో ఉన్న ఆర్‌ఎంపీ సంతోష్ వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. అతడు ఇంజెక్షన్ వేయడంతో వికటించి పల్స్, బీపీ పడిపోగా నాలుక మందమై బాలిక తీవ్ర అనారోగ్యానికి గురైంది. రాత్రికి రాత్రే చెన్నూర్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యుడు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 5 గంటలకు బాలిక మృతి చెందింది. ఆర్‌ఎంపీ నిర్లక్ష్యం కారణంగానే తన కూతురు చనిపోయిందని తల్లి భాగ్యలక్ష్మి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు

- కేసులు తప్పవని హెచ్చరించిన పోలీసు అధికారులు

సాక్షి, హైదరాబాద్: విత్తన విక్రయాలు ఊపందుకుంటున్న నేపథ్యంలో రైతులను మోసగించే నకిలీ విత్తన ముఠాల కట్టడికి పోలీసులు చర్యలు ప్రారంభించారు. రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరించారు. ప్రభుత్వం, పోలీసులు ఎట్టిపరిస్థితుల్లోనూ నకిలీ విత్తనాలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు తెలంగాణ పోలీసు శాఖ తరఫున హెచ్చరికలు జారీ చేశారు. నకిలీ విత్తనాల విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. విత్తనాల కొనుగోలు సమయంలో అవి సరైనవేనా? లేదా అన్నది సరిచూసుకోవాలని అధికారులు పేర్కొన్నారు.

స్కూళ్లలో కూల్‌డ్రింక్స్ వద్దు

పాఠశాలల ప్రిన్సిపల్స్‌కు డబ్ల్యూహెచ్‌ఓ మార్గదర్శకాలు

- క్యాంటీన్లు, కారిడార్లు, ఆట ప్రదేశాల్లో ఇవి అందుబాటులో ఉంటున్నాయి
- షుగరీ డ్రింకులతో పిల్లల ఆరోగ్యానికి చేటు
- ఊబకాయంతో పాటు జబ్బులకు గురయ్యే చాన్స్
- మంచినీటితో మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: '13–15 ఏళ్ల మధ్య వయస్సు పిల్లల్లో సగం మంది షుగరీ డ్రింక్స్ (కూల్ డ్రింక్స్, పండ్ల రసాలు, ఎనర్జీ డ్రింక్స్ లాంటి తీపి పానీయాలు) రోజుకొకసారి తాగుతున్నారు. అంటే ప్రతి ఇద్దరిలో ఒకరు ఇలాంటివి తాగుతున్నారు. ముఖ్యంగా స్కూళ్ల పరిసరాల్లో వీటి అమ్మకం భారీగా జరుగుతోంది. పిల్లల్ని లక్ష్యంగా చేసుకునే వీటిని అందుబాటులో ఉంచుతున్నారు. కూల్‌డ్రింక్స్‌తో పాటు పీచు మిఠాయిలు, ఐస్‌క్రీములు కూడా స్కూళ్ల పరిసరాల్లో ఉంటున్నాయి. వీటివల్ల అధిక మొత్తంలో కేలరీలు వస్తాయి. దంత క్షయం, ఊబకాయంతో పాటు వివిధ రకాల వ్యాధులకు గురయ్యే అవకాశం పెరుగుతుంది. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రిన్సిపల్స్ స్కూళ్ల పరిసరాల్లో వీటి అమ్మకాలు నియంత్రించాలి..' అని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) సూచించింది. షుగర్ ఆధారిత అన్ని రకాల డ్రింక్స్‌ను స్కూళ్ల పరిసరాల్లో అనుమతించ కూడదని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న స్కూళ్ల ప్రిన్సిపల్స్‌కు తమ నివేదికలోని అంశాలను వెల్లడించడమే కాకుండా పలు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది.

ఎక్కడ పడితే అక్కడ అందుబాటులో..

- చిన్న పిల్లలే లక్ష్యంగా ఈ అమ్మకాలు కొనసాగుతున్నాయి. మరి ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో ఇవి ఉంటున్నాయి. కొందరు స్కూళ్ల ప్రిన్సిపల్స్‌లోనూ వీటి విషయంలో సానుకూలమైన భావన ఉంది.
- స్కూల్ క్యాంటీన్లు, కారిడార్లలో, ఆట ప్రదేశాల్లో వీటిని ఉంచుతున్నారు. స్కూళ్లలో ఏవైనా వేడుకలు నిర్వహిస్తే కంపెనీలు ఈ తరహా డ్రింక్స్ స్పాన్సర్ చేస్తున్నాయి. తద్వారా తమ కంపెనీ కూల్‌డ్రింక్స్‌ను ప్రమోట్ చేసుకుంటూ బిజినెస్ పెంచుకుంటున్నాయి.
- కూల్‌డ్రింక్స్ వెండింగ్ మిషన్లు కూడా స్కూళ్లల్లో ఉంటున్నాయి. మరి ముఖ్యంగా కార్పొరేట్ స్కూళ్లలో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. స్కూళ్లకు ఉచితంగా శాంపిల్స్ కూడా ఇస్తున్నారు. అలాగే 10 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తున్నారు.
- కొన్ని కంపెనీలు పిల్లల్ని ఆకర్షించేందుకు సినీ హీరోల ద్వారా కూడా ప్రచారం చేస్తున్నాయి.

షుగరీ డ్రింక్స్ అంటే?

- కూల్‌డ్రింక్స్, ఫ్రూట్ జ్యూస్, ఫ్రూట్ ఫ్లేవర్డ్ జ్యూస్, మిక్స్‌డ్ ఫ్రూట్ జ్యూస్, షుగర్‌తో తయారు చేసిన ఫ్లేవర్డ్ మిల్క్, లస్సీ, విటమిన్ వాటర్, ఎనర్జీ డ్రింక్ లాంటి వాటిని షుగరీ డ్రింక్స్ అంటారు.
- చిన్న పిల్లలు, యువత శరీరాల్లోకి షుగర్ ఎక్కువగా ఈ డ్రింక్‌ల ద్వారానే వెళ్తోంది.
- ఇండియా వంటి దక్షిణాసియా దేశాల పిల్లల్లో షుగరీ డ్రింక్స్ వాడకం ఎక్కువగా ఉంది.

చాలా దేశాల్లో షుగరీ డ్రింక్స్‌పై నిషేధం



ఫ్రాన్స్ 2004లోనే స్కూళ్లలో షుగరీ డ్రింక్స్ వెండింగ్ మిషన్లను నిషేధించింది. నెదర్లాండ్స్‌లో ఒకేసారి ఆపకుండా తొలుత చిన్నచిన్న సైజుల్లో డ్రింక్‌లను అందుబాటులో ఉంచారు. క్రమంగా వాటిని తగ్గించేశారు. రిపబ్లిక్ ఆఫ్ కొరియా కూడా 2007లోనే షుగరీ డ్రింక్స్‌ను నిషేధించింది. స్కూళ్లలో ఏదైనా అమ్మే పక్షంలో అందులో ఉండే పదార్థాలను తెలియజేయాలి. హంగేరీ చిన్న పిల్లలకు శుభ్రమైన నీటిని సరఫరా చేస్తోంది. షుగరీ డ్రింక్స్ వల్ల చిన్న పిల్లలకు ఊబకాయం వస్తుంది. దమ్ము, షుగర్, బీపీ లాంటివి రావొచ్చు. శ్వాస ఆడకపోవడం వంటిది చోటుచేసుకోవచ్చు. కొందరు పిల్లలు గుండె జబ్బులు, పక్షవాతం, కేన్సర్లు లాంటి వాటికీ గురయ్యే అవకాశం ఉంది. దంతాల సమస్యలు కూడా వస్తాయి. ఈటింగ్ డిజార్డర్స్ వస్తాయి. చిన్న వయస్సులో ఊబకాయం వస్తే.. అందులో 30 శాతం మందిలో పెద్ద వయస్సులోనూ కొనసాగుతుంది. ఇలాంటి సమస్యలతో స్కూల్ అటెండెన్స్ తగ్గుతుందని డబ్ల్యూహెచ్‌ఓ తెలిపింది.

– డాక్టర్ ఎం.హరిత, అసోసియేట్ ప్రొఫెసర్, ఓరల్ మెడిసిన్, నిజామాబాద్

దేన్లో ఎన్ని స్పూన్ల షుగర్

- 330 ఎంఎల్ లస్సీలో ఏడు స్పూన్ల షుగర్ ఉంటుంది. అంతే పరిమాణంలో ఉన్న బాదం మిల్క్, ఫ్లేవర్డ్ మిల్క్‌ల్లో 7 స్పూన్ల చక్కెర ఉంటుంది. కూల్‌డ్రింక్స్‌లో 8.5 స్పూన్లు, ఫ్రూట్ జ్యూస్‌లో 9.5 స్పూన్లు, ఎనర్జీ డ్రింక్స్‌లో 10 స్పూన్ల షుగర్ ఉంటుంది. అంటే ఒక్క కూల్ డ్రింక్ లేదా జ్యూస్ ద్వారానే అన్ని స్పూన్ల షుగర్ శరీరంలోకి వెళ్తుందన్నమాట. • పదేళ్ల పైబడినవారు మంచి ఆరోగ్యంగా ఉండాలంటే మొత్తంగా రోజుకు ఆరు టీ స్పూన్లు లేదా 25 గ్రాముల షుగర్ మాత్రమే తీసుకోవాలి.
- ఐదేళ్లలోపు వారు రోజుకు 6 నుంచి 8 టీ స్పూన్ల వరకు, 4–5 ఏళ్లలోపు వాళ్లు బాలికలైతే 8 స్పూన్లు, బాలురు 8.5 టీ స్పూన్లు తీసుకోవచ్చు.

మంచినీళ్లే మేలు

- పరిశుభ్రమైన నీటిని తాగడం ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడుతుంది. చిన్న పిల్లలు చెమట ద్వారా త్వరగా శరీరంలో నీటిని కోల్పోతారు. నీరు లేకపోతే నీరసించిపోతారు. అందువల్ల సురక్షితమైన నీటిని ఎక్కువగా తాగడం మంచిది. • షుగరీ డ్రింక్స్‌ల్లో కేలరీలు ఉంటాయని, ఎనర్జీ వస్తుందని తాగుతుంటారు. కానీకేలరీలను కేవలం ఆహారం ద్వారానే తీసుకోవాలి కానీ ఇలా డ్రింక్స్ ద్వారా కాదు. పుదీన, నిమ్మరసాలు, బట్టర్ మిల్క్ (మజ్జిగ) లాంటివి తీసుకుంటే మంచిది.
- 10 ఏళ్లు దాటిన వారు, పెద్దలు రెండు లీటర్ల మంచినీరు తాగాలి. ఎక్కువ శ్రమ చేసేవారికి 4 లీటర్ల నీరు కావాలి. 24 గంటల పాటు సురక్షిత నీటిని సరఫరా చేయలేని పరిస్థితి స్కూళ్లలో ఉంటే, ఆ మేరకు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ప్రిన్సిపల్ కోరాలి.

గురుకుల సీట్లన్నీ భర్తీ చేసేలా...!

- కార్యాచరణ రూపొందించిన సొసైటీలు
- జూన్ రెండో వారంలోగా ప్రవేశాలు
- ఐదో తరగతిలో తొలివిడత మెరిట్ జాబితా విడుదల.. మరోవారంలో రెండో జాబితా
- సీట్లు మిగిలిపోతే మెరిట్ ప్రాతిపదికన అడ్మిషన్లు... ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపకల్పన
- రెండురోజుల్లో వేగవంతం కానున్న బ్యాక్‌లాగ్ ఖాళీలు, ఇంటర్, డిగ్రీ అడ్మిషన్లు



సాక్షి, హైదరాబాద్: ఈ విద్యాసంవత్సరం ప్రారంభంనాటికే గురుకుల విద్యాసంస్థల్లో అన్ని సీట్లు భర్తీ చేయనున్నారు. ఈ మేరకు గురుకుల సొసైటీలు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నాయి. నాలుగు గురుకుల సొసైటీలు ఉమ్మడిగా ఐదోతరగతి అర్హత పరీక్ష నిర్వహించగా, కేటగిరీల వారీగా అధికారులు విద్యార్థుల విభజన పూర్తి చేశారు. దీంతో తొలివిడత ప్రాథమిక ఎంపిక జాబితాను ఆయా సొసైటీలు వెబ్‌సైట్‌లో పొందుపర్చాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల సొసైటీలు తొలివిడత జాబితా ఆధారంగా అడ్మిషన్లు పూర్తి చేస్తున్నాయి. నాలుగు గురుకుల సొసైటీల పరిధిలో ఐదోతరగతిలో ప్రవేశానికి 48వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే 30వేల మందికి పైగా ప్రాథమిక జాబితాలో అర్హత సాధించారు. తొలిజాబితాలో ఎంపికైన విద్యార్థులు వారంరోజుల్లోగా ఆయా స్కూళ్లలో రిపోర్టు చేయాలి. ఆ తర్వాత ఉన్న ఖాళీల ఆధారంగా రెండోజాబితా విడుదల చేస్తారు. మరోవారం రోజుల్లోగా రెండో జాబితా విడుదల చేయనున్నట్లు గురుకుల సొసైటీ వర్గాలు చెబుతున్నాయి.

ఈ నెలాఖరులోగా జూనియర్, డిగ్రీ అడ్మిషన్లు

గురుకుల జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లకు గురుకుల సొసైటీలు సన్నద్ధమవుతున్నాయి. పదోతరగతి ఫలితాలు వెలువడిన వెంటనే ప్రవేశాల ప్రక్రియ వేగవంతం చేయాలని భావించారు. అయితే ఎన్నికల నేపథ్యంలో కాస్త ఆలస్యమైంది. ప్రస్తుతం జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం అర్హత పరీక్ష ఫలితాలను గురుకుల సొసైటీలు విడుదల చేశాయి. నెలాఖరులోగా ఎంపికైన విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలి. మొదటివిడత అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెలాఖరులోగా పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత రెండోవిడత ఎంపిక జాబితా విడుదల చేస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల సొసైటీలు ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతం చేశాయి. మైనార్టీ గురుకుల సొసైటీ మాత్రం కాస్త వెనుకబడి ఉంది. ఈ సొసైటీ నుంచి ఐదోతరగతితో పాటు జూనియర్ కాలేజీలు, బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి సంబంధించి సమాచారం ఇవ్వడం లేదు.

మిగులు సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

గురుకుల విద్యాసంస్థల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని సొసైటీలు నిర్ణయించాయి.

- ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీలు ఇప్పటికే కార్యదర్శి కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. అర్హత పరీక్షల ద్వారా సీట్లు భర్తీ పూర్తయిన తర్వాత ఈ ప్రక్రియ ప్రారంభిస్తారు. ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి అర్హతల ఆధారంగా అడ్మిషన్లు ఇస్తారు.
- జనరల్ గురుకుల సొసైటీల్లో సీట్లు పెద్దగా మిగలడం లేదు.
- బీసీ గురుకుల సొసైటీల్లో సీట్ల భర్తీకి ఆ సొసైటీ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించింది. సీట్లు దక్కని విద్యార్థులు సొసైటీ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అలా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అర్హతను బట్టి అడ్మిషన్ ఇస్తారు. పూర్తిగా పారదర్శకతతో అడ్మిషన్లు జరిగేందుకు సాంకేతికవ్యవస్థ ఏర్పాటు చేశామని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతులు సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బి.సైదులు 'సాక్షి'తో అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై ఫేక్ వీడియో వైరల్

- గాంధీ ఆస్పత్రిలో కరెంట్ లేక బాలుడు మృతి చెందాడని కథనం
- విచారణ చేపట్టిన సీఎం పేషీ.. తప్పుడు కథనమని తేలిన వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన గాంధీ సూపరింటెండెంట్



గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్): రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై 'ఎక్స్' ఖాతాలో ఓ ఫేక్ వీడియో వైరల్ అయింది. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కొవ్వొత్తులు, టార్చిలైట్లు, సెల్‌ఫోన్ వెలుగులో వైద్యసేవలు అందించారని, ఈ క్రమంలో ఓ బాలుడు మృతి చెందాడని, గొప్పలు చెప్పుకుని అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం పనితీరు దరిద్రంగా ఉందని, గుంపు మేస్త్రీ ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తూ వీడియోను పెట్టారు. ఓ తెలుగు చానల్ లోగోతో ఉన్న వీడియో క్లిప్పింగ్‌ను జత చేస్తూ 'బీఆర్‌ఎస్ యూఎస్‌ఏ'ఎక్స్ ఖాతాలో ఇది పోస్ట్ అయింది. దీనిపై సీఎం కార్యాలయం విచారణ చేపట్టగా అంతా ఉత్తదే అని తేలింది. పాత క్లిప్పింగ్‌తో డీప్‌ఫేక్ ద్వారా తప్పుడు వీడియోను సృష్టించారని విచారణలో వెల్లడైంది. సీఎం పేషీ ఆదేశాల మేరకు గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు చిలకలగూడ ఠాణాలో సోమవారం ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బీఆర్‌ఎస్ యూఎస్‌ఏ ఎక్స్ ఖాతాలో హరీశ్‌రెడ్డి అనే వ్యక్తి ఈ ఫేక్ వీడియోను అప్‌లోడ్ చేసినట్లు సాంకేతిక ఆధారాల ద్వారా గుర్తించారు. ఐటీ, ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్ తెలిపారు. వైద్యులు, సిబ్బందిపై నిందలు వేయడం తగదని గాంధీ సూపరింటెండెంట్ రాజారావు ఆవేదన వ్యక్తం చేశారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి.. బాలుడికి తీవ్రగాయాలు

- భద్రాద్రి జిల్లాలో పది పశువులు మృత్యువాత



పిడుగుపాటుకు మృతిచెందిన పశువులు

తాండూరు టౌన్/పాల్వంచ రూరల్: పిడుగుపాటుకు ఓ వ్యక్తి మృతి చెందగా.. మరో బాలుడు గాయాలపాలైన ఘటన సోమ వారం తాండూరులో చోటుచేసుకుంది. యాలాల మండల పరిధిలో ఆదివారం పిడుగుపాటుకు ముగ్గురు రైతులు మృత్యువాత పడిన ఘటన మరువకముందే.. తాండూరు పట్టణంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఓ కుటుంబంలో విషాదాన్ని నింపింది. టీకొట్టు నడుపుతూ జీవనం సాగిస్తున్న పాత తాండూరుకు చెందిన పుర్రు శేఖర్(40) బహిర్భూమికి వెళ్లేందుకు సోమవారం సాయంత్రం బయటకు వచ్చాడు. అదే సమయంలో వర్షం రావడంతో రైల్వే గేట్ సమీప ప్రాంతంలోని చెట్టు కిందకు వెళ్లాడు. ఆ సమయంలోనే పక్కనే ఉన్న మైదానంలో క్రికెట్ ఆడుతున్న బాలురుల్లో 17 ఏళ్ల హన్మంతు కూడా వర్షం రావడంతో అదే చెట్టు కిందకు వచ్చాడు. అప్పుడే పిడుగు పడడంతో చెట్టు కింద ఉన్న శేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా హన్మంత్ తీవ్ర గాయాలపాలయ్యాడు. కాగా, పిడుగుపాటుకు అకాల మరణం చెందిన శేఖర్ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఓ ప్రకటనలో భరోసానిచ్చారు. గాయపడిన హన్మంతుకు ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. మరోవైపు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం రాళ్లచెలకలో పిడుగులు పడి పది పశువులు మృతి చెందాయి. వర్షం పడుతుండడంతో పశువులు చెట్టు కిందకు చేరగా చెట్టుపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతిచెందాయి.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

Srinivasa Ramanujan Institute of Technology
(AUTONOMOUS)
Rotarypuram Village, B K Samudram Mandal, ANANTHAPURAMU - 515701
www.srit.ac.in

FACULTY RECRUITMENT

Applications are invited from the eligible candidates for the following posts in the Departments of CSE, ECE, EEE, MEC, CIV, Mathematics, Physics, Management Sciences & English

S.No.	Post	Minimum Qualifications
1.	Assistant Professor	• M.Tech. (CSE/ECE/EEE/MEC/CIV) • M.Sc. (Mathematics / Physics / Statistics / Finance) • M.A. (English)
2.	Associate Professor	• M.Tech. (CSE/ECE/EEE/MEC/CIV) with Ph.D. • M.Sc. (Mathematics/Physics/Statistics/Finance) with Ph.D. • M.A. (English) with Ph.D.
3.	Professor*	• M. Tech. (CSE/ECE/EEE/MEC/CIV) with Ph.D. • M.Sc. (Mathematics/Physics/Statistics/Finance) with Ph.D. • M.A. (English) with Ph.D. (with relevant experience)

★ Faculty from any Department with 2 NPTEL/Swayam courses equivalent to 10 credits related to CSE stream can also apply.
★ Salary as per AICTE Norms.
★ The eligible and interested candidates may send their resume to careers@srit.ac.in & info@srit.ac.in on or before 31st May 2024

Sd/- Secretary

ANNAMACHARYA UNIVERSITY
EXCELLENCE IN EDUCATION; SERVICE TO SOCIETY
(ESTD. UNDER AP STATE PRIVATE UNIVERSITIES (ESTABLISHMENT AND REGULATION) ACT, 2016)
www.annamacharyauniversity.edu.in Phone: 08565-251252

Advt No: Notfication/2024/2 Date: 21-05-2024

RECRUITMENT NOTIFICATION

We are currently looking for qualified and experienced academicians in Leadership Roles: **Dean (Academics)** and **Dean(Administration)** and for **Faculty** in the following departments. Eligible and interested candidates can apply through online by visiting Annamacharya University website: **www.annamacharyauniversity.edu.in** or by e-mail: hr@annamacharyauniversity.edu.in before 04-06-2024.

Dept	Post	Qualification & Experience
CSE	Professor	Ph.D. with 10 years teaching experience, out of which at least 5 years must be at the level of Associate Professor. Research publications in standard journals will carry more weight.
	Professor of Practice	B.Tech / M.Tech with 15 years of Industrial experience
CSE	Associate Professor	Ph.D. with 5 years teaching experience
	Ast. Professor of Practice	B.Tech / M.Tech with 10 years of Industrial experience
CSE, EEE, ECE, ME, CIVIL, AIML, AIDS, CSE(AI) & CSE(DS)	Assistant Professor	First Class in B.Tech &M.Tech.Experienced candidates will be given preference
	Ast. Professor of Practice	B.Tech with 5 years of Industrial experience
Physics,Chemistry, Mathematics, English	Assistant Professor	Ph.D. in relevant discipline

Faculty from the core Engineering branches who have completed online courses on MOOCs through NPTEL / SWAYAM, equivalent to 10 credits related to CSE courses, are encouraged to apply for positions in the CSE Department.

Salary will be commensurate with the candidate's qualifications, experience, and performance. Candidates will be shortlisted based on their profiles and will be invited for an interview at Annamacharya University during the second week of June 2024

-Registrar

RAJAMPET, ANNAMAYYA DISTRICT, 516126, ANDHRA PRADESH, INDIA



టీడబ్ల్యూఆర్డీసీఎల్ ఇన్‌చార్జి వీసీ, ఎండీగా విజయభాస్కర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జల వనరుల అభివృద్ధి సంస్థ(టీడబ్ల్యూఆర్డీసీఎల్) ఇన్‌చార్జి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నాగర్‌కర్నూల్ సీఈ విజయ భాస్కర్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఈనెల 17న ఉత్తర్వులు జారీచేశారు.

మల్లన్నను గెలిపిస్తే అండగా ఉంటారు

- టీపీసీసీ నేతలు భవానీరెడ్డి, లింగం యాదవ్

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న విజయంతో కేటీఆర్, హరీశ్‌రావుల గూబ గుయ్యిమంటుందని టీపీసీసీ నేతలు భవానీరెడ్డి, లింగంయాదవ్ ఎద్దేవాచేశారు. సోమవారం గాంధీభవన్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లా డారు. తీన్మార్ మల్లన్నను గెలిపిస్తే నిరుద్యోగులకు, పట్టభద్రులకు అండగా ఉంటారని, వారి కోసం పోరాటం చేస్తారని చెప్పారు. నిరుద్యోగులకు అండగా ఉండి కేసీఆర్ గడీల పాలనకు వ్యతిరేకంగా పనిచేసిన వ్యక్తి తీన్మార్ మల్లన్న అని వ్యాఖ్యానించారు. పదేళ్ల కాలంలో ఒక్క ఉద్యోగం ఇవ్వని కేటీఆర్ ఏం మొహం పెట్టుకుని పట్టభద్రుల ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. హరీశ్‌రావుకు మతిభ్రమించి మాట్లాడుతున్నారని, పదేళ్ల కేసీఆర్ పాలనను ప్రజలు చీదరించుకుని బీఆర్‌ఎస్‌ను బొన్స్ చేశారన్న విషయాన్ని గమనించాలని వారు హితవు పలికారు.

ఉద్యోగుల రాజ్య బీమా సంస్థ
Employees' State Insurance Corporation (Ministry of Labour & Employment, Govt of India)
E.S.I.C
REGIONAL OFFICE: TELANGANA
5-9-23, HILLFORT ROAD, HYDERABAD-500 063
Ph.Nos. 040-23232356/57/58/59
E-mail: rd-telangana@esic.gov.in
Website: www.esic.gov.in

MBBS/BDS/B.Sc నర్సింగ్ కోర్సులలో కార్మికుల పిల్లల కోటాలో ప్రవేశం కొరకు ప్రకటన

తేది: 21-05-2024

కార్మిక రాజ్య బీమా సంస్థ ద్వారా నిర్వహించబడుతున్న మరియు ESI పథకం కింద నడపబడుతున్న కొన్ని ఇతర ప్రభుత్వ యాజమాన్యం లోని వైద్య/దంత వైద్య/నర్సింగ్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 'కార్మికుల పిల్లల' కోటాలో MBBS/BDS/ నర్సింగ్ కోర్సులలో ప్రవేశం కొరకు, అందుకు నిర్దేశించబడిన అర్హతా నియమాలను తృప్తి పరిచే మరియు NEET (UG) 2024-25 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించబడిన ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసినట్టి అభ్యర్థుల కొరకు ప్రవేశ ప్రకటన. పూర్తి వివరాలు, ప్రవేశ విధి విధానాలు, దరఖాస్తు విధానం కొరకు ESIC వెబ్‌సైట్ www.esic.gov.in లో గల 'Admission link'ను చూడగలరు.

వైద్య విద్యా విభాగం,
కార్మిక రాజ్య బీమా సంస్థ,
ముఖ్య కార్యాలయం,
న్యూఢిల్లీ

కార్డైట్ ఫ్యాక్టరీ, అరువన్‌కాడు
ది నీలగిరీస్, తమిళనాడు - 643 202
శ్రీ T విజయ్ కుమార్, CPW 'HS-II' CD-3116/111628 కు నోటీసు

శ్రీ T విజయ్ కుమార్, CPW 'HS-II' CD-3116/111628, వయసు 38 సంవత్సరాలు, CFA ఉద్యోగి, నివాసం: 1-7-270/2, శ్రీలక్ష్మీనిలయం, చైతన్యపురి ST-5/A, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ – 500060 (ఏపి) వారికి విధుల నుండి (15-01-23 నుండి 29-07-23 (196 రోజులు) మరియు 20-08-23 నుండి 20-02-24 (185 రోజులు) (మొత్తం 381 రోజులు) అనధికారిక గైర్హాజరు మరియు ఈ తేదీ వరకు విధుల నుండి నిరంతర గైర్హాజరు కొరకు CFA నుండి చార్జ్ మెమొరాండం నం.103/DOO/DFUAV/DISC/IE/CFA/TVK తేది:05-03-2024 సేకరించుటకు మరియు ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 10 రోజులలోగా ఏదైనా ఉంటే చార్జ్ మెమొరాండంపై అతని అభ్యర్థన దాఖలు చేయుటకు ఆఖరి మరియు తుది అవకాశం ఇందుమూలంగా ఇవ్వడమైనది. లేనిచో సదరు వ్యక్తికి తెలియజేయుటకు ఏమీలేదని భావించబడుతుంది మరియు తగినదని భావించిన విధంగా విషయంలో తదుపరి ముందుగుసాగుట డిసిప్లినరీ అథారిటీకి తప్పనిసరవుతుంది.

చీఫ్ జనరల్ మేనేజర్

CBC 10201/12/0002/2425

భూమికి పరిహారంగా భూమే

- రీజినల్ రింగురోడ్డులో అటవీశాఖకు 200 ఎకరాలు స్వాధీనం చేయాల్సిందే
- ఇప్పటి వరకు దృష్టి సారించని రాష్ట్ర ప్రభుత్వం
- గందరగోళంగా ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం

సాక్షి, హైదరాబాద్: ట్రిపుల్ ఆర్ (రీజినల్ రింగురోడ్డు)లో ప్రభుత్వపరంగా జరుగుతున్న జాప్యం నిర్మాణ పనులపై ప్రభావం చూపుతోంది. భూసేకరణ వ్యవహారంలో రానురాను ఎన్‌హెచ్‌ఏఐ(నేషనల్‌హైవే అథారిటీ ఆఫ్ ఇండియా)కి అడ్డంకులు పెరుగుతున్నాయి. ఒకవైపు ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోయేవారు కోర్టులను ఆశ్రయిస్తుంటే, మరోవైపు అటవీశాఖ కూడా ఎన్‌హెచ్‌ఏఐకి చుక్కలు చూపిస్తోంది. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగానికి సంబంధించి అటవీశాఖ నుంచి దాదాపు 200 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఈ భూమిని సేకరించాలంటే, అటవీశాఖకు అంతే పరిమాణంలో భూమిని ఎన్‌హెచ్‌ఏఐ కేటాయించాలి. కానీ, సొంతంగా ఎన్‌హెచ్‌ఏఐకి భూమి ఉండదు, ఆ అథారిటీకి రాష్ట్రప్రభుత్వం భూమిని కేటాయించాలి. కానీ, ఆ ప్రక్రియ జరగటం లేదు. ఫలితంగా ట్రిపుల్ ఆర్ నిర్మాణం ఇప్పట్లో ప్రారంభమయ్యే సూచనలు కనిపించటం లేదు.

నిబంధనలు మార్చిన కేంద్రం

గతంలో అటవీశాఖ కోల్పోయే భూములకు విలువ లెక్కగట్టి చెల్లించే పద్ధతి అమలులో ఉండేది. ఇటీవల కేంద్రప్రభుత్వం దానిని మార్చింది. అటవీశాఖకు ప్రత్యామ్నాయ భూములు మాత్రమే ఇవ్వాలని, పరిహారం రూపంలో డబ్బులు ఇవ్వొద్దని నిర్ణయించింది. అటవీభూముల్లో రోడ్లు నిర్మించే ప్రాంతాల్లో వేల సంఖ్యలో వృక్షాలను తొలగించాల్సి ఉంటుంది. ఆ రూపంలో పర్యావరణానికి జరిగే నష్టాన్ని కొంతలో కొంతైనా భర్తీ చేసేందుకు, ప్రత్యామ్నాయంగా ఇచ్చే భూముల్లో భారీగా చెట్లు పెంచాల్సి ఉంటుంది. పరిహారంగా డబ్బులు ఇవ్వటం వల్ల ఈ చెట్ల పెంపకం ఉండటం లేదు. ఇది పర్యావరణంపై నేరుగా ప్రభావం చూపుతోంది. దీనిని నివారించేందుకు అటవీశాఖకు ప్రత్యామ్నాయంగా భూములే ఇవ్వాలని, వాటిల్లో చెట్లను పెంచాలని కేంద్రం ఆదేశించింది. దీంతో ట్రిపుల్ ఆర్ కోసం అటవీశాఖ కోల్పోయే భూములకు ప్రత్యామ్నాయ భూములు ఇవ్వాల్సి ఉంది.

మూడు జిల్లాల్లో..

మెదక్, సిద్దిపేట, యాదాద్రి జిల్లాల్లోని 200 ఎకరాల అటవీ భూమి ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ పరిధిలో ఉంది. ముట్రాజ్‌పల్లి, నర్సాపూర్, కొండపోచమ్మ సాగర్ పరిసరాలు.. తదితర ప్రాంతాల్లో అడవుల మీదుగా రింగ్‌రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. కొన్ని చోట్ల ఒకే ప్రాంతంలో అర కిలోమీటరు మించిన నిడివిలో అటవీ భూములు పోతున్నాయి. నాలుగు రోజుల క్రితం మంత్రి కోమట్‌రెడ్డి వెంకటరెడ్డి అధికారులతో సమీక్షించారు. ట్రిపుల్ ఆర్‌కు అలైన్‌మెంట్ ప్రతిపాదించి మూడేళ్లు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం ఎందుకు ప్రారంభం కాలేదంటూ మంత్రి అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు అటవీశాఖ భూముల అంశాన్ని ఆయన దృష్టికి తెచ్చారు.


అధ్యక్షుడు రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కుప్పకూలిన దృశ్యం

ఇరాన్ అధ్యక్షుడు రైసీ దుర్మరణం

- హెలికాప్టర్ కూలిన ఘటనలో విదేశాంగ మంత్రి హుస్సేన్ తదితరుల మృతి
- మహమ్మద్ మొఖ్బర్‌ను తాత్కాలిక అధ్యక్షుడిగా నియమించిన అయెతొల్లా
- ఐదు రోజులు సంతాప దినాలుగా పాటించనున్న దేశ ప్రజలు



దుబాయ్: ఇరాన్ తూర్పు అజర్‌బైజాన్ పర్వతసానువుల్లో హెలికాప్టర్ కుప్పకూలిన ఘటనలో ఆ దేశ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ(63) ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ దట్టమైన అటవీప్రాంతంలో కనిపించకుండా పోయిన విషయం తెల్సిందే. ఈ ఘటనలో విదేశాంగ మంత్రి హుస్సేన్ అమీరబ్దుల్లాహియాన్ (60), ఈస్ట్ అజర్‌బైజాన్ ప్రావిన్స్ గవర్నర్ మాలిక్ రహ్మతీ, అధికారులు, పైలట్లు, అంగరక్షకులు చనిపోయారని ఇరాన్ అధికారిక మీడియా సోమవారం ప్రకటించింది. ఇరాన్ సుప్రీంలీడర్ అయాతొల్లాహ్ అలీ ఖమేనీ మార్గదర్శకంలో ఇజ్రాయెల్‌పై గత నెలలో ఇరాన్ జరిపిన భీకర డ్రోన్లు, క్షిపణి దాడుల ఘటన మరువకముందే రైసీ హఠాన్మరణంపై ప్రపంచవ్యాప్తంగా భిన్న కథనాలు వినవస్తున్నాయి. అయితే రైసీ మరణోదంతంలో తమ ప్రమేయం ఎంతమాత్రం లేదని ఇజ్రాయెల్ సోమవారం స్పష్టంచేసింది. హెలికాప్టర్ ప్రమాదంపై అత్యున్నతస్థాయి దర్యాప్తునకు సాయపడేందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షొయిగు మాట ఇచ్చారు. రైసీ మరణం నేపథ్యంలో ప్రస్తుత ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ మొఖ్బర్‌ను తాత్కాలిక దేశాధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ఖమేనీ ప్రకటించారు. ఉపవిదేశాంగ మంత్రి బఘేరీ కనీని నూతన విదేశాంగ మంత్రిగా నియమించారు. హెలికాప్టర్ కూలడానికి గల కారణాలను ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు. అధ్యక్షుడి మరణవార్త తెలిసి ఇరాన్ శోకసంద్రంలో మునిగిపోయింది. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు మొదలయ్యాయి. ఐదు రోజులు సంతాపదినాలుగా పాటించనున్నారు. లెబనాన్, సిరియా సైతం మూ డ్రోజులు సంతాప దినాలుగా ప్రకటించాయి. భార త్ సైతం


తాత్కాలిక అధ్యక్షుడు మొఖ్బర్

ఒక రోజు(మంగళవారం)ను సంతాప దినంగా ప్రకటించింది. రైసీ, ఇతర నేతల మృతదేహాలను తబ్రిజ్ పట్టణానికి తీసుకొస్తున్నారు. రైసీ ఖనన క్రతువును మష్హాద్ నగరంలో చేసే అవకాశం ఉంది.

జాడ చెప్పిన తుర్కియే అత్యాధునిక డ్రోన్

భారీ వర్షం, దట్టంగా కమ్ముకున్న మంచు, దారిలేని పర్వతమయ అటవీప్రాంతం కావడంతో త్రివిధ దళాలు రంగప్రవేశం చేసినా గాలింపు చర్యల్లో ఎలాంటి పురోగతి లేదు. దీంతో తుర్కియే తమ అత్యాధునిక నిఘా డ్రోన్‌ను రంగంలోకి దింపింది. అది అడవిలో ఉష్ణోగ్రతల్లో మార్పుల ఆధారంగా సరిహద్దుకు 20 కి.మీ.ల దూరంలోని పచ్చని అటవీప్రాంతంలో హెలికాప్టర్ కూలిన ప్రాంతాన్ని కనిపెట్టి సహాయక బృందాలకు సమాచారం చేరవేసింది. దీంతో దళాలు నేరుగా ఘటనాస్థలికి చేరుకోగలిగాయి. ఆ తర్వాతే రైసీ మరణవార్తను ధ్రువీకరించారు.

సంతాపాల వెల్లువ

రైసీ మరణవార్త తెల్సి చాలా ప్రపంచదేశాలు తమ సంతాప సందేశాలను పంపించాయి. ప్రధాని మోదీ సైతం తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ''రైసీ మరణవార్త నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. భారత్–ఇరాన్ సంబంధాల బలోపేతానికి రైసీ చేసిన కృషి చిరస్మరణీయం. రైసీ కుటుంబ సభ్యులకు, ఇరాన్ దేశ ప్రజలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఈ విచారకర సమయంలో ఇరాన్‌కు అండగా ఉంటాం'' అని మోదీ సోమవారం 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. లెబనాన్, సిరియా, ఫ్రాన్స్, సౌదీ అరేబియా, ఈజిప్ట్, చైనా, టర్కీ, రష్యా, మలేసియా, హౌతీ, ఖతార్, ఇరాక్, పాకిస్తాన్, అజర్‌బైజాన్, పోలండ్, యూఏఈ, వెనిజులా దేశాలు, యూరోపియన్ యూనియన్, ఐక్యరాజ్యసమితి, నాటో, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ సంతాపం తెలిపాయి. గొప్ప సోదరుడిని కోల్పోయామని లెబనాన్ ఉగ్రసంస్థ హెజ్‌బొల్లా, హమాస్‌తో పాటు హౌతీ తిరుగుబాటుదారులు సంతాపం ప్రకటించారు.

నూతన అధ్యక్షుడి ఎంపిక ఎప్పుడు?

తాత్కాలిక అధ్యక్షుడిగా మొఖ్బర్ కేవలం 50 రోజులు కొనసాగనున్నారు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడు అకస్మాత్తుగా మరణిస్తే ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ ఆ పదవిని తాత్కాలికంగా చేపడతారు. ఈ నియామకానికి సుప్రీం లీడర్ ఖమేనీ ఆమోద ముద్ర వేస్తారు. ఆ తర్వాత ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్, పార్లమెంట్ స్పీకర్, న్యాయ విభాగాధిపతులతో ఒక మండలిని ఏర్పాటుచేస్తారు. ఇది గరిష్ఠంగా 50 రోజుల్లోపు కొత్త అధ్యక్షుడి కోసం ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది.

మతబోధకుల కుటుంబంలో మస్హద్ నగరంలో 1960 డిసెంబర్ 14న రైసీ జన్మించారు. మోతాహరీ యూనివర్సిటీలో న్యాయవిద్యను చదివారు. 15 ఏళ్ల వయసులోనే 'ఖ్వామ్'లో మతవిద్యను నేర్చుకున్నారు. 1979లో ఇస్లామిక్ విప్లవకాలంలో పశ్చిమదేశాల మద్దతున్న ఇరాన్ పాలకుడు షాకు వ్యతిరేకంగా ఆయాతొల్లా రుహొల్లా ఖొమేనీ చేసిన ఉద్యమంలో రైసీ పాల్గొన్నారు. 21 ఏళ్లకే కరాజ్ నగర ప్రాసిక్యూటర్‌గా, పాతికేళ్లకే టెహ్రాన్ డెప్యూటీ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. అటార్నీ జనరల్ స్థాయికి ఎదిగారు. తదనంతరకాలంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా పనిచేశారు. అయితే 1988 ఏడాది జూలై–సెప్టెంబర్ కాలంలో ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు చెందిన వేలాదిమంది రాజకీయ ఖైదీలను దేశవ్యాప్తంగా సామూహికంగా ఉరితీసిన ఉదంతంలో రైసీ ముఖ్యపాత్ర పోషించారని అమెరికా, ఇతర దేశాలు ఆరోపించాయి. రైసీ 2017లో హసన్ రౌహానీతో అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. 2021లో మరోసారి అధ్యక్ష ఎన్నికలు పోటీచేశారు. ఆ ఎన్నికల్లో ముఖ్యమైన ప్రత్యర్థి నేతలందర్నీ అనర్హులు గా ప్రకటించడంతో రైసీ గెలుపు సులువైంది. ఛాందసవాద మత సంప్రదాయాల పేరిట భావ ప్రకటన స్వేచ్ఛ, మహిళా, మానవ హక్కులను కాలరాశారని ఆయనపై మాయని మచ్చ పడింది. ఈయన మార్గదర్శకత్వంలో అమల్లోకి వచ్చిన కఠిన హిజాబ్ చట్టాన్ని అమలుచేస్తూ నైతిక పోలీసులు 2022లో మహ్సా అమిని అనే మహిళను కొట్టిచంపడంతో దేశవ్యాప్తంగా నిరసనలు పెల్లుబికాయి. 85 ఏళ్ల ఇరాన్ సుప్రీం లీడర్ అయాతొల్లా అలీ ఖమేనీ భవిష్యత్ రాజకీయ వారసునిగా రైసీ పేరు చాన్నాళ్లుగా వినిపిస్తోంది. హసన్ రౌహానీ కాలంలో కుదిరిన అణుఒప్పందం నుంచి అమెరికా తప్పుకున్నాక అణ్వస్త్ర స్థాయి యురేనియం శుద్ధిని రైసీ మరింత పెంచి అంతర్జాతీయ ఆంక్షలకు గురయ్యారు. పాత, కొత్త ఆంక్షల కారణంగానే కొత్త హెలికాప్టర్లు కొనలేక పాత హెలికాప్టర్ల విడిభాగాలు దొరక్క, మరమ్మతులు చేయలేక చివరకు అదే హెలికాప్టర్ ప్రమాదంలో కన్నుమూశారు. రైసీకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఖైదీల సామూహిక ఉరి ఉదంతంలో ప్రమేయం

మరోవైపు సంబరాలు!

అతివాద రైసీ మరణవార్త తెల్సి ఇరాన్‌లో ఓవైపు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు జరుగుతుంటే మరోవైపు 'టెహ్రాన్ నరహంతకుడు' అంతమయ్యాడని వేలాది మంది బాణసంచా కాల్చుతూ సంబరాలు చేసుకుంటున్నారు. దేశ, విదేశాల్లో ఇరానీయన్లు వేడుకలు చేసుకుంటున్న వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. నెటిజన్లు పేల్చుతున్న మీమ్స్, జోక్స్‌కు కొదవే లేదు. 'హెలికాప్టర్ ప్రమాదంలో ఒకరు బతకడం కంటే చనిపోతేనే బాగుణ్ను అని లక్షలాది మంది కోరుకోవడం మానవ చరిత్రలో ఇదే తొలిసారి అనుకుంటా'' అని అమెరికాలో ఉన్న ఇరాన్ పాత్రికేయుడు మసీహ్ అలీనెజాద్ వ్యాఖ్యానించారు. వేలాది మంది రాజకీయ ఖైదీలను ఉరితీయించడం, కఠిన హిజాబ్ చట్టాలు, మానవ హక్కుల ఉల్లంఘన ఘటనలు రైసీ మరణ సంబరాలకు కారణమని తెలుస్తోంది.

దక్షిణాన కాషాయ జెండా

అతి పెద్ద పార్టీగా బీజేపీ | తూర్పునా అవే ఫలితాలు | ప్రధాని మోదీ విశ్వాసం

- రెండుచోట్లా అభిమాన వెల్లువ
- దాంతో విపక్షాలకు నిద్ర కరువు
- 400 ప్లస్‌తో ఎన్డీఏ రికార్డు ఖాయం
- మైనారిటీలను నేనెన్నడూ వ్యతిరేకించలేదు
- అంబానీ, అదానీలతో కాంగ్రెస్‌కు డీల్
- అందుకే ప్రచారంలో వారి ఊసెత్తని రాహుల్

భువనేశ్వర్: దక్షిణ భారతదేశంలో ఈసారి కూడా బీజేపీయే అత్యధిక లోక్‌సభ స్థానాలు గెలుచుకుంటుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వెలిబుచ్చారు. దేశమంతటా ఎన్డీఏకు స్థానాలు పెరుగుతాయని, ముఖ్యంగా దక్షిణ, తూర్పు భారతదేశంలో బీజేపీ బలం మరింతగా పెరగనుందని జోస్యం చెప్పారు. ''దళిత, ఓబీసీ, గిరిజన ఎంపీలు, ఎమ్మెల్యేలు అత్యధిక సంఖ్యలో ఉన్న పార్టీ బీజేపీయే. కానీ 'బీజేపీ పట్టణ పార్టీ, కేవలం ఉత్తరాది పార్టీ, బ్రాహ్మణ–బనియా పార్టీ' అంటూ దుష్ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. దక్షిణాదిన మాకు బలం లేదన్నది కూడా విపక్షాలు వ్యాప్తి చేసిన అలాంటి అపోహే. దేశాన్ని సర్వనాశనం చేసేందుకు ఇలాంటి అపోహలను ప్రచారంలో పెట్టాయి. కానీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఏం జరిగింది? దక్షిణ భారతంలో బీజేపీయే అతి పెద్ద పార్టీగా అవతరించింది. అప్పటితో పోలిస్తే అక్కడి ప్రజల మనసును మరింతగా గెలుచుకున్నాం. ఆ లెక్కన దక్షిణాదిన ఈసారి మరిన్ని ఎక్కువ స్థానాలు గెలుస్తున్నాం. మా భాగస్వాములనూ కలుపుకుంటే అక్కడ ఎన్డీఏ స్థానాల సంఖ్య భారీగా పెరగనుంది'' అన్నారు. ఆదివారం పీటీఐ ఇంటర్వ్యూలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. దక్షిణాదిన 131 లోక్‌సభ స్థానాల్లో 2019లో బీజేపీకి 29 సీట్లు రావడం తెలిసిందే. తూర్పు భారతదేశంలో దశాబ్దాల అభివృద్ధి లేమిని పక్కా ప్రణాళికతో పదేళ్లలో తుడిచిపెట్టామని మోదీ అన్నారు. ''మొత్తం తూర్పు భారతాన్నీ సాధికారపరిచాం. ఫలితంగా 'రెడ్ కారిడార్'గా పిలిచే ఆ ప్రాంతం 'కాషాయ కారిడార్'గా మారిపోయిందని ఈ ఎన్నికల ఫలితాలు రుజువు చేయనున్నాయి. పలు తూర్పు రాష్ట్రాల్లో కాంగ్రెస్, దాని సారథ్యంలోని ఇండియా కూటమి ఖాతా కూడా తెరవలేవు'' అని జోస్యం చెప్పారు. దాంతో భువనేశ్వర్, కోల్‌కతాతో పాటు ఢిల్లీలోనూ కొన్ని పార్టీలకు ఇప్పట్నుంచే కంటిపై కునుకు కరువైందని బిజూ జనతాదళ్, తృణమూల్, కాంగ్రెస్‌లను ఉద్దేశించి ఆయన ఎద్దేవా చేశారు. ''ప్రజల ఆశీస్సులతో మేమీసారి రికార్డు స్థాయి విజయం సాధించబోతున్నాం. జూన్ 4న వెల్లడయ్యే ఫలితాల్లో ఎన్డీఏ కూటమి 400 పై చిలుకు స్థానాలు సాధించడం ఖాయం (4 జూన్, 400 పార్)'' అని చెప్పారు. ''ఉనికిపరంగానే గాక భావజాలపరంగా కూడా బీజేపీ మాత్రమే దేశంలో సిసలైన జాతీయ పార్టీ. ఎందుకంటే దేశమే ముందన్నది మా మూల సిద్ధాంతం'' అని స్పష్టం చేశారు. ఇంటర్వ్యూలో మోదీ వెల్లడించిన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే...

కాంగ్రెస్‌కు లారీల్లో నల్లధనం!

'అదానీ–అంబానీ' అవినీతి అంటూ ఆ ఇద్దరు పారిశ్రామికవేత్తలను కొన్నేళ్లుగా నిత్యం విమర్శిస్తూ వచ్చిన రాహుల్ బాబా ఎన్నికలు మొదలవగానే ప్లేటు ఫిరాయించారు. ఆయన ప్రచారంలో ఎక్కడా వారి ప్రస్తావనే లేదు! హఠాత్తుగా ఎందుకీ మార్పు? ఎందుకంటే అంబానీ, అదానీలతో లోపాయకారీ లింకులున్నది కాంగ్రెస్ పార్టీకే. తమకు లారీల నిండా డబ్బులు పంపితే వారికి వ్యతిరేకంగా మాట్లాడబోమన్న కాంగ్రెస్ అగ్ర నేత అధీర్ రంజన్ చౌధరి వ్యాఖ్యలే అందుకు నిదర్శనం. అదానీ, అంబానీలతో కాంగ్రెస్‌కు డీల్ కుదరడం, రాహుల్ తమను విమర్శించకుండా ఉండేందుకు వారిద్దరూ లారీల నిండా నల్లధనం పంపడం నిజమో కాదో చెప్పాలి! ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలపై కాంగ్రెస్ నేతల ఆరోపణలూ పస లేనివే. అవి రెండూ స్వతంత్రంగా పని చేసే సంస్థలని స్వయానా అధీర్ చేసిన తాజా ప్రకటనే అందుకు నిదర్శనం.

'ప్రత్యేక పౌరుల' హోదాకు ఒప్పుకోను

మైనారిటీ సంతుష్టీకరణ కోసం కాంగ్రెస్, విపక్షాలు చేస్తున్న ఓటుబ్యాంకు రాజకీయాలనే నా ఎన్నికల ప్రసంగాల్లో బయట పెడుతున్నాను. అంతే తప్ప మైనారిటీలకు వ్యతిరేకంగా నేనెప్పుడూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. బీజేపీ కూడా వారికెప్పుడూ వ్యతిరేకం కాదు. కాకపోతే 'ప్రత్యేక పౌరుల' హోదాను ఎప్పటికీ అంగీకరించబోను. ఎందుకంటే ప్రజలందరూ సమానమే. కేవలం ఎన్నికల రాజకీయాల కోసం రాజ్యాంగంలో పేర్కొన్న లౌకిక స్ఫూర్తికి నిత్యం గండి కొట్టే పార్టీ ఏదన్నా ఉందంటే అది కాంగ్రెసే. రిజర్వేషన్లకు మతం ప్రాతిపదిక కారాదని అంబేడ్కర్, నెహ్రూతో సహా రాజ్యాంగ నిర్మాతలంతా తీసుకున్న నిర్ణయానికి తూట్లు పొడుస్తోంది. కాంగ్రెస్ మేనిఫెస్టో నిండా ముస్లిం లీగ్ ఛాయలే! చివరికి టెండర్ల కేటాయింపు వంటివాటిలో కూడా మైనారిటీలకు రిజర్వేషన్లిస్తామని అందులో హామీలు గుప్పించారు. కేంద్రంలో అధికారంలో ఉండగా పాకిస్తాన్‌తో సమర్థంగా వ్యవహరించకుండా జాతి ప్రయోజనాలనే పణంగా పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌ది. రాహుల్ వ్యాఖ్యలను పాక్ నేతలు ప్రశంసిస్తున్న పరిస్థితి! మన వీర సైనికులను పొట్టన పెట్టుకున్నది పాక్ ఉగ్రవాదులు కాదని కాంగ్రెస్ నేతలంటున్నారు. పాక్ వద్ద అణుబాంబులున్నాయి గనుక ఆ దేశాన్ని గౌరవించాలని చెబుతున్నారు. సర్జికల్ దాడులకు రుజువులేవని ప్రశ్నిస్తున్నారు. వీటన్నింటినీ ప్రజలకు వివరించడం, కాంగ్రెస్ కుట్రలను బయట పెట్టడం నా బాధ్యత. కాంగ్రెస్‌ది సంతుష్టీకరణ బాట. నాది అందరినీ సంతృప్తిపరిచే అభివృద్ధి బాట. ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గడానికి కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీల పేలవ ప్రచారం కూడా ఓ కారణం. వాటికి సొంత కార్యకర్తలు కూడా ఓటేయడం లేదు. ఇదంతా బీజేపీకే లాభం చేకూరుస్తుంది.

బీజేడీ పుట్టి మునుగుతోంది

ఒడిశా ప్రజలు మార్పు కావాలని నిర్ణయించుకున్నారు. నవీన్ పట్నాయక్ ప్రభుత్వంపై వారిలో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. అధికార బిజూ జనతాదళ్ మనుగడ ఇక కష్టమే. ఒడిశాలో బీజేపీ ఐదేళ్లుగా తీవ్రంగా కష్టపడి నంబర్ టూ నుంచి నంబర్‌వన్ స్థానానికి చేరింది.

యూసీసీ హామీ నెరవేరుస్తాం

ఉమ్మడి పౌర స్మృతి, 'ఒక దేశం, ఒకే ఎన్నిక' బీజేపీ మేనిఫెస్టో హామీలు. వాటిని నెరవేర్చి తీరతాం. జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తాం. మళ్లీ అధికారంలోకి రాగానే ముందుగా మేమేం చేయాలో సూచించాల్సిందిగా దేశ యువతనే అడగదలచుకున్నా. అందుకోసం 'తొలి 100 రోజుల కార్యాచరణ'ను 125 రోజులకు పొడిగించాను. మాకు 400 సీట్లొస్తే రాజ్యాంగాన్ని మారుస్తామన్న విపక్షాల విమర్శలు నిరాధారం. నేను స్వీయ ప్రయోజనాల కోసమే పని చేస్తున్నానని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. కానీ నా శ్రేయస్సు కూడా రాజ్యాంగ శ్రేయస్సులోనే ఇమిడి ఉంది. ఈ రోజు ఈ స్థానంలో ఉన్నానంటే రాజ్యాంగం వల్లే. నేను స్ఫూర్తి, శక్తి పొందేదే రాజ్యాంగం నుంచి!

బ్రాండ్ మోదీ!

నేను కార్యసాధకున్ని. 'బ్రాండ్ మోదీ' అన్నది రెండు దశాబ్దాల పై చిలుకు ప్రజా జీవితంలో వారి నుంచి సంపాదించుకున్న విశ్వాస ఫలితం. అంతే తప్ప దాని కోసం నేను ఏ ప్రయత్నమూ చేయలేదు. నేనూ మనిషినే. తప్పిదాలు చేసుండొచ్చు. కానీ తప్పుడు ఉద్దేశాలు మాత్రం నాకెప్పుడూ ఉండవు. మండెటెండల్లో కూడా నా సభలకు ప్రజలు పోటెత్తుతున్నారు. వారి కళ్లలో నాపై కనిపించే తిరుగులేని విశ్వాసమే నాకు శక్తినిచ్చి నడిపిస్తోంది. 13 ఏళ్లు సీఎంగా, పదేళ్లు ప్రధానిగా చేసిన వ్యక్తి మాతృమూర్తి తన చివరి రోజుల్ని ప్రభుత్వాసుపత్రిలో గడిపిందంటే, అలాంటి దేశానికి మరే ఇతర బ్రాండూ అవసరం లేదని నా అభిప్రాయం. అతడు భిన్నమైన వ్యక్తి అని ఆ దేశం ఏనాడో అర్థం చేసుకుంది''.

రూ.250 కోట్ల అవినీతి కంటే 250 జతల బట్టలు మేలే!

తాను అత్యంత ఖరీదైన దుస్తులు ధరిస్తానంటూ రాహుల్ తదితరులు చేసే ఆరోపణలపై మోదీ ఆసక్తికరంగా స్పందించారు. ''నా రాజకీయ జీవితంలో ఎదుర్కొన్న అతి పెద్ద ఆరోపణ దుస్తుల గురించే! నాకు 250 జతల బట్టలున్నాయని గతంలో గుజరాత్ మాజీ సీఎం అమర్‌సింగ్ చౌదరి ఆరోపణలు చేశారు. అప్పుడు నేను సీఎంగా ఉన్నా. అదే రోజు ఓ సభలో పాల్గొన్నా. 'రూ.250 కోట్లు దోచుకున్న సీఎం కావాలా, లేక 250 జతల బట్టలున్న ముఖ్యమంత్రా?' అని వేదిక నుంచి ప్రజలనడిగా. 250 జతల బట్టలున్నా పర్లేదు గానీ అవినీతిపరుడు వద్దని వారంతా ముక్త కంఠంతో చెప్పారు. దాంతో విపక్షాలు ఇంకెప్పుడూ నాపై అవినీతి ఆరోపణలకు ధైర్యం చేయలేదు'' అన్నారు. నిజానికి తనకెప్పుడూ అన్ని జతల బట్టల్లేవంటూ ముక్తాయించారు.



ఏడాదిన్నరలో నాలుగోసారి..

పార్లమెంట్ విశ్వాసం పొందిన ప్రచండ

కాఠ్మండు: నేపాల్ ప్రధానమంత్రి పుష్పకుమార్ దహల్ 'ప్రచండ' సోమవారం పార్లమెంట్‌లో విశ్వాస తీర్మానం నెగ్గారు. పార్లమెంట్‌లో ప్రచండ సారథ్యంలోని నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీ(మావోయిస్ట్ సెంటర్) మూడో అతిపెద్ద పార్టీగా ఉంది. సోమవారం పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో 275 మంది సభ్యులకు గాను హాజరైన 158 మందిలో ప్రచండ ప్రభుత్వానికి అనుకూలంగా 157 మంది ఓటేశారు. ప్రచండ సభ విశ్వాసం పొందినట్లు పార్లమెంట్ స్పీకర్ ప్రకటించారు. ప్రచండ 2022లో ప్రధాని పగ్గాలు చేపట్టాక గత 18 నెలల్లో పార్లమెంట్ విశ్వాసం పొందడం ఇది నాలుగోసారి.

మార్పు గాలి వీస్తోంది

రాహుల్ ధీమా



న్యూఢిల్లీ: దేశంలో మార్పు గాలి బలంగా వీస్తోందని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు ప్రజలు సంసిద్ధులై ఉన్న విషయం స్పష్టంగా తెలుస్తోందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారు. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 49 లోక్‌సభ స్థానాలకు సోమవారం ఐదో విడత పోలింగ్ ప్రారంభమైన వేళ 'ఎక్స్'లో ఆయన ..'ఈరోజు ఐదో విడత పోలింగ్ జరుగుతోంది. బీజేపీని ఓడించి, దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు ప్రజలు కట్టుబడి ఉన్నట్లు మొదటి నాలుగు విడతల పోలింగ్‌లో స్పష్టమైంది. విద్వేష రాజకీయాలతో జనం విసిగిపోయారు. యువత ఉద్యోగాలు, రైతులు రుణ మాఫీ, కనీస మద్దతు ధర, మహిళలు ఆర్థిక స్వేచ్ఛ, భద్రత, కార్మికులు రోజువారీ వేతనాలు వంటి అంశాలపైనే నేటి పోలింగ్ ఆధారపడి ఉంది. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇండియా కూటమికి మద్దతుగా నిలిచారు. దేశంలో మార్పు గాలి బలంగా వీస్తోంది'అని రాహుల్ పేర్కొన్నారు. అమేథీ, రాయబరేలీతోపాటు దేశ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఇలా ఉండగా, ఐదో దశలో పోలింగ్ జరుగుతున్న రాయ్‌బరేలీలో పార్టీ అభ్యర్థిగా రాహుల్ గాంధీ సోమవారం పర్యటించారు. రాయ్‌బరేలీలోని హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం నియోజకవర్గంలోని పలు పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. ప్రజలతో ఆయన సెల్ఫీలు దిగారు. అయితే, మీడియాతో మాట్లాడలేదు.

చత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం

వ్యాన్ లోయలో పడి 19 మంది మృతి

దుమ్ముగూడెం: చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కబీర్‌ధామ్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ పికప్ వ్యాన్ అదుపుతప్పి 20 అడుగుల లోతున్న లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోగా మరో నలుగురు గాయాలపాలయ్యారు. మృతుల్లో 18 మంది మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. కబీర్‌దామ్ జిల్లాలోని సెమ్హరా గ్రామానికి చెందిన గిరిజనులు తునికాకు సేకరణ కోసం సమీపంలోని అడవికి వెళ్లారు. తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న పికప్ వ్యాన్ కుక్‌దూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బహపానీ గ్రామ సమీపంలో బంజారి ఘాట్‌లో అదుపుతప్పి 20 అడుగుల లోతున్న లోయలో పడింది.

ఐదో విడతలో 59.06 శాతం

6 రాష్ట్రాలు, 2 యూటీల్లో 49 స్థానాల్లో ముగిసిన పోలింగ్

న్యూఢిల్లీ/కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికల క్రతువులో మరో అంకం ముగిసింది. సోమవారం ఐదో విడతలో ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని 49 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ జరిగింది. పశ్చిమబెంగాల్లో అక్కడక్కడలా స్వల్ప ఘర్షణలు, ఒడిశాలో కొన్నిచోట్ల ఈవీఎంలలో చిన్న సమస్యలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కడపటి సమాచారం అందేసరికి 59.06 శాతం పోలింగ్ నమోదైంది. పశ్చిమబెంగాల్లో అత్యధికంగా 73.14, మహారాష్ట్రలో అత్యల్పంగా 54.22 శాతం పోలింగ్ జరిగింది. జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లాలో ఏకంగా 59 శాతం పోలింగ్ నమోదవడం విశేషం! ఇది ఆ లోక్‌సభ స్థానం చరిత్రలోనే అత్యధికం. గత నాలుగు విడతల్లో కలిపి 66.95 శాతం పోలింగ్ నమోదైంది. సోమవారంతో జమ్మూ కశ్మీర్, మహారాష్ట్రల్లో అన్ని స్థానాల్లోనూ పోలింగ్ ప్రక్రియ ముగిసింది. మొత్తమ్మీద ఇప్పటిదాకా 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 428 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ ముగిసింది. మిగతా 115 స్థానాలకు మే 25, జూన్ 1న ఆరు, ఏడో విడతల్లో పోలింగ్ జరగనుంది. జూన్ 4న ఫలితాలు వెల్లడవుతాయి.

బెంగాల్లో ఘర్షణలు

పశ్చిమబెంగాల్లో పలుచోట్ల అధికార తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగాయి. ఒడిశాలో గుర్తు తెలియని వ్యక్తులు ఓటర్లను పోలింగ్ బూత్‌కు తీసుకెళ్తున్న ఆటోను అడ్డుకుని డ్రైవర్‌ను నరికి చంపారు. యూపీలో 14 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ ఎలాంటి ఘర్షణలూ లేకుండా ముగిసింది. ముంబై సౌత్ పరిధిలో ఒకా పోలింగ్ బూత్‌లో 56 ఏళ్ల ఎన్నికల అధికారి గుండెపోటుతో మరణించారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, స్మృతీ ఇరానీ, కౌశల్ కిశోర్, సాధ్వీ నిరంజన్ జ్యోతి, ప్రతాప్‌సింగ్‌వర్మ తదితరులు ఐదో విడతలో బరిలో ఉన్నారు.



ముంబై: ముకేశ్ అంబానీ దంపతులు, కుటుంబంతో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత




ముంబైలో సచిన్ టెండూల్కర్, ఐశ్వర్యా రాయ్, లక్నోలో రాజ్‌నాథ్ సింగ్

ఆప్‌కు అక్రమంగా రూ. 7.08 కోట్ల విదేశీ నిధులు!

న్యూఢిల్లీ: విదేశీ విరాళాల నియంత్రణ చట్టానికి (ఎఫ్‌సీఆర్‌ఏ) విరుద్ధంగా ఆమ్ ఆద్మీ పార్టీ రూ. 7.08 కోట్లను విదేశాల నుంచి సేకరించిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేంద్ర హోం శాఖకు తెలిపింది. పంజాబ్ మాజీ ఆప్ ఎమ్మెల్యే సుఖ్‌పాల్ సింగ్ ఖైరాపై డ్రగ్స్ సంబంధిత మనీలాండరింగ్ కేసులో సోదాలు చేపట్టినపుడు ఆప్ విదేశీ విరాళాలకు సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లు, ఈ–మెయిల్స్ లభించాయని ఈడీ పేర్కొంది. 2014– 2022 మధ్య ఆప్ రూ. 7.08 కోట్లను అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఒమన్‌ల నుంచి సేకరించిందని.. ఇది ఎఫ్‌సీఆర్‌ఏ, ప్రజా ప్రాతినిధ్య చట్టం, ఇండియన్ పీనల్ కోడ్‌లను ఉల్లంఘించడమేనని తెలిపింది. ఆప్ ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్, కుమార్ విశ్వాస్, అనికిత్ సక్సేనా, కపిల్ భరద్వాజ్ మధ్య జరిగిన ఈ–మెయిల్ సంప్రదింపుల్లో ఇందుకు సంబంధించిన ఆధారాలున్నట్లు పేర్కొంది. అమెరికా, కెనడాల్లో నిధుల సేకరణ కార్యక్రమాల్లో విరాళాలిచ్చిన వ్యక్తుల వివరాలను ఆప్ తమ ఖాతా పుస్తకాల్లో చూపలేదంది.

పూరీ జగన్నాథుడు ప్రధాని మోదీ భక్తుడు

సంబిత్ పాత్ర వివాదాస్పద వ్యాఖ్యలు

భువనేశ్వర్: పూరీ జగన్నాథ స్వామి ప్రధాని మోదీ భక్తుడు అంటూ పూరీ లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి సంబిత్ పాత్ర ఆదివారం ఎన్నికల ర్యాలీలో చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. సర్వత్రా విమర్శలు రావడంతో, జగన్నాథునికి మోదీ పెద్ద భక్తుడనబోయి పొరపాటున వ్యతిరేకార్థంలో మాట్లాడానంటూ సంబిత్ పాత్ర వివరణ ఇచ్చారు.

నెతన్యాహు, హమాస్ నాయకుల అరెస్టుకు ఆదేశాలు కోరతా

ఐసీసీ చీఫ్ ప్రాసిక్యూటర్ వెల్లడి

జెరూసలెం: అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుంచి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు, హమాస్ అగ్రనేతలపై అరెస్టు వారెంట్లు కోరనున్నట్లు చీఫ్ ప్రాసిక్యూటర్ కరీం ఖాన్ సోమవారం వెల్లడించారు. గాజా, ఇజ్రాయెల్‌లో యుద్ధ నేరాలు, మానవాళిపై అకృత్యాలకు గాను నెతన్యాహు, ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గాలంట్, హమాస్ నేతలు యోహియా సిన్వర్, మహ్మద్ దీఫ్, ఇస్మాయిల్ హనియేహ్‌లు బాధ్యులని ఆయన అన్నారు. ముగ్గురు జడ్జిల ప్యానెల్ అరెస్టు వారెంట్లు, కేసు కొనసాగింపుపై నిర్ణయం తీసుకోనుంది. సాధారణంగా ఇలాంటి వాటిల్లో నిర్ణయానికి జడ్జిలు రెండు నెలల సమయం తీసుకుంటారు. వారెంట్లు జారీ అయినా నెతన్యాహు, గాలంట్‌లకు వచ్చే ఇబ్బందేమీ లేదు. కానీ నెతన్యాహు, గాలంట్‌లు విదేశీ పర్యటనలకు వెళ్లడం కష్టమవుతుంది. వారెంట్లు కోరడాన్ని యూదు వ్యతిరేక చర్యగా నెతన్యాహు అభివర్ణించారు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం ౹ 21 ౹ మే ౹ 2024



24 నుంచి డీటీ-20 ప్రీమియర్ క్రికెట్ లీగ్

డాక్టర్ క్రికెటర్లతో టీహబ్ ప్రాంగణం సందడిగా మారింది. 24 నుంచి జరగనున్న 'డీటీ-20' ప్రీమియర్ క్రికెట్ లీగ్-1పై ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. -8లో



ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

ప్లాటులో నిర్మాణం కోసం లంచం డిమాండ్ చేసిన పంచాయతీ కార్యదర్శి. కారోబార్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. శంషాబాద్ ననాజీపూర్‌లో ఘటన జరిగింది. -8లో

22న భాగ్యరెడ్డి వర్మ జయంతి

కాచిగూడ: సంఘ సంస్కర్త మాదరి భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతిని ఈ నెల 22న చాదర్‌ఘాట్‌లోని ఆది హిందూ భవన్‌లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ అధ్యక్షుడు రాహుల్ అమ్‌లోక్ శాస్త్రి, ఇతర ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై భాగ్యరెడ్డి వర్మకు నివాళులర్పిస్తారని ఆయన వెల్లడించారు.



ట్యాంక్‌బండ్‌పై..



లక్డీకాపూల్‌లో వర్షం దృశ్యం



ఖైరతాబాద్‌లో..

హాట్ అండ్ కూల్

నగరంలో పగలు ఎండ.. సాయంత్రం వాన

సాక్షి, సిటీబ్యూరో: మహానగర వాతావరణంలో మార్పు వచ్చింది. పగటి పూట భగభగలు..మధ్యాహ్నం వర్షంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. మరో రెండు రోజులు కూడా ఇదే పరిస్థితి కొనసాగనుంది. ఆ తర్వాత బంగాళా ఖాతంలో అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. సోమవారం నగరంలో మధ్యాహ్నం వరకు సగటున 38 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైంది. ఆ తర్వాత పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. నగర శివారులోని అబ్దులాపూర్‌మెట్‌లో అత్యధికంగా ఐదు సెంటీ మీటర్లకు పైగా వర్షం కురిసింది. శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, నాంపల్లి, మోతీనగర్, మూసాపేట, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఆసిఫ్ నగర్, జీడిమెట్ల, ఎల్బీనగర్ ప్రాంతాల్లో సగటున ఒకటి నుంచి రెండు సెంటీమీటర్ల వర్షం కురిసింది.



వర్షంలో చిన్నారుల సైకిల్ రైడ్

జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

బత్తిని కుటుంబ సభ్యులు



పంజగుట్ట: ఆస్తమా, ఉబ్బసం సంబంధించిన వ్యాధిగ్రస్తులకు ఇస్తున్న చేప ప్రసాదం ఈ సంవత్సరం జూన్ 8వ తేదీన శనివారం ఉదయం 11 గంటల నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పంపిణీ చేయనున్నట్లు బత్తిని గౌడ్స్ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బత్తిని అమర్నాథ్‌గౌడ్, శివ శంకర్ గౌడ్, గౌరీశంకర్ గౌడ్‌లు మాట్లాడుతూ 8వ తేదీ ఉదయం 11 నుంచి 9వ తేదీ ఉదయం 11 వరకు 24 గంటల పాటు నిరంతరాయంగా చేప ప్రసాదం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తరువాత 3 రోజులపాటు దూద్‌బౌలిలోని తమ నివాసం వద్ద పంపిణీ చేస్తామని తెలిపారు. ఇప్పటికే 3 లక్షల చేప పిల్లలు సిద్ధంగా ఉంచినట్లు, జీహెచ్ఎంసీ, ఆర్టీసీ, వాటర్‌వర్క్స్, మున్సిపాలిటీ, పోలీస్ ఎప్పటిలాగే సహాయ సహకారాలు అందించాలని లేఖలు రాసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో జూన్ 7వ తేదీ ప్రసాదం పంపిణీ అని వార్తలు వస్తున్నాయని, అది తప్పుడు వార్త అని..8నే ప్రసాదం పంపిణీ ఉంటుందని చెప్పారు.

భార్య కళ్ల ముందే భవనంపై నుంచి దూకి భర్త ఆత్మహత్య

బంజారాహిల్స్: భార్య కాపురానికి రావడం లేదనే బాధతో ఓ యువకుడు ఆమె కళ్ల ముందే మూడో అంతస్తు నుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలివీ... కడప ఎర్రముఖపల్లి సర్కిల్‌లో నివసించే పసుపులేటి మణికంఠ (33) 2018 మే 10వ తేదీన బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లోని ఇబ్రహీంనగర్‌కు చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరూ కలిసి ఏడాది పాటు బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14లో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని కాపురం చేశారు. మణికంఠ పద్ధతులతో విసిగిపోయిన యువతి ఇబ్రహీంనగర్‌లోని తన పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి మణికంఠ తీవ్ర నిరాశా నిస్పృహలతో గడపసాగాడు. భార్యను తనతో పాటు రమ్మని పిలవడానికి ఆదివారం రోజు రాత్రి ఆమె ఇంటికి వెళ్లాడు. తనతో పాటు రావాలని కోరాడు. నీ పద్ధతులు నచ్చకనే వేరుగా ఉంటున్నానని, నీవు మారవని రాలేనని భార్య తెగేసి చెప్పడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తన భార్య ఎప్పటికీ ఇక రాదని, ఈ జీవితం వృథా.. బతికి వేస్ట్ అనుకుంటూ భార్య చూస్తుండగా మూడో అంతస్తు నుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కడికక్కడే మణికంఠ మృతి చెందగా ఈ విషయాన్ని బాధిత యువతి మణికంఠ బాబాయి వెంకటరమణకు తెలియజేసింది. వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు అనుమానాస్పద మృతి కింద నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దత్తత దారిలో..

సిటీలో పెరుగుతున్న సంతాన లేమి జంటలు

- అనాథ పిల్లల దత్తతపై ఆసక్తి
- శిశువిహార్‌లో 186 మంది పిల్లలు.. 2,050 పైగా దరఖాస్తులు

అధిక బరువు..ఆలస్యపు పెళ్లిళ్లు..రోజంతా ల్యాప్‌ట్యాప్‌లతో సహవాసం..కాలుష్యం..మారిన జీవనశైలి..మానసిక ఒత్తిడి..వెరసి నవ దంపతుల సంతానోత్పత్తి సామర్థ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఎన్ని మందులు వాడినా సంతానం కలుగక..ఒంటరిగా ఉండలేక చాలా మంది యువ దంపతులు అనాథ పిల్లలపై ఆసక్తి పెంచుకుంటున్నారు. దత్తతకు పిల్లలు కావాలని కోరుతూ ఇప్పటి వరకు 2,050 మంది దంపతులు శిశువిహార్‌కు దరఖాస్తు చేసుకోవడం ఇందుకు నిదర్శనం.



సాక్షి, సిటీబ్యూరో: ఒకప్పుడు పాతికేళ్లకే పెళ్లి చేసుకుని, ఏడాది తిరక్క ముందే పండంటి బిడ్డకు జన్మనిచ్చేవారు. కానీ ప్రస్తుతం చాలా మంది ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాల వేటలో పడి 30 ఏళ్లు దాటిన తర్వాతే పెళ్లికి సిద్ధపడుతున్నారు. గంటల తరబడి ల్యాప్‌టాప్‌లతో గడపడం..జంక్‌ఫుడ్ అధికంగా తీసుకోవడం, వీకెండ్‌లో పార్టీల పేరుతో మద్యం అతిగా తాగడం వంటి అలవాట్లు స్త్రీ, పురుషుల హార్మోన్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వైద్య నిపుణులు అంటున్నారు. పెళ్లై నాలుగైదేళ్లు దాటినా పిల్లలు పుట్టకపోవడంతో చివరకు సంతాన సాఫల్య కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ అండ్ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్(ఐవీఎఫ్), ఇంట్రాసైటో ప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్(ఐసీఎస్ఐ)చికిత్సలు చేయించుకున్నా..ఫలితం లేక పోవడంతో చివరకు కొందరు ప్రత్యామ్నాయాలపై దృష్టిసారిస్తున్నారు. ఒంటిరిగా జీవించలేక, పిల్లలపై మమకారం చంపుకోలేక అనాథ పిల్లలను దత్తత తీసుకునేందుకు ముందుకు వస్తున్నారు.

186 మంది పిల్లలు..2050 దరఖాస్తులు

గతంతో పోలిస్తే దంపతుల వైఖరిలో చాలా మార్పులు వచ్చాయి. ఆడపిల్లలు ఇంటికి భారమని భావించే రోజులు పోయాయి. శిశు విహార్‌లో పిల్లలను దత్తత తీసుకుంటున్న జంటల జాబితాను పరిశీలిస్తే ఇది స్పష్టంగా అర్థమవుతుంది. ప్రస్తుతం శిశు విహార్‌లో 2050 మందికిపైగా తమ పేర్లను నమోదు చేసుకుని ఉండగా, 186 మంది పిల్లలు మాత్రమే అందుబాటులో ఉన్నారు. దత్తతకు దరఖాస్తు చేసుకున్న వాళ్లలో ఎక్కువ మంది మగపిల్లలు కావాలని కోరగా, అందులో అత్యధికంగా ఏడాదిలోపు పిల్లలను కోరుకుంటున్న వారే అధికం. రంగు, ఎత్తు, బరువు వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఆడ శిశువుకు రెండు నుంచి మూడేళ్ల సమయం పడుతుండగా, మగ శిశువుకు ఐదు నుంచి ఆరేళ్ల పడుతోంది. పిల్లల దత్తత కోసం దరఖాస్తు చేసుకున్నా..అది కూడా గ్యారంటీ లేదు. ఇదిలా ఉంటే గత పదిహేనేళ్లలో శిశువిహార్ ద్వారా మొత్తం మూడు వేల మందికిపైనే దత్తత ఇస్తే, కేవలం నాలుగేళ్లలో 798 మంది పిల్లలను మాత్రమే దత్తత ఇవ్వగా, వీరిలో 527 మంది ఆడపిల్లలు ఉన్నారు.

మహిళల్లోనే కాదు పురుషుల్లోనూ..



గతంలో 5 నుంచి 10 శాతం మందిలోనే ఇన్‌ఫెర్టిలిటీ సమస్య ఉండేది. ఇప్పుడది 15 నుంచి 20 శాతానికి పెరిగింది. మహిళల కంటే పురుషుల్లోనే ఈ సమస్య ఎక్కువ కన్పిస్తుంది. చిన్న వయసులోనే మెనోపాజ్ వస్తుండటం వల్ల చాలా మంది రెండోసారి గర్భధారణకు నోచుకోవడం లేదు. దంపతుల్లో ఉన్న బలహీనతను ఆస్పత్రులు సొమ్ము చేసుకుంటున్నాయి. సాధారణ చికిత్సలతో పిల్లలు జన్మించే అవకాశం ఉన్నా.. ఐవీఎఫ్, ఐయూఐ వంటి చికిత్సల పేరుతో బాధితులను లూటీ చేస్తున్నారు. మంచి ఆహారపు, జీవన శైలి అలవాట్లు, త్వరగా వివాహం చేసుకోవడం ద్వారా సంతాన లేమిని నిరోధించవచ్చు.

– డాక్టర్ బాలాంబ, సీనియర్ గైనకాలజిస్ట్

ప్రాధాన్యతను బట్టి కేటాయింపు



గతంతో పోలిస్తే పిల్లలను దత్తతకు తీసుకునే వారి సంఖ్య ఇటీవల బాగా పెరిగింది. దత్తతకు ఇక్కడ పిల్లలు లేక చాలా మంది నిరుత్సాహంతో వెనుదిరుగుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా వందకుపైగా దరఖాస్తులు అందుతున్నాయి. దంపతుల అభీష్టం మేరకు పిల్లలను దత్తత ఇస్తున్నాం. విదేశాల్లో స్థిరపడిన వారు కూడా ఇక్కడి పిల్లలను దత్తత తీసుకునేందుకు దరఖాస్తు చేసుకుంటున్నారు. దరఖాస్తు చేసుకున్న దంపతుల ప్రాధాన్యతను బట్టి పిల్లల దత్తతకు అవకాశం కల్పిస్తున్నాం.

– మోతీ నాయక్, అదనపు డైరెక్టర్, శిశువిహార్

అంతా 'గ్యాసే'నా?

వంటగ్యాస్ కనెక్షన్లు ఇలా

హైదరాబాద్ జిల్లా 13.22 లక్షలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా 15.96 లక్షలు



సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా అమలు చేస్తున్న రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం కొందరికే పరిమితమైంది. తెల్లరేషన్ కార్డు కలిగి విద్యుత్ జీరో బిల్లుకు అర్హత సాధించినా.. వంటగ్యాస్ సబ్సిడీ మాత్రం వర్తించని పరిస్థితి నెలకొంది. దీంతో నిరుపేదలకు ఎప్పటి మాదిరిగా వంటగ్యాస్ ధర భారంగా తయారైంది. మూడు నెలల క్రితమే మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 500 గ్యాస్ సిలిండర్ పథకం అమలు ప్రారంభమైంది. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా బీపీఎల్ కుటుంబాలను అర్హులుగా గుర్తించి జీరో బిల్లు, వంటగ్యాస్ సబ్సిడీకి లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండు పథకాలకు కూడా తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకున్నారు. వాస్తవంగా మహా నగరంలో సుమారు 17.21 లక్షల కుటుంబాలు తెల్లరేషన్‌కార్డులు కలిగి ఉండగా అందులో సుమారు 11 లక్షల కుటుంబాలకు మాత్రమే విద్యుత్ జీరో బిల్లు వర్తించింది. రూ.500కు వంట గ్యాస్ మాత్రం అందులో కేవలం రెండు లక్షల కుటుంబాలకు మాత్రమే వర్తిస్తోంది. గ్యారంటీ పథకాల కింద బీపీఎల్‌గా అర్హత సాధించినా సబ్సిడీ వర్తించకపోవడంతో పేదలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.855కు సిలిండర్..

మహా నగరంలో బహిరంగ మార్కెట్ ప్రకారం ప్రస్తుతం 14.5 కేజీల డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.855 పలుకుతోంది. గృహ వినియోగదారులు సిలిండర్ ధరను పూర్తిగా చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చమురు సంస్థల ద్వారా సబ్సిడీని నగదు బదిలీ కింద వినియోగదారుల ఖతాలో జమచేస్తూ వస్తోంది. తాజాగా ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా అర్హత సాధించిన వంట గ్యాస్ లబ్ధిదారులకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం సిలిండర్ ధరలో రూ.500 మినహాయించి మిగిలిన సొమ్మును నగదు బదిలీ ద్వారా వినియోగదారులు ఖాతాలో చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ అందరికి వర్తిస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ మాత్రం కొందరికే పరిమితమైంది.

కేంద్రం సబ్సిడీ రూ. 40.71 మాత్రమే

కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సబ్సిడీని పరిమితం చేసింది. సిలిండర్ ధర ఎంత పలికినా.. సబ్సిడీ సొమ్ము మాత్రం రూ.40.71లు మాత్రమే వినియోగదారుడి ఖాతాలో జమ చేస్తోంది. పదేళ్ల క్రితం వరకు సబ్సిడీపై రూ.414కు మాత్రమే వంట గ్యాస్ ధర సరఫరా జరిగేది. మిగతా ధరను కేంద్ర ప్రభుత్వం ముందస్తుగానే భరించేది. ఆ తర్వాత వంట గ్యాస్‌కు నగదు బదిలీ పథకం వర్తింపుజేయడంతో బహిరంగ మార్కెట్ ధర ప్రకారం సిలిండర్ సరఫరా చేసి ఆ తర్వాత సబ్సిడీ నగదు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తూ వచ్చారు. 2015లో సిలిండర్‌ను మార్కెట్ ధర ప్రకారం రూ. 697కు కొనుగోలు చేస్తే సబ్సిడీగా రూ.239.65 నగదు బదిలీ ద్వారా వినియోగదారుడి బ్యాంక్ ఖాతాలో జమ అయ్యేది. బహిరంగ మార్కెట్‌లో సిలిండర్ ధర పెరిగిన దానిని బట్టి సబ్సిడీ నగదు కూడా పెరిగేది. ఆ తర్వాత క్రమంగా సబ్సిడీ ఎత్తివేతలో భాగంగా పరిమితి విధించారు. ప్రస్తుతం ధర ఎంత ఉన్నా.. సబ్సిడీ మాత్రం ఒక స్లాబ్‌కు పరిమితమైంది.

కోహ్లి ఇష్టపడే మెనూ...

- నగరం వేదికగా 'వన్ 8 కమ్యూన్' ప్రారంభం
- సందడి చేసిన టాలీవుడ్ సినీతారలు



వన్ 8 కమ్యూన్‌లో సినీ నటుడు మంచు మనోజ్ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా నూతనంగా ప్రారంభించిన వన్ 8 కమ్యూన్ రెస్టారెంట్‌లో టాలీవుడ్ స్టార్స్ సందడి చేశారు. భారత లెజెండరీ క్రికెటర్ విరాట్ కోహ్లి స్థాపించిన వన్ 8 కమ్యూన్ రెస్టారెంట్ ఇకపై హైటెక్ సిటీ వేదికగా నగరవాసులకు పసందైన రుచులను అందించనుంది. ఈ రెస్టారెంట్ వేదికగానే ప్రముఖ సినీనటుడు మంచు మనోజ్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో మంచు లక్ష్మి, నాని, అడివి శేష్, నిఖిల్, తేజ సజా, సుధీర్‌బాబు, సందీప్ కిషన్, ఆకాష్ పూరి, అభిరామ్ తదితర టాలీవుడ్ నటులు, నిర్మాతలు, దర్శకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వన్ 8 కమ్యూన్ కో-ఫౌండర్ వర్తిక్ తిహారా మాట్లాడుతూ., జుహు, బెంగళూరు, గుర్గావ్‌తో పాటు నగరంలో నూతన స్టోర్ ప్రారంభించామని, ఇలాంటి వినూత్న రెస్టో బార్‌కు హైదరాబాద్ అనువైన కేంద్రమని తెలిపారు. విరాట్ కోహ్లి ఇష్టపడే మెనూ ఇక్కడ లభిస్తుందని, విభిన్నమైన డిష్‌లతో పాటు స్థానిక రుచుల మేళవింపుతో వన్ 8 కమ్యూన్ ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు.

'శిథిల' భయం!

ప్రమాద ఘంటికలు మోగిస్తున్న పురాతన భవనాలు

- వర్షాలు కురుస్తున్నా..ఇంకా లెక్కల్లోనే జీహెచ్ఎంసీ..
- చర్యలెప్పుడో మరి?

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగర ప్రజలకు వానొస్తే గుండె గుభిల్లు మనిపించేవి నాలాలు, శిథిల భవనాలు. నోళ్లు తెరుచుకున్న నాలాల్లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియదు. అలాగే వందల సంఖ్యలో ఉన్న శిథిల భవనాల్లో ఎప్పుడు ఏ భవనం కూలుతుందో తెలియదు. ప్రతియేటా వర్షాకాలంలో ఎదురయ్యే ఈ సమస్యల పరిష్కారానికి వేసవి నుంచే తగిన చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం విఫలమవుతోంది. ఈసారి లోక్‌సభ ఎన్నికలు కూడా రావడంతో జీహెచ్ఎంసీ యంత్రాంగం ఆ పనుల్లో నిమగ్నమైంది. దాంతో మిగతా పనులు పెండింగ్‌లో పడ్డాయి. సాధారణ పరిస్థితుల్లోనే జూన్‌లో వర్షాలు కురిసేంతదాకా కూడా పరిష్కార చర్యలు తీసుకోలేకపోతుండగా, ఈసారి ఎన్నికలు కూడా తోడవడంతో చర్యలు చేపట్టలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు నాలా కప్పులు కూలడం, వాహనాలు కొట్టుకుపోవడం తెలిసిందే. మరికొన్ని వానలొస్తే శిథిల భవనాల్లో ఉంటున్న వారు ప్రమాదం బారిన పడే అవకాశాలున్నాయి.

ముందే వచ్చిన వర్షాలు..

ప్రతియేటా జూన్ రెండో వారంలో వర్షాలొచ్చేవి. అందుకు భిన్నంగా ఈసారి మే మూడో వారంలోనే వర్షాలు దంచి కొడుతున్నాయి. ముందస్తుగా వచ్చిన వర్షాలతో పాటు ప్రమాదాలూ ముందస్తుగానే పొంచి ఉన్నాయి.

ప్రతిసారీ అదే వరుస

వర్షాకాలం సమీపించే లోపునే నాలాల సమస్యలు, శిథిల భవనాల ప్రమాదాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ, పనులు పూర్తి కావడం లేవు. ఫిబ్రవరి నుంచి శిథిల భవనాలను గుర్తించి మేనెలలోగా తగిన చర్యలు తీసుకోవాల్సి ఉండగా, ఈసారి ఎన్నికలు ముంచుకొచ్చాయి. ఈనెల 18వ తేదీ లోగా శిథిల భవనాలను గుర్తించి, తగిన చర్యలు తీసుకోవడంతో పాటు చర్యల నివేదిక(ఏటీఆర్) ఇవ్వాల్సిందిగా కమిషనర్ రోనాల్డ్‌రాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కానీ, ఇంకా ఆ పనులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఏ సంవత్సరం గుర్తించిన శిథిల భవనాలకు సంబంధించిన చర్యలు ఆ సంవత్సరం వర్షాకాలం లోపునే తీసుకోవాల్సి ఉండగా, అమలు కావడం లేదు. గత సంవత్సరం గుర్తించిన శిథిల భవనాలు,అంతకుముందు సంవత్సరం పరిష్కారం కాకుండా ఉన్న పెండింగ్‌లోని భవనాలతో కలిపి పెరిగిన శిథిల భవనాలు, పరిష్కార చర్యలు చేపట్టినవి పోను ఇంకా 150 శిథిల భవనాలు మిగిలే ఉన్నాయి. ఈ సంవత్సరం కొత్తగా గుర్తించేవి మరో 300 వరకు ఉండే అవకాశాలున్నాయి.

గత సంవత్సరం వరకు గుర్తించిన శిథిల భవనాలు..

జోన్	2023వరకు గుర్తించినవి	పరిష్కరించినవి	పెండింగ్
ఖైరతాబాద్	101	41	60
సికింద్రాబాద్	107	56	51
చార్మినార్	75	53	22
ఎల్బీనగర్	73	70	03
శేరిలింగంపల్లి	30	21	09
కూకట్‌పల్లి	97	92	05
మొత్తం	483	333	150

- గత సంవత్సరం వర్షాకాలం వరకు 483 శిథిల భవనాలుండగా, వాటిల్లో 87 భవనాలను కూల్చివేశారు.
- 92 శిథిల భవనాలకు మరమ్మతులు చేయించారు.
- 135 శిథిల భవనాల్లో నివసిస్తున్న వారిని తాత్కాలికంగా ఖాళీ చేయించారు.
- 19 భవనాలను సీజ్ చేశారు.
- వెరసి మొత్తం 333 శిథిల భవనాలకు సంబంధించి పరిష్కార చర్యలు చేపట్టారు. ఇంకా 150 శిథిల భవనాలు మిగిలే ఉన్నాయి. ఈ సంవత్సరం లెక్కల్లో తేలేవాటితో మొత్తం ఎన్ని శిథిల భవనాలు వెలుగులోకి వస్తాయో.. వాటిల్లో ఎన్నింటికి ఎప్పటిలోగా పరిష్కార చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే !



సర్వేలో భాగంగా శిథిల భవనాన్ని గుర్తిస్తున్న అధికారి

కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలలను కట్టడి చేయాలి

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఆర్.కృష్ణయ్య వినతి


విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: రాష్ట్రంలో కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు, డొనేషన్ల పేరుతో విద్యార్థుల నుంచి రూ. లక్షలు వసూలు చేస్తున్నాయని, వాటికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు సోమవారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యా ప్రమాణాలను పాటించకుండా, నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంస్థలను నడుపుతూ రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వీరి ఒత్తిడిని తట్టుకోలేక ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, కార్పొరేట్ కళాశాలలపై వారు నియంత్రణ కోల్పోయారన్నారు. వెంటనే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం చేసి కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు నీల వెంకటేష్, గుజ్జ సత్యం, గోరిగే మల్లేష్‌యాదవ్, రుషికుమార్, నిఖిల్‌పటేల్ తదితరులున్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య కు పాల్పడిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా నాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాకుత్‌పుర రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి (30) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



24 నుంచి డీటీ-20 ప్రీమియర్ క్రికెట్ లీగ్

- టీ హబ్‌లో డాక్టర్ క్రికెటర్ల సందడి
- డీటీ 20 ప్రీమియర్ క్రికెట్ లీగ్ సీజన్-1
- గ్రాండ్ ఎరీనా స్పోర్ట్స్ కౌంటీలో క్రికెట్ మ్యాచ్‌లు
- మే 24 నుంచి జూన్ 2 వరకు నిర్వహణ
- తలపడనున్న 8 జట్లు
- మే 31న సెమీఫైనల్స్
- జూన్ 2న గ్రాండ్ ఫినాలే



రాయదుర్గం: డాక్టర్ క్రికెటర్లతో హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని టీహబ్ ప్రాంగణం సందడిగా మారింది. హైదరాబాద్‌లో 'డీటీ-20 ప్రీమియర్ క్రికెట్ లీగ్ సీజన్-1ను దృష్టిలో ఉంచుకుని ఆదివారం రాత్రి టీహబ్ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్యం చేతిలో స్టెతస్కోప్ పట్టుకుని రోగులను పరీక్షించే వైద్యులు క్రికెట్ బ్యాట్, బాల్‌తో మైదానంలో తలపడనున్నారు. 'కెప్టెన్స్ మీట్ అండ్ ట్రీట్' పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో డాక్టర్లు హాజరయ్యారు. వివిధ జట్లతో పాటు కెప్టెన్లుగా ఎన్నికైన వారిని పరిచయం చేశారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ఏపీ బీజేపీ మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం, శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్ సీఈఓ వైవికే మోహన్, తెలంగాణ బీజేపీ మీడియా ఇన్‌చార్జ్ ఎన్‌వీ సుభాష్, డాక్టర్ ఎన్ నవీనా, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఉషారాణి, సినీ నిర్మాత, పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి చెందిన వివేక్ కూచుబొట్ల పాల్గొని టోర్నీ లోగో, జెర్సీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీమ్జ్ ఎంటర్‌టైన్మెంట్స్, ఏడీ11, డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ లీగ్(డీపీసీఎల్) వ్యవస్థాపకులు పి అనీల్, ఏడీ11 డైరెక్టర్ అంజలి పెండెలా, యశోదా ఆస్పత్రి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ టీడీఆర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'డీటీ-20 క్రికెట్ టోర్నీ' షెడ్యూల్..

నగరంలో మొదటిసారిగా నిర్వహించే డీటీ-20 క్రికెట్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ క్రికెట్ మ్యాచ్‌లన్నీ మహేశ్వరంలోని ఎరీనాస్పోర్ట్స్ కౌంటీలో నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. ఈ మ్యాచ్‌లను సాయంత్రం వేళల్లో 20-20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. లీగ్ మ్యాచ్‌లు మే 24 నుంచి 30 వరకు కొనసాగనున్నాయి. మే 31న సెమీఫైనల్స్, జూన్ 1న ఫేస్ ఆఫ్ మ్యాచ్ జరుగనున్నాయి. జూన్ 2న గ్రాండ్ ఫినాలే మ్యాచ్ నిర్వహిస్తారు. రెండు రాష్ట్రాల నుంచి 120కి పైగా డాక్టర్లు ఈ పోటీల్లో పాల్గొనున్నారు.

విజేతకు రోలింగ్ ట్రోఫీ, రూ.2 లక్షల నగదు బహుమతి

డాక్టర్స్ టీ-20 ప్రీమియర్ క్రికెట్ లీగ్‌లో 8 జట్లు పాల్గొనున్నాయి. కేర్ రైజర్స్, కిమ్స్ లెజెండ్స్, ఏఐజీ పవర్ బ్లాస్టర్స్, సూపర్ కింగ్స్-13, మావెరిక్స్, బ్లాక్ రైడర్స్, టైగోన్స్, టీడీఆర్స్ఏడీ11 జట్ల పేర్లను ప్రకటించారు. టోర్నీలో విజేతగా నిలిచే జట్టుకు రోలింగ్ ట్రోఫీతోపాటు రూ.2 లక్షల నగదు బహుమతి అందజేస్తారు. రన్నరప్ జట్టుకు ట్రోఫీతోపాటు రూ. లక్ష అందించనున్నారు. హీరో ఆఫ్ సిరీస్, హీరో ఆఫ్‌ది మ్యాచ్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, బెస్ట్ వికెట్ కీపర్, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్, మోస్ట్ సిక్సెస్, మోస్ట్ ఫోర్స్, బెస్ట్ ఫీల్డర్‌ను ఎంపిక చేసి వారిని తగిన రీతిలో సత్కరించాలని నిర్ణయించారు.

తదుపరి టోర్నీలు కూడా..

నగరంలో నిర్వహించే సీజన్ డీటీ-20 టోర్నీతోనే కాకుండా ప్రతిష్టాత్మకమైన ఇండియా కప్, ఇంటర్నేషనల్ కప్ వంటివి కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని తలపెట్టారు. వీటిని హైదరాబాద్, ముంబై, విశాఖపట్నం వంటి నగరాల్లో నిర్వహించాలని నిర్ణయించారు.

టెన్‌పిన్ బౌలింగ్ టోర్నీ విజేతలుగా లలిత్, మమత



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ ర్యాంకింగ్ టెన్‌పిన్ బౌలింగ్ టోర్నమెంట్‌లో లలిత్ కుమార్, జి.మమత విజేతలుగా నిలిచారు. మాదాపూర్‌లోని గేమ్ ఎక్స్‌ట్రీమ్ బౌలింగ్‌లో ఈ పోటీలు జరిగాయి. పురుషుల విభాగంలో ఫైనల్‌లో లలిత్ 369-358 స్కోరుతో నవీన్ సిద్దంపై విజయం సాధించగా...మహిళల విభాగంలో ఫైనల్లో మమత 300-179తో తీర్థ శెట్టిని ఓడించింది.

'టెట్' తొలిరోజు ప్రశాంతం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో టెట్ పరీక్ష-2024 తొలిరోజు సోమవారం ప్రశాంతంగా జరిగింది. నగరంలోని నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, సికింద్రాబాద్‌లోని ఇన్నోవిజన్ టెక్నాలజీస్ కేంద్రాల్లో రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. నారాయణమ్మ కేంద్రంలో ఉదయం సెషన్‌లో 230 మంది అభ్యర్థులకు గాను 143 మంది హాజరుకాగా, 87 మంది గైర్హాజయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 157 మంది అభ్యర్థులకు గాను 117 మంది హాజరుకాగా, 40 మంది గైర్హాజరైనట్లు పరీక్ష నిర్వాహకులు తెలిపారు. ఇన్నోవిజన్ కేంద్రంలో 70 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. టెట్ పరీక్షలు ఈ నెల 20 నుంచి జూన్ 2వ తేదీ వరకు రెండు విడతల్లో జరుగనున్నాయి. తొలిసారిగా ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ పద్ధతి(సీబీటీ)లో ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

కూచిపూడి వర్క్‌షాప్ ప్రారంభం


శిక్షణ ఇస్తున్న మంజుభార్గవి

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో సోమవారం కూచిపూడి డ్యాన్స్ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. శంకరాభరణం ఫేమ్, ప్రముఖనాట్య గురువు సంగీతనాటక అకాడమీ అవార్డు గ్రహీత మంజు భార్గవి ఆధ్వర్యంలో ఎత్నిక్‌హాల్‌లో 15 రోజుల పాటు ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి 4గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఏడేళ్ల పైబడిన వారు ఎవరైనా ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనవచ్చునని తెలిపారు. వివరాలకు ఫోన్. 9948078459 లలో సంప్రదించాలని సూచించారు.

హిట్ అండ్ రన్ కేసు నమోదు

- సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఆలస్యంగా వెలుగులోకి
- కారులో మద్యం బాటిల్ ఉన్నట్లు గుర్తింపు


కారు నడిపిన వ్యక్తి


కారులో మద్యం బాటిల్

నల్లకుంట: మద్యం మత్తులో కారు నడిపి రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖకు చెందిన ఓ అధికారి వీరంగం సృష్టించిన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అడ్మిన్ ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాగ్‌అంబర్‌పేట డీడీ కాలనీకి చెందిన యడవల్లి శ్రీనివాస్ సీతారమేష్(46)టీచర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 18న రాత్రి అతను బైక్‌పై విద్యానగర్ లక్కీ కేఫ్ సమీపంలోని ఐరావత్ ఐ క్లినిక్ రోడ్డులో వెళుతున్నాడు. అదే సమయంలో వేగంగా దూసుకువచ్చిన కారు ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొట్టడంతో రమేష్ కిందపడ్డాడు. ఈ ఘటనపై బాధితుడు రమేష్ ఈ నెల 19న నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్సై రమాదేవి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేయలేదని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని ఎస్సై పేర్కొన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేశామన్నారు. స్థానికులు కారును అడ్డుకుని కారు నడుపుతున్న వ్యక్తిని నిలదీస్తూ సెల్ ఫోన్‌లో వీడియో తీశారు. ప్రమాద సమయంలో అతను మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం.కారు కుడివైపు ముందు డోర్ పక్కన బీరు బాటిల్ ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్‌గా మారింది. కాగా ఘటన జరిగిన సమయంలో కారు నడుపుతున్న వ్యక్తి పక్కన ఓ చిన్నారి కూడా ఉండటం గమనార్హం.



చరిత్రను కాపాడుకోవాలి

పంజగుట్ట: చరిత్రను సంరక్షించుకుంటేనే భావితరాలకు మన అస్థిత్వాన్ని అందించవచ్చని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్, రచయిత శ్రీరామోజు హరగోపాల్ సంపాదకత్వంలో వెలువరించిన 'త్రిపురాంతకంలో చారిత్రక శిల్పాలు' పుస్తకాన్ని సోమవారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం పూర్వ చరిత్రశాఖ అధ్యక్షులు డాక్టర్ కె.విజయబాబు, ఎంసీహెచ్‌ఆర్‌డీ మాజీ డీజీ ఎస్.చల్లప్ప, మణికొండ వేదకుమార్, సముద్రాల శ్రీరంగాచార్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. గతం అనేది మనకు తెలియనిదని, ఐదువేల ఏళ్ల నుంచి మాత్రమే మనకు చరిత్ర అందుబాటులో ఉందన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం యూరోపియన్‌లు మన చరిత్రను రాశారని, అయితే అందులో వారి గొప్పతనాన్నే చాటుకున్నారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా పెద్దగా చరిత్రను వెలుగులోకి తీసుకురాలేదని, అసలైన భారతదేశ చరిత్రను మారిపోయే విధంగా చూపించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ చరిత్రను కనుమరుగు చేసే ప్రయత్నం జరిగిందని గుర్తు చేశారు. త్రిపురాంతకంలో చారిత్రక శిల్పాలు పుస్తకంలో కాకతీయుల చరిత్రను అద్భుతంగా వివరించారన్నారు. పూర్వం తయారు చేసిన శిల్పాలు చరిత్రను వివరిస్తాయని, చెన్నైలో ఇలాంటి ప్రయత్నాన్ని విజయవంతంగా చేశారని, ఇక్కడ కూడా చెయ్యడం గొప్ప విశయమన్నారు. ఈ పుస్తకంలో రాణి రుద్రమదేవి శిల్పం చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం కో కన్వీనర్ బి.వీ.భద్రగిరీశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కట్టా శ్రీనివాస్, వేముగంటి మురళీకృష్ణ, కవి, చరిత్రకారులు తురిమెల్ల శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

రౌడీయిజం, దౌర్జన్యాలు అనే పదాలు వినిపించొద్దు



ఫిలింనగర్: నగరంలో రౌడీయిజం, దౌర్జన్యం అనే పదాలు ఇకపై వినిపించరాదని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందిని, అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... ప్రజలు ఆనందంగా, ప్రశాంతంగా ఉండాలంటే పోలీసులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. రౌడీయిజం, దౌర్జన్యాలు అనే పదాలు వినిపించకుండా పోలీసుల పనితీరు ఉండాలన్నారు. ఫిలింనగర్ పోలీసుల పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఆకతాయిలు దొరికారు

- బస్సు ధ్వంసం కేసును ఛేదించిన పోలీసులు
- ఎనిమిది మంది నిందితుల రిమాండ్


పోలీసుల అదుపులో నిందితులు

మహేశ్వరం: నిర్లక్ష్యంగా బైక్‌లు నడపడమేగాక సైడ్ ఇవ్వనందుకు ఆర్టీసీ బస్సుపై దాడి చేసిన ఘటనలో ఎనిమిది నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రెండు గుర్రాలు, మూడు బైక్‌లు, కత్తి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఫలక్‌నుమా మదీనా కాలనీకి చెందిన కలీముద్దీన్ తౌసిఫ్, బహదూర్‌పురా కిషన్ బాగ్‌కు చెందిన మహ్మద్ ఆసిఫ్ కందుకూరు మండలం గ్రీన్ ఫార్మాసిటీ రోడ్డులో గుర్రపు పందేలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్టాగ్రాం వేదికగా పోస్ట్ చేశారు. ఈ పోస్టును చూసిన సుమారు 50 మంది బెట్టింగ్‌లో పాల్గొనేందుకు బైక్‌లపై వచ్చారు. ఈ నెల 16న గుర్రాలతో పాతబస్తీ నుంచి గ్రీన్‌ఫార్మాసిటీ రోడ్డుకు చేరుకున్నారు. ఆరు కిలోమీటర్లు ఎంచుకుని పందేలు నిర్వహించారు. శ్రీశైలం జాతీయ రహదారిపై బైక్‌లపై తిరిగి వస్తున్న వారు అదే సమయంలో హైదరాబాద్ వస్తున్న కల్వకుర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సైడ్ ఇవ్వలేదంటూ రాచలూరుగేట్ సమీపంలో ఆపి కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో కల్వకుర్తికి చెందిన ప్రయాణికుడు చీకొండ నాగరాజు చేతికి గాయాలయ్యాయి. డ్రైవర్, కండక్టర్, ప్రయాణికుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సయ్యద్ అహ్మద్, మహ్మద్ వజహత్, ముసా కలీముద్దీన్ తౌసిఫ్, మహ్మద్ ఆసిఫ్, సయ్యద్ జునైద్ అలీ, కాషిఫ్ రజీద్దీన్, అబ్బసాయిలు, మహ్మద్ గౌస్, మహ్మద్ మజార్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి గుర్రాలు, బైక్‌లు, కత్తి, ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన పోలీసులను డీసీపీ సునీతారెడ్డి అభినందించారు. సమావేశంలో కందుకూరు సీఐ మక్బుల్ జానీ, మహేశ్వరం ఎస్ఐలు వెంకట్‌రెడ్డి, రవీందర్, క్రైమ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

జూన్ 6 నుంచి నేషనల్ త్రోబాల్ పోటీలు



పంజగుట్ట: తెలంగాణ స్టేట్ త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు మూడు రోజులపాటు 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు, పోటీ నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ సత్యం శ్రీరంగం తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు... హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషనల్ అకాడమీలో నిర్వహించనున్న ఈ పోటీలకు 26 రాష్ట్రాల నుంచి 750 మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు తెలిపారు. మెన్, ఉమెన్స్ వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఉన్నతాధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో కృష్ణ రాజ్‌పుత్, చిత్ర షనయ్, జమీల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


పీజీ హాస్టల్‌లో మాదకద్రవ్యాల పట్టివేత

5.8 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

గచ్చిబౌలి: మెన్స్ పీజీ హాస్టల్ అడ్డాగా ఓ వ్యక్తి డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఓటీ, గచ్చిబౌలి పోలీసులు దాడులు నిర్వహించి 5.8 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ భాను ప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన సుల్తాన్ కుమార్ ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ కొండాపూర్, రాఘవేంద్ర కాలనీలోని పీఆర్ గ్రాండ్ మెన్స్ పీజీ హాస్టల్‌లో ఉంటున్నాడు. స్నేహితుడి ద్వారా అతడికి నగరానికి చెందిన లక్కీ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. సోమవారం స్నాప్ షాట్‌లో సుల్తాన్ కుమార్‌తో మాట్లాడిన లక్కీ ఓ వ్యక్తి ఎండీఎంఏ తెచ్చి ఇస్తాడని, వాటిని తాను చెప్పిన వ్యక్తికి అప్పగించాలని సూచించాడు. డ్రగ్ డెలివరీ ఆయినట్లు సమాచారం అందడంతో సోమవారం మధ్యాహ్నం ఎస్ఓటీ, గచ్చిబౌలి పోలీసులు పీజీ హాస్టల్‌లో సోదాలు నిర్వహించి సుల్తాన్ కుమార్ నుంచి రూ.30 వేల విలువ చేసే 5.8 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

– రూ.35వేలు తీసుకుంటూ పట్టుబడిన వైనం



శంషాబాద్ రూరల్ : ఇంటి నిర్మాణం కోసం లంచం డిమాండ్ చేసిన పంచాయతీ కార్యదర్శి, కారోబార్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మండలంలోని ననాజీపూర్‌లో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన బర్కత్‌అలీకి ననాజీపూర్‌లో 500 గజాల స్థలం ఉంది. సదరు స్థలంలో గది, ప్రహరీ నిర్మాణంతో పాటు ఇంటి నెంబర్ జారీకోసం పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాడు. ఇందుకుగాను పంచాయతీ కార్యదర్శి రాధిక, కారోబార్ బాల్‌రాజ్ రూ.65 వేలు డిమాండ్ చేశారు. అంత మొత్తం ఇచ్చుకోలేనని.. కొంత డబ్బును ఇప్పటికే అనుమతి కోసం ఆన్‌లైన్‌లో చెల్లించినట్లు బర్కత్‌అలీ చెప్పాడు. చివరకు రూ.35 వేలకు ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలో బాధితుడు 15 రోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో డబ్బులు తీసుకుంటుండగా పంచాయతీ కార్యదర్శి, కారోబార్‌లను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించిన ఏసీబీ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడు శివకుమార్

బంజారాహిల్స్: అపోలో ఆస్పత్రి వైద్యుడి ఇంట్లో నగదు, నగల చోరీకి పాల్పడిన ఘరానా దొంగను జూబ్లీహిల్స్ క్రైమ్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... నారాయణపేట మండలం, ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన చాకలి శివకుమార్ అలియాస్ శంకర్ పర్వత్‌నగర్‌లో ఉంటూ జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-52లోని ఓ టీవీ చానల్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన అతను తాను పనిచేస్తున్న టీవీ చానల్ ఎదురుగా ఉండే అపోలో ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ అశోక్ కుమార్ ఇంటిని టార్గెట్ చేసుకున్నారు. రెక్కీ నిర్వహించి ఆయన ఇంట్లో లేని సమయంలో లోపలికి ప్రవేశించి రూ. 25.70 లక్షల నగదు, బంగారు ఆభరణాలు, వెండి బిస్కెట్లు తస్కరించి కారులో పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలించారు. స్విఫ్ట్ డిజైర్ కారు రోడ్డు పక్కన ఆపి ఉండటం, దొంగతనం చేసిన యువకుడు అదే కారులో కర్నూలు హైవేలో వెళ్తున్నట్లు గుర్తించి పోలీసులను అప్రమత్తం చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు బారికేడ్లు అడ్డుపెట్టి వాహన తనిఖీలు చేపట్టారు. శివకుమార్ నడుపుతున్న కారులో నగదును కూడా గుర్తించి జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడి నుంచి రూ. 23.70 లక్షల నగదు, బంగారు ఆభరణాలు, వెండి బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు. చోరీకి ఉపయోగించిన కారు, కటింగ్ ప్లేయర్, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. గతంలోనూ అతను మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఔత్సాహిక క్రీడాకారులకు ఉచిత క్రికెట్ వీక్షణ అవకాశం...



సాక్షి, సిటీబ్యూరో: ''అభిమాన క్రికెట్ హీరోలు మైదానంలో పోరాడుతుండగా చూడడం ఆనందాన్ని కలిగించడమే కాక ఔత్సాహిక క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుంది''అని ఆన్‌లైన్ స్కిల్ గేమింగ్ వేదిక గేమ్స్ 24/7 సహ-వ్యవస్థాపక సీఈఓ భవిన్ పాండ్యా అన్నారు. గేమ్స్ 24/7 ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద యువ క్రీడాకారులకు ఉప్పల్ స్టేడియంలో ఆదివారం హైదరాబాద్, పంజాబ్ జట్ల మధ్య జరిగిన ఐపీఎల్ టి 20 మ్యాచ్‌ను చూసే అవకాశాన్ని కల్పించారు. ఈ కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ఔత్సాహిక క్రీడాకారుల ఆకాంక్షలను బలోపేతం చేసేందుకు వీల్స్ ఆఫ్ చేంజ్ పేరిట కార్యక్రమం చేపట్టామని, దీని కోసం నగరానికి చెందిన ఓ స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని వివరించారు. ఈ సమావేశంలో స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కె. సాయిబాబా మాట్లాడారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE
■ Brand New Flats For Resale Gated Community, Near Habsiguda, ECIL Cherlapally, Yapral, Many Options For Every Budget. Call Now Ph: 08069045555 [H-804948]

HOUSE FOR SALE
■ 1) Bandlaguda (Nagaram) 100 Sq Yds North Facing (G+1) Complete - Rs. 78 Lakh Semi Structure - Rs. 56 Lakhs. 2) Kundanpally (HMDA) 180 Sq Yds West Facing (G+1) (Rampally) Complete Rs. 1.2 CR Semi Structure Rs. 78 Lakhs Ph: 9390805530 / 6309409952 [HA-801627]

PLOT FOR SALE
■ గజం 2750/- కే బెంగుళూరు హైవేకి బాలానగర్ దగ్గర పండ్ల మొక్కలు, గెస్ట్ హౌస్ స్విమ్మింగ్ పూల్ గేటెడ్ కమ్యూనిటీ కాంపౌండ్ వాల్‌తో. ఫోన్: 9347986771 [HA-32175]

Services

BUSINESS SERVICE
■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739. [H-800406]

BUSINESS OFFER
■ INVESTORS welcome for imported Alchoholic Beverages. Discussions shall be held on 23th May 2024 at Hotel Taj Krishna Lobby, Rd No.1, Banjara Hills, Hyd. Please feel free to call 9324902794, 8867588202 [HA-14338]

PERSONAL CARE

OLD AGE HOME
■ వృద్ధులు & భార్యాభర్తలు A/C & N/C అటాచ్డ్ బాత్రూం, మేడిపల్లి / ఉప్పల్, వృద్ధులు, బెడ్ పేషెంట్లు. Ecil, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతి మరియు 24/7 మెడికల్ సర్వీస్. ఫోన్: 7981467086, 9391039990, 9515474083. [H-778801]

WATER PROOFING
■ శ్రీ సాయి భవాని వాటర్ ప్రూఫింగ్: టెర్రస్, సీలింగ్, సైడ్ వాల్స్, వాటర్ ట్యాంక్, సంపు, బాత్రూమ్స్ ఎటువంటి లీకేజైనా కెమికల్స్‌చే 10 సం॥ల గ్యారెంటీగా చేయబడును. ఫోన్: 9948270898 [H-800485]

Wanted

■ అన్నపూర్ణ హోమ్ కేర్ సర్వీస్ 24 గంటలు ఇంట్లోనే ఉండి బేబీ కేర్, వంట / ఇంటి పేషంట్ కేర్ పని చేయుటకు 20 నుండి 40 సం॥రాల ఆడవాళ్ళు కావలెను. భోజన+వసతి. జీతం: 16000/- 20000/- వరకు. ఫోన్: 9390427894 [H-788088]

■ రిసెప్షన్, టెలికాలర్, ఆఫీస్‌బాయ్, వీడియో ఎడిటింగ్, టైపింగ్ DTP, డ్రైవర్లు, సూ॥వైజర్, ఆయాలు, కుక్స్, హెల్పర్స్, గార్డెన్ వర్కర్స్, మేస్త్రీలు, జీ: 15-18K, ఫ్రీ హాస్టల్. ఫోన్: 9505288777. [H-778727]

■ Waves వాటర్ ప్యూరిఫైర్, కంపెనీకి సర్వీస్ టెక్నీషియన్స్ ఫ్రెషర్స్ కావలెను. Qly: 10th పాస్/ఫెయిల్ వ॥ 18 సం. మంచి జీతం+ESI/PF & కమీషన్ ఇవ్వబడును. ఫోన్: 8328177881, 6281547216 [H-801624]

■ ఫీల్డ్ ఆఫీసర్స్, వాలెట్ డ్రైవర్ జీ: 18,000/-+2 W/O, సెక్యూరిటీ/గార్డ్స్ 10th పాస్, జీతం: 15,000/- 12.00 Hrs, ఫ్రీ భోజనం గచ్చిబౌలి, జూబ్లీహిల్స్‌లో కావలెను. సంప్ర: 9848898400 / 9177364335 [H-778725]

■ అమీర్‌పేట్ హాస్టల్లో పనిచేయుటకు ఆడమనిషి కావలెను. ఉచిత భోజనం, వసతి కల్పించబడును. ఫోన్: 9666480999/7416996777 [HA-32199]

■ వేద హోంకేర్: హైదరాబాద్ నందు వృద్ధులకు,పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/ వంటపనికి స్త్రీ/పు॥ కావలెను. జీతం: 17000 రూం+భోజనం ఫ్రీ ✆ 9177963179 [G-1490]

■ Prakruthi Entrepreneurs Pvt Ltd Village Mart Managers & Mandal Dealers, Salary 56000/- Best opportunity Contact: 8830396314 [J-1630]

■ Wanted Female Telecallers Experience, Freshers & Collection Executive. Goutham Nager, Malkajgiri, Hyderabad. Ph: 8142051234 [HA-5892]

■ Wanted Commercial Vehicle Driver for Ashok leyland in Shamirpet, Turkapally. Contact Number: 9550447220 [HA-5894]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్
సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-24/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

వీడీసీసీ రోడ్డులో అడ్డగోలుగా తవ్వకాలు

- అనుమతులు తీసుకోకుండానే పనులు
- జీహెచ్ఎంసీ క్షేత్ర స్థాయి సిబ్బంది చేతివాటం


ఎమ్మెల్యే కాలనీలో పైప్‌లైన్ ఏర్పాటుకు తవ్విన వీడీసీసీ రోడ్డు

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ సర్కిల్–18 పరిధిలో క్షేత్ర స్థాయిలో అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది చేతివాటంతో జీహెచ్ఎంసీకి రావాల్సిన ఆదాయానికి గండిపడుతున్నది. దీనికి తోడు లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్లను అడ్డగోలుగా తొవ్వేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తాము అన్ని అనుమతులు తీసుకున్నామని ఇటు వర్క్ ఇన్‌స్పెక్టర్లు, అటు ఇంటి యజమానులు బుకాయిస్తున్నారు. తాజాగా బంజారాహిల్స్ రోడ్ నెం. 12 ఎమ్మెల్యే కాలనీలోని లేన్ నెంబర్ 11లో ఓ భవన యజమాని మంచినీటి లైన్ ఏర్పాటుకు జలమండలి కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. జలమండలి నుంచి ఆయన అనుమతులు పొందాడు. కానీ మంచినీటి లైన్ వేయాలంటే కచ్చితంగా జీహెచ్ఎంసీ అధికారులు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దానికి ఎంత మేర తవ్వుతున్నారు. ఎన్ని మీటర్లు తవ్వుతున్నారు అనే విషయాన్ని సదరు డివిజన్ ఇంజినీర్ లెక్కగట్టి దానికి తగిన రుసుమును చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఆ ఇంటి యజమాని వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో కుమ్మక్కై 80 మీటర్లకుపైగా రోడ్డును తవ్వేశారు. స్థానిక నివాసితులు అడిగితే తాము అన్ని అనుమతులు తీసుకున్నామని అంటున్నారు. ఆ యజమాని మూడు మీటర్ల కోసం దరఖాస్తు చేసుకొని దాని రుసుమును సైతం చెల్లించకుండా క్షేత్ర స్థాయి సిబ్బందితో రోడ్డును తవ్వేశారు. వాస్తవానికి కాలనీలో నాలుగు నెలల క్రితం ఇక్కడ వీడీసీసీ రోడ్డును వేశారు. ఈ రోడ్డును తవ్వాలంటే జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి మాత్రమే అనుమతులు ఇస్తారు. ఇవేవీ ఖాతరు చేయని సదరు సిబ్బంది యథేచ్ఛగా రోడ్డును 80 మీటర్లకుపైగా తవ్వేశారు. ఇదే విషయాన్ని ఏఈ, ఈఈలను ప్రశ్నించగా తమకు ఎటువంటి సమాచారం లేదని సదరు నివాస యజమానికి నోటీసులు ఇస్తామని చెప్పారు. ఇందులో ట్విస్ట్ ఏంటంటే ఆ నివాసాన్ని ఆనుకొని ఉన్న మరో ఇద్దరు నివాసితులు కూడా ఇదే సమయం అంటూ అనుమతి లేకుండా నల్లా పైప్‌లైన్ కోసం పైపులు వేసుకున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

అక్రమ నిర్మాణంపై కదిలిన అధికారులు


బీజేఆర్‌నగర్ బస్తీలోని అక్రమ నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్..

బంజారాహిల్స్: వైన్‌షాపు ఏర్పాటును వ్యతిరేకిస్తూ బస్తీవాసుల ఆగ్రహం అనే శీర్షికన సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు స్పందించారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని కొత్త చెరువు పక్కన బీజేఆర్‌నగర్ బస్తీ నాలాను ఆనుకుని కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం షాపు ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించారంటూ స్థానికులు ఆరోపించారు. దీంతో షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి ఆర్ఐలు, సర్వేయర్లతో కలిసి సోమవారం ఈ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. అయితే ఈ స్థలానికి సంబంధించి కలెక్టర్ నుంచి ఎన్‌ఓసీ కూడా ఉందని, ఈ వైన్‌షాపు నిర్వహణకు మాత్రం జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా నిర్మించినట్లు ఆమె గుర్తించారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ ఏసీపీకి ఈ అక్రమ నిర్మాణం విషయంలో లేఖ రాస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. రోడ్డు పక్కనే కొన్నాళ్లుగా ఇంత పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అవినీతి, అక్రమాలు, వసూళ్లు, బెదిరింపులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులకు కనిపించలేదా? అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణంపై జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్‌కు ఫిర్యాదు చేయడానికి బస్తీవాసులు సిద్ధమవుతున్నారు. ఈ అక్రమ నిర్మాణం వెంటనే కూల్చివేయాలంటూ, ఇక్కడి నుంచి వైన్‌షాపు తొలగించాలంటూ బస్తీవాసులు ధర్నా చేసేందుకు సిద్ధమవుతున్నారు.

లంబాడాలకు మంత్రి పదవి ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న భూక్యా సంజీవనాయక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ ప్రభుత్వంలో లంబాడాలకు మంత్రి పదవి ఇవ్వాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సేవాలాల్ సేన సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. గిరిజనులు రాష్ట్రంలో కొట్లాడి సాధించుకున్న పది శాతం రిజర్వేషన్ కొనసాగించాలని, అందు కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని తెలిపారు. కావాలనే కొంత మంది స్వార్థపరులు గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు దక్కకుండా హైకోర్టులో పిటిషన్ వేశారన్నారు. సమావేశంలో కోర్ కమిటీ చైర్మన్ ధరావత్ ప్రేమ్‌చంద్, రాష్ట్ర ఇన్‌చార్జి మాలోతు సైదానాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్, రైతు సంఘం అధ్యక్షుడు బానోతు కిషన్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురామ్ రాథోడ్, గ్రేటర్ అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ధరావత్ వెంకన్న, లకావత్ భాస్కర్, ఉపాధ్యక్షులు రేఖ్యానాయక్, పరశురామ్ నాయక్, బాలు నాయక్, మోతీలాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ కరాటే పోటీలో నగర విద్యార్థుల సత్తా


స్వర్ణ, రజత పతకాలు సాధించిన నగర విద్యార్థులు

కాచిగూడ: మలేషియాలో జరిగిన ఇంటర్నేషనల్ గోజు –రైయు –ఐపో సిటీ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో నగరానికి చెందిన జపాన్ షోటోకాన్ అసోసియేషన్ సికో–కరాటే–డోలో శిక్షణ పొందుతున్న ముగ్గురు కరాటే విద్యార్థులు సత్తా చాటారు. కట్టాస్ విభాగంలో ఎస్.జై కార్తికేయన్, ఎస్.తమన్, ఏఎస్ఎన్ గౌతమ్ రజత పతకాలు సాధించారు. సీనియర్ కట్టాస్ విభాగంలో మాస్టర్ వైఆర్ శివకుమార్ స్వర్ణ పతకం సాధించారు. కుమితే విభాగంలో ఎస్.జై కార్తికేయన్, రజత పతకం, ఎస్.తమన్, ఏఎస్ఎన్ గౌతమ్ కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను జపాన్ షోటోకాన్ అసోసియేషన్ సికో–కరాటే –డో ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, 6వ బ్లాక్ బెల్ట్ వైఆర్ శివకుమార్ అభినందించారు.

అనారోగ్య కారణాలతో మహిళ ఆత్మహత్య


మృతురాలు అరుణ(ఫైల్)

వెంగళరావునగర్: అనారోగ్య కారణాల వల్ల మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన అరుణ(40), రమేష్‌లు కొంతకాలంగా కార్మికనగర్‌లో నివాసం ఉంటున్నారు. అరుణ హౌస్ కీపింగ్‌గా విధులు నిర్వహిస్తుండగా, రమేష్ పెయింట్ వర్క్ చేస్తుంటాడు. వారికి అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. కొన్నేళ్లుగా ఆమె తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రులకు వెళ్లినా తగ్గడం లేదు. ఈ క్రమంలో ఇటీవల రమేష్‌తో పాటుగా పిల్లలు కూడా ఓటు వేయడానికి తమ స్వగ్రామం వెళ్లాడు. పిల్లలతోపాటు ఇంట్లో ఎవరూ లేక పోవడంతో సోమవారం రాత్రి ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందింది. చుట్టుపక్కల వారు విషయాన్ని పోలీసులకు తెలిపారు. ఆమె సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

25న సైకాలజిస్టుల శిక్షణ శిబిరం

చిక్కడపల్లి: సైకాలజిస్టుల వృత్తి నైపుణ్యాలు పెంపొందించేందుకు సైకియాట్రిస్ట్ డాక్టర్ రవ్వా హరికుమార్‌తో ఒక రోజు జాతీయస్థాయి శిక్షణశిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, డాక్టర్ వీజే క్యారోలిన్ తెలిపారు.సోమవారం అశోక్‌నగర్‌లో డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 25వ తేదీన శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అశోక్‌నగర్‌లో మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ హాల్‌లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్టులు, సైకాలజీ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 9390044031కు సంప్రదించాలని సూచించారు.

వరదనీరు నిలిచే ప్రాంతాలు 121

- తనిఖీలు చేస్తున్న జలమండలి అధికారులు
- లాగింగ్ పాయింట్ల వద్ద ముందస్తు జాగ్రత్తలు
- కార్యాచరణ ప్రణాళిక సిద్ధం


బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-7లో వాటర్ లాగింగ్ పాయింట్‌ను పరిశీలిస్తున్న జలమండలి అధికారులు

బంజారాహిల్స్: వర్షాకాలం ప్రారంభం అవుతుందంటేనే ప్రజలు ముఖ్యంగా లోతట్టు ప్రాంతవాసుల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తం అవుతుందనడం నిర్వివాదాంశం. వానలు ముంచుకొస్తున్నాయంటే రోడ్లపై వరదనీరు నిలిచి రాకపోకలు స్తంభించడమే కాకుండా తెరిచి ఉన్న మ్యాన్‌హోళ్ల మూతలు, పైకప్పు లేని వరదనీటి కాలువలతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది.

- ఈసారి వానాకాలానికి ముందే నగరాన్ని కుండపోత వర్షం ముంచెత్తిన నేపథ్యంలో ఎక్కడికక్కడ రోడ్లపై వరద నిలిచిపోయి వానకష్టాలు ముందస్తుగానే కళ్లకు కడుతున్నాయి. ప్రతి సంవత్సరం వానాకాలానికి ముందే జలమండలి అధికారులు వరదనీరు నిలిచిపోయే ప్రాంతాలపై దృష్టిపెట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా మ్యాన్‌హోళ్ల వద్ద మరమ్మతులు చేపడుతున్నారు.
- ఈ ఏడాది కూడా వర్షాకాలానికి ముందే ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో అధికారులు సిద్ధమవుతున్నారు.
- వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద ప్రమాదాలు చోటుచేసుకోకుండా మ్యాన్‌హోళ్లను సరిచేస్తున్నారు. మూతల్లేని మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపడుతున్నారు.
- జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్ డివిజన్ల పరిధిలో 18 చోట్ల వరద నీరు నిలిచిపోతుందని, వాటి వివరాలను జలమండలి అధికారులకు అందజేసింది.
- అలాగే ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, బోరబండ, రహమత్‌నగర్ డివిజన్ల పరిధిలో 113 చోట్ల వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించి ట్రాఫిక్ పోలీసులు జలమండలి అధికారులకు నివేదిక ఇచ్చారు.
- అటు ట్రాఫిక్ పోలీసులు ఇటు జీహెచ్ఎంసీ ఈ రెండు విభాగాల అధికారులు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో 121 వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించడమే కాకుండా ఆ ప్రాంతాలతో కూడిన వివరాలను జలమండలికి అప్పగించింది. వాటర్ లాగింగ్ పాయింట్లలో జలమండలికి చెందిన డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల మూతలు ఉన్నాయో లేదో, అక్కడ రక్షణ ఏర్పాట్లు ఎంవరకు ఉన్నాయో పరిశీలించాల్సిందిగా సూచించారు.
- ఈ నేపథ్యంలోనే జలమండలి డివిజన్–6 జనరల్ మేనేజర్ హరిశంకర్ ఆధ్వర్యంలో సంబంధిత సెక్షన్ మేనేజర్లు, సిబ్బంది గుర్తించిన వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద తనిఖీలు మొదలుపెట్టారు.
- డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల మూతలు లేనిచోట్ల కొత్తవి ఏర్పాటుచేస్తున్నారు. దెబ్బతిన్న మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేస్తున్నారు.
- లోతుగా ఉన్న మ్యాన్‌హోళ్ల వద్ద సేఫ్టీగ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు.
- ఇక్కడ వరదనీరు నిలిచిపోతుందనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.
- సమస్యాత్మకమైన వాటర్ లాగింగ్ పాయింట్లపై దృష్టి పెట్టడమే కాకుండా వర్షాలు పడినప్పుడు అక్కడ సిబ్బంది విధుల్లో ఉండేవిధంగా చర్యలు చేపడుతున్నారు.
- మరోవైపు నివాసితులు తమ ఇళ్ల నుంచి వచ్చే వరదనీటిని నేరుగా డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లోకి పంపిస్తున్నట్లుగా గుర్తించారు. అలా కాకుండా వరదనీరు వృథాపోకుండా ఒడిసి పట్టుకోవాలని, ఇళ్లల్లో ఇంకుడుగుంతలు ఏర్పాటుచేసుకోవడం ద్వారా వర్షపునీటిని ఆదా చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.
- వరదనీరు డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలోకి పంపడం ద్వారా ఆ నీళ్లతో పాటు ఇసుక, రాళ్లు, వ్యర్థాలు కొట్టుకువెళ్తాయని, దీని ద్వారా మ్యాన్‌హోళ్లు నిండిపోయి మురుగునీరు రోడ్లపైకి వస్తుందని జలమండలి డివిజన్–6 జీఎం హరిశంకర్ తెలిపారు.
- ప్రజలుకూడా తమవంతు బాధ్యతగా మురుగునీటి మ్యాన్‌హోల్‌లోకి వరదనీరు వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యతను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.


మ్యాన్‌హోల్ నుంచి బురదను తొలగిస్తున్న జలమండలి సిబ్బంది

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



ఖైరతాబాద్: సైఫాబాద్ టీఎస్ఎస్‌పీడీసీఎల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ట్రీ కట్టింగ్, మెయింటనెన్స్‌లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఏసీ గార్డ్స్ 11కేవీ ఫీడర్ పరిధిలోని ఏసీగార్డ్స్, మహావీర్ హాస్పిటల్, డీలక్స్ హోటల్, నూరీ ట్రావెల్స్, ఏసీ గార్డ్స్ ఐడీఎంసీడ్ ఏరియా, అడ్వకేట్ కాలనీలలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. ఆదర్శ్‌నగర్ 11కేవీ ఫీడర్ పరిధిలోని ఆదర్శనగర్, ఎస్‌బీఐ బ్యాంక్ ఏరియా, బిర్లామందిర్ టెంపుల్, డిప్లొమా అసోసియేషన్ ఆఫీస్, ఆదర్శ్‌నగర్ ఈఎస్ఐ హాస్పిటల్ ఏరియా, ఆదర్శ్ కేఫ్, బేకరీ, సంజయ్‌గాంధీనగర్, బిర్లా ప్లానిటోరియం ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ ఆపివేస్తామని తెలిపారు. విజయ హాస్పిటల్ 11కేవీ ఫీడర్ పరిధిలోని విజయ హాస్పిటల్ లేన్, రాజ్‌భవన్ మెయిన్ రోడ్డు, మార్వెల్ అపార్ట్‌మెంట్ ఏరియా, ప్రభుత్వ పాఠశాల, విజయ ఎలక్ట్రానిక్స్ ఏరియాలలో మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 వరకు , నవీన్ నగర్ 11కేవీ ఫీడర్ పరిధిలోని ఎస్టీడీ బూత్, భగత్‌సింగ్ విగ్రహం, అనురాగ అపార్ట్‌మెంట్ ఏరియా, ఎర్రమంజిల్, ఐఐపీఎం వెనుక వైపు ఏరియా, నవీన్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 23, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 18, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 90, గింజ చిక్కుడు 70, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 23, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 28, చామగడ్డ 43, మొరంగడ్డ 28, కందగడ్డ 70, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

రక్షణ కల్పించాలని సీపీకి వినతి

రహమత్‌నగర్: బంగారు మైసమ్మ ఆలయం వద్ద జరిగిన దాడిలో ధనుంజయ్ అతని అనుచరులతో తమకు ప్రాణహాని ఉందని తమకు రక్షణ కల్పించాలని దాడిలో గాయపడ్డ శ్రీనాథ్, కుటుంబ సభ్యులు సోమవారం నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని తమ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని వాపోయారు. బస్తీ నాయకులు గడ్డం శ్రీధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మెయింటెనెన్స్ చెల్లిస్తేనే అపార్ట్‌మెంట్‌లో సేవలు

పంజగుట్ట: అపార్ట్‌మెంట్‌లో నిర్వహణ చార్జీలు చెల్లించకుండా సదుపాయాలు కల్పించడం సాధ్యం కాదని సిటీ సివిల్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పంజగుట్టలోని సఫైర్ రెసిడెన్షియల్ అసోసియేషన్‌లో మొత్తం 102 ఫ్లాట్లు ఉండగా 10 ఫ్లాట్ల యజమానులు 5 సంవత్సరాలుగా మెయింటెనెన్స్ చెల్లించడంలేదు. వారికి అపార్ట్‌మెంట్ అసోసియేషన్ మార్చి నెలలో మౌలిక సేవలు నిలిపివేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు జి.రవీందర్ రెడ్డి సోమవారం అసోసియేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. సేవలు ఆపివేయడంతో ఆ 10 మంది పంజగుట్ట పోలీసులను ఆశ్రయించగా పోలీసులు సివిల్ వివాదం కావడంతో కోర్టును ఆశ్రయించాలని సూచించారు. దీంతో వారు సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. ఇరువైపులా వాదనలు విన్న కోర్టు మెయింటెనెన్స్ చెల్లించకుండా సేవలు ఎలా పొందుతారని ఆ 10 మందికి మొట్టికాయలు వేసిందని తెలిపారు. అదే సమయంలో ఇటీవల అపార్ట్‌మెంట్ హక్కులపై హైకోర్టు ఇచ్చిన తీర్పును గుర్తుచేస్తూ నిర్వహణ ఖర్చులు ఇస్తేనే సేవలు అందుతాయని తెలిపిందని వివరించారు. కోర్టు తీర్పుతో ముగ్గురు బకాయిలతో సహా చెల్లించేందుకు సిద్ధమయ్యారని ఆయన పేర్కొన్నారు.

వాహనాల తనిఖీలు

రహమత్‌నగర్: బోరబండ డివిజన్‌లో సోమవారం రాత్రి పోలీసులు పెద్ద ఎత్తున వాహనాలను తనిఖీ చేశారు. ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ నేతృత్వంలో జరిగిన తనిఖీల్లో సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్‌లు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వీరశేఖర్ మాట్లాడుతూ... వాహనం నడుపుతున్నప్పుడు తప్పని సరిగా అన్ని పత్రాలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు మైనర్‌లకు వాహనాలను నడిపేందుకు ఇవ్వకూడదని హెచ్చరించారు. సెక్టార్ ఎస్ఐ షేక్ నాగూల్ మీరా, మనోజ్, స్వప్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


బాధితులను పరామర్శిస్తున్న భవానీశంకర్

రహమత్‌నగర్: బంగారు మైసమ్మ ఆలయం వద్ద జరిగిన దాడిలో గాయపడిన శ్రీకాంత్, స్వప్నలను కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి భవానీశంకర్ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా భవానీశంకర్ మాట్లాడుతూ... బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు అరుణ్‌గౌడ్, దేవేందర్, సాయి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతకు పట్టాభిషేకం

ఆచార్య కొలకలూరి ఇనాక్


'ఉగ్రం–వీరం'గ్రంథం ఆవిష్కరిస్తున్న ఇనాక్, శరత్ జ్యోత్స్నారాణి, కళాజనార్ధనమూర్తి, అపర్ణ

చిక్కడపల్లి: మానసికంగా, భౌతికంగా, సామాజికంగా ఆధ్యాత్మికతను ప్రచారం చేస్తున్న పురాణపండ శ్రీనివాస్ రచనలోని అక్షరాలు ఆధ్యాత్మికతకు పట్టాభిషేకం అని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ కొనియాడారు. సోమవారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగాన సభలోని గుండవరపు హన్మంతరావు కళావేదికలో పురాణపండ శ్రీనివాస్ రచించిన 'ఉగ్రం–వీరం'గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇనాక్ మాట్లాడుతూ నరసింహస్వామి అవతారంలోని ఉగ్రం రూపం సమాజ శ్రేయస్సు కోసమేనని పురాణపండ శ్రీనివాస్ వ్యాఖ్యానించారని, సంస్కృత శ్లోకాలతోపాటు తెలుగులో విశ్లేషణ చేశారని వివరించారు. ఆధ్యాత్మిక సాహిత్యంలో పురాణపండ బహుగ్రంథ కర్త అని అన్నారు. పురాణపండ జీవితకాలం ఆధ్యాత్మిక సాహితీ సేద్యం చేస్తూ సంపదనను వెచ్చిస్తున్న అరుదైన మహనీయుడని పేర్కొన్నారు. ప్రముఖ సాహితీవేత్త ప్రొఫెసర్ శరత్ జ్యోత్స్నారాణి మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు ఈ గ్రంథాలు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గాన సభ అధ్యక్షుడు వీఎస్ కళాజనార్ధనమూర్తి, అపర్ణ పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముషీరాబాద్: ముషీరాబాద్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2024–25 సంవత్సరానికిగాను మొదటి విడత ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో జూన్ 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ హనుమానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 16 నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలైందని పేర్కొన్నారు. ఈ కళాశాలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, టర్నర్, మెషినిస్ట్, ఆర్ అండ్ ఏసీ, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ, సోలార్ టెక్నీషియన్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

- అవగాహన కల్పిస్తున్న బస్తీ సంక్షేమ సంఘం


అవగాహనలో పాల్గొన్న ప్రతినిధులు

వెంకటేశ్వరకాలనీ: ఓపెన్ గార్బేజ్ పాయింట్లలో చెత్త వేయవద్దని, ఇంటి వద్దకు వచ్చే చెత్త బండికి మాత్రమే చెత్తను అందజేయాలంటూ బస్తీ సంక్షేమ సంఘం, మహిళా సమాఖ్యల ప్రతినిధులు అవగాహన కల్పించారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం11లోని గౌరీ శంకర్ కాలనీ, సరస్వతి స్కూల్ వద్ద ఓపెన్ గార్బేజీ పాయింట్ వద్ద గౌరీ శంకర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఉదయ్ నగర్, గౌరీ శంకర్ కాలనీ మహిళా సమాఖ్యల ప్రతినిధులు, రిసోర్స్ పర్సన్లు స్థానికులకు అవగాహన కల్పించారు. నిత్యం రోడ్లమీద చెత్త వేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఇంటింటికి తిరిగి సర్వే చేసి ప్రతీ ఇంటి వద్ద ప్రత్యేక చెత్త డబ్బాను ఏర్పాటు చేయాలని ఇంటి యజమానులకు సూచించారు. గౌరీ శంకర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తు, భీమ్‌రావు, నజీర్, బాలాజీ గోస్వామి, మహిళా సమాఖ్యల ప్రతినిధులు పాల్గొన్నారు.

ల్యాండ్ బ్యాంకులోని స్థలం కబ్జాకు ఎత్తుగడలు

అడ్డుకున్న అధికారులు


ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రహరీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని దావూద్‌జంగ్ కాలనీ వెనుక వైపు ఉన్న 250 గజాల స్థలాన్ని ఆక్రమించేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారు. 14 ఏళ్లుగా ఇక్కడ ఉన్న ఈ ప్రభుత్వ స్థలం ల్యాండ్ బ్యాంకులో అధికారులు నమోదు చేశారు. ఈ స్థలంలోకి రెవెన్యూ అధికారులు రాకుండా స్టేటస్ కో తెచ్చిన సదరు వ్యక్తులు సెలవు రోజుల్లో స్థలం చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రెవెన్యూ అధికారులు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు, ఈ స్థలం నాలాను ఆనుకొని ఉండటంతో నీటి పారుదల శాఖ అధికారులకు లేఖ రాశారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం ఇక్కడికి వచ్చి నిర్మించిన గోడను తొలగించారు. స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ స్థలంలో గతంలో బస్తీవాసులు ప్రభుత్వ పాఠశాల నిర్మించాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతులు కూడా ఇచ్చారు.

ఫుట్‌పాత్‌పై నిర్మాణ సామగ్రి వేసిన వ్యక్తిపై కేసు

ఫిలింనగర్: ఫుట్‌పాత్‌తో పాటు రోడ్డును ఆక్రమించి నిర్మాణ సామగ్రిని వేయడమే కాకుండా ట్రాఫిక్ రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న భవన యజమానిపై ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాలివీ... షేక్‌పేట నాలా పక్కన బరడీ రూపేందర్‌రెడ్డి అనే భవన యజమాని నిర్మాణ సామగ్రిని ఇక్కడ ఫుట్‌పాత్‌తో పాటు రోడ్డు పక్కన డంప్ చేశాడు. ఐరన్ రాడ్స్, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్‌ను గోల్కొండ లిక్కర్ మార్ట్ వెనుక పెద్ద ఎత్తున వేయడంతో కొంతకాలంగా ట్రాఫిక్ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అంతేకాకుండా ఈ ఐరన్ రాడ్స్ ప్రమాదకరంగా ఉండి స్థానికుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని, నిర్లక్ష్యంగా భవన నిర్మాణ సామగ్రి వేసిన రూపేందర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాల్సిందిగా టోలిచౌకి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం.ప్రేమ్‌రాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు రూపేందర్‌రెడ్డిపై ఐపీసీ సెక్షన్ 341, 283, 336ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మారణాయుధాలతో నిమ్స్‌మే మైదానంలోకి..

వెంగళరావునగర్: మారణాయుధాలతో గుర్తు తెలియని వ్యక్తులు నిమ్స్ మే మైదానంలోకి ప్రవేశించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల సమాచారం మేరకు... ఈ నెల 19వ తేదీ అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో పోలీస్ బెటాలియన్ వెనుక నుంచి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నిమ్స్‌మే ప్రాంగణంలోనికి గోడ దూకి ప్రవేశించారు. నిమ్స్‌మే సిబ్బంది టార్చ్ లైట్ వేసి వారిని పరిశీలించగా వారి వద్ద పెద్ద కత్తులు, హానికారక ఆయుధాలు కన్పించాయి. సెక్యూరిటీ గార్డులు వారిని పట్టుకోవాలని ప్రయత్నించగా వారందరూ గోడ దూకి పారిపోయారు. ఇటీవల కాలంలో నిమ్స్‌మే మైదానంలో ఉన్న విలువైన గంధం చెట్లను నరికి తీసుకెళ్తున్నారు. వాస్తవానికి ఇక్కడ దేశ విదేశాలకు చెందిన ప్రతినిధులకు శిక్షణ ఇస్తుంటారు. నిమ్స్‌మే సూపరింటెండెంట్ భిక్షపతి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం


సోనూవతి

బంజారాహిల్స్: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత అదృశ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలివీ... మధ్యప్రదేశ్‌కు చెందిన రాజేష్‌కుమార్, సోనూవతి(30) ఎనిమిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుని పొట్టకూటి కోసం హైదరాబాద్‌కు వచ్చి జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–59లో ఉంటున్నారు. రాజేష్‌కుమార్ ఓ ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తుండగా, సోనూవతి గృహిణి. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. గత నెల 24వ తేదీన సోనూవతి ఇంట్లో చెప్పకుండా తెల్లవారుజామునే వెళ్లిపోయింది. భర్త రాజేష్‌కుమార్ అన్ని ప్రాంతాలు గాలించినా ఉపయోగం లేకుండాపోయింది. ఇంట్లో పిల్లలను వదిలిపెట్టి వెళ్లడంతో పిల్లలు కోసమైనా ఇంటికి వస్తుందేమోనని ఇన్నాళ్లు ఎదురుచూసినా ఆమె జాడలేదు. దీంతో తన భార్య కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 80196 75480లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

డబ్బు, నగలతో యువతి అదృశ్యం


ప్రసన్న

రహమత్‌నగర్: ఓ యువతి డబ్బు, నగలు తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ సమాచారం మేరకు... బోరబండ డివిజన్ సాయిబాబానగర్‌కు చెందిన ప్రసన్న(27) సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోని డబ్బు, నగలతో బయటికి వెళ్లింది. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు ఆరా తీయగా ఫలితం లేక పోవడంతో బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ప్రేమ వ్యవహారం కారణంగా ప్రసన్న ఇంటి నుంచి పారిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

క్లుప్తంగా...

ఇంగ్లిష్ కఠినం..సైన్స్ మధ్యస్థం

- తొలి రోజు టెట్ ప్రశాంతం
- 77 శాతం హాజరు



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఎస్ టెట్) తొలి రోజైన సోమవారం ప్రశాంతంగా ముగిసింది. రెండు సెషన్లుగా పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో జరిగిన పరీక్షకు 17,231 మందిని కేటాయిస్తే, 13,110 మంది పరీక్ష రాశారు. 4,121 మంది గైర్హాజరయ్యారు. 76.08 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు తెలిపారు. రెండో సెషన్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగింది. ఈ పరీక్షకు 17,205 మందికి అవకాశం కల్పించారు. వీరిలో 13,686 మంది పరీక్ష రాశారు. 79.55 శాతం హాజరు నమోదైంది. మొత్తంగా పేపర్-2కు తొలి రోజు 34,436 మంది పరీక్ష రాయాల్సి ఉంటే, 26,796 మంది హాజర య్యారు. 7,640 మంది గైర్హాజర య్యారు. మొత్తంగా 77.81 శాతం హాజరు నమోదైంది. మేథ్స్ పేపర్ కొంత కఠినంగానే ఉందని విద్యార్థులు తెలిపారు. సైన్స్ మధ్యస్థంగా ఉందని, మొత్తంగా టెట్ కష్టంగానే ఉందని పలువురు వెల్లడించారు. కొత్త పాఠ్యపుస్తకాల నుంచే ప్రశ్నలు వచ్చాయన్నారు. తెలుగులో గ్రామర్, కవులపై ఎక్కువ ప్రశ్నలు వచ్చాయని, సైకాలజీలో సాధారణంగానే ప్రశ్నలు ఇచ్చినట్లు తెలిపారు. ఇంగ్లిష్‌లోనూ కఠినంగానే ప్రశ్నలున్నాయని కొంతమంది చెప్పారు. మేథ్స్, సైన్స్ ప్రశ్నలను సిలబస్ పరిధిలోని అన్ని తరగతుల నుంచి ఇచ్చినట్లు విశ్లేషకులు వెల్లడించారు.

నేడు హైదరాబాద్‌లో సీఐఎస్సీఈ సమావేశం

సాక్షి, హైదరాబాద్: కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్స్ కౌన్సిల్ (సీఐఎస్సీఈ) సమావేశం హైదరాబాద్‌లో జరగనుంది. మంగళవారం హబ్సీగూడలో నూతనంగా స్థాపించిన 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'లో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని సీఐఎస్సీఈ అనుబంధ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశానికి సీఐఎస్సీఈ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్, సెక్రటరీ జోసెఫ్ ఇమ్మాన్యుయేల్ అధ్యక్షత వహించనున్నారు. ఇరు తెలుగు రాష్ట్రాల నుంచి 200లకుపైగా సీఐఎస్సీఈ పాఠశాలలకు సంబంధించిన మేనేజర్లు, ప్రధానోపాధ్యాయులు, సీనియర్ ఉపాధ్యాయులు హాజరుకానున్నారు.

ఈ-సెట్‌లో 95.86% పాస్

- బాలికల ఉత్తీర్ణతే ఎక్కువ
- 11 విభాగాల్లోనూ 90 శాతంపైనే అర్హత
- గ్రామీణ విద్యార్థులకే టాప్ ర్యాంక్‌లు
- ఈ సెట్ ఫలితాలు వెల్లడించిన ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి
- జూన్ రెండో వారం కౌన్సెలింగ్ మొదలు

సాక్షి, హైదరాబాద్: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో చేరేందుకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈ-సెట్) ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఇందులో 95.86 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారు. బాలురు 95.20 శాతం పాసయితే, బాలికలు 97.22 శాతం ఉత్తీర్ణత సాధించారు. 11 విభాగాల్లో నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలో ఎక్కువ మంది బాలురే టాప్ ర్యాంకులు దక్కించుకున్నారు. ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో మాత్రం మొదటి ఐదు ర్యాంకుల్లో నాలుగు ర్యాంకులు అమ్మాయిలకే దక్కాయి. కెమికల్ ఇంజనీరింగ్‌లో మొదటి ఐదు ర్యాంకులూ ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకే వచ్చాయి.

అర్హత సాధించిన 22,365 మంది విద్యార్థులు

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 6వ తేదీన ఈసెట్ జరిగింది. 24,272 మంది ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేశారు. వీరిలో 23,330 మంది పరీక్ష రాశారు. 22,365 మంది అర్హత సాధించారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి ఫలితాలను విడుదల చేయగా, ఈ కార్యక్రమంలో మండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ మహమ్మద్, ప్రొఫెసర్ వెంకటరమణ, మండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ డి రవీందర్, టీఎస్ఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాస్ అయిన ప్రతి ఒక్కరికీ సీట్లు రావొచ్చు

టీఎస్ ఈసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియను జూన్ రెండో వారం నుంచి ప్రారంభిస్తున్నట్టు మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. ఈ సెట్ ద్వారా భర్తీ చేసే ఇంజనీరింగ్ సీట్లు రాష్ట్రంలో 25,288 ఉన్నట్టు చెప్పారు. త్వరలో ఇందుకు సంబంధించిన షెడ్యూల్ ఇస్తామన్నారు. డిప్లొమా కోర్సులకు ఇటీవల కాలంలో ఆదరణ పెరుగుతోందని, క్యాంపస్ నియామకాల్లో మంచి వేతనాలతో కూడిన ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. రాత్రిపూట క్లాసులు నిర్వహించే విధానాన్ని తీసుకొస్తున్నామని ఆయన వెల్లడించారు. కెమికల్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులు తెలంగాణలో లేవని, అందుకే ఏపీ విద్యార్థులే ఈ కోర్సు రాసినట్టు తెలిపారు. ఉత్తీర్ణులైన ప్రతి ఒక్కరికీ సీట్లు వస్తాయన్న ఆశాభావాన్ని లింబాద్రి వ్యక్తం చేశారు.

వివిధ విభాగాల్లో తొలి ఐదు ర్యాంకర్లు వీరే...



సుధాకర్ రెడ్డి, అనిల్‌కుమార్, రఘువర్ధన్

సివిల్ ఇంజనీరింగ్

పేరు	ప్రాంతం
గెదోల్ల సుధాకర్‌రెడ్డి	కూకట్‌పల్లి, మేడ్చల్
అచ్చన అనిల్‌కుమార్	కొణిజర్ల, ఖమ్మం
టి రఘువర్ధన్	జోగులాంబ గద్వాల్
వీరమల్ల వంశీకృష్ణ	మంచాల, రంగారెడ్డి
గుగులోత్ అఖిల	మైలారం, వరంగల్



గణేష్, శ్రీవత్సవ్, శ్రీరామ్

ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్

అలువల గణేష్	పగడపల్లి, జగిత్యాల
టి. శ్రీవత్సవ్	భూపాలపల్లి
తుపాకుల శ్రీరామ్	రాజన్న సిరిసిల్ల
మేడిపల్ల కౌశిక్‌కుమార్	హనుమకొండ
బూదాటి దొరబాబు	గన్నవరం, ఆంధ్రప్రదేశ్



నవ్యశ్రీ, వైష్ణవ్, రవళి శ్రీ

ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్

మేడిశెట్టి నవ్యశ్రీ	శంకరపట్నం, కరీంనగర్
వేముల వైష్ణవ్	కొత్తవాడ, వరంగల్
ఉరాడి రవళి శ్రీ	స్టేషన్ ఘన్‌పూర్, జనగామ
న్యాలకొండ శ్వేత	రాజన్న సిరిసిల్ల
వి అశ్రిత	తిమ్మాపూర్, కరీంనగర్



సాయి అశ్రిత్, సాయి విఘ్నేష్, దీక్షిత్

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్

పంచదార సాయి అశ్రిత్	మేడ్చల్, మల్కాజిగిరి
లవంగ సాయి విఘ్నేష్	అల్వాల్, హైదరాబాద్
నానవేణి దీక్షిత్	జమ్మికుంట, కరీంనగర్
పూల వివేక్	గీసుకొండ, వరంగల్
రితీష్ జంజీరపు	పెగడపల్లి, జగిత్యాల



శ్రీరాం, చందు, సాత్విక్

మెకానికల్

కిల్లి శ్రీరాం	విశాఖపట్నం
కందికొండ చందు	దుగ్గొండి, వరంగల్
తేజావత్ సాత్విక్	భద్రాద్రి కొత్తగూడెం
వీరమల్ల గణేష్	గట్టుపల్లి, నల్లగొండ
పి శివకుమార్	చిగురుమామిడి, కరీంనగర్

విభాగాల వారీగా అర్హత

విభాగం	పరీక్ష రాసిన వారు	ఉత్తీర్ణులు	శాతం
కెమికల్ ఇంజనీరింగ్	187	173	92.51
సివిల్ ఇంజనీరింగ్	3609	3496	96.87
కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్	4131	4057	98.21
ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్	6002	5892	98.17
ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్	5407	4889	90.42
ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్	147	144	97.96
మెకానికల్ ఇంజనీరింగ్	3340	3221	96.44
మెటలర్జికల్ ఇంజనీరింగ్	83	80	96.39
మైనింగ్ ఇంజనీరింగ్	348	338	97.13
బీఎస్సీ (మేథ్స్)	10	10	100
ఫార్మసీ	66	65	98.48
మొత్తం	23330	22365	95.86

23 వరకు లాసెట్-2024 దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): లాసెట్-2024, పీజీఎల్‌సెట్-2024 దరఖాస్తులను ఈనెల 23 వరకు స్వీకరించనున్నట్లు కన్వీనర్ విజయలక్ష్మి సోమవారం తెలిపారు. ఇంత వరకు దరఖాస్తు చేయని అభ్యర్థులు రూ.2,000 అపరాధ రుసుముతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

ముగిసిన వీసీల పదవీకాలం

- తాత్కాలికంగా కొనసాగింపా? ఇన్‌చార్జీల నియామకమా?
- సెర్చ్ కమిటీల నివేదిక తర్వాతే పది వర్సిటీలకు కొత్త వారి నియామకం
- ఇప్పటివరకు స్పష్టత ఇవ్వని సర్కార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాల ఉప కులపతుల పదవీ కాలం మంగళవారంతో ముగుస్తోంది. అయితే వీరిని కొంతకాలం కొనసాగించడమా? కొత్త వారిని నియమించడమా? అనే విషయంలో ప్రభుత్వం ఇంత వరకూ స్పష్టత ఇవ్వలేదు. వాస్తవానికి వీసీల పదవీకాలం ముగిసేలోగానే కొత్తవారి నియామకం చేపట్టాల్సి ఉంది. ఈ ప్రక్రియకు ఎన్నికల కోడ్ అడ్డు వచ్చింది. దీంతో ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుని వీసీల నియామకం కోసం సెర్చ్ కమిటీలను నియమించారు. కానీ ఈ కమిటీలు ఇప్పటివరకూ సమావేశం కాలేదు. ఈ నేపథ్యంలో గడువు ముగిసిన వీసీల స్థానంలో ఐఏఎస్ అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇస్తారని, లేదా కొత్త వారిని నియమించే వరకూ పాత వారినే కొంతకాలం కొనసాగిస్తారని భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఉస్మానియా, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, జేఎన్టీయూ, కాకతీయ, మహాత్మాగాంధీ. శాతవాహన, తెలంగాణ, పాలమూరు, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీల వీసీల పదవీకాలం ఈ నెల 21తో ముగుస్తోంది. కాకతీయ వర్సిటీ వీసీ నియామకానికి సంబంధించి సాంకేతిక కారణాల వల్ల సెర్చ్ కమిటీ కూడా వేయలేదు. అయితే, పది వీసీల పోస్టులకు ఇప్పటి వరకూ 312 మంది నుంచి 1,382 దరఖాస్తులు అందాయి. వీటిని సెర్చ్ కమిటీ సమగ్రంగా విచారించి, ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

రూ. 6.20 లక్షలు చెల్లించండి

- వడ్డీతో సహా ఇవ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- జైలులో ఖైదీ మృతి...పరిహారంతో ఆ కుటుంబానికి ఊరట

సాక్షి, హైదరాబాద్: జైలులో ఖైదీ మృతి చెందగా, కోర్టు తీర్పుతో ఆ కుటుంబానికి ఊరట లభించింది. బాధిత కుటుంబానికి రూ.6.20 లక్షల పరిహారాన్ని చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 2012, జూలై 4 నుంచి 3 శాతం వడ్డీతో కలిపి ఆర్డర్ ఇచ్చిన మూడు నెలల్లో అందజేయాలని తేల్చిచెప్పింది. కేసు వివరాల్లోకి వెళితే.. ఓ కేసులో ఐపీసీ 302 కింద నేరం రుజువు కావడంతో మెదక్ జిల్లా టేక్మాల్ మండలం కుసంగి గ్రామానికి చెందిన కె.వెంకయ్యకు ట్రయల్‌కోర్టు జీవితఖైదు విధించింది. చర్లపల్లి జైలులో ఉంటున్న వెంకయ్యపై 2012, జూలై 4న మరో ఖైదీ డి.నర్సింహులు కత్తెరతో దాడి చేశాడు. గాయపడిన వెంకయ్యను గాంధీ ఆస్పత్రికి తరలించగా, అదే రోజు మృతి చెందాడు. జైలు అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త మృతి చెందాడంటూ భార్య జయమ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనికి బాధ్యత వహిస్తూ ప్రభుత్వం పరిహారం చెల్లించాలని కోరినా.. అందుకు నిరాకరించిందని పేర్కొన్నారు. దీంతో విధిలేక హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని, రూ.10 లక్షలు చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ న్యాయవాది పల్లె శ్రీహరినాథ్ వాదనలు వినిపిస్తూ జైలు అధికారుల బాధ్యతారాహిత్యమే వెంకయ్య మృతికి కారణమన్నారు. జైలు అధికారులు నిబంధన మేరకే వ్యవహరించారని, ఇందులో వారి నిర్లక్ష్యం ఏమీ లేదని హోంశాఖ తరఫున జీపీ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి మృతిచెందే నాటికి 55 ఏళ్ల వెంకయ్య నెలకు రూ.7,200 సంపాదిస్తున్నారని, సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం.. లెక్కగట్టి రూ.6,33,600 అవుతుందని పేర్కొన్నారు. ఇతర ఖర్చులన్నీ కలిపి రూ.7.2 లక్షల అవుతుందని లెక్కించారు. అయితే జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాల మేరకు 2018లో రూ.లక్ష చెల్లించినందున మిగిలిన రూ.6.2 లక్షల అందజేయాలని ఆదేశించారు.


ఎలక్షన్-2024

బీజేపీ అభ్యర్థుల్లో... నాలుగోవంతు
ఫిరాయింపుదారులే

దేశవ్యాప్తంగా 435 స్థానాల్లో బీజేపీ పోటీ | **వారిలో ఏకంగా 106 మంది వలస పక్షులే**

నేతలు పార్టీలు మారడం, సిద్ధాంతాలు మార్చుకోవడం రాజకీయాల్లో పరిపాటే. చాలా ఏళ్లుగా ఉన్న ధోరణే. కానీ సిద్ధాంతాలు, విలువలకు పెద్దపీట వేస్తామని చెప్పుకునే బీజేపీ కొన్నాళ్లుగా ఫిరాయింపు నేతలకు పెద్దపీట వేస్తుండటం విశేషం. ఈ లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బరిలో ఉన్న 435 మంది బీజేపీ అభ్యర్థులను గమనిస్తే ఆశ్చర్యకరమైన వివరాలు తెలుస్తాయి. వీరిలో ఏకంగా 106 మంది, అంటే నాలుగో వంతు అభ్యర్థులు గత పదేళ్లలో కమలం గూటికి వలస వచ్చినవాళ్లే! అందులోనూ 90 మంది గత ఐదేళ్లలో బీజేపీలోకి ఫిరాయించారు!

- సాక్షి, నేషనల్ డెస్క్



ప్రముఖ జంపర్లు

జ్యోతిరాదిత్య సింధియా (కేంద్ర మంత్రి, కాంగ్రెస్ మాజీ నేత-గుణ)
జితిన్ ప్రసాద (కాంగ్రెస్ మాజీ నేత-పిలిభీత్)
నవీన్ జిందాల్ (ప్రముఖ పారిశ్రామికవేత్త-కురుక్షేత్ర)
అశోక్ తన్వర్ (హరియాణా పీసీసీ మాజీ చీఫ్-సిర్సా)
ప్రణీత్ కౌర్ (అమరీందర్‌సింగ్ భార్య-పటియాలా)
సీతా సోరెన్ (జేఎంఎం ఎమ్మెల్యే-దుమ్కా)

ఈసారి ఎలాగైనా 2019 కంటే ఎక్కువ లోక్‌సభ స్థానాలు సాధించాలని అధికార బీజేపీ ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తోంది. ప్రాంతీయ పార్టీల్లో టికెట్లు రాని వారు, మోదీ మేనియా కలిసొస్తుందని భావించిన వాళ్లు ఎన్నికల ముందే బీజేపీలో చేరారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ఆరు లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయగా వారిలో ఏకంగా ఐదుగురు 2019 తర్వాతే పార్టీ తీర్థం తీసుకోవడం విశేషం! తెలంగాణలోనూ 17 మంది బీజేపీ అభ్యర్థుల్లో 11 మంది 2014 తర్వాత వచ్చి చేరిన వారే. వీరిలో చాలామంది మాజీ కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్ నేతలే.

ఇతర రాష్ట్రాల్లోనూ అంతే..

ఏపీ వంటి చోట్ల బీజేపీ బలహీనంగా ఉంది గనుక వలస నేతలకు పెద్దపీట వేసిందనుకుంటే పార్టీ అత్యంత బలోపేతంగా ఉన్న యూపీ, హరియాణా తదితర చోట్లా ఇదే బాట పట్టడం ఆశ్చర్యం కలిగించేదే! హరియాణాలోని 10 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ తరఫున బరిలో ఉన్నవారిలో ఆరుగురు 2014 తర్వాత పార్టీలో చేరినవారే. ప్రముఖ పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్ అయితే లోక్‌సభ ఎన్నికల ముందే బీజేపీ కండువా కప్పుకున్నారు. పీసీసీ మాజీ చీఫ్ అశోక్ తన్వర్ కూడా అంతే. ఇక యూపీలో బీజేపీ సొంతంగా పోటీ చేస్తున్న 74 లోక్‌సభ స్థానాలను చూస్తే 23 చోట్ల బరిలో ఉన్నవాళ్లు బయటి నుంచి వచ్చినవారే. అంటే ఏకంగా 31 శాతం! పంజాబ్‌లోని 13 స్థానాల్లో ఏకంగా ఏడుగురు బీజేపీ అభ్యర్థులు వలస వచ్చిన బాపతే. వీరిలో చాలామంది కాంగ్రెస్ మాజీలే. వీరు చాలావరకు మాజీ సీఎం అమరీందర్ సింగ్ తన పార్టీని బీజేపీలో విలీనం చేసినప్పుడు బీజేపీలోకి వచ్చారు. జార్ఖండ్‌లో కూడా 13 మంది బీజేపీ అభ్యర్థుల్లో ఏడుగురు జేఎంఎం, కాంగ్రెస్, జార్ఖండ్ వికాస్ మోర్చాల నుంచి జంప్ చేసిన నేతలే. వీరిలో మాజీ సీఎం హేమంత్ సోరెన్ మరదలు సీతా సోరెన్ కూడా ఉన్నారు. ఒడిశాలో 29 శాతం, తమిళనాడులో 26 శాతం మంది బీజేపీ అభ్యర్థులు ఫిరాయింపుదారులే! మహారాష్ట్రలోనూ పావు వంతు బీజేపీ అభ్యర్థులు బయటి నుంచి వచ్చిన బాపతే.

ఎందుకని..?

బీజేపీ బలహీనంగా ఉన్న ఏపీ, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలే గాక బలంగా ఉన్నచోట కూడా ఇలా ఫిరాయింపులను భారీగా ప్రోత్సహిస్తుండటం వెనుక విజయమే పరమావధి అంటున్నారు. మరీ ముఖ్యంగా గత రెండు లోక్‌సభ ఎన్నికల నుంచి యూపీలో బీజేపీ హవా నడుస్తోంది. అయినా అక్కడ కూడా 31 శాతం మంది వలసదారులకు టికెట్లివ్వడం ఇందుకు నిదర్శనం. ప్రత్యర్థి పార్టీలు బలమైన అభ్యర్థులను దింపిన చోట బీజేపీ ప్రధానంగా ఫిరాయింపుదారులనే నమ్ముకుంది. తనకు గెలుపు గుర్రాలు లేరనుకున్న లోక్‌సభ స్థానాల్లో ఇతర పార్టీల నుంచి బలమైన నాయకులను ఆకర్షించేందుకు బీజేపీ ఏమాత్రం వెనుకాడటం లేదు!

రాష్ట్రాలవారీగా ఫిరాయింపుదారులు

రాష్ట్రం	బీజేపీ అభ్యర్థులు	ఫిరాయింపుదారులు (2014 తర్వాత)
ఆంధ్రప్రదేశ్	6	5
తెలంగాణ	17	11
హరియాణా	10	6
పంజాబ్	13	7
జార్ఖండ్	13	7
ఉత్తరప్రదేశ్	74	23
ఒడిశా	21	6
తమిళనాడు	19	5
మహారాష్ట్ర	28	7
పశ్చిమబెంగాల్	42	10
బిహార్	17	3
కర్ణాటక	25	4
కేరళ	16	2
రాజస్తాన్	25	2
గుజరాత్	26	2
మధ్యప్రదేశ్	29	2
ఇతర రాష్ట్రాల్లో	54	4

అనంత్‌నాగ్-రాజౌరీలో...
అంతుపట్టని ఓటరు నాడి

పీడీపీ, ఎన్సీ హోరాహోరీ

- సవాలు చేస్తున్న చిన్న పార్టీలు
- తొలిసారి బరిలో కశ్మీరేతరుడు
- పోటీలో లేకున్నా బీజేపీ ప్రచారం

జమ్మూ కశ్మీర్‌లో అనంత్‌నాగ్-రాజౌరీ స్థానంలో పోటీ ఈసారి ఆసక్తి రేపుతోంది. ఉమ్మడి రాష్ట్ర చివరి సీఎం, పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ చీఫ్ మెహబూబా ముఫ్తీ బరిలో దిగడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. ఇక్కడ పోలింగ్ మే 7న మూడో విడతలో జరగాల్సింది. బీజేపీ, ఇతర పార్టీల విజ్ఞప్తి మేరకు ఆరో విడతలో భాగంగా మే 25కు కేంద్ర ఎన్నికల సంఘం మార్చింది...

- సాక్షి, నేషనల్ డెస్క్

2022 పునర్విభజనలో అనంత్‌నాగ్ లోక్‌సభ స్థానం కాస్తా అనంత్‌నాగ్-రాజౌరీగా మారింది. విపక్ష ఇండియా కూటమి భాగస్వాములైన నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ కశ్మీర్ లోయలో మాత్రం పరస్పరం పోటీ పడుతున్నాయి. లోయలోని 3 లోక్‌సభ స్థానాలూ 2014లో పీడీపీకే దక్కాయి. 2019లో వాటన్నింటినీ ఎన్సీ కైవసం చేసుకుంది. సిట్టింగ్ ఎంపీ హస్నాయిన్ మసూదీ కేవలం 6,676 ఓట్లతో గట్టెక్కారు. ఎన్సీ ఈసారి వ్యూహాత్మకంగా గుజ్జర్ బకర్వాల్ మత నాయకుడు, పార్టీ సీనియర్ నేత మియా అల్తాఫ్‌ను బరిలో దింపింది. ఆయనకు పూంచ్, రాజౌరిలో గట్టి మద్దతుంది. ఇది ఇతర పార్టీల ఓట్లను చీల్చే అవకాశముంది. మోదీ ప్రభుత్వం ఫిబ్రవరిలో పహాడీ జాతి సమూహాలకు షెడ్యూల్డ్ తెగ హోదా ఇచ్చాక సమీకరణాలు మారాయి. కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి వేరు కుంపటి పెట్టుకున్న గులాం నబీ ఆజాద్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డీపీఏపీ) నుంచి మహమ్మద్ సలీమ్ పారే, అప్నీ పార్టీ నుంచి జాఫర్ ఇక్బాల్ మన్హాస్ బరిలో ఉన్నారు. ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో బల్‌దేవ్ కుమార్ రూపంలో జమ్మూకశ్మీర్‌లో తొలిసారిగా ఓ స్థానికేతరుడు పోటీ చేస్తుండటం విశేషం. ఆయన స్వస్థలం పంజాబ్.

లెక్కలు మార్చేసిన డీలిమిటేషన్!

2022కు ముందు జమ్మూలో రెండు (జమ్మూ, ఉధంపూర్), కశ్మీర్‌లో మూడు (శ్రీనగర్, బారాముల్లా, అనంత్‌నాగ్), లద్దాఖ్‌లో ఒక లోక్‌సభ స్థానముండేవి. డీలిమిటేషన్ తర్వాత జమ్మూలో రెండు స్థానాలు కొనసాగినా అక్కడి పూంచ్, రాజౌరి జిల్లాల్లో చాలా భాగాన్ని కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ లోక్‌సభ స్థానంతో కలిపి అనంత్‌నాగ్-రాజౌరీగా చేశారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలో 18 అసెంబ్లీ సీట్లున్నాయి. మొత్తం 18.3 లక్షల ఓటర్లున్నారు. 10.94 లక్షల మంది కశ్మీర్ ప్రాంతంలో, 7.35 లక్షల మంది జమ్మూలో ఉన్నారు. మెజారిటీ కశ్మీరీలు ముస్లింలు. జమ్మూలో 3 లక్షల మేర గుర్జర్లు, బేకర్వాల్ సామాజిక వర్గం ఉంది. మిగతా జనాభా పహాడీలు (హిందువులు, సిక్కులు ఇతరత్రా). వారిని ఎస్టీ జాబితాలోకి చేర్చడం వంటి చర్యల ద్వారా బీజేపీ నెమ్మదిగా లోయలో పాగా వేయజూస్తోంది. ఈసారి పోటీ చేయకున్నా వేరే పార్టీలకు మద్దతిస్తోంది. బీజేపీ నేతలు తీవ్రంగా ప్రచారమూ చేస్తున్నారు. ఎన్సీ, కాంగ్రెస్, పీడీపీలపై సభలు పెట్టి మరీ విమర్శలు గుప్పిస్తున్నారు! ఆ మూడింటికి కాకుండా ఎవరికైనా ఓటేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



బీజేపీ అడ్డుకుంటోంది: ముఫ్తీ

తాము ప్రజలను కలవకుండా మోదీ సర్కారు అడ్డుకుంటోందని ముఫ్తీ ఆరోపిస్తున్నారు. ''ఆర్టికల్ 370 రద్దుతో వారు నెలకొల్పామంటున్న శాంతి నిజానికి శ్మశాన వైరాగ్యం. మాకది ఆమోదయోగ్యం కాదు. జమ్మూ కశ్మీర్ యంత్రాంగం దన్నుతో దక్షిణ కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్లు మొదలయ్యాయి'' అని మండిపడుతున్నారు.


కశ్మీరీ పండిట్ ఒంటరి పోరు

కశ్మీరీ పండిట్లు. 1980ల్లో పెచ్చరిల్లిన హింసాకాండకు తాళలేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వలసపోయిన ప్రజలు. ఏళ్ల కొద్దీ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ఈ వర్గానికి చెందిన దిలీప్ కుమార్ పండిత (54) ఈసారి అనంత్‌నాగ్-రాజౌరి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు! ముఫ్తీ, మియా అల్తాఫ్ అహ్మద్‌లకు గట్టి సవాల్ విసురుతున్నారు. పౌర చర్చల ద్వారా పండిట్లు, ముస్లింలతో పాటు కశ్మీరీలందరినీ ఏకం చేస్తానన్నది ఆయన హామీల్లో ప్రధానమైనది. నిజాయితీగా ఆయన చేస్తున్న ప్రయత్నం స్థానికులను ఆకర్షిస్తోంది. ప్రతి గడపకూ వెళ్లి ఓట్లడుగుతున్నారు. స్థానికులతో భేటీ అవుతున్నారు. ఐదు వలస శిబిరాల్లో ఉన్న 35,000 మంది పండిట్లను తనకే ఓటేయాలని కోరారు. ''35 ఏళ్లుగా ఇంటికి దూరంగా బతుకుతున్నాం. మాకిప్పటికీ న్యాయం జరగలేదు. కశ్మీరీ పండిట్లకు న్యాయం కోసం, వారు లోయలోకి సురక్షితంగా తిరిగొచ్చే పరిస్థితులను నెలకొల్పడం కోసం పోరాడుతున్నాను'' అని మీడియాకు తెలిపారు పండిత.



ఆకాశమే హద్దు

డైరెక్టర్‌గా, ప్రొడ్యూసర్‌గా బాలీవుడ్‌లో గుర్తింపు పొందిన ఫౌజియా అర్షి మేనేజ్‌మెంట్ అండ్ మార్కెటింగ్ పుస్తకాల రచయిత్రి, గిటారిస్ట్, సింగర్, మ్యూజిక్ కంపోజర్, డైలాగ్ రైటర్. ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి ఎంటర్‌ప్రెన్యూర్‌గా కూడా విజయపథంలో దూసుకుపోతోంది. ఎఫ్‌ఎ ఎయిర్‌లైన్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా తాజాగా మరో సవాలును స్వీకరించనుంది.


మల్టీ టాలెంట్
ఫౌజియా అర్షి


ఖాళీగా కూర్చోకుండా కాలాన్ని సద్వినియోగం చేసుకోవడంలో ఫౌజియా అర్షి పెట్టింది పేరు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన ఫౌజియాకు టైమ్ అంటే కొత్త విషయం తెలుసుకోవడం. కొత్త కళలో అక్షరాలు దిద్దడం. కాలాన్ని అద్భుతంగా సద్వినియోగం చేసుకున్న ఆమె కృషి వృథా పోలేదు. 'బహుముఖ ప్రజ్ఞాశాలి' అని ప్రపంచం గుర్తించేలా చేసింది.

'హోగయా దిమాగ్ క దహీ' బాలీవుడ్ సినిమాతో నవ్వులు పూయించింది. ఈ రోరింగ్ కామెడీ ఫిల్మ్‌లో ఓంపురి, రాజ్‌పాల్ యాదవ్ లాంటి నటులు నటించారు.

ఫస్ట్–జెనరేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా టీనేజ్‌లోనే తన వ్యాపారదక్షతను చాటుకుంది ఫౌజియా.

'ఇంటర్నేషనల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్' పేరుతో ఆమె రాసిన పుస్తకానికి మంచి పేరు వచ్చింది. మేనేజ్‌మెంట్ డిప్లొమా కోర్సుల విద్యార్థులకు బాగా ఉపకరించే ఈ పుస్తకం ప్రపంచ మార్కెటింగ్‌కు సంబంధించిన ఆర్థిక, రాజకీయ, భౌగోళిక వాతావరణాన్ని కళ్లకు కడుతుంది. 'ది సన్ రైజెస్ ఫ్రమ్ ది వెస్ట్' అనేది దీనికి పూర్తిగా భిన్నమైన పుస్తకం. 'ఏది వాస్తవం?' అంటూ వాస్తవాన్ని గురించి లోతుగా విశ్లేషించే పుస్తకం. తాత్విక ఛాయలు కనిపించే ఈ పుస్తకం రకరకాల చుక్కలను కనెక్ట్ చేసి ఒక రూపాన్ని మన ముందు ఆవిష్కరిస్తుంది.


డైరెక్టర్‌గా...



రైటర్‌గా...

ఎంత అలవోకగా పుస్తకం రాయగలదో అంతే అలవోకగా రాగం తీయగలదు. అప్పటికప్పుడు పదాలు అల్లుతూ పాట పుట్టించగలదు. కాన్వాస్‌పై కనువిందు చేసే చిత్రాన్ని సృష్టించగలదు. ఇక గిటారిస్ట్‌గా ఆమె నైపుణ్యం సరేసరి. మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్‌గా ఎంత జటిలమైన విషయాలనైనా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించగలదు.

ఫౌజియాకు చెందిన డైలీ మల్టీ మీడియా లిమిటెడ్ (డిఎంఎల్)... సినిమాలు, టెలివిజన్ కంటెంట్, యాడ్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీలు, షార్ట్ ఫిల్మ్స్, ఈవెంట్ ఆర్గనైజింగ్, పొలిటికల్ క్యాంపెయిన్‌కు సంబంధించిన కంపెనీ.


గిటారిస్ట్‌గా...

సామాజిక సేవారంగంలో చేస్తున్న కృషిని దృష్టిలో పెట్టుకొని ఫౌజియాను బ్రిటన్ పార్లమెంట్ సత్కరించింది.

ఫౌజియాకు ఇంగ్లీష్ భాషలో ఇష్టమైన మాట 'న్యూ ఛాలెంజ్'.

ఎప్పటికప్పుడు కొత్త ఛాలెంజ్‌లను అధిగమిస్తూ తన సత్తా చాటుతోంది.

తాజా విషయానికి వస్తే...
ముంబైకి చెందిన ఎఫ్‌ఎ ఎయిర్‌లైన్స్ ప్రాంతీయ విమానయాన సంస్థ 'ఫ్లైబిగ్'ను కొనుగోలు చేసే ప్రక్రియ జరుగుతోంది. లావాదేవీలు పూర్తయిన తరువాత 'ఫ్లైబిగ్'ను మరిన్ని విమానాలతో విస్తరించనున్నారు. ఎఫ్‌ఎ ఎయిర్‌లైన్స్‌కు ఫౌజియా అర్షి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉంది. 'ఫ్లైబిగ్' రూపంలో మరో సవాలు అర్షి ముందుకు రానుంది. ఈ సవాలును కూడా ఫౌజియా విజయవంతంగా అధిగమించగలరన్నది ఆమె గురించి తెలిసిన వారు కాస్త గట్టిగానే చెప్పేమాట.

● నోమొఫోబియా



ఫోన్ కనపడకపోతే ప్రాణం పోతోందా?

ఒక్క నిమిషం.. ఫోన్ కనపడదు.
చాలా భయం. చాలా ఆందోళన.
చాలా కోపం. చాలా వణుకు.
ఈ లక్షణాలన్నీ ఉంటే
మీకు 'నో మొబైల్ ఫోన్ ఫోబియా'
లేదా 'నోమొఫోబియా' ఉన్నట్టే.
ఇది మీకు చేటు చేస్తుంది.
దీన్నుంచి బయటపడమని
సైకియాట్రిస్ట్‌లు సూచిస్తున్నారు.

ఇంతకుముందు మనిషి రెండు చేతులు రెండు కాళ్లతో ఉండేవాడు. ఇప్పుడు అతని చేతికి అదనపు అంగం మొలుచుకుని వచ్చింది– మొబైల్ ఫోన్. అది లేకుండా గతంలో మనిషి బతికాడు. ఇప్పుడూ బతకొచ్చు. కాని మొబైల్ ఫోన్‌తో మన వ్యక్తిగత, కుటుంబ, వృత్తిగత, స్నేహ, సాంఘిక సమాచార సంబంధాలన్నీ ముడి పడి ఉన్నాయి కాబట్టి అది కలిగి ఉండక తప్పదు. అలాగని అదే జీవితంగా మారితే నష్టాలూ తప్పవు. ఐదు నిమిషాల సేపు ఫోన్ కనిపించకపోతే తీవ్ర ఆందోళన చెందుతూ ఉన్నా, సినిమాకు వెళ్లినప్పుడైనా మూడు గంటల సేపు ఫోన్ స్విచ్చాఫ్ చేయలేకపోయినా, రాత్రి ఫోన్ ఎక్కడో పడేసి మీరు మరెక్కడో నిద్రపోలేకపోయినా, ఎంత ఆత్మీయులొచ్చినా ఫోన్ వైపు చూడకుండా దానిని చేతిలో పెట్టుకోకుండా వారితో గడపలేకపోయినా మీకు 'నోమొ ఫోబియా' ఉన్నట్టు.

కేస్‌స్టడీ 1

ఆఫీస్ నుంచి హుషారుగా ఇల్లు చేరుకున్న సుందర్ కాసేపటికి బట్టలు మార్చుకుని ముఖం కడుక్కుని రిలాక్స్ అయ్యాడు. ఫోన్ గుర్తొచ్చింది. టీ పాయ్ మీద లేదు. టీవీ ర్యాక్ దగ్గర లేదు. కంగారుగా భార్యను పిలిచి ఆమె ఫోన్‌తో రింగ్ చేయించాడు. రింగ్ వస్తోంది కాని ఇంట్లో ఆ రింగ్ వినపడలేదు. సుందర్‌కు చెమటలు పట్టాయి. మైండ్ పని చేయలేదు. ఎక్కడ మర్చిపోయాడు. కారు తాళాలు తీసుకుని కిందకు వెళ్లి కారులో వెతికాడు. లేదు. మళ్లీ పైకి వచ్చి ఇల్లంతా వెతికాడు. దారిలో పెట్రోలు పోయించుకున్నాడు... అక్కడేమైనా పోయిందా? మరోచోట ఫ్రూట్స్ కొని ఫోన్‌పే చేశాడు. అక్కడ పడేసుకున్నాడా? ఫోన్.. మొబైల్ ఫోన్.. అది పోతే... అది పోతే... మైండ్ దిమ్మెక్కిపోతోంది. సరిగ్గా అప్పుడే అతని కూతురు వచ్చి రక్షించింది. 'నాన్నా.. ప్యాంట్ జేబులో మర్చిపోయావు. వాల్యూమ్ లో అయి ఉంది' అని. ఫోన్ కనపడకపోతే ప్రాణం పోతుంది ఇతనికి. అంటే నోమొ ఫోబియా ఉన్నట్టే.

కేస్ స్టడీ 2

ఇంటికి చాలా రోజుల తర్వాత గెస్ట్‌లు వచ్చారు. వారు ఎదురుగా కూచుని మాట్లాడుతున్నారు. ఇంటి యజమాని విజయ్ ఫోన్ చేతిలో పట్టుకుని వారితో మాట్లాడుతున్నాడు. ప్రతి నిమిషానికి ఒకసారి ఫోన్ చూస్తున్నాడు. వాళ్లతో మాట్లాడుతూనే ఫేస్‌బుక్ స్క్రోల్ చేస్తున్నాడు. వాళ్లతో మాట్లాడుతూనే వాట్సప్ చెక్ చేస్తున్నాడు. వాళ్ల వైపు ఒక నిమిషం ఫోన్ వైపు ఒక నిమిషం చూస్తున్నాడు. వాళ్లకు విసుగొచ్చి కాసేపటికి లేచి వెళ్లిపోయారు. విజయ్‌కు నోమొ ఫోబియా ఉంది.

కేస్ స్టడీ 3

దుర్గారావు ఆఫీస్ పని మీద వేరే ఊరు వెళ్లి హోటల్‌లో దిగాడు. దిగాక గాని తెలియలేదు అక్కడ ఫోన్ సిగ్నల్స్ అందవని. కాల్స్ ఏమీ రావడం లేదు. డేటా కూడా సరిగ్గా పని చేయడం లేదు. ఆ ఊళ్లో వేరే మంచి హోటళ్లు లేవు. సిగ్నల్ కోసం హోటల్ నుంచి గంట గంటకూ బయటకు వెళ్లాల్సి వస్తోంది. ఇక అక్కడ ఉన్నంత సేపు దుర్గారావుకు అస్థిమితమే. చిరాకే. ఏ కాల్ మిస్సవుతున్నానో అన్న బెంగే. ఏ మెసేజ్ అందడం లేదో అన్న ఆందోళనే. ఇదీ నోమొ ఫోబియానే.

ఎలా బయటపడాలి?

- ఖాళీ సమయాల్లో మెల్లమెల్లగా ఫోన్‌ను పక్కన పడేయడం ప్రాక్టీస్ చేయండి.
- రోజులో ఒక గంటైనా ఏదో ఒక సమయాన ఫోన్ స్విచ్చాఫ్ చేయడం మొదలుపెట్టండి.
- సినిమాలకు, శుభకార్యాలకు వెళ్లినప్పుడు ఫోన్ ఇంట్లో పడేయడమో, మ్యూట్ చేసి జేబులో పడేయడమో చేయండి.
- ఫోన్ నుంచి దృష్టి మరల్చే ఆటలు, పుస్తక పఠనం, ఇతర హాబీలపై దృష్టి పెట్టండి.
- యోగా, ప్రాణాయామం చేయడం మంచిది.
- ఫోన్‌లో మీ కాంటాక్ట్స్, ముఖ్యమైన ఫొటోలు, ఇతర ముఖ్య సమాచారం పర్సనల్ కంప్యూటర్‌లోనో మెయిల్స్‌లోనో నిక్షిప్తం చేసుకుని ఫోన్ ఎప్పుడుపోయినా మరో సిమ్ కొనుక్కోవచ్చు అనే అవగాహన కలిగి ఉంటే నోమొ ఫోబియాను దాదాపుగా వదిలించుకోవచ్చు.

నష్టాలు

- నోమొఫోబియా ఉంటే మీ అనుబంధాలు దెబ్బ తింటాయి. ఎందుకంటే అనుబంధాల కంటే ఫోన్‌తో బంధం ముఖ్యమని భావిస్తారు కాబట్టి.
- నోమొ ఫోబియా మీ లక్ష్యాలపై మీ ఫోకస్‌ను తప్పిస్తుంది. మీరు ఎక్కువసేపు ఒక పని మీద మనసు లగ్నం చేయరు. దీనివల్ల చదువుకునే విద్యార్థి, పని చేయాల్సిన ఉద్యోగి, ఇంటిని చక్కదిద్దే గృహిణి అందరూ క్వాలిటీ వర్క్‌ను నష్టపోతారు. పనులు పెండింగ్‌లో పడతాయి.
- నోమొ ఫోబియా కలిగిన వారు తమను తాము నమ్ముకోవడం కన్నా ఫోన్‌ను నమ్ముకుంటారు. చివరకు ఫోన్ లేకుండా ఇంట్లో నుంచి అడుగు బయటపెట్టడానికి కూడా ఇష్టపడరు.
- సోషల్ మీడియా సంబంధాలే అసలు సంబంధాలుగా భావించి అసలు సంబంధాలు కోల్పోతారు.
- ఫోన్ ఇతరుల చేతుల్లో పడితే వారు ఏమి ఆరా తీస్తారోనని అనుక్షణం ఫోన్‌ని కనిపెట్టుకుని ఉంటారు.

అర్బన్ అన్నదాత!

సాగుబడి
కృత్తిక కార్తె : మే 25 వరకు
రోహిణి కార్తె : మే 26 నుంచి

- అర్బన్ సాగు కోసం సొంత టెక్నాలజీలను అభివృద్ధి చేసిన హైదరాబాద్ సంస్థ 'అర్బన్ కిసాన్'
- అర్బన్ సాగుకు అనుగుణంగా స్పీడ్ బ్రీడింగ్ పద్ధతుల్లో అనేక కూరగాయలు, పండ్ల వంగడాల రూపుకల్పన.
- పూర్తిగా సొంత టెక్నాలజీతోనే దేశ విదేశాల్లో హైబ్రిడ్ స్మార్ట్ అర్బన్ ఫామ్స్‌ను భాగస్వామ్య పద్ధతిలో నెలకొల్పుతోంది.



విస్తారమైన పొలాల్లో ఆరుబయట సాగేది సంప్రదాయ వ్యవసాయం అయితే.. నియంత్రిత వాతావరణంలో అత్యాధునిక సాంకేతికతలతో చేసేదే అర్బన్ వ్యవసాయం. మట్టిలో కాకుండా పోషకాలతో కూడిన నీటిలో వర్టికల్ స్ట్రక్చర్లలో లేదా కొబ్బరి పొట్టుతో కూడిన గ్రోబ్యాగ్స్‌లో అర్బన్ సాగు జరుగుతూ ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక సాగు వ్యవస్థలతో పాటు ప్రత్యేకంగా బ్రీడింగ్ చేసిన వంగడాలు కూడా అవసరమే అంటోంది 'అర్బన్ కిసాన్'. మానవాళి రేపటి ఆహారపు, పర్యావరణ అవసరాలు తీర్చటం కోసం స్పీడ్ బ్రీడింగ్ తదితర పద్ధతుల్లో పరిశోధనలు చేపట్టి చక్కని పురోగతి సాధిస్తోంది. ఈ హైదరాబాద్ సంస్థ విదేశాల్లోనూ సత్తా చాటుతోంది. తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం సహా పలు సంస్థల భాగస్వామ్యంతో అర్బన్ సాగు ప్రపంచంలో తనదైన ముద్ర వేస్తోంది.


హైదరాబాద్ నగర శివారు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గుండ్లపోచంపల్లి పారిశ్రామికవాడలోని అర్బన్ కిసాన్ పరిశోధన కేంద్రంలో హైడ్రోపోనిక్స్ సాగు దృశ్యాలు

పట్టణీకరణ తామరతంపరగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో అత్యాధునిక సాంకేతికతలతో కూడిన అర్బన్ ఫార్మింగ్ పద్ధతులు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ కోవలోనివే హైడ్రోపోనిక్స్, సాయిల్ లెస్ ఫార్మింగ్, వర్టికల్ ఫార్మింగ్, ఇండోర్ ఫార్మింగ్ వంటివి. ఈ సాగు వ్యవస్థలను ముఖ్యంగా అర్బన్ రైతులకు అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో హైదరాబాద్ సమీపంలో ఏడేళ్ల క్రితం ప్రారంభమైంది 'అర్బన్ కిసాన్'. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంతో పాటు అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో పనిచేస్తూ అర్బన్ కిసాన్ అభివృద్ధి సాధిస్తోంది.
ఇక్కడ పండించిన లెట్యూస్, ఇటాలియన్ బసిల్ తదితర ఆకుకూరలు, రంగురంగుల కాప్సికం తదితర కూరగాయలతో తయారైన సలాడ్స్‌ను ఫార్మ్‌బౌల్ పేరుతో హైదరాబాద్‌లో అందుబాటులోకి తెస్తోంది.

అర్బన్ సాగు కోసం ప్రత్యేక వంగడాలు

హైదరాబాద్ నగర శివారు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గుండ్లపోచంపల్లి పారిశ్రామికవాడలో అర్బన్ కిసాన్ పరిశోధన కేంద్రం ఏర్పాటైంది. విహారి కానుకొల్లు, డాక్టర్ సాయిరాం రెడ్డి పాలిచర్ల కొందరు మిత్రులతోపాటు అర్బన్ కిసాన్ సహ వ్యవస్థాపకులుగా ఉన్నారు. విహారి సీఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, డా. సాయిరాం రెడ్డి, డా. నర్సిరెడ్డి ఆధ్వర్యంలో పరిశోధనలు సాగుతున్నాయి. హైడ్రోపోనిక్స్, వర్టికల్ ఫార్మింగ్ వ్యవస్థలను శీతల గదిలో, పాలీహౌస్‌లో, మేడపైన.. ఇలా అనేక వాతావరణ పరిస్థితుల్లో మట్టి లేకుండా వివిధ పంటలు పండించటంపై వారు లోతైన పరిశోధనలు చేస్తున్నారు.

పొలాల్లో వాడే సాధారణ వంగడాలను నియంత్రిత వాతావరణంలో, పరిమిత స్థలంలో సాగు చేయటం అనేక ఇబ్బందులతో కూడిన పని. అందుకే అర్బన్ సాగుకు అవసరమైన ప్రత్యేక వంగడాల రూపుకల్పన కృషికి అర్బన్ కిసాన్ శ్రీకారం చుట్టింది. మన దేశపు 150 రకాల కూరగాయలు, ఆకుకూరలపై ప్రయోగాలు చేశారు. తక్కువ ఉష్ణోగ్రతల్లో పండటంతో పాటు.. వేర్ల పొడవు, మొక్క సైజు, ఆకారం తదితర అంశాల్లో అర్బన్ ఫార్మింగ్‌కు అనువుగా చిన్న సైజులో ఉండేలా అనేక సరికొత్త వంగడాలను రూపొందించామని డా. సాయిరాం రెడ్డి 'సాక్షి సాగుబడి'కి తెలిపారు. ఇవి తిరిగివాడుకోదగిన సూటి రకాలేనని, వీటిని నియంత్రిత వాతావరణంలో ఏ దేశంలోనైనా పండించవచ్చన్నారు.

చెప్పినంత దిగుబడి..!

హైడ్రోపోనిక్స్ సాగు ప్రపంచవ్యాప్తంగా చేస్తున్నారు. అయితే, ఎవరి దగ్గరా కంప్లీట్ టెక్నాలజీ లేదు. మా దగ్గర తప్ప. మేం వాడుతున్నది స్వయంగా మేం దేశీయంగా పరిశోధనల ద్వారా రూపొందించుకున్న పరిపూర్ణమైన, సమగ్ర సాంకేతికత ఇది. అందుబాటులో ఉన్న టెక్నాలజీలతో పోల్చితే 60% ఖర్చుతోనే మా టెక్నాలజీని అర్బన్ ఫార్మర్స్ పొందవచ్చు. దీని ద్వారా చెప్పినంత దిగుబడి కచ్చితంగా ఇస్తుంది. ప్రపంచంలో ఎవరైనా టెక్నాలజీ అమ్ముతారు లేదా ప్రొడక్టు అమ్ముతారు. మేం అలాకాదు. ఇతర సంస్థలతో కలిసి భాగస్వామ్యంలో యూనిట్లు నెలకొల్పి ఉత్పత్తి చేసి విక్రయించి లాభాలు పంచుకుంటాం. ఈ పద్ధతిలోనే అనేక దేశాల్లో యూనిట్లు ఏర్పాటు చేశాం. పెట్టిన పెట్టుబడి తిరిగి రావాలంటే హైడ్రోపోనిక్ కూరగాయలు, ఆకుకూరలను ప్రీమియం ప్రైస్‌తో అమ్మగలగాలి. మానవాళి భవిష్యత్తు ఆహారపు అవసరాలు తీర్చగలిగిన శక్తిసామర్థ్యాలున్న టెక్నాలజీ ఇది.

– డాక్టర్ సాయిరాం రెడ్డి పాలిచర్ల
అర్బన్ కిసాన్ పరిశోధనా కేంద్రం,
గుండ్లపోచంపల్లి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా
sai@urbankisaan.com



2.5 ఏళ్లలోనే కొత్త వంగడాలు

బెండ, టొమాటో, పచ్చిమిర్చి వంగ తదితర కూరగాయల్లో ఒక్కో రకానికి సంబంధించి 2–3 రకాల వంగడాలను రూపొందించారు. ఫంగస్ సోకని బేసిల్ (ఇటాలియన్ తులసి)ను రూపొందించారు. ఎరుపు, ఆకుపచ్చ, కాండం తెల్లగా ఆకు గ్రీన్‌గా ఉండే రకరకాల తోటకూర రకాలను రూపొందించారు. పాలకూర, కొత్తిమీర, గోంగూరలో కూడా కొత్త వంగడాలను రూపొందించారు. కీరదోస, సొర, కాకర వంటి తీగజాతులు పాలినేషన్ అవసరం లేకుండా దిగుబడినిచ్చే విధంగా రూపొందిస్తున్నాం అన్నారు డా. సాయిరాం. సాధారణంగా ఒక కొత్త వంగడాన్ని బ్రీడింగ్ చేయాలంటే 6–7 ఏళ్లు పడుతుంది. స్పీడ్ బ్రీడింగ్ పద్ధతిలో తాము 2.5 ఏళ్లలోనే కొత్త వంగడాలను రూపొందించగలిగామన్నారు.

95 శాతం నీటి ఆదా

వేగవంతమైన నగరీకరణ నేపథ్యంలో నగరాల్లో ఏడాది పొడవునా అర్బన్ ప్రాంతీయులకు తాజా ఆకుకూరలు, కూరగాయలు అందించడానికి ద్రవరూప ఎరువులతో చేసే వర్టికల్ ఫార్మింగ్ ఉపయోగపడుతోంది. హైడ్రోపోనిక్స్ పద్ధతిలో పంటలు పండించటం వల్ల కలిగే ప్రయోజనాలను భారత్‌తోపాటు ప్రపంచదేశాలు ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నాయి. సాధారణ వ్యవసాయంలో వాడే నీటితో పోల్చితే ఈ పద్ధతిలో 95% ఆదా అవుతుంది. పొలంలో పంటతో పోల్చితే నిర్దిష్టమైన స్థలంలో 30 రెట్లు అధిక దిగుబడి సాధించడానికి హైడ్రోపోనిక్స్ ఉపయోగపడుతుందని, అందులోనూ ఈ సాంకేతికతను దేశీయంగానే అభివృద్ధి చేశామని అర్బన్ కిసాన్ చెబుతోంది.

సాగులో ఉన్న పంటల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా పోషకాల మోతాదు, పిహెచ్ స్థాయిలు, వాతావరణంలో తేమ, కార్బన్‌డయాక్సయిడ్ స్థాయి, కాంతి తీవ్రత వంటి అనేక ఇతర అంశాలన్నిటినీ ఒక యాప్ ద్వారా నియంత్రిస్తుండటం విశేషం. వర్టికల్ ఫార్మింగ్ వ్యవస్థల్లో కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌ను ఉపయోగిస్తూ ఫార్మింగ్ ఆటోమేషన్‌లో అర్బన్ కిసాన్ తనదైన ప్రత్యేకతను చాటుతోంది. ప్రపంచవ్యాప్తంగా హైడ్రోపోనిక్స్ సాగు జరుగుతున్నా ఇందులో అన్ని దశలకు సంబంధించిన సంపూర్ణ సాంకేతికత ఒకే చోట అందుబాటులో లేదు. అర్బన్ కిసాన్ పూర్తిగా సొంత సాంకేతికతను అభివృద్ధి చేసుకోవటం విశేషం.

మధ్యప్రాచ్య దేశాల్లో ఆదరణ

అర్బన్ కిసాన్ ఇండోర్ హైడ్రోపోనిక్స్ యూనిట్లలో పూర్తిస్థాయిలో ఆటోమేషన్ చేస్తారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, కృత్రిమ మేధ, సెన్సార్ల ఆధారంగానే ఫామ్ యాజమాన్యం ఉంటుంది. దుబాయ్, ఒమన్, ఖతార్ దేశాల్లో మూడేళ్ల క్రితం 50% భాగస్వామ్యంతో హైడ్రోపోనిక్స్ యూనిట్‌ను నెలకొల్పాం. అదే మాదిరిగా బహామాస్ దేశంలోనూ 50% భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన యూనిట్‌ను కూడా తాము ఇక్కడి నుంచే పూర్తిస్థాయిలో నియంత్రిస్తున్నామని డా. సాయిరాం రెడ్డి వివరించారు. అక్కడ ఆకుకూరల ధర కిలో 12 డాలర్లు. మా యూనిట్లలో కిలో 5 డాలర్లకే ఆకుకూరలను ఉత్పత్తి చేస్తున్నాం. అమెరికా, కెనడా, నార్వే దేశాల్లో కూడా జాయింట్ వెంచర్లు ఏర్పాటు చేయబోతున్నాం.

మన దేశంలో హైడ్రోపోనిక్స్ యూనిట్లకు పారిశ్రామిక విద్యుత్తు చార్జీలు వర్తిస్తుండటం ఈ హైటెక్ సాగు విస్తరణకు ప్రతిబంధకంగా మారింది. ఇప్పటికైతే ఇది కాస్త ఖరీదైన ప్రత్యామ్నాయ ఆహారోత్పత్తి పద్ధతే. కానీ, పోషక విలువలున్న, పురుగుమందుల్లేని ఆహారాన్ని అందించే ఈ పద్ధతి ఏదో ఒక రోజున మెయిన్ స్ట్రీమ్‌లోకి వస్తుందని అర్బన్ కిసాన్ ఆశాభావంతో ముందడుగు వేస్తోంది.

– పంతంగి రాంబాబు,
సాక్షి సాగుబడి డెస్క్


ఇంటి పంట



కలబంద రసంతో ఉపయోగాలెన్నో..

కలబందలో మొక్కలకు కావలసిన పోషకాలు, యాంటిఆక్సిడెంట్లు, ఎంజైమ్‌లు పుష్కలంగా ఉంటాయి. అమైనా ఆమ్లాలు, కాల్షియం, జింక్, మెగ్నీషియం వంటివి 75 రకాల పోషకాలుంటాయి.. ఇది మొక్కలను క్రిములు, వైరస్‌లు, శిలీంధ్రాల నుంచి కాపాడుతుంది. కలబంద ఆకు ముక్కలను మిక్సీలో వేస్తే రసం వస్తుంది. స్పూనుతో ఈ కింద చెప్పిన కొలతలో ఇంటిపంటలు / మిద్దెతోటల సాగులో వాడుకోవచ్చు:

1. ఒక టీస్పూను కలబంద రసాన్ని ఒక లీటరు నీటితో కలిపి మొలక దశలో లేదా చిన్న మొక్కలు స్ప్రే చేయవచ్చు. వారానికి ఒక సారి చేస్తే సరిపోతుంది. **2.** ఒక టేబుల్ స్పూన్ రసాన్ని ఒక లీటరు నీటితో కలిపి మొక్క ఉన్న కుండీలో పోయాలి. ఇలా నెలకు ఒకసారి చేయాలి. దీనివలన మొక్కకు ఇమ్యూనిటీ పెరుగుతుంది. **3.** మొక్కను ఒక కుండీ నుంచి వేరే కుండీలోకి మార్చినప్పుడు లీటరు నీటికి ఒక టేబుల్ స్పూన్ రసాన్ని కలిపి కుండీలో పోయాలి. ఇలా చేస్తే మొక్క మార్పిడి వత్తిడికి గురికాదు. **4.** ఎరువుగా వాడాలి అన్నప్పుడు 2 టేబుల్ స్పూన్ల కలబంద రసాన్ని లీటరు నీటితో కలిపి మొక్క కుండీలో పోయాలి. ఇలా 15 రోజులకు ఒకసారి వాడాలి. **5.** స్ప్రే చేయాలంటే ఒక టేబుల్ స్పూన్ వాడాలి లీటరు నీటికి. ఆకుల అడుగు భాగంలో మాత్రమే స్ప్రే చేయాలి. దీనివలన మొక్క తొందరగా పోషకాలను గ్రహిస్తుంది. **6.** రూటింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఏదైనా మొక్క కొమ్మను విరిచి నాటుకోవాలంటే, నేరుగా కలబంద రసంలో అరగంట కొమ్మ చివరను నానబెట్టి, ఆ తరువాత నాటవచ్చు. **7.** ఇది బూడిద తెగులును అరికడుతుంది.

గమనిక: కలబంద రసం తయారు చేసిన అర గంట లోపే వాడాలి. పులిస్తే అందులో ఉన్న పోషకాలు కొన్ని పోతాయి.

– విజయలక్ష్మి, బెంగళూరు మిద్దెతోట బృందం





జ్యోతి యర్రాజీకి స్వర్ణం, రజతం

కొత్త సీజన్‌లో భారత మహిళా అథ్లెట్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ మరోసారి మెరిసింది. జర్మనీలో జరిగిన కుర్ఫ్‌పాల్జ్ గాలా మీట్‌లో జ్యోతి ఒక స్వర్ణం, ఒక రజత పతకం నెగ్గింది. 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో జ్యోతి 13.06 సెకన్లలో గమ్యానికి చేరి పసిడి పతకాన్ని గెలిచింది. 200 మీటర్ల ఫైనల్లో జ్యోతి 23.83 సెకన్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని దక్కించుకుంది. రెండు వారాల క్రితం నెదర్లాండ్స్‌లో జరిగిన హ్యారీ షుల్టింగ్ గేమ్స్‌లో జ్యోతి 100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణంతో కొత్త సీజన్‌ను ఘనంగా ఆరంభించింది.

ఆనంద్‌కు మూడో స్థానం



కాసాబ్లాంకా చెస్ వేరియంట్ టోర్నమెంట్‌లో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) విజేతగా నిలిచాడు. నలుగురు మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య మొరాకోలో ఆరు రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో కార్ల్‌సన్ 4.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని పొందాడు. ఐదుసార్లు ప్రపంచ మాజీ చాంపియన్, భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ మూడు పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. హికారు నకమురు (అమెరికా) 3.5 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచాడు. ఆనంద్ ఒక గేమ్‌లో ఓడిపోయి, మరో గేమ్‌లో నెగ్గి, మిగతా నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకున్నాడు.

ఫైనల్ వేటలో ఎవరిదో జోరు!

నేడు తొలి క్వాలిఫయర్‌లో కోల్‌కతాతో హైదరాబాద్ 'ఢీ'

గెలిస్తే నేరుగా టైటిల్ పోరుకు • ఓడినా... మరో అవకాశం

రాత్రి గం.7:30 నుంచి 'స్టార్ స్పోర్ట్స్', జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం


కమిన్స్, శ్రేయస్ అయ్యర్

అహ్మదాబాద్: గత రెండు నెలలుగా పది జట్ల పోరు 'ప్లే ఆఫ్స్' లక్ష్యంగా సాగింది. మెరుపులు, ధనాధన్ ధమాకాలతో ఐపీఎల్ 17వ సీజన్ మరింత మజాను పంచింది. ఇప్పుడు నాలుగు జట్ల సమరం ఫైనల్ దిశగా జరగనుంది. ముందుగా మంగళ వారం జరిగే తొలి క్వాలిఫయర్‌లో జోరు మీదున్న సన్‌రైజర్స్ హైదరాబాద్... రెండుసార్లు (2012, 2014) చాంపియన్ అయిన కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)తో తలపడనుంది. 2016లో ఐపీఎల్ ట్రోఫీ సాధించిన సన్‌రైజర్స్ ప్రస్తుత సీజన్‌లో భీకర మైన ఫామ్ దృష్ట్యా టైటిల్ వేటలో ముందంజ వేయాలనే పట్టుదలతో ఉంది. మరోవైపు కోల్‌కతా తక్కువేం కాదు... తగ్గేలా లేనేలేదు! ఈ సీజన్‌లో కేవలం 3 మ్యాచ్‌లే ఓడిన నైట్‌రైడర్స్ ఎవరికి సాధ్యం కానీ 9 విజయాల్ని సాధించి పాయింట్ల పట్టికలో 'టాప్'లో నిలిచింది. అటు బౌలింగ్, బ్యాటింగ్‌లో సమతూకంగా ఉన్న కేకేఆర్ రెండో క్వాలిఫయర్‌దాకా చాన్స్ తీసుకోకుండా ఫైనల్ బెర్త్ సాధించాలని ఆశిస్తోంది.

సన్ తుఫాన్‌కు ఎదురేది?



సన్‌రైజర్స్ కొట్టిన కొట్టుడు... దంచిన దంచుడు... 200 పైచిలుకు లక్ష్యమైనా మాకేంటని ఛేదించిన వైనం చూస్తే హైదరాబాద్‌కు ఎదురు నిలవడం ఏ జట్టుకైనా కష్టమే! దంచేసే ఓపెనర్ హెడ్ డకౌటైన గత మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 215 పరుగుల లక్ష్యాన్ని 19.1 ఓవర్లలోనే ఛేదించి టాప్–2లోకి దూసుకొచ్చింది. అభిషేక్ శర్మ, ఆంధ్రప్రదేశ్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి, క్లాసెన్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లకు పదేపదే చుక్కలు చూపిస్తున్నారు. ఈ జట్టు బలం బ్యాటింగే! అయితే నిలకడ లేని బౌలింగ్‌తోనే అసలు సమస్యంతా! బౌలర్ల వైఫల్యం వల్లే 277/3, 287/3, 266/7 లాంటి రికార్డు స్కోర్లు నమోదు చేసినా భారీ తేడాతో ఏ మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. కెప్టెన్ కమిన్స్, భువనేశ్వర్, నటరాజన్ సహా బౌలర్లంతా కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తేనే సన్‌రైజర్స్‌కు విజయం సులువవుతుంది.

ఫైట్ రైడర్స్

ఫిల్ సాల్ట్–సునీల్ నరైన్ ఓపెనింగ్ జోడీ మెరుపులతో కోల్‌కతా నైట్‌రైడర్స్ కాస్తా ఫైట్‌రైడర్స్‌గా మారింది. కీలకమైన మ్యాచ్‌లో సాల్ట్ (స్వదేశానికి తిరుగుముఖం) లేకపోయినప్పటికీ బ్యాటింగ్ బలం ఏమాత్రం తగ్గలేదు. ఎందుకంటే వెంకటేశ్ అయ్యర్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, నితీశ్ రాణా, రసెల్, రింకూ సింగ్, రమణ్‌దీప్ ఇలా ఎనిమిదో వరుస వరకు తిరుగులేని బ్యాటింగ్ లైనప్ ఉన్న జట్టు కోల్‌కతా. ప్రత్యేకించి రసెల్, రింకూ, రమణ్‌దీప్‌లైతే స్పెషలిస్టు హిట్టర్లు. టాప్–3 విఫలమైన ప్రతీసారీ జట్టును నడిపించారు. బౌలింగ్‌లో అనుభవజ్ఞుడైన స్టార్క్, నరైన్, రసెల్‌లతో పాటు హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తిలు నైట్‌రైడర్స్ విజయాల్లో భాగమవుతున్నారు. ఇక నైట్‌రైడర్స్ మ్యాచ్ ఆడి పది రోజులవుతోంది. ఈ నెల 11న ముంబై ఇండియన్స్‌పై మొదట 157/7 స్కోరే చేసినా... ప్రత్యర్థిని 139/8కు కట్టడి చేసి 18 పరుగులతో గెలిచింది. తర్వాత గుజరాత్, రాజస్తాన్‌లతో జరగాల్సిన రెండు మ్యాచ్‌లు వర్షంతో రద్దయ్యాయి. దీంతో ఆటగాళ్లంతా 'మ్యాచ్ ఆకలి' మీదున్నారు. తప్పకుండా ఇరుజట్ల మధ్య హోరాహోరీ సమరం గ్యారంటీ!

26 ఐపీఎల్‌లో ఇప్పటి వరకు సన్‌రైజర్స్, నైట్‌రైడర్స్ జట్లు ముఖాముఖిగా 26 సార్లు తలపడ్డాయి. 17 మ్యాచ్‌ల్లో నైట్‌రైడర్స్... 9 మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్ గెలుపొందాయి. ఈ సీజన్‌లో ఈ రెండు జట్లు ఒకసారి పోటీపడగా నైట్‌రైడర్స్ నాలుగు పరుగుల తేడాతో నెగ్గింది. నైట్‌రైడర్స్‌పై సన్‌రైజర్స్ అత్యధిక స్కోరు 228, అత్యల్ప స్కోరు 116 కాగా... సన్‌రైజర్స్‌పై నైట్‌రైడర్స్ అత్యధిక స్కోరు 208, అత్యల్ప స్కోరు 101.

జట్లు (అంచనా)

హైదరాబాద్: కమిన్స్ (కెప్టెన్), హెడ్, అభిషేక్ శర్మ, రాహుల్ త్రిపాఠి, నితీశ్ కుమార్ రెడ్డి, క్లాసెన్, షహబాజ్, సమద్, సన్వీర్, భువనేశ్వర్, విజయకాంత్, నటరాజన్. **కోల్‌కతా:** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), నరైన్, గుర్బాజ్, వెంకటేశ్, నితీశ్ రాణా, రింకూ సింగ్, రసెల్, రమణ్‌దీప్, స్టార్క్, హర్షిత్ రాణా, వరుణ్, అనుకుల్/వైభవ్.

పిచ్, వాతావరణం

నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఆరు మ్యాచ్‌ల్ని పరిశీలిస్తే.. పిచ్ బౌలర్లకు, బ్యాటర్లకు సమాన అవకాశాలు కల్పించింది. మూడు మ్యాచ్‌ల్లో 200 పైచిలుకు స్కోర్లు నమోదయ్యాయి. తక్కువ స్కోర్ల మ్యాచ్ (గుజరాత్ 89 ఆలౌట్; ఢిల్లీ 92/4) కూడా ఇక్కడే నమోదైంది. మ్యాచ్‌కు వర్ష సూచన లేదు.

శభాష్ దీప్తి...

ప్రపంచ రికార్డుతో పసిడి పతకం | 400 మీటర్లలో విశ్వ విజేతగా తెలంగాణ అమ్మాయి





కోబే (జపాన్): ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్, తెలంగాణకు చెందిన దీప్తి జివాంజి పసిడి పతకంతో మెరిసింది. ప్రపంచ రికార్డుతో ఆమె స్వర్ణం సొంతం చేసుకోవడం విశేషం. సోమవారం జరిగిన మహిళల 400 మీటర్ల (టి20 కేటగిరీ) పరుగును దీప్తి 55.07 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. గత ఏడాది ఈ ఈవెంట్‌లో అమెరికాకు చెందిన బ్రియానా క్లార్క్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డు (55.12 సెకన్ల)ను దీప్తి బద్దలు కొట్టింది. ఆదివారం జరిగిన క్వాలిఫయింగ్ పోటీల్లో 56.18 సెకన్లతో రేసును ముగించిన 20 ఏళ్ల దీప్తి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఈ టోర్నీలో ప్రస్తుతం భారత్ ఖాతాలో 4 పతకాలు ఉండగా, శనివారం వరకు పోటీలు జరుగుతాయి.

పేదరికం నుంచి పైకెగసి...


కోచ్ నాగపురి రమేశ్‌తో...

పారా అథ్లెటిక్స్‌లో టి20 కేటగిరీ అంటే 'మేధోలోపం' ఉన్న ప్లేయర్లు పాల్గొనే ఈవెంట్. ఆమె స్వస్థలం వరంగల్ జిల్లా కల్లెడ. తల్లిదండ్రులు యాదగిరి, ధనలక్ష్మి రోజువారీ కూలీలు. ఒకవైపు పేదరికం ఉండగా, మరో వైపు దీప్తిని 'బుద్ధిమాంద్యం' ఉన్న అమ్మాయిగా ఊర్లో అందరూ హేళన చేసేవారు. ఇలాంటి సమయంలో భారత అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేశ్ ఆమెకు అన్ని విధాలా అండగా నిలిచారు. ఒక స్కూల్ మీట్‌లో దీప్తి రన్నింగ్ ప్రతిభ గురించి తన మిత్రుడి ద్వారా ఆయనకు తెలిసింది. దాంతో రమేశ్ ఆ అమ్మాయిని హైదరాబాద్‌కు రప్పించి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) శిక్షణా కేంద్రంలో కోచింగ్ అందించే ఏర్పాట్లు చేశారు. మానసికంగా కొంత బలహీనంగా ఉండటంతో ఆమెకు శిక్షణ ఇవ్వడంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చేది. భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ కూడా 'మైత్రా ఫౌండేషన్'తో కలిసి ఆర్థికంగా సహకారం అందించారు. తన ప్రతిభ కారణంగా కెరీర్ ఆరంభంలో ఆమె అందరూ పాల్గొనే సాధారణ అథ్లెటిక్స్ ఈవెంట్లలోనూ పోటీ పడి విజయాలు సాధించడం విశేషం. 2019 ఆసియా అండర్–18 చాంపియన్‌షిప్‌లో కాంస్యం, 2021 సీనియర్ నేషనల్స్‌లో కాంస్యం సాధించిన దీప్తి 2022లో చివరిసారిగా రెగ్యులర్ పోటీల బరిలోకి దిగింది. రెండు అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనడం ద్వారా దీప్తికి 'పారా క్రీడల' లైసెన్స్ లభించింది. దాంతో పూర్తిగా పారా పోటీలపైనే ఆమె దృష్టి పెట్టింది. గత ఏడాది జరిగిన గ్వాంగ్జౌ ఆసియా పారా క్రీడల్లో 400 మీటర్ల ఈవెంట్‌లోనే దీప్తి స్వర్ణం గెలుచుకుంది. ఆర్థిక సమస్యలతో ఒకదశలో తమ భూమిని అమ్ముకున్న తల్లిదండ్రులు దీప్తి 'ఆసియా' విజయం తర్వాత ప్రభుత్వం ఇచ్చిన రూ. 30 లక్షలతో మళ్లీ భూమి కొనుక్కోగలిగారు. ఇదే ప్రపంచ రికార్డు జోరులో మున్ముందు పారా ఒలింపిక్స్‌లో పతకాలు సాధించగల సత్తా దీప్తిలో ఉంది.

జ్యోతిక శ్రీ బృందానికి స్వర్ణం

ఆసియా 4x400 మిక్స్‌డ్ రిలేలో భారత జట్టు జాతీయ రికార్డు



అమోజ్ జేకబ్, శుభ, జ్యోతిక శ్రీ, అజ్మల్

బ్యాంకాక్: ఆసియా రిలే అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అజ్మల్, దండి జ్యోతిక శ్రీ, అమోజ్ జేకబ్, శుభాలతో కూడిన భారత బృందం మిక్స్‌డ్ రిలే 4x400 మీటర్ల విభాగంలో స్వర్ణ పతకం గెలిచింది. భారత బృందం 3 నిమిషాల 14.12 సెకన్లలో గమ్యానికి చేరి విజేతగా నిలిచింది. ఈ క్రమంలో గత ఏడాది ఆసియా క్రీడల్లో 3 నిమిషాల 14.34 సెకన్లతో నెలకొల్పిన జాతీయ రికార్డు తెరమరుగైంది. భారత్‌కు బంగారు పతకం దక్కడంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతిక శ్రీ కీలకపాత్ర పోషించింది. ఈ ప్రదర్శనతో భారత బృందం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 21వ స్థానానికి చేరుకుంది. జూన్ 30వ తేదీలోపు భారత బృందం టాప్–16లోకి చేరితే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తుంది.

సినిమా

ఆగస్టులో ఆరంభం


• ఎన్టీఆర్

హీరో ఎన్టీఆర్, 'కేజీఎఫ్, సలార్' మూవీ చిత్రాల ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కాంబినేషన్‌లో రూపొందనున్న ఈ చిత్రం ('ఎన్టీఆర్ నీల్' వర్కింగ్ టైటిల్) ఆగస్టులో ఆరంభం కానుంది. సోమవారం (మే 20) ఎన్టీఆర్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ చిత్రం అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. 'ఎన్టీఆర్ నీల్' మూవీ షూటింగ్‌ను ఆగస్టు నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ''భారీ యాక్షన్ మూవీగా 'ఎన్టీఆర్ నీల్' రూపొందనుంది. ప్రశాంత్ నీల్ ఈ సినిమా స్క్రిప్ట్‌ను ఫైనల్ చేస్తున్నారు. ఎన్టీఆర్ మాస్ ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని దాన్ని మరో రేంజ్‌కు తీసుకెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు ప్రశాంత్ నీల్. ఎన్టీఆర్–ప్రశాంత్ కాంబినేషన్‌లో రాబోతున్న ఈ సినిమా ఇండస్ట్రీలో సరికొత్త బెంచ్ మార్క్‌ను క్రియేట్ చేస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

అద్భుతమైన మహిళలకు ధన్యవాదాలు

''సినిమాల్లో ఉండే మహిళలను కొనియాడటం ఓ మరపు రాని అనుభూతి. ఈ సాయంత్రం ఇంత హ్యాపీగా ఈ వేడుక చేసుకోవడానికి కారణమైన అద్భుతమైన మహిళా నిర్మాతలు, నటీమణులకు, దర్శకులకు కృతజ్ఞతలు. ఈ వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పించిన రెడ్ సీ ఫిల్మ్ ఫౌండేషన్‌కు ధన్యవాదాలు'' అని నటి అమీ జాక్సన్ అన్నారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న 77వ కాన్స్ చిత్రోత్సవాల్లో అమీ జాక్సన్ 'ఉమెన్ ఇన్ సినిమా గాలా'కు హాజరయ్యారు. ఈ వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా అమీ ఈ విధంగా స్పందించారు. తెలుపు రంగు సూట్‌లో ఆమె హుందాగా అగుపించారు. ఇంకా బాలీవుడ్ నుంచి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఈ వేడుకలకు హాజరయ్యారు. బంగారు వర్ణం గౌనులో జాక్వెలిన్ ఎర్ర తివాచీపై క్యాట్ వాక్‌తో కనువిందు చేశారు.

– అమీ జాక్సన్

కాన్స్‌లో కన్నప్ప టీమ్: విష్ణు మంచు టైటిల్ రోల్‌లో రూపొందుతున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. మోహన్‌బాబు, ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను ఈ నెల 20న కాన్స్ చిత్రోత్సవాల్లో ఆవిష్కరించనున్నట్లు విష్ణు పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మోహన్‌బాబు, విష్ణు, ప్రభుదేవా, విష్ణు భార్య విరానికా కాన్స్ చిత్రోత్సవాలకు హాజరు అయ్యారు.


• జాక్వెలిన్ ఫెర్నాండెజ్
• అమీ జాక్సన్

వినాయక చవితి చుట్టూ...


• నయన్ సారిక, ఆనంద్ దేవరకొండ

''గం గం గణేశా' దర్శకుడు ఉదయ్ నా వద్ద పని చేశాడు. అంకితభావం, కష్టపడే తత్వం ఉన్న అతనికి ఈ సినిమా తప్పకుండా సక్సెస్ ఇవ్వాలి'' అని రచయిత, దర్శకుడు విజయేంద్ర ప్రసాద్ అన్నారు. ఆనంద్ దేవరకొండ హీరోగా, ప్రగతీ శ్రీవాస్తవ, నయన్ సారిక హీరోయిన్లుగా నటించిన చిత్రం 'గం..గం..గణేశా'. ఉదయ్ శెట్టి దర్శకత్వంలో కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమంలో విజయేంద్ర ప్రసాద్, దర్శకులు వంశీ పైడిపల్లి, సాయి రాజేశ్ అతిథులుగా పాల్గొన్నారు. ''గం గం గణేశా'ని థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయండి'' అన్నారు వంశీ కారుమంచి, కేదార్ సెలగంశెట్టి. ''వినాయక చవితి చుట్టూ తిరిగే కథతో ఈ సినిమా రూపొందించాం'' అన్నారు ఉదయ్ శెట్టి. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ– ''గం గం గణేశా'లో తొలిసారి ఎనర్జిటిక్ క్యారెక్టర్ చేశాను'' అన్నారు.

మాస్ తథాస్తు


• రామ్ తేజ్, భానుచందర్

రామ్ తేజ్ హీరోగా భానుచందర్ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'తథాస్తు'. కన్నా నాగరాజు సమర్పణలో తోట వెంకట నాగేశ్వరరావు స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ లాంచ్ వేడుక సోమవారం జరిగింది. డైరెక్టర్ చంద్రమహేశ్, నిర్మాత దామోదర ప్రసాద్ ఈ మూవీ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేసి, యూనిట్‌కి అభినందనలు తెలిపారు. భానుచందర్ మాట్లాడుతూ– ''తథాస్తు'లో వినోదం, భావోద్వేగాలు ఉన్నాయి'' అన్నారు. ''కంప్లీట్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'తథాస్తు' రూపొందుతోంది. మా బ్యానర్‌లో రూపొందిన 'మల్లె మొగ్గ' సినిమా ఇటీవల విడుదలవగా మంచి ఆదరణ వస్తోంది'' అన్నారు దర్శక–నిర్మాత తోట వెంకట నాగేశ్వరరావు. ''నన్ను హీరోని చేసిన మా మావయ్య వెంకట నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు'' అన్నారు రామ్ తేజ్.

పవర్‌ఫుల్ రోల్


• మనోజ్ మంచు


''మిరాయ్'లో పవర్‌ఫుల్ పాత్ర చేస్తుండడం సవాల్‌గా ఉంది. ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్‌తో మళ్లీ ఇండస్ట్రీకి రావడం ఎగ్జయిటింగ్‌గా, సంతోషంగానూ ఉంది'' అని మనోజ్ మంచు అన్నారు. 'హనుమాన్' మూవీ ఫేమ్ తేజ సజ్జ హీరోగా నటిస్తున్న చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రితికా నాయక్ కథానాయికగా, మనోజ్ మంచు కీలక పాత్రలో నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. సోమవారం (మే 20) మనోజ్ మంచు పుట్టినరోజు సందర్భంగా ఆయన ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ను లాంచ్ చేశారు. ది బ్లాక్ స్వోర్డ్‌గా ఇంటెన్స్, పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు మనోజ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత వెండితెరకి వస్తున్నాను. ఈ చిత్రం రెండు భాగాలుగా వస్తుంది. తొలి భాగం 2025 ఏప్రిల్ 18న రిలీజ్ అవుతుంది'' అన్నారు. ''మిరాయ్'లో మనోజ్ అన్న భాగం కావడం అదృష్టం'' అన్నారు కార్తీక్ ఘట్టమనేని. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కృతీ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ కొల్లి, సంగీతం: గౌర హరి.

గాడ్ పవర్?


• సాయి పల్లవి, రణ్‌బీర్ కపూర్

'రామాయణ్' టైటిల్ 'గాడ్ పవర్'గా మారిందా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి రాముడు, సీత పాత్రల్లో నితీష్ తివారీ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం గురించి ఇప్పటివరకూ యూనిట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. రామాయణం ఆధారంగా 'రామాయణ్' టైటిల్‌తో తెరకెక్కిస్తున్నారని వార్తలు వచ్చాయి. అలాగే సీతారాముల గెటప్స్‌లో సాయి పల్లవి, రణ్‌బీర్ కపూర్ ఉన్న ఫొటోలు లీక్ అయి, వైరల్‌గా మారాయి. ముంబైలో చడీ చప్పుడూ లేకుండా కొన్ని రోజుల క్రితం ఈ చిత్రం షూటింగ్ ఆరంభించారు. ఆ లొకేషన్లోని రణ్‌బీర్, సాయి పల్లవి ఫొటోలే బయటికొచ్చాయి. కాగా.. ఈ చిత్రానికి 'రామాయణ్' టైటిల్‌కి బదులు 'గాడ్ పవర్' అనే టైటిల్ ఫిక్స్ చేయాలని యూనిట్ అనుకుంటోందనే వార్త ప్రచారంలో ఉంది.

ఫ్యాంటసీ టుక్ టుక్


• 'టుక్ టుక్' పోస్టర్

హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోధాటి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'టుక్ టుక్'. సుప్రీత్ సి. కృష్ణ దర్శకత్వంలో రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్ విడుదలైంది. ''ఒక గ్రామం నేపథ్యంలో ఫ్యాంటసీ ఎలిమెంట్స్‌తో సాగే చిత్రం ఇది. ఈ కథలో ఓ ఆటోకి ప్రాధాన్యం ఉంది. ప్రేక్షకులకు ఒక మంచి అనుభూతిని ఇచ్చే చిత్రంగా రూపొందించాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సంతు ఓంకార్, కెమెరా: హార్దిక్ శ్రీకుమార్.

అందమైన ప్రయాణం ఆరంభం


• యామీ గౌతమ్, ఆదిత్య ధర్

''మా జీవితంలో మరో అందమైన ప్రయాణం ఆరంభమైంది'' అంటూ బాలీవుడ్ దర్శక–నిర్మాత, రచయిత ఆదిత్య ధర్ సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. నటి యామీ గౌతమ్, ఆదిత్య ధర్ 2021లో పెళ్లి చేసుకున్నారు. ఈ నెల 10న యామీ ఒక మగబిడ్డకు జన్మనిచ్చారు. తమ కుమారుడికి 'వేదవిద్' అని పేరు పెట్టినట్లు ప్రకటించి, పై విధంగా పేర్కొన్నారు ఆదిత్య ధర్. ''మా కుమారుడు ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించడంతో పాటు మాకు, దేశానికి గర్వకారణంగా నిలిచేలా ఎదగాలని ఆశిస్తున్నాం'' అని కూడా ఆదిత్య ధర్ పేర్కొన్నారు. ఇక యామీ గౌతమ్ విషయానికొస్తే.. తెలుగులో 'నువ్విలా' ఆమె తొలి చిత్రం. ఆ తర్వాత 'గౌరవం, యుద్ధం, కొరియర్ బాయ్ కల్యాణ్' (2015) వంటి చిత్రాల్లో నటించారు. 'కొరియర్ బాయ్...' తర్వాత వేరే తెలుగు చిత్రాల్లో నటించలేదు. హిందీ చిత్రాలతో బిజీ అయ్యారు.

యాక్షన్ ఎంటర్‌టైనర్


• శివ కంఠంనేని

శివ కంఠంనేని లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'బిగ్ బ్రదర్'. ప్రియా హెగ్డే హీరోయిన్. గోసంగి సుబ్బారావు డైరెక్టర్. జి. రాంబాబు యాదవ్ సమర్పణలో కె. శివశంకర్ రావు, ఆర్. వెంకటేశ్వరరావు నిర్మించిన ఈ చిత్రం' ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో నటులు మురళీ మోహన్, అశోక్ కుమార్, నిర్మాతల మండలి అధ్యక్షుడు దామోదర్ ప్రసాద్ పాల్గొన్నారు. ''భోజ్‌పురి పరిశ్రమకు వెళ్లి 15 సినిమాలు చేశాను. చాలా రోజుల తర్వాత తెలుగులో 'బిగ్ బ్రదర్'తో రీ ఎంట్రీ ఇవ్వడం ఎగ్జయిటింగ్‌గా ఉంది'' అన్నారు గోసంగి సుబ్బారావు. ''బిగ్ బ్రదర్'లో నటించడం గర్వంగా ఉంది'' అన్నారు శివ కంఠంనేని. 'యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌ను ఇష్టపడేవారిని మా మూవీ అలరిస్తుంది'' అన్నారు నిర్మాతలు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
89	36
74,006	22,502

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	16,788	▲	102
డోజోన్స్	39,890	▼	113
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,424	▲	4
డాక్స్	18,769	▲	65
పాంఘై	3,171	▲	17
నికాయ్	39,070	▲	282

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.10	84.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.57	107.12
€	యూరో	ఎస్‌బీఐ	89.63	91.99
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.06	54.23
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.76	56.70
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.54	64.19
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.33	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.08	23.59
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.41	12.48

ఫ్లిప్‌కార్ట్ నుంచి ఐరిస్ ప్లాట్‌ఫాం

న్యూఢిల్లీ: ఈ–కామర్స్ కంపెనీ ఫ్లిప్‌కార్ట్ తాజాగా ఐరిస్ ప్లాట్‌ఫాంను ఆవిష్కరించింది. కస్టమర్ల కొనుగోళ్ల ధోరణులు, మార్కెట్లో ట్రెండ్ల గురించి, వ్యాపార పనితీరును మెరుగుపర్చుకునేందుకు తీసుకోదగిన చర్యలు మొదలైన వాటి గురించి బ్రాండ్లు తెలుసుకునేందుకు ఇది సహాయపడుతుంది. దీనితో కంపెనీలు డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవచ్చని, అమ్మకాలు మెరుగుపర్చుకోవచ్చని ఫ్లిప్‌కార్ట్ పేర్కొంది.

వృద్ధి 6.2%: ఇండియా రేటింగ్స్

న్యూఢిల్లీ: భారత్ మార్చితో గడచిన ఆర్థిక సంవత్సరంలో (2023–24) 6.9– 7.0 శాతం శ్రేణిలో వృద్ధి సాధిస్తుందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ అంచనావేసింది. మార్చి త్రైమాసికంలో 6.2 శాతం వృద్ధి నమోదవుతుందని సంస్థ ప్రిన్సిపల్ ఎకనమిస్ట్ సునీల్ కుమార్ సిన్హా పేర్కొన్నారు. మే 31న అధికారిక గణాంకాల నేపథ్యంలో తాజా అంచనాలను సంస్థ వెలువరించింది. 2023–24 తొలి మూడు త్రైమాసికాల్లో 8.2 శాతం, 8.1 శాతం, 8.4 శాతం వృద్ధి రేట్లు నమోదయిన సంగతి తెలిసిందే.

పెట్ ఫుడ్ వ్యాపారంలోకి గ్రోవెల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆక్వాకల్చర్ ఫీడ్స్ సంస్థ గ్రోవెల్ తాజాగా పెంపుడు జంతువుల పౌష్టికాహార విభాగంలో విస్తరిస్తోంది. దీనిపై వచ్చే 5–7 ఏళ్లలో రూ. 80–100 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు ప్రమోటర్ గ్రూప్‌నకు చెందిన ఎంఎస్ఆర్ కార్తీక్ తెలిపారు. వివిధ ఉత్పత్తులవ్యాప్తంగా తమకు తెలుగు రాష్ట్రాల్లో నాలుగు ప్లాంట్లు ఉన్నాయని, కొత్తగా మరో రెండు సిద్ధమవుతున్నాయని చెప్పారు. గ్రూప్ స్థాయిలో రూ. 2,000 కోట్ల పైచిలుకు టర్నోవరు ఉన్నట్లు కార్తీక్ వివరించారు. 20 పైగా దేశాలకు ఎగుమతులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశీయంగా పెట్ ఫుడ్స్ విభాగం 2027 నాటికి బిలియన్ డాలర్ల స్థాయికి పెరుగుతుందన్న అంచనాలు ఉన్నట్లు ఆయన చెప్పారు. ఇందులో బిస్కెట్లు మొదలైన ట్రీట్స్ సెగ్మెంట్ ప్రస్తుతం రూ. 650 కోట్ల నుంచి రూ. 2,000 కోట్లకు చేరగలదని వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

21-5-2024 ఫామ్ ధర...	
విశాఖ	550–00
చిత్తూరు	628–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
హైదరాబాద్	550–00
వరంగల్	552–00

యూఎస్ జెనరిక్స్ మార్కెట్లో భారత్ హవా

- 47 శాతం వాటాతో అగ్రస్థానం
- 219 బిలియన్ డాలర్ల పొదుపు
- ఐక్వియా ఇన్‌స్టిట్యూట్ నివేదికలో వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జెనరిక్ ఔషధ రంగంలో భారత కంపెనీల హవా కొనసాగుతోంది. 2022లో వైద్యుల సిఫార్సు మేరకు యూఎస్‌లో రోగులు వినియోగించిన మొత్తం జెనరిక్స్‌లో 47 శాతం భారతీయ కంపెనీలు సరఫరా చేశాయి. ఔషధాల పరిమాణం పరంగా భారత్ తొలి స్థానంలో నిలిచింది. ఐక్వియా నేషనల్ ప్రిస్క్రిప్షన్ ఆడిట్ ప్రకారం.. అందుబాటు ధరలో జెనరిక్ మందుల సరఫరాలో భారతీయ కంపెనీలు తమ సత్తా చాటుతున్నాయి. ప్రభుత్వ బీమా కార్యక్రమాలు, ప్రైవేట్ బీమా కంపెనీలు ఔషధాల కోసం చెల్లించిన మొత్తంలో.. భారతీయ ఫార్మా కంపెనీలు అందించిన మందులు సగానికంటే అధికంగా ఉండడం గమనార్హం. యూఎస్ సంస్థలు 30 శాతం వాటాతో రెండవ స్థానం సంపాదించాయి. మధ్యప్రాచ్య దేశాలు 11 శాతం, యూరప్ 5, కెనడా 3, చైనా 2, ఇతర దేశాల కంపెనీలు 2 శాతం జెనరిక్స్ సరఫరా చేశాయి.

50 శాతంపైగా మన కంపెనీలవే..

చికిత్సల పరంగా చూస్తే మానసిక రుగ్మతలకు వినియోగించిన మందుల్లో భారతీయ కంపెనీలు సరఫరా చేసినవి ఏకంగా 62 శాతం ఉన్నాయి. హైపర్‌టెన్షన్ 60 శాతం, లిపిడ్ రెగ్యులేటర్స్ 58, యాంటీ అల్సర్స్ 56, నరాల సంబంధ చికిత్సలకు 55 శాతం మందులు భారత్ నుంచి సరఫరా అయినవే కావడం విశేషం.

మధుమేహ సంబంధ ఔషధాల్లో భారత్ వాటా 21 శాతంగా ఉంది. ఇక బయోసిమిలర్స్ సరఫరాలో మూడవ స్థానంలో ఉన్న భారత సంస్థల వాటా ప్రస్తుతం 15 శాతంగా ఉంది. యూఎస్ 56 శాతం, కొరియా 18, యూరప్ 11 శాతం బయోసిమిలర్స్ సరఫరా చేశాయి.

భారతీయ కంపెనీలు సరఫరా చేసిన జెనరిక్ మందుల కారణంగా 2022లో యూఎస్ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ 219 బిలియన్ డాలర్ల మేర పొదుపు చేయగలిగింది. 2013 నుంచి 2022 మధ్య మొత్తం 1.3 ట్రిలియన్ డాలర్లు ఆదా అయ్యాయని ఐక్వియా నేషనల్ ప్రిస్క్రిప్షన్ ఆడిట్ నివేదిక పేర్కొంది. భారతీయ కంపెనీల నుండి వచ్చే జెనరిక్ ఔషధాలతో వచ్చే ఐదేళ్లలో అదనంగా 1.3 ట్రిలియన్ డాలర్ల పొదుపు అవుతుందని అంచనా.

మరో 1.3 ట్రిలియన్ డాలర్లు..

భారత్–యూఎస్ మధ్య బలమైన ఫార్మా వాణిజ్య భాగస్వామ్యం కోసం రెండు దేశాలు ఔషధ ముడిపదార్థాలకై విదేశీ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి ఔషధ స్థితిస్థాపకతను సాధించాలని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ (ఐపీఏ) ఇటీవల కోరింది. ఔషధాల రంగంలో ఇరు దేశాలు కలిసి వచ్చి అగ్రిగేటర్‌గా మారాలి అని ఐపీఏ అభిప్రాయపడింది. 70 శాతం యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియెంట్స్ చైనా నుంచి భారత్‌కు దిగుమతి అవుతున్నాయి.

సానుకూల సంకేతాలు

ఈ వారం మార్కెట్ ట్రేడింగ్‌పై నిపుణుల అంచనా



ముంబై: ట్రేడింగ్ నాలుగు రోజులే జరిగే ఈ వారం లోనూ ఎన్నికల అప్రమత్తత కొనసాగే వీలుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. చివరి దశ కార్పొరేట్ ఆర్థిక ఫలితాలు, ప్రపంచ పరిణామాలు, స్థూల ఆర్థిక గణాంకాలు, విదేశీ ఇన్వెస్టర్లు తీరుతెన్నులు స్టాక్ సూచీలకు దిశానిర్దేశం చేస్తాయంటున్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ, క్రూడాయిల్ ధరలూ ట్రేడింగ్ ప్రభావితం చూపొచ్చంటున్నారు. ఇక ప్రాథమిక మార్కెట్లో అవఫిస్ స్పేస్ సొల్యూషన్స్ ఐపీఓ బుధవారం ప్రారంభం కానుంది. ఇటీవల పబ్లిక్ ఇష్యూ పూర్తి చేసుకున్న గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ షేర్లు గురువారం ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానున్నాయి.

‘‘అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి. ఇది దేశీయ ఈక్విటీ మార్కెట్‌కు కలిసొచ్చే అంశం. అయితే ఎన్నికల సంబంధిత పరిణామాల వార్తలు, కార్పొరేట్ ఆర్థిక ఫలితాల ప్రకటన నేపథ్యంలో ఒడిదుడుకుల ట్రేడింగ్ కొనసాగొచ్చు. నిఫ్టీ సాంకేతికంగా కీలకమైన 22,500 స్థాయిని నిలుకోగలిగితే జీవితకాల గరిష్టాన్ని (22,795) పరీక్షించవచ్చు. అమ్మకాలు నెలకొంటే 22,200 వద్ద మరో కీలక మద్దతు ఉంది’’ అని నిపుణులు తెలిపారు. ఇక ఈ వారంలో దాదాపు 200 కి పైగా కంపెనీలు తమ క్యూ4 ఫలితాలు ప్రకటించనున్నాయి. ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా యాజమాన్య వ్యాఖ్యలు కీలకం కానున్నాయి. అమెరికా ఆర్థిక పరిణామాలు భారత్ మార్కెట్‌పై ప్రభావం చూపనున్నాయి.

కార్యకలాపాల విస్తరణలో నెక్ట్స్‌వేవ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్ నైపుణ్యాల్లో శిక్షణనిచ్చే ఎడ్‌టెక్ సంస్థ నెక్ట్స్‌వేవ్ కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఈ ఏడాది ఆఫ్‌లైన్ మాధ్యమంలోకి ప్రవేశిస్తోంది. హైదరాబాద్ క్యాంపస్‌లో తొలి బ్యాచ్‌లో 750 మంది విద్యార్థులకు శిక్షణనివ్వనున్నట్లు సంస్థ సీఈవో రాహుల్ అట్లులూరి తెలిపారు. ప్లస్‌టు తర్వాత విద్యార్థులు ఇటు పరిశ్రమకు అవసరమైన టెక్ నైపుణ్యాలను నేర్చుకుంటూ అటు నాలుగేళ్ల వ్యవధి డిగ్రీ పట్టా కూడా పొందే విధంగా బిట్స్ పిలానీతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఆయన వివరించారు. వచ్చే ఏడాది నాటికి బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లో 10 క్యాంపస్‌లు ఏర్పాటు చేయనున్నట్లు రాహుల్ చెప్పారు. ప్రస్తుతం తమ సిబ్బంది సంఖ్య 1,400గా ఉండగా, దీన్ని 3,000కు పెంచుకోనున్నట్లు వివరించారు. గడిచిన మూడేళ్లలో సుమారు రూ. 295 కోట్ల నిధులు సమకూర్చుకున్నట్లు రాహుల్ తెలిపారు.

వర్ల్‌పూల్ లాభం 25 శాతం అప్..



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో కన్జూమర్ డ్యూరబుల్స్ తయారీ సంస్థ వర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన సుమారు 25 శాతం పెరిగి రూ. 79.5 కోట్లుగా నమోదైంది. అంతక్రితం క్యూ4లో ఇది రూ. 64 కోట్లు. సమీక్షాకాలంలో ఆదాయం 4 శాతం వృద్ధితో రూ. 1,734 కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను నికర లాభం రూ. 224 కోట్లుగా, ఆదాయం రూ. 6,830 కోట్లుగా నమోదైంది. షేరు ఒక్కింటికి రూ. 5 చొప్పున కంపెనీ డివిడెండ్ ప్రకటించింది.

ఇండియా సిమెంట్స్ నష్టాలు తగ్గాయ్



క్యూ4లో రూ. 50 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: ప్రైయివేట్ రంగ కంపెనీ ఇండియా సిమెంట్స్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర నష్టం భారీగా తగ్గి రూ. 50 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 250 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 1,486 కోట్ల నుంచి రూ. 1,267 కోట్లకు క్షీణించింది. ఈ కాలంలో సిమెంట్, క్లింకర్ అమ్మకాల పరిమాణం 24.36 లక్షల టన్నులుగా నమోదైంది. సిమెంట్ విక్రయ ధరలు నీరసించినప్పటికీ భూమి విక్రయం ద్వారా రూ. 24 కోట్ల నగదు లాభం ఆర్జించినట్లు కంపెనీ వెల్లడించింది. మొత్తం వ్యయాలు రూ. 1,638 కోట్ల నుంచి రూ. 1,352 కోట్లకు తగ్గాయి. ఇక పూర్తి ఏడాదికి రూ. 216 కోట్ల నికర నష్టం ప్రకటించింది. 2022–23లో రూ. 170 కోట్ల నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం రూ. 5,608 కోట్ల నుంచి రూ. 5,112 కోట్లకు వెనకడుగు వేసింది.

ఆయిల్ ఇండియా బోనస్ షేర్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజం ఆయిల్ ఇండియా లిమిటెడ్(ఓఐఎల్) గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో స్టాండెలోన్ నికర లాభం 13 శాతం పైగా వృద్ధితో రూ. 2,028 కోట్లను దాటింది. కంపెనీ చరిత్రలోనే ఇది ఒక క్వార్టర్‌కు అత్యధికంకాగా.. చమురు ధరలు బలపడటం, ఉత్పత్తి పుంజుకోవడం ఇందుకు సహకరించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం మరింత అధికంగా 18 శాతం ఎగసి రూ. 2,333 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 1,980 కోట్లు మాత్రమే ఆర్జించింది. కాగా.. వాటాదారులకు 1:2 నిష్పత్తిలో బోనస్ షేర్ల జారీకి బోర్డు అనుమతించింది. దీంతో ప్రతీ 2 షేర్లకు 1 షేరు ఉచితంగా లభించనుంది. అంతేకాకుండా ప్రతీ షేరుకి రూ. 3.75 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. బోనస్ తదుపరి రూ. 2.5గా డివిడెండ్ వర్తించనుంది. ఇక క్యూ4లో మొత్తం ఆదాయం సైతం 16 శాతం పుంజుకుని రూ. 10,375 కోట్లను అధిగమించింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఓఐఎల్ నికర లాభం 29 శాతం క్షీణించి రూ. 6,980 కోట్లకు పరిమితమైంది. చట్టబద్ధ నిబంధనలకు అనుగుణంగా ప్రొవిజన్లు చేపట్టడం లాభాలను దెబ్బతీసినట్లు కంపెనీ పేర్కొంది.

ఐఆర్‌ఎఫ్‌సీ లాభం హైజంప్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఆర్‌ఎఫ్‌సీ) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 34 శాతం జంప్ చేసి రూ. 1,717 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,285 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 0.7 డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 6,230 కోట్ల నుంచి రూ. 6,478 కోట్లకు బలపడింది. మొత్తం వ్యయాలు రూ. 4,945 కోట్ల నుంచి రూ. 4,761 కోట్లకు తగ్గాయి. ఈ ఏడాది(2024–25) దేశ, విదేశీ మార్కెట్ల నుంచి రూ. 50,000 కోట్లు సమీకరించేందుకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ వెల్లడించింది. వివిధ రకాల బాండ్లు, ప్రయివేట్ ప్లేస్‌మెంట్ తదితర మార్గాలలో నిధులను సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది.

భవిత

AP & TS EAPCET 2024:
Check Rank-wise College Predictor Scan QR Code

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

టీటీడబ్ల్యూఆర్ఏఎఫ్‌పీఏ, అశోక్‌నగర్‌లో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు

తెలంగాణ ట్రైబల్ వేల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలోని.. వరంగల్ జిల్లా అశోక్ నగర్‌లోని తెలంగాణ ట్రైబల్ వేల్ఫేర్ రెసిడెన్షియల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ అకాడమీ ఫర్ మెన్ (టీటీడబ్ల్యూఆర్ఏఎఫ్‌పీఏ) 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: 80
» సీట్ల వివరాలు: బీఎస్సీ(ఎంపీసీ)–40 సీట్లు, బీఏ(హెచ్ఈపీ)–40 సీట్లు.
» కోర్సు వ్యవధి: మూడేళ్లు.
» అర్హత: ఏదైనా గుర్తింపు పొందిన బోర్డు నుంచి 60 శాతం మార్కులతో 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన పురుష విద్యార్థులు అర్హులు. విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2,00,000(పట్టణ ప్రాంతం), రూ.1,50,000(గ్రామీణ ప్రాంతం) మించకూడదు. » వయసు: 01.07.2024 నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి.
» ఎంపిక విధానం: ప్రవేశ పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది: 10.05.2024
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 30.05.2024
» వెబ్‌సైట్: https://www.ttwrdcs.ac.in

ఎన్‌సీఈఆర్‌టీ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్-2024

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ).. దేశవ్యాప్తంగా ఐదు ప్రాంతీయ విద్యా సంస్థ(ఆర్ఐఈ)ల్లో వివిధ ఉపాధ్యాయ విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎన్‌సీఈఆర్‌టీ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్–2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

» ఆర్ఐఈ ఉన్న ప్రాంతాలు: అజ్మీర్, భువనేశ్వర్, భోపాల్, మైసూర్, షిల్లాంగ్.

కోర్సులు-ఆర్ఐఈ క్యాంపస్ వివరాలు

» బీఎస్సీ బీఈడీ (నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు) –భువనేశ్వర్, మైసూరు.
» బీఏ బీఈడీ(నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్)–భువనేశ్వర్, మైసూరు.
» ఎంఎస్సీఈడీ(ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్)–మైసూరు.
» బీఈడీ(రెండేళ్లు)–అజ్మీర్, భువనేశ్వర్, భోపాల్, మైసూర్, షిల్లాంగ్.
» బీఈడీ–ఎంఈడీ(మూడేళ్లు)–భోపాల్.
» ఎంఈడీ(రెండేళ్లు)–అజ్మీర్, భువనేశ్వర్, భోపాల్, మైసూర్.
» అర్హత: కోర్సును అనుసరించి 10+2/హయ్యర్ సెకండరీ/సీనియర్ సెకండరీ, డిగ్రీ, పీజీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక విధానం: ప్రవేశ పరీక్ష, కౌన్సిలింగ్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.05.2024
» ప్రవేశ పరీక్ష తేది: 16.06.2024.
» బీఎస్సీ బీఈడీ, బీఏ బీఈడీ, ఎంఎస్సీఈడీ పరీక్ష ఫలితాల వెల్లడి తేది: 05.07.2024.
» బీఈడీ, ఎంఈడీ పరీక్ష ఫలితాల ప్రకటన తేది: 10.07.2024.
» వెబ్‌సైట్: https://cee.ncert.gov.in

టీఎస్ సీపీజీఈటీ-2024

తెలంగాణ రాష్ట్రంలోని ఉస్మానియా యూనివర్శిటీ ఆధ్వర్యంలో ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మా గాంధీ, పాలమూరు, మహిళా విశ్వవిద్యాలయాలు, జేఎన్‌టీయూహెచ్ పరిధిలోని పీజీ కళాశాలల్లో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం సీపీజీఈటీ–2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు: ఎంఏ, ఎంఎస్ డబ్ల్యూ, ఎంహెచ్ఆర్ఎం, ఎంటీఎం, ఎంకాం, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంఎల్ఐబీఎస్సీ, బీఎల్ఐబీఎస్సీ.
» ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు: బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఎకనామిక్స్, ఐఎంబీఏ.
» పీజీ డిప్లొమా కోర్సులు: చైల్డ్ సైకాలజీ, ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సిలింగ్, ఫోరెన్సిక్ సైన్స్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్.
» అర్హత: పీజీ కోర్సులకు డిగ్రీలో కనీసం 40 శాతం మార్కులు, బీఈడీ/బీపీఈడీ కోర్సులకు డిగ్రీలో 55 శాతం మార్కులు, ఇంటిగ్రేటెడ్ కోర్సులకు 10+2/ఇంటర్మీడియట్‌లో 50 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలి.
» ఎంపిక విధానం: ప్రవేశ పరీక్ష, రిజర్వేషన్ రూల్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» ప్రవేశ పరీక్ష: సంబంధిత సబ్జెక్ట్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) ద్వారా నిర్వహిస్తారు.
» దరఖాస్తు ప్రారంభతేది: 18.05.2024.
» ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తులకు చివరి తేది: 17.06.2024.
» రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది: 25.06.2024. »రూ.2000 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది: 30.06.2024.
» ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష తేది: 05.07.2024.
» వెబ్‌సైట్: https://cpget.tsche.ac.in

డిగ్రీతో.. డిఫెన్స్ కొలువులు



సీడీఎస్ఈ (2)-2024

» సీడీఎస్ఈ (2)-2024 నోటిఫికేషన్ విడుదల
» ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీల్లో కమిషన్డ్ ర్యాంకు పోస్టులు
» త్రివిధ దళాలకు చెందిన అయిదు అకాడమీల్లో 459 పోస్టులు
» ఎంపికైతే శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టయిఫండ్

బ్యాచిలర్ డిగ్రీ తర్వాత.. డిఫెన్స్‌లో కొలువుల కోసం ఎదురుచూసే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! అదే.. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్!! ఈ పరీక్షలో విజయం సాధించి, మలి దశలోనూ ప్రతిభ చూపితే.. త్రివిధ దళాల్లో కమిషన్డ్ ర్యాంకు హోదాతో కొలువుదీరొచ్చు! ఈ ఉద్యోగంతో త్రివిధ దళాల్లో ఉజ్వల కెరీర్‌తోపాటు దేశ సేవ చేసే ఉన్నత అవకాశం లభిస్తుంది. తాజాగా.. సీడీఎస్ఈ(2)-2024 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. సీడీఎస్ఈ (2) వివరాలు, ఎంపిక విధానం, వేతనాలు తదితర వివరాలు..

మొత్తం 459 పోస్టులు

త్రివిధ దళాల్లో పోస్టుల భర్తీకి యూపీఎస్సీ ఏటా రెండుసార్లు సీడీఎస్ పరీక్ష నిర్వహిస్తుంది. తాజాగా మొత్తం 459 పోస్టుల భర్తీకి సీడీఎస్ఈ (2)–2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా ఇండియన్ మిలటరీ అకాడమీ (డెహ్రాడూన్)–100 పోస్టులు, ఇండియన్ నేవల్ అకాడమీ(ఎజిమలా) –32 పోస్టులు, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (హైదరాబాద్)–32 పోస్టులు, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (చెన్నై) (పురుషులు)–276 పోస్టులు, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (చెన్నై) (మహిళలు)–19 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు.

అర్హతలు ఇలా

- **ఇండియన్ మిలటరీ అకాడమీ, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఇండియన్ నేవల్ అకాడమీ:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
- **ఎయిర్‌ఫోర్స్ అకాడమీ:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా బీఈ/బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూప్ చదివుండాలి.

ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ సమయానికి సర్టిఫికెట్లు చూపించాల్సి ఉంటుంది.

వయసు

- **ఇండియన్ మిలటరీ అకాడమీ:** జూలై 2, 2001–జూలై 1, 2006 మధ్య జన్మించి ఉండాలి.
- **నేవల్ అకాడమీ:** జూలై 2, 2001–జూలై 1, 2006 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎయిర్‌ఫోర్స్ అకాడమీ:** జూలై 2, 2001–జూలై 1, 2005 మధ్య జన్మించి ఉండాలి. (డీజీసీఏ కమర్షియల్ పైలట్ లైసెన్స్ ఉన్న వారికి రెండేళ్ల సడలింపు ఇస్తారు).
- **ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ:** జూలై 2, 2000–జూలై 1, 2006 మధ్య జన్మించి ఉండాలి.

రెండంచెల ఎంపిక ప్రక్రియ

ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లలో ఆఫీసర్ కేడర్ పోస్టుల భర్తీకి రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. వీటిలో మొదటిది.. యూపీఎస్సీ నిర్వహించే సీడీఎస్ రాత పరీక్ష. ఇందులో నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించి మెరిట్ జాబితాలో నిలిస్తే.. మలి దశలో ఆయా దళాలకు చెందిన సర్వీస్ సెలక్షన్ బోర్డులు ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయి. ఈ ప్రక్రియలోనూ విజయం సాధించి తుది జాబితాలో నిలిస్తే.. అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న విభాగంలో కొలువు ఖరారవుతుంది.

రాత పరీక్ష ఇలా

- తొలిదశలో నిర్వహించే సీడీఎస్ఈ రాత పరీక్ష ఆయా విభాగాలకు వేర్వేరుగా ఉంటుంది.
- ఇండియ మిలటరీ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అభ్యర్థులకు 300 మార్కులకు; ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ అభ్యర్థులకు 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాత పరీక్షలో నెగెటివ్ మార్కింగ్ నిబంధన అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి మూడో వంతు మార్కు కోత విధిస్తారు.
- ఇండియన్ మిలటరీ, నేవల్, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ కోర్సుల పరీక్షలో ఇంగ్లిష్ వంద మార్కులకు, జనరల్ నాలెడ్జ్ వంద మార్కులకు, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ వంద మార్కులకు ఉంటాయి. ప్రతి పేపర్‌కు పరీక్ష సమయం 2 గంటలు.
- ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ పరీక్షలో ఇంగ్లిష్ వంద మార్కులకు, జనరల్ నాలెడ్జ్ వంద మార్కులకు నిర్వహిస్తారు. వీటికి కూడా ప్రతి పేపర్‌కు పరీక్ష సమయం 2గంటలు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటుంది.

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ

- రాత పరీక్షలో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన అభ్యర్థులకు సర్వీస్ సెలక్షన్ బోర్డ్(ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తారు. దీనికి 300 మార్కులు కేటాయించారు. అన్ని అకాడమీల అభ్యర్థులకు ఉమ్మడిగా అయిదు రోజులపాటు పరీక్ష జరుగుతుంది. ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి టెస్టులు 6 రోజుల పాటు ఉంటాయి.
- మలి దశలో మొదట స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో ఉత్తీర్ణత సాధిస్తే స్టేజ్–2కు అనుమతిస్తారు. స్టేజ్–1లో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్(ఓఐఆర్) టెస్టులు, స్టేజ్–2లో సైకాలజీ టెస్టులు, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్కులు, ఇంటర్వ్యూలు, కాన్ఫరెన్స్‌లు ఉంటాయి. స్టేజ్–1, స్టేజ్–2ల తర్వాత వర్డ్ అసోసియేషన్ టెస్ట్ (డబ్ల్యూఏటీ), సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్ (ఎస్ఆర్‌టీ)ల ద్వారా విద్యార్థుల సమయస్ఫూర్తిని పరీక్షిస్తారు. చివరగా సెల్ఫ్ డిస్క్రిప్షన్ టెస్ట్(ఎస్‌డీ)లో అభ్యర్థి తన కుటుంబం, స్నేహితులు, కాలేజీ, ఉపాధ్యాయుల గురించి రాయాలి. ఈ టెస్టుల తర్వాత రెండు రోజుల పాటు 9 రకాల గ్రూప్ టాస్కులు నిర్వహిస్తారు.

తుది దశలో ఇంటర్వ్యూ

ఎంపిక ప్రక్రియలోని రెండు దశల్లోనూ విజయం సాధించిన అభ్యర్థులకు చివరగా.. ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ ఇంటర్వ్యూను బోర్డ్ ప్రెసిడెంట్ లేదా సీనియర్ సభ్యుడి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఇంటర్వ్యూలోనే ఒక ప్రక్రియ కాన్ఫరెన్స్ ఉంటుంది. ప్యానెల్ ముందు అభ్యర్థులు వేర్వేరుగా హాజరవ్వాలి. ఫ్లయింగ్ బ్రాంచ్ వారికి పీఏబీటీ ఉంటుంది. వీటిలో చూపిన ప్రతిభ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న అభ్యర్థులకు మరోసారి శారీరక, వైద్య పరీక్షలు నిర్వహించి.. రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ టెస్టుల్లో ప్రతిభ ఆధారంగా ఫైనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేస్తారు.

అకాడమీలలో శిక్షణ

సీడీఎస్ఈ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన అభ్యర్థులకు ఎంపికైన అకాడమీల్లో వేర్వేరుగా శిక్షణ ఉంటుంది. ఇండియన్ మిలటరీ అకాడమీ (డెహ్రాడూన్)లో 18 నెలలు, నేవల్ అకాడమీలో 17 నెలలు, ఎయిర్ ఫోర్స్ అకాడమీలో 18 నెలలు, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో 11 నెలలు శిక్షణ అందిస్తారు. ఈ శిక్షణ సమయంలో వీరికి నెలకు రూ.56,100 స్టైపెండ్ అందిస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత లెఫ్టినెంట్ హోదాలో పర్మనెంట్ కొలువు సొంతమవుతుంది. నేవీలో మాత్రం ప్రారంభంలో సబ్–లెఫ్టినెంట్ హోదా లభిస్తుంది. ఎయిర్‌ఫోర్స్‌లో శిక్షణ పొందిన వారు ప్రారంభంలో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా విధులు చేపడతారు. ఇలా ఆయా విభాగాల్లో అడుగుపెట్టిన వారు కొన్ని నెలలు ప్రొబేషన్‌లో ఉంటారు.

రాత పరీక్షలో రాణించేలా

- **ఇంగ్లిష్:** ఈ విభాగం వంద మార్కులకు ఉంటుంది. ఇందులో ఇంగ్లిష్ భాషపై పట్టును, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పరిశీలిస్తారు. యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్, ఆర్డరింగ్ ఆఫ్ సెంటెన్సెస్, సెంటెన్సెస్‌లో పదాల ఆర్డరింగ్, ప్యాసేజ్‌లు, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, క్లోజ్ టెస్టు, ఫిల్ అప్స్, అనాలజీస్ సెక్షన్ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, స్పాటింగ్ ద ఎర్రర్స్ విభాగాల్లో మార్కులు సాధించేందుకు గ్రామర్ రూల్స్ తెలుసుకోవాలి.
- **జనరల్ నాలెడ్జ్:** అభ్యర్థులకు సామాజిక అంశాల పట్ల ఉన్న అవగాహన పరీక్షించే విభాగమిది. దీనికి కూడా వంద మార్కులు కేటాయించారు. ఈ విభాగంలో కరెంట్ అఫైర్స్, జాగ్రఫీ, హిస్టరీ, ఇండియన్ పాలిటీ, ఎకనామిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ తదితర సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. డిఫెన్స్‌కు సంబంధించిన ప్రధాన కార్యాలయాలు, అవార్డులు, జాయింట్ మిలిటరీ ఎక్సర్‌సైజెస్ –అందులో పాల్గొన్న దేశాలు, ఆయా ఉమ్మడి సైనిక విన్యాసాల పేర్లు మొదలైన వాటిని తెలుసుకోవాలి. కరెంట్ అఫైర్స్ నుంచి ఎక్కువగా ప్రశ్నలు అడుగుతున్నారు.
- **ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్:** ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీకి మినహా మిగతా పోస్టులకు మ్యాథమెటిక్స్ విభాగం ఉంటుంది. వంద మార్కులకు జరిగే విభాగం ఇది. పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. టైమ్ అండ్ డిస్టెన్స్, స్టాటిస్టిక్స్ అండ్ ప్రాబబిలిటీ, వాల్యూమ్ అండ్ సర్ఫేస్ ఏరియా, లీనియర్ అండ్ క్వాడ్రటిక్ ఈక్వేషన్స్, ట్రిగనోమెట్రీ, ఫ్యాక్టరైజేషన్ తదితర చాప్టర్ల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, జూన్ 4
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: 2024, జూన్ 5 – జూన్ 11
- పరీక్ష తేదీ: 2024, సెప్టెంబర్ 1
- వివరాలకు వెబ్‌సైట్: www.upsc.gov.in

తిరు వేంకటపతి అలంకార సేవలో శ్రీనృసింహ స్వామి



యాదాద్రిలో శ్రీనృసింహ జయంత్యుత్సవాలు ప్రారంభం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సోమవారం శ్రీనృసింహ స్వామి జయంతి ఉత్సవాలను అర్చకులు పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా ప్రారంభించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా స్వయంభూలకు ఆచార్యులు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయంలో స్వస్తీ వాచనం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షా బంధనం వేడుకలు నిర్వహించారు. ఉత్సవ మూర్తుల చెంత లక్ష కుంకుమార్చన జరిపించారు. అనంతరం తిరువేంకటపతిగా శ్రీనృసింహస్వామిని అలంకరించి ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం వేదమంత్రోచ్చరణల మధ్య అంకురారోపణం, హవనం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి వారిని పరవాసుదేవుడిగా అలంకరించి ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. ఇక అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో కూడా శ్రీనృసింహ జయంతి ఉత్సవాలు ప్రారంభించారు. ఆయా వేడుకల్లో ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

భారతి లేక్‌వ్యూ టవర్స్‌కు 'రెరా' షోకాజ్ నోటీసులు

- 'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి, హైదరాబాద్: కొంపల్లిలో 'భారతి లేక్‌వ్యూ టవర్స్' పేరుతో రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నట్లు జనాలను నమ్మించి ప్రీలాంచ్ ఆఫర్ కింద కొనుగోలుదారుల నుంచి భారీ ఎత్తున డబ్బులు గుంజి మోసం చేసిన భారతి బిల్డర్స్‌కు రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 'సాక్షి' దినపత్రిక ఆది వారం సంచికలో 'యథేచ్ఛగా ప్రీలాంచ్ దందా' శీర్షికతో ప్రచురితమైన వార్తకు 'రెరా' స్పందించింది. 15 రోజుల లోగా సంజాయిషీ ఇవ్వాలని భారతి బిల్డర్స్‌ను ఆదేశించినట్లు రెరా అథారిటీ ఒక ప్రకటనలో తెలిపింది. 'రెరా'లో రిజిస్ట్రేషన్ చేసుకోకుండా వ్యాపార ప్రకటనలు జారీ చేయడం, ఫ్లాట్ల విక్రయాలకు పాల్పడటం రేరా చట్టంలోని 3(1), 4 ప్రకారం నేర మని పేర్కొంది. భారతి లేక్‌వ్యూ ప్రాజెక్ట్ యజమానులు ఇచ్చే సంజాయిషీని పరిశీలించి రెరా చట్టంలోని సెక్షన్ 59 ప్రకారం అపరాధ రుసుము విధించడంతోపాటు తగు చర్యలు తీసుకుంటామని అథారిటీ అధికారులు తెలిపారు. రెరా రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టులలో ఫ్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దని పేర్కొన్నారు. రెరా చట్టంలోని నిబంధనలను విధిగా పాటిస్తూ, నిర్దేశించిన కాల వ్యవధిలో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు తమ నిర్మాణాలను పూర్తి చేసి కొనుగోలుదారులకు స్వాధీనం చేయాలని, లేని పక్షంలో బాధితుల ఫిర్యాదు మేరకు సదరు డెవలపర్లు కొనుగోలుదారులకు పరిహారం చెల్లించవలసి ఉంటుందని పేర్కొంది. రియల్ ఎస్టేట్ రంగంలో మోసాలకు అడ్డుకట్ట వేసి కొనుగోలుదారుల ప్రయోజనాలను కాపాడేందుకు రెరా కృషి చేస్తుందని అథారిటీ తెలిపింది.

టీజీ 09 9999 రూ.25 లక్షలు

సాక్షి, హైదరాబాద్: టీజీ 09 9999 ఫ్యాన్సీ నంబరుకు రూ. 25 లక్షల ధర పలికింది. ఖైరతాబాద్ ఆర్టీఏలో సోమవారం నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో సోనీ ట్రాన్స్‌పోర్ట్ సొల్యూషన్స్ 'టయోటా లాండ్ క్రూజర్ ఎల్ఎక్స్' వాహనం కోసం ఈ నంబరును దక్కించుకుంది. దీనిపై ఆర్టీఏ విధించిన రూ.50 వేల ఫీజుతో పాటు, బిడ్డింగ్ మొత్తం రూ.25,50,000 చెల్లించి సొంతం చేసుకుంది. ఆల్‌నైన్స్ కోసం ఈ స్థాయిలో పోటీ రావడం తెలంగాణలోనే ఇది మొదటిసారి అని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేష్ తెలిపారు. ప్రత్యేక నంబర్లకు ఖైరతాబాద్‌లో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో ఒక్క రోజే రూ.43,70,284 లభించినట్టు ఆయన చెప్పారు.

ఆల్‌నైన్స్ ఆన్‌లైన్ అత్యధిక బిడ్డింగ్ ఇలా..

- 'టీఎస్ 09 జీజీ 9999' నంబరుకు ముప్పా హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ చెల్లించిన మొత్తం రూ.15,53,000
- టీఎస్ 09 జీఈ 9999 నంబరుకు కీస్టోన్స్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ చెల్లించిన మొత్తం రూ.17,35,000
- టీఎస్09 జీసీ 9999 నంబరుకు ప్రైమ్ సోర్స్ గ్లోబల్ సర్వీస్ చెల్లించిన బిడ్డింగ్ మొత్తం రూ.21,60,000
- తాజాగా 'టీజీ 09 9999' నంబర్‌కు సోని ట్రాన్స్‌పోర్ట్ సొల్యూషన్స్ చెల్లించిన మొత్తం రూ.25,50,000



చూడ్డానికి రెయిన్‌బోలా కనిపిస్తోంది కానీ.. ఇది ఫాగ్‌బౌ.. అంటే తెల్లటి ఇంద్రధనస్సు అన్నమాట. నీటి బిందువుల మీద సూర్యకాంతి పరావర్తనం చెందడం వల్ల ఇంద్రధనస్సు ఏర్పడితే.. పొగమంచులోని నీటి బిందువులపై పరావర్తనం చెందడం వల్ల ఫాగ్‌బౌ ఏర్పడుతుంది. సాధారణమైన వాటితో పోలిస్తే.. పొగమంచులోని నీటి బిందువులు చిన్నవిగా ఉండటం వల్ల రంగులు పెద్దగా కనిపించవు. దూరం నుంచి తెల్లగా కనిపిస్తుంది. అందుకే దీన్ని తెల్లటి ఇంద్రధనస్సు అని కూడా అంటారు. ఈ చిత్రాన్ని ఈస్ట్ గ్రీన్‌ల్యాండ్‌లో హూబర్ అనే ఫొటోగ్రాఫర్ ఓ నౌక పై నుంచి తీశారు.

అసలు కథ ఇంకా ఉంది!

ట్యాపింగ్ కేసును మలుపు తిప్పిన ప్రభాకర్‌రావు అఫిడవిట్

- ఇది వాంగ్మూలంతో సమానమంటున్న న్యాయ నిపుణులు
- అందులో డీజీపీ, ఇంటెలిజెన్స్ అదనపు డీజీల అంశం ప్రస్తావన
- వీరి స్టేట్‌మెంట్ సైతం తప్పనిసరి అంటున్న అధికారులు
- త్వరలో కేసులో కీలక పరిణామాలు?



సాక్షి, హైదరాబాద్: రెడ్ కార్నర్ నోటీసుల జారీ ప్రక్రియలో భాగంగా స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావుపై పంజగుట్ట పోలీసులు ఇటీవల అరెస్టు వారెంట్ తీసుకున్నారు. దీనికోసం నాంపల్లి కోర్టులో అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ ప్రభాకర్‌రావు ఓ అఫిడవిట్ వేశారు. అందులో ఉన్న అంశాలు ఆయన వాంగ్మూలంతో సమానం కావడం కొత్త ట్విస్ట్‌కు కారణ మైంది. తాను కేవలం కీలక పాత్రధారిని మాత్రమే అని, ట్యాపింగ్ వ్యవహారం మొత్తం అప్పటి డీజీపీలు, నిఘా విభాగాధిపతిగా ఉండే అదనపు డీజీపీ పర్యవేక్షణలో జరిగినట్లు తన వాంగ్మూలంలో ప్రభాకర్‌రావు పేర్కొనడమే అందుకు కారణం. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాల విడుదల తర్వాత ఈ కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మొత్తం ప్రభాకర్‌రావు అధీనంలోనే జరిగింది. ఇప్పటివరకు అరెస్టయిన డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావు, అదనపు ఎస్పీలు నాయిని భుజంగరావు, మేకల తిరుపతన్న, మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావులు సైతం ఇదే విషయాన్ని తమ వాంగ్మూలాల్లో స్పష్టం చేశారు. ఎస్ఐబీకి ఓఎస్డీ హోదాలో ప్రభాకర్‌రావే నేతృత్వం వహించినప్పటికీ... ఈ విభాగం కూడా ప్రధాన ఇంటెలిజెన్స్‌లో అంతర్భాగమే. దీనికి అదనపు డీజీపీ లేదా ఐజీ స్థాయి అధికారులు బాస్‌లుగా ఉంటారు. మరో పక్క ఎస్ఐబీలో ప్రణీత్‌రావు వార్‌రూమ్‌గా వినియోగించిన రెండు గదులూ ఇంటెలిజెన్స్ చీఫ్ కోసం అధికారికంగా కేటాయించనవే. ఎలాంటి నిఘా ఉపకరణాలు ఖరీదు చేయాలన్నా కచ్చితంగా నిఘా విభాగాధిపతితో పాటు డీజీపీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందే. ఇవన్నీ నిబంధనల్లో పొందుపరిచిన అంశాలే. అయితే ఇప్పటివరకు ఈ విషయాలను ఎవరూ తమ వాంగ్మూలాల్లో స్పష్టం చేయలేదు. నాంపల్లి కోర్టులో ప్రభాకర్‌రావు తరఫున ఆయన న్యాయవాదులు దాఖలు చేసిన అఫిడవిట్‌తో మాత్రం డీజీపీ, అదనపు డీజీల వ్యవహారం ప్రస్తావనకు వచ్చింది. తాను పూర్తిగా వారి పర్యవేక్షణలోనే పని చేశానంటూ ప్రభాకర్‌రావు చెప్పడంతో పరోక్షంగా వారి పాత్రనూ ఆయన ఉటంకించినట్లు అయింది. న్యాయ స్థానంలో దాఖలైన అఫిడవిట్‌ను ప్రభాకర్‌రావు వాంగ్మూలంగా పరిగణించాల్సి వస్తుందని నిపుణులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే రానున్న రోజుల్లో ఇద్దరు మాజీ డీజీపీలు, నిఘా విభాగం మాజీ అదనపు డీజీకి నోటీసులు జారీ చేసి వాంగ్మూలం నమోదు చేయడం తప్పనిసరి కానుందని తెలుస్తోంది.

ఆ అధికారులకూ నోటీసులు ఇస్తారా?

ఆ మాజీ సీపీల నుంచి కూడా వాంగ్మూలం?

మరోపక్క టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు నేరాంగీకార వాంగ్మూలం నేపథ్యంలో హైదరాబాద్ పోలీసు కమిషనర్లుగా పని చేసిన సీనియర్ ఐపీఎస్‌ల నుంచి వాంగ్మూలం సేకరించడం తప్పనిసరిగా మారింది. 'ఎన్నికల టాస్క్'లకు సంబం ధించి తనకు అప్పటి పోలీసు కమిషనర్ ద్వారానే ఆదేశాలు ఇప్పించాలని కోరానని, ప్రభాకర్‌రావు ఆ ప్రకారమే చేశారని రాధాకిషన్‌రావు తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. అక్రమ ఫోన్ ట్యాపింగ్, నిఘా అనేది ఎస్ఐబీ అధీనంలో స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) చేసింది. అయితే టార్గెట్ చేసిన వారిని పట్టుకోవడం, నగదు స్వాధనం చేసుకోవడం, వసూళ్లకు పాల్పడటం ఫీల్డ్ ఆపరేషన్లు మాత్రం టాస్క్‌ఫోర్స్ నిర్వర్తించింది. ఈ విభాగం పోలీసు కమిషనర్ అధీనంలో, ఆయన పర్యవేక్షణలో పని చేస్తుంది. ఈ నేపథ్యంలోనే ఇద్దరు మాజీ పోలీసు కమిషనర్ల నుంచి వాంగ్మూలాలు తీసుకోవడమూ అనివార్యంగా మారనుంది.

ఎన్నికల ఫలితాల తర్వాత అరెస్టులు?

అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు పంజగుట్ట పోలీసుస్టేషన్‌లో నమోదైంది. అయితే దీన్ని దర్యాప్తు చేయడం కోసం అనధికారికంగా ఓ సిట్ ఏర్పాటైంది. ఇప్పటివరకు ఈ బృందం బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌లోని మొదటి అంతస్తు కేంద్రంగా పని చేసింది. అయితే తాజాగా దీన్ని జూబ్లీహిల్స్ ఠాణాకు తరలించారు. అక్కడ అధికారులు కొన్ని ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. నోటీసుల జారీ, విచారణ, వాంగ్మూలాల నమోదుతో పాటు కొందరు పోలీసులు, ప్రైవేట్ వ్యక్తుల అరెస్టులు చోటు చేసుకుంటాయని సమాచారం.

20 కోట్ల ఏళ్ల కథ చెబుతా..!

- రవీంద్ర భారతిలో ప్రదర్శనకు పురాతన వృక్ష శిలాజం
- మంచిర్యాల జిల్లా సుంపుతం గ్రామంలో వెలుగులోకి..



సాక్షి, హైదరాబాద్: వందలు, వేలు, లక్షలు కాదు.. దాదాపు 20 కోట్ల ఏళ్ల కింద బతికిన వృక్షం. నాటి పరిస్థితుల్లో శిలాజంగా మారింది. ఇన్నేళ్ల తర్వాత ఇటీవల బయటపడింది. ఇప్పుడు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో కొలువుదీరింది. తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వీటిని ప్రదర్శనకు పెట్టారు. రాష్ట్రానికి చెందిన పురాతత్వ పరిశోధకుడు సముద్రాల సునీల్.. ఇటీవల మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం సుంపుతం గ్రామ పరిధిలో ఈ పురాతన వృక్ష శిలాజాన్ని గుర్తించారు. దీనిపై భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. ''మనుషులు అభివృద్ధి చెంది లక్ష సంవత్సరాలైనా కాలేదని పరిశోధకులు గుర్తించారు. అలాంటిది దాదాపు 20 కోట్ల ఏళ్ల నాటి అరుదైన వృక్ష శిలాజాలు లభ్యమవడం, వాటిని 420 ఏళ్ల వయసున్న హైదరాబాద్ నగరంలో ప్రదర్శనకు ఏర్పాటు చేయడం గర్వకారణంగా భావిస్తున్నాం. జీవ పరిణామ క్రమంలోని కీలక అంశాలకు ఇలాంటి శిలాజాలు సాక్ష్యాలుగా నిలుస్తాయి''అని పేర్కొన్నారు.

ఎన్నో అరుదైన శిలాజాలు ఉన్నాయి



"నేను 15 ఏళ్లుగా శిలాజాలపై పరిశోధన చేస్తున్నాను. ఇప్పటికే డైనోసార్లు, పురాతన చేపలు, వృక్షాలు, ఇతర జీవజాతుల శిలాజాలను సేకరించాను. రాష్ట్రంలో ఇలాంటి వృక్ష, జంతు శిలాజాలు ఆదిలాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ఆసిఫాబాద్ తదితర జిల్లాల్లో విస్తృతంగా లభ్యమవుతున్నాయి.."

- సముద్రాల సునీల్, పురాతత్వ పరిశోధకుడు



యాదాద్రిలో ఎల్ఈడీ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ తూర్పు మాఢ వీధిలో బిగించిన ఎల్ఈడీ స్క్రీన్‌ను సోమవారం ట్రయల్ రన్ వేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆల యంలో జరిగే శ్రీస్వామి వారి పూజ కార్యక్రమాలను మాఢ వీధుల్లో ఉండే భక్తులు వీక్షించేలా యాదాద్రి ఆలయ తూర్పు మాఢ వీధిలో బిగించారు. యా దాద్రీశుడి ప్రధానాలయం, ఉద్ఘాటనకు సంబంధించిన వీడియోలను ఎల్ఈడీ స్క్రీన్‌పై వేసి పరిశీలించారు. మంగ ళవారం రాత్రి అధికారికంగా ఎల్ఈడీ స్క్రీన్‌ను ప్రారంభించనున్నారు.

రూ. 200 కోట్లు కొట్టేశారు

సిటీ సివిల్ కోర్టులో ఐపీ దాఖలు చేసిన ప్రియాంక ఫైనాన్స్

- అధిక వడ్డీ ఆశ చూపి కోట్ల రూపాయల సేకరణ
- 500 మందికి పైగా బాధితులు
- పక్కాగా ప్లాన్ చేసిన టీఎస్‌సీబీ మేనేజర్
- భర్త, కుమారుడితో అబిడ్స్ బ్యాంక్ సమీపంలోనే ఫైనాన్స్ సంస్థ ఏర్పాటు
- సీసీఎస్‌లో కేసు నమోదు, దర్యాప్తు బాధ్యతలు సిట్‌కు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకు (టీఎస్‌సీబీ) మేనేజర్ భర్త, కుమారుడు కలిసి ఏర్పాటు చేసిన ప్రియాంక ఫైనాన్స్ సంస్థ రూ.200 కోట్లు మేర స్వాహా చేసి బిచాణా ఎత్తేసింది. అధిక వడ్డీ పేరుతో అనేక మంది నుంచి డిపాజిట్లు సేకరించి ఐపీ పిటిషన్ దాఖలు చేసింది. బాధితుల ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసుకున్న నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) అధికారులు దర్యాప్తు బాధ్యతల్ని సిట్‌కు అప్పగించారు. సోమవారం సీసీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన బాధితులు తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లాకు చెందిన నిమ్మగడ్డ వాణి బాల, నేతాజీ భార్యాభర్తలు. సైదాబాద్‌లో వీళ్లు నివసిస్తుండగా... వాణి బాల ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో విధుల్లో చేరారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇది టీఎస్‌సీబీగా మారగా ప్రస్తుతం వాణి బాల మేనేజర్ స్థాయిలో పని చేస్తున్నారు.

15 శాతం వడ్డీ ఇస్తామని చెప్పి..

దాదాపు 20 ఏళ్ల నుంచి వాణి బాల ఓ పథకం ప్రకారం బ్యాంక్‌కు వచ్చే వినియోగదారులను ఆకర్షిస్తూ వచ్చారు. టీఎస్‌సీబీలో డిపాజిట్ చేస్తే సాలీనా కేవలం 6 నుంచి 7% మాత్రమే వడ్డీ వస్తుందని, అబిడ్స్‌లోని టీఎస్‌సీబీ సమీపంలోనే తన భర్త నేతాజీ నెలకొల్పిన ఫైనాన్స్ సంస్థ ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్‌లో డిపాజిట్ చేస్తే 15శాతం వడ్డీ వస్తుందని నమ్మబలికారు. బ్యాంకు కస్టమర్లతో పాటు సహోద్యోగులు, స్నేహితులను ఇందులో డిపాజిట్ చేసేలా ప్రేరేపించారు. చాలాకాలం చెల్లింపులు సక్రమంగా జరగడంతో అనేక మంది దృష్టి ఈ ప్రైవేట్ సంస్థపై పడింది. బ్యాంకులో భారీ మొత్తం డిపాజిట్ చేస్తే ప్రతి ఏడాదీ ఐటీ శాఖ వారికి లెక్కలు చూపాలని, తమ సంస్థలో ఆ ఇబ్బంది ఉండదంటూ మరి కొందరిని ఆకర్షించారు. డిపాజిట్లుగా సేకరించిన మొత్తంతో ఏం చేస్తున్నారంటూ ఇటీవల కొందరు ప్రియాంక సంస్థ నిర్వాహకులను ప్రశ్నించారు. దీనికి నిర్వాహకులు తమకు జీడిమెట్ల, బెంగళూర్‌లో వ్యాపారాలు, కర్మాగారాలు ఉన్నాయంటూ చెప్పి నమ్మిస్తూ వచ్చారు. దీంతో వీరి వద్ద డిపాజిట్లు పెరిగాయి. గరిష్టంగా రూ.2 కోట్ల వరకు డిపాజిట్ చేసిన వాళ్లు ఉన్నారు. కాగా, ఆ ఫైనాన్స్ సంస్థలో ఆమె కుమారుడు శ్రీహర్ష కీలకంగా వ్యవహరించాడు.

ఆఫీసు, ఇంటికి తాళాలు: ఈ నెల 14న ఆఖరుసారిగా కార్యాలయం తెరిచిన నేతాజీ ఆయన కుమారుడు శ్రీహర్ష సిబ్బందిని హఠాత్తుగా పంపేసి తాళం వేశారు. ఈ విషయం తెలిసిన బాధితులు సైదాబాద్‌లోని ఇంటికి వెళ్లగా అక్కడా తాళమే కనిపించింది. దీంతో తాము మోసపోయామని భావించి అబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భారీ మొత్తంతో ముడిపడిన కుంభకోణం కావడంతో సీసీఎస్‌కు వెళ్లాల్సిందిగా అక్కడి అధికారులు సూచించారు. దీంతో వాళ్లు సోమవారం సీసీఎస్ డీసీపీ ఎన్. శ్వేతను కలిసి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. బాధితుల్లో అనేక మంది వృద్ధులు ఉన్నారని, వీళ్లంతా తమ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కూడా ప్రియాంక సంస్థలో పెట్టుబడిగా పెట్టారని అధికారులు చెప్తున్నారు.

ఆర్నెల్లుగా వడ్డీల చెల్లింపుల్లో జాప్యం

గతేడాది నవంబర్, డిసెంబర్ నుంచి వడ్డీల చెల్లింపులు సక్రమంగా జరగట్లేదు. అదేమని కొందరు ప్రశ్నించగా... ఎన్నికల సమయం కావడంతో డబ్బుల లావాదేవీలు తగ్గాయని అందుకే వడ్డీలు ఇవ్వడంలో ఆలస్యం అవుతోందంటూ నిర్వాహకులు చెప్పుకొచ్చారు. ఈ నెలాఖరుకు వాణి బాల సర్వీసు పూర్తి కావస్తుండటంతో పదవీ విరమణ పొందాల్సి ఉంది. దీంతో ఈ నెల 3న ప్రియాంక సంస్థ నిర్వాహకులు సిటీ సివిల్ కోర్టులో దివాలా పిటిషన్ (ఐపీ) దాఖలు చేశారు.

దేశంలో నంబర్‌వన్ ఐఎస్‌బీ



- వరుసగా మూడో ఏడాదీ టాప్ ర్యాంక్
- అంతర్జాతీయ స్థాయిలో 26వ ర్యాంకు
- ఎఫ్‌టీ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కస్టమ్స్ ర్యాంకింగ్స్ విడుదల

రాయదుర్గం: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) మరోసారి దేశంలోని బిజినెస్ స్కూళ్లలో టాప్‌లో నిలిచింది. ఫైనాన్షియల్ టైమ్స్ (ఎఫ్‌టీ) ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కస్టమ్స్ ర్యాంకింగ్స్-2024ను సోమవారం విడుదల చేశారు. ఈ ర్యాంకింగ్స్‌లో వరుసగా మూడవ ఏడాదీ హైదరాబాద్ ఐఎస్‌బీ నంబర్ వన్ ర్యాంకును కైవసం చేసుకుంది. ఆసియా స్థాయిలో నంబర్-2గా గుర్తింపు పొందింది. ఫైనాన్షియల్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కస్టమ్స్ ర్యాంకింగ్స్‌ను ప్రతి ఏటా విడుదల చేస్తుంటారు. వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని పరిశీలించగా.. భవిష్యత్తు ఉపయోగం విషయంలో ఐఎస్‌బీ నంబర్ వన్ స్థానం పొందింది. బోధనా పద్ధతులు, మెటీరియల్స్ విషయంలో 25, డబ్బుకు తగిన విలువలో 15, తయారీ రంగంలో 27, ప్రోగ్రామ్ డిజైన్‌లో 28వ స్థానం పొందింది.

గత ఏడాది 29..ఈ ఏడాది 26

అంతర్జాతీయ స్థాయిలో చూస్తే (గ్లోబల్ ర్యాంకింగ్స్) ఈ ఏడాది ఐఎస్‌బీ 26వ స్థానంలో నిలిచింది. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ర్యాంకు మెరుగుపర్చుకోవడం విశేషం. 2023లో ఐఎస్‌బీ 29వ స్థానంలో నిలిచింది. కాగా దేశంలో ఐఎస్‌బీ మూడేళ్లుగా నంబర్ వన్ స్థానంలో నిలువడంపై విద్యాసంస్థ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ అండ్ డిజిటల్ లెర్నింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ప్రొఫెసర్ దీపామణి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు ఎప్పటికప్పుడు మార్పులు చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రపంచానికి భవిష్యత్తు నాయకులను అందజేసే అంతర్జాతీయ స్థాయి నిర్వహణ సంస్థగా ఐఎస్‌బీ భవిష్యత్తులో మరింత ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగేందుకు సంస్థ డీన్ పర్యవేక్షణలో అన్ని చర్యలు చేపడతామని చెప్పారు.


డెఫ్ అండ్ స్లో స్పీచ్ చిన్నారులకు 'అమ్మ యాప్'

నిట్ విద్యార్థుల వినూత్న ఆవిష్కరణ



నిట్ విద్యార్థులను అభినందిస్తున్న డీఈఐసీ అధికారులు

కాజీపేట అర్బన్: వినికిడి సమస్యతో త్వరగా మాట్లాడలేక పోయే డెఫ్ అండ్ స్లో స్పీచ్ విద్యార్థులకు ఆసరాగా నిలిచే వినూత్న అమ్మ యాప్‌ను వరంగల్ నిట్ విద్యార్థులు రూపొందించారు. ప్రొఫెసర్ డాక్టర్ కేవీ.కాదంబరి సారథ్యంలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా నిట్ వరంగల్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌కు చెందిన బీటెక్ ఫైనలియర్ విద్యార్థులు ఆదర్శ్‌రావు, సయ్యద్ ఫర్హానావుద్దీన్ నిజాం ఈ యాప్‌ను రూపొందించారు. ఏడాది నుంచి 5 సంవత్సరాల చిన్నారులు మాట్లాడటంలో ఆలస్యాన్ని, తప్పులను ఈ అమ్మ యాప్.. ఆడియో, స్పీచ్ ఇన్‌పుట్‌ను స్వీకరించి తప్పులను సరిచేస్తుంది. ఎంజీఎంలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రకాశ్‌కు నిట్ విద్యార్థులు సోమవారం ఈ యాప్‌ను అందజేశారు. ఇది చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అభినందిస్తూ రూపకర్తలకు ప్రశంసా పత్రాన్ని బహూకరించారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.